సత్యమేవ జయతే

# సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15
సంచిక: 278

గురువారం 22-6-2023

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'



## రొనాల్డో రికార్డు


జాతీయ ఫుట్‌బాల్ జట్టుకు 200 మ్యాచ్‌లు ఆడిన తొలి ప్లేయర్ - 12లో





## 'ఎంప్లాయర్ బ్రాండ్' టాటా పవర్

ఆ తర్వాతి స్థానాల్లో అమెజాన్, టాటా స్టీల్.. రాండ్‌స్టాడ్ ఇండియా నివేదిక - 13లో



## జిన్‌పింగ్ ఓ నియంత: బైడెన్

అమెరికా విదేశాంగ మంత్రి చైనా పర్యటన ముగిసిన మరుసటి రోజే.. జిన్‌పింగ్‌పై అమెరికా అధినేత బైడెన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనొక నియంత అంటూ మండిపడ్డారు.

వివరాలు 6లో ▸



## హోండురస్‌లో దారుణం

హోండురస్ దేశంలోని మహిళల జైలులో రెండు ముఠాల మధ్య జరిగిన ఘర్షణల్లో 46 మంది ఖైదీలు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఎక్కువ మంది సజీవ దహనమయ్యారు.

వివరాలు 6లో ▸

# పనితీరే ప్రామాణికం

## 'గడప గడపకూ' వర్క్ షాప్‌లో సీఎం వైఎస్ జగన్ దిశానిర్దేశం

## మరో 9 నెలల్లో ఎన్నికలు రానున్నాయి.. ఇక ప్రతి అడుగూ కీలకమే

- రాష్ట్రంలో సగటున 87 శాతం కుటుంబాలకు మంచి చేశాం.. ప్రతి ఇంటికీ వెళ్లి మనం చేసిన మంచిని వివరించాలి
- ఇది నిజమే కదా అనే భావన ప్రతి అక్క చెల్లెమ్మలోనూ తేవాలి.. ఆ భావనే ఆశీస్సులుగా మారి ప్రతి ఇల్లూ మనకు ఓట్లేసేలా చేస్తుంది
- ప్రతి గ్రామం మనకే ఓటేస్తుంది.. అప్పుడు ప్రతి నియోజకవర్గంలోనూ గెలుస్తాం
- 175కు 175 శాసనసభ స్థానాల్లోనూ గెలవడం కష్టమేం కాదు.. మనం యుద్ధం చేస్తున్నది రాక్షసులు, మారీచులతో
- సోషల్ మీడియాను విస్తృతంగా వాడుకుంటూ ప్రజలకు నిజాలు చెప్పండి.. నెగెటివ్ మీడియాను అడ్డం పెట్టుకుని ప్రభుత్వంపై చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి
- దేశ చరిత్రలో ఎక్కడా జరగని రీతిలో 23 నుంచి 'జగనన్న సురక్ష'.. ప్రతి ఇంటినీ జల్లెడ పట్టి మిగిలిపోయిన అర్హులకూ లబ్ధి చేకూర్చేలా సన్నద్ధం
- నాలుగేళ్లలో తెచ్చిన మార్పులను చాటిచెప్పేలా త్వరలో ''వై ఏపీ నీడ్స్ జగన్?''





గడప గడపకూ మన ప్రభుత్వం వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: ''మరో తొమ్మిది నెలల్లో ఎన్నికలు రాబోతున్నాయి. ఇవాళ్టి నుంచి మనం వేసే ప్రతి అడుగు చాలా కీలకం. 175కు 175 శాసనసభ స్థానాల్లోనూ మనం గెలవాలి. ఇంతకు ముందుకన్నా బ్రహ్మాండమైన మెజార్టీలు రావాలి. మన లక్ష్యం అదీ! అందుకే గడప గడపకూ కార్యక్రమాన్ని సీరియస్‌గా తీసుకోవాలి..'' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్గనిర్దేశం చేశారు. బుధవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంపై ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గాల సమన్వయకర్తలు, ప్రాంతీయ సమన్వయకర్తలతో సీఎం వైఎస్ జగన్ వర్క్ షాప్ నిర్వహించారు. 175కు 175 స్థానాల్లో విజయబావుటా ఎగురవేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. నాలుగేళ్లలో రాష్ట్రంలో ఎన్నడూ లేనివిధంగా

మిగతా 2వ పేజీలో ▶

"ఎమ్మెల్యేల పనితీరు ప్రజల్లో బాగుంటే ఆ ఎమ్మెల్యేలను కొనసాగిస్తాం. ప్రజల్లో గ్రాఫ్ బాగా లేకపోతే ఆ ఎమ్మెల్యేలను కొనసాగించడం కుదరదు. ప్రతి ఒక్కరూ ఇది గుర్తుంచుకోండి. ఈ విషయం ఎందుకు చెబుతున్నానంటే కొన్ని కోట్ల మంది మనపై ఆధారపడి ఉన్నారు. కోట్ల మంది పేదలకు మంచి జరుగుతోంది. కొంతమంది ఎమ్మెల్యేల పనితీరు బాగా లేకపోతే.. వాళ్లను అక్కడే కొనసాగించడం వల్ల వారికీ నష్టం, పార్టీకీ నష్టం! కోట్లాది మంది పేదలకూ నష్టం జరుగుతుంది. మనం సర్వే చేసినప్పుడు మీ గ్రాఫ్‌లు బలంగా ఉండాలి. దీనికి గడప గడపకూ కార్యక్రమం ఉపయోగపడుతుంది. ప్రజలకు చేరువగా ఉండేందుకు బాగా ఉపయోగపడుతుంది. దీనివల్ల మీ గ్రాఫ్ పెరుగుతుంది. సర్వేలు అనుకూలంగా లేకపోతే.. టిక్కెట్లు ఇవ్వకపోతే.. నన్ను బాధ్యుడ్ని చేయొద్దు. రాజకీయాలను సీరియస్‌గా తీసుకోవాలి

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్

న్యూయార్క్‌లోని ఐరాస కార్యాలయంలో యోగా చేస్తున్న మోదీ



టెస్లా సీఈవో ఎలాన్ మస్క్‌తో ప్రధాని మోదీ



## అభివృద్ధి ప్రయాణం.. రికార్డు 'యోగాసనం'

ప్రధాని మోదీ అమెరికాలో తొలి రోజు బిజీ బిజీగా గడిపారు. ఎలాన్ మస్క్‌తో ప్రత్యేకంగా సమావేశమైన ఆయన.. భారత్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకురావాలని కోరారు. భారత్‌లో టెస్లా కంపెనీ ఏర్పాటుపై త్వరలోనే ప్రకటన చేస్తానని మస్క్ చెప్పారు. కాగా, ఐక్యరాజ్యసమితిలో తొలిసారిగా అధికారికంగా, ప్రధాని మోదీ సారథ్యంలో సాగిన యోగా సెషన్ గిన్నిస్ ప్రపంచ రికార్డు సృష్టించింది. మోదీ.. యోగా టీ–షర్ట్, ట్రౌజర్ ధరించి 'నమస్తే'తో యోగా సనాలు ప్రారంభించి పలు దేశాల ప్రతినిధులకు యోగా సెషన్‌లోకి స్వాగతం పలికారు.

- వివరాలు 6లో



గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

## గవర్నర్‌తో సీఎం జగన్ భేటీ


2లో



## రామోజీ రాసిందే రశీదు!

### ష్యూరిటీ పేరుతో అక్రమంగా డిపాజిట్ల సేకరణ

- పాన్ నంబర్, ఆధార్ ఉండదు
- బ్యాంకు ఖాతా ఊసే లేదు
- తనకు తోచినంత వడ్డీ రేట్ల నిర్ణయం
- అవే నిధులు దర్జాగా సొంత కంపెనీలకు మళ్లింపు
- ఆర్బీఐ నిబంధనలు బేఖాతర్
- కేంద్ర చట్టం యథేచ్ఛగా ఉల్లంఘన
- సహారా, చార్మినార్, కృషి బ్యాంక్ తరహాలో అక్రమాలు
- మార్గదర్శి ముసుగులో 'నల్ల' దందా!





- వివరాలు 3లో



## కేజీబీవీ టీచర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

- ఈ నెల 23 నుంచి 25 వరకు జిల్లాల్లో నిర్వహణ
- పోస్టుకు ముగ్గురు చొప్పున 4,243 మంది ఎంపిక

10లో

## ఇదండీ సంగతి





...నెక్స్ట్ మీటింగ్‌కు ప్రిపేర్ అవుతున్నార్సార్!

### మళ్లీ ఓడిపోతానని తెలుసు.. అయినా నిలబడుతున్నా

- రాష్ట్రానికి వైఎస్సార్‌సీపీ అనే తెల్ల దోమ ఆశించింది
- ముమ్మిడివరం సభలో జనసేన అధినేత పవన్



3లో

## రాజకీయ ఆత్మహత్య దిశగా పవన్

- నిత్యం పిచ్చి వ్యాఖ్యలతో పవన్ గ్రాఫ్ డౌన్
- తన పిరికితనం తప్ప.. చంపాల్సిన అవసరం ఎవరికుంది?
- దేశంలోనే రామోజీకి మించిన వైట్‌కాలర్ నేరస్తుడు లేడు
- తన అక్రమాలు కప్పిపుచ్చుకునేందుకు ప్రభుత్వంపై దాడి
- పవన్‌ను అడ్డుపెట్టుకుని ప్రజలను మభ్యపెట్టే రాతలు
- అప్పుడప్పుడు రాష్ట్రానికి వచ్చే వ్యక్తి.. ప్రజలు మెచ్చిన సీఎంను ఎక్కడికి పంపిస్తాడు?
- కాపులను మోసంచేసి బాబుకు ఊడిగం చేసే పనిలో దత్తపుత్రుడు
- మీడియాతో జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు



3లో

# పనితీరే ప్రామాణికం



సమావేశానికి హాజరైన మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలు, రీజనల్ కోఆర్డినేటర్లు

▶ మొదటి పేజీ తరువాయి

తెచ్చిన మార్పులను 'వై ఏపీ నీడ్స్ జగన్..?' అనే కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికీ తెలియజేద్దామని పిలుపునిచ్చారు. 'నెగెటివ్ మీడియాను అడ్డం పెట్టుకుని మారీచుల్లా మనపై యుద్ధం చేస్తున్నారు.. ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తున్న వారితో మనం యుద్ధం చేస్తున్నాం. ఆ దుష్ప్రచారాన్ని ప్రతి గడపలోనూ తిప్పికొట్టాలి..' అని సూచించారు. వర్క్ షాప్‌లో ముఖ్యమంత్రి జగన్ ఇంకా ఏమన్నారంటే..

### ప్రతి లబ్ధిదారుడినీ చైతన్యం చేయాలి..

ఇవాళ మూడు ప్రధాన కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తున్నాం. ఇందులో మొదటిది ఈ నెల 23వతేదీన ప్రారంభించబోతున్న జగనన్న సురక్ష కార్యక్రమం. రెండోది.. గడపగడపకూ మన ప్రభుత్వం. ఇక మూడో అంశం ''వై ఏపీ నీడ్స్ జగన్..?'' అనే కార్యక్రమం. నాలుగేళ్ల పరిపాలనలో గొప్పగా, దేశానికే ఆదర్శంగా నిలబడగలిగిన పనులు ఏం చేశామన్న విషయాలతోపాటు వాటికి సంబంధించి ఆధారాలతో సహా అవగాహన కలిగించేలా 'వై ఏపీ నీడ్స్ జగన్..' కార్యక్రమాన్ని కూడా చేపట్టబోతున్నాం. మనం రాక్షసులతోనూ, మారీచులతోనూ యుద్ధం చేస్తున్నాం. ప్రతి ఒక్కరూ చైతన్యవంతులు అయితేనే మనపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని తగినవిధంగా తిప్పికొట్టగలిగే పరిస్థితి ఉంటుంది. మనం చేస్తున్న మంచి ఏమిటన్నది ప్రతి మనిషి దగ్గరికి, ప్రతి కుటుంబం వద్దకు పదేపదే తీసుకెళ్లాలి. ఈ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టగలిగే పరిస్థితిలోకి ప్రతి లబ్ధిదారుడిని తయారు చేయాలి. ఇది చాలా ముఖ్యమైన అంశం.

#### ప్రతి ఇంటిని జల్లెడ పడుతూ...

"జగనన్న సురక్ష' కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామంలో ఏ చిన్న సమస్య ఉన్నా పరిష్కారం కావాలి. ఏకంగా 1.50 లక్షల మంది సచివాలయ సిబ్బంది, 2.60 లక్షల మంది వలంటీర్లు, 3 వేల మంది మండల స్థాయి సిబ్బంది, 26 మంది సీనియర్ ఐఏఎస్‌లు, 7.5 లక్షల మంది గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు ప్రతి గ్రామంలో ఒక రోజు కేటాయిస్తూ 15 వేల క్యాంపులు నిర్వహిస్తారు. 30 రోజులపాటు జరిగే ఈ కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటిని జల్లెడ పట్టి ఇంకా ఎవరైనా అర్హులు ప్రభుత్వ పథకాలకు దూరమయ్యారేమో పరిశీలించి వారికి కూడా ప్రయోజనం చేకూర్చేలా చర్యలు తీసుకుంటారు. ఇలా ప్రతి సమస్యను పరిష్కరించాలన్న దృక్పథంతో అడుగులు వేస్తోన్న పరిస్థితి దేశ చరిత్రలో ఎక్కడా ఉండదు. ఈ రాష్ట్రంలో మాత్రమే జరుగుతోంది"

\- 'జగనన్న సురక్ష'పై సీఎం జగన్

### జగనన్న సురక్షతో సమస్యల పరిష్కారం

- మీతోపాటు క్యాడర్‌ను కూడా యాక్టివేట్ చేసి గృహ సారథులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లను ఏకం చేస్తూ ముందుకు సాగాలి. ఇప్పటికే 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం కొనసాగుతోంది. ఎక్కడైనా, ఏదైనా సమస్య మీరు ప్రయత్నం చేసినప్పటికీ పరిష్కారం కాకపోతే దాన్ని పరిష్కరించేలా భరోసా ఇస్తూ ఈ కార్యక్రమాన్ని చేపట్టాం. దీనికి అనుబంధంగా, అదనంగా 'జగనన్న సురక్ష' కార్యక్రమం కొనసాగుతుంది.
- 'జగనన్న సురక్ష కార్యక్రమం' ద్వారా మొత్తం సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల వ్యవస్థ, గృహ సారథుల వ్యవస్థ ప్రతి ఇంటికీ వెళ్లి జల్లెడ పడుతుంది. అర్హులై ఉండి కూడా ఇంకా ఎవరైనా మిగిలిపోయి పథకాలకు దూరం కాకూడదనే లక్ష్యంతో జల్లెడ పట్టే కార్యక్రమం జరుగుతుంది. ఇంకా ఎక్కడైనా అర్హులు మిగిలిపోయిన వారు ఉంటే కుటుంబంలో విభజన చేసి రేషన్ కార్డు అందించడం నుంచి వివిధ రకాల సర్టిఫికెట్లు అక్కడికక్కడే మంజూరు చేసే కార్యక్రమం జరుగుతుంది. ప్రతి ఇంటికి వెళ్లి కాసేపు గడిపి సర్టిఫికెట్స్ పరంగా, పథకాల పరంగా సమస్యలుంటే జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా పరిష్కరిస్తాం.
- మండల స్థాయి అధికారులు ప్రతి సచివాలయంలో ఒకరోజు పాటు గడుపుతారు. తహసీల్దార్, పంచాయతీరాజ్ ఈవో ఒక బృందంగా.. ఎంపీడీవో, డిప్యూటీ తహసీల్దార్ మరొక బృందంగా ఏర్పడతారు. షెడ్యూల్ ప్రకారం సచివాలయాలకు వెళతారు. ఏ తేదీన ఎక్కడకు వెళతారో ముందే ప్రకటిస్తారు. ఉత్సాహం ఉన్నవారు ఎవరైనా ఇందులో పాల్గొనవచ్చు.
- సచివాలయం పరిధిలో ప్రతి కుటుంబాన్నీ అధికారులతో కూడిన ఈ బృందాలు కలుస్తాయి. ప్రజల నుంచి సమస్యలు తెలుసుకోవడం, సర్టిఫికెట్ల జారీకి అవసరమైన డాక్యుమెంట్లు, పథకాల అర్హతకు సంబంధించిన పత్రాలు తీసుకుంటారు. వీటిని తీసుకుని తిరిగి గ్రామ, వార్డు సచివాలయాల వద్దకు చేరుకుంటారు. అక్కడ ప్రతి వినతికీ సర్వీసు నంబరు, టోకెన్ కేటాయించి ఆయా కుటుంబాలకు అందచేస్తారు.
- వారం తర్వాత అధికారులతో కూడిన బృందం ఆయా గ్రామ, వార్డు సచివాలయాలకు చేరుకుని సర్టిఫికెట్లు జారీ చేసే కార్యక్రమం చేపడుతుంది. అర్హులందరికీ పథకాలు మంజూరు చేస్తారు. ఒక పండగ వాతావరణంలో గ్రామానికి సంబంధించిన సమస్యలన్నీ పరిష్కరిస్తారు. దీనివల్ల నూరు శాతం కార్యక్రమం సంతృప్తిగా జరుగుతుంది.
- జగనన్న సురక్ష కార్యక్రమం క్యాంపుల్లో దాదాపు 11 రకాల సర్టిఫికెట్లు జారీ చేస్తారు. కులం, ఆదాయం, జనన ధృవీకరణ, వివాహం, ఫ్యామిలీ మెంబర్, డెత్, బియ్యం కార్డులు, కుటుంబాల విభజన, సీసీఆర్సీ, మ్యుటేషన్లు, ఫోన్ నంబర్లకు ఆధార్ లింకేజి లాంటివన్నీ అందించే కార్యక్రమం జరుగుతుంది.
- మండలంలో ప్రతి రోజూ రెండు క్యాంపులు జరుగుతాయి. నియోజకవర్గంలో ఎన్ని మండలాలుంటే అన్నింటా రెండేసి క్యాంపులు చొప్పున జరుగుతాయి. ప్రతి క్యాంపు దగ్గర ఎమ్మెల్యేలు కనిపించాలి. జగనన్న సురక్ష కార్యక్రమంపై ఈ నెల 23 నుంచి శిక్షణ కార్యక్రమాలు జరుగుతాయి. జూలై 1 నుంచి క్యాంపులు ప్రారంభం అవుతాయి.

## దుష్ప్రచారాన్ని ఎక్కడికక్కడ తిప్పికొట్టండి

- గతంలో చంద్రబాబు పాలన, ఇవాళ మన ప్రభుత్వంలో జరిగిన కార్యక్రమాలతో నాడు – నేడు కంటెంట్ తయారు చేసి ప్రజల దగ్గరకు చేర్చాలి. ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ–5 ద్వారా వెలువడుతున్న వ్యతిరేక కథనాలకు సంబంధించి నిజాలేమిటో ప్రజలకు వివరిస్తూ నెగెటివ్ మీడియా చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి.
- ప్రభుత్వం చేస్తున్న మంచిని సోషల్ మీడియా ద్వారా ప్రజలకు తెలియజేయాలి. సోషల్ మీడియాను విస్తృతంగా వాడుకోవాలి. అబద్ధాలు, విష ప్రచారాలను పూర్తిస్థాయిలో తిప్పికొట్టాలి. రాబోయే రోజుల్లో మనపై దుష్ప్రచారం పెరుగుతుంది. సోషల్ మీడియాలో అబద్ధాలను ఇంకా ఎక్కువగా ప్రచారంలోకి తెచ్చే కార్యక్రమం చేస్తారు. ఇంత దారుణమైన ఎమ్మెల్యే ఎవరూ లేరంటూ వ్యక్తిత్వ హననానికి పాల్పడతారు. ప్రతి ఒక్కరిపైనా వ్యక్తిత్వ హననానికి పాల్పడతారు. వీటిని ఎదుర్కొంటూ ముందుకు పోవాలి. గ్రామ స్థాయి నుంచి మన సోషల్ మీడియా టీమ్‌లను తయారు చేసుకోవాలి. ఈ కౌంటర్ మెకానిజం కచ్చితంగా ఉండాలి. దీనికి సిద్ధం కావాలి.

## ఆ భావనే ఆశీస్సులుగా మారి..

వచ్చే ఎన్నికల్లో మనం 175కు 175 నియోజకవర్గాలూ గెలవాలి. ఆ దిశగా అడుగులు పడాలి. అదేం కష్టమైన పనికాదు. ఎందుకంటే.. రాష్ట్రంలో సగటున 87 శాతం కుటుంబాలకు మంచి జరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో 92 శాతం కుటుంబాలకు మంచి జరగ్గా పట్టణ ప్రాంతాల్లో 84 శాతానికి మేలు జరిగింది. ప్రతి నియోజకవర్గంలోనూ, ప్రతి గ్రామంలోనూ ఇదే పరిస్థితి. అన్ని చోట్లా ఇదే పరిస్థితి ఉన్నప్పుడు.. దేవుడి దయతో మన ప్రభుత్వం మంచి చేయగలిగిందని ప్రతి ఇంటికి వెళ్లి చెప్పి ఆ ఇంట్లో ప్రతి అక్కచెల్లెమ్మ మనసులో ఇది నిజమే కదా అనే భావనను తేవాలి. ఆ భావనే ఆశీస్సులుగా మారి ప్రతి ఇల్లూ మనకు ఓటు వేస్తుంది. అది జరిగితే ప్రతి గ్రామం మనకు ఓటు వేస్తుంది. ప్రతి నియోజకవర్గం ఆటోమేటిక్‌గా మనకే ఓటు వేసే పరిస్థితి వస్తుంది. 175కు 175 స్థానాల్లో మనం విజయం సాధిస్తాం.

## స్పీడ్ పెంచుతాం



వచ్చే ఎన్నికల్లో గెలుపు గుర్రాలే బరిలో ఉంటాయి. వైనాట్ 175? వైనాట్ కుప్పం..? లక్ష్యంతో పని చేసేలా సీఎం జగన్ దిశా నిర్దేశం చేశారు. ఇంకా మిగిలిపోయిన అర్హులకు కూడా న్యాయం జరిగేలా మరోసారి పరిశీలించేందుకు జగనన్న సురక్ష ద్వారా క్షేత్ర స్థాయిలోకి వెళ్లమన్నారు. ఇప్పటి వరకు ఇలా చెప్పిన సీఎం దేశంలో ఎక్కడా లేరు. ప్రజాక్షేత్రంలో నెమ్మదిగా ఉన్న నాయకులను పద్ధతి మార్చుకోవాలని సూచించారు. మా నాయకుడు చెప్పినట్లు గేరు మారుస్తాం.. స్పీడ్ పెంచుతాం. ప్రజల మనసులు గెలిచిన యాత్రలను వైఎస్సార్, సీఎం జగన్ ఎప్పుడో చేశారు. ఇప్పుడు ఎంత మంది ఎన్నియాత్రలు చేసినా.. పార్టీ దండాలు పెట్టినా ప్రజలు వారిని నమ్మరు.

\- జోగి రమేష్, గృహనిర్మాణ శాఖ మంత్రి

## సీఎం చెప్పినట్లే కార్యాచరణ



హామీల్లో 99 శాతం అమలు చేశాం. జగనన్న సురక్ష కార్యక్రమంతో డోర్ టూ డోర్ క్యాంపెయిన్ నిర్వహిస్తాం. మూడు నెలల్లో నాయకులు తమ గ్రాఫ్ పెంచుకోవాలని సీఎం చెప్పారు. పార్టీ, ప్రజలే లక్ష్యంగా నిర్ణయాలు ఉంటాయన్నారు. ఎవరికీ అన్యాయం జరగకుండా చూస్తానని భరోసా ఇచ్చారు. సీఎం చెప్పినట్లే మా కార్యాచరణ ఉంటుంది.

\- గుడివాడ అమర్నాథ్, పరిశ్రమల శాఖ మంత్రి

## 9 నెలలు ప్రజా క్షేత్రంలోనే



సీఎం వైఎస్ జగన్ ఆదేశించినట్లుగా వచ్చే 9 నెలలు ప్రజా క్షేత్రంలోనే ఉంటూ మరింత కష్టపడతాం. నియోజకవర్గ సమన్వయకర్తలు, ఎమ్మెల్యేలు అందరూ కలిసి మళ్లీ పార్టీని అధికారంలోకి తీసుకొస్తాం. ఎల్లో మీడియా దుష్ప్రచారాలను ఆధారాలతో సహా తిప్పికొడతాం. ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని, రాష్ట్రం సాధించిన పురోగతిని ప్రజలకు చెబుతాం.

\- కారుమూరి వెంకట నాగేశ్వరరావు, పౌరసరఫరాల శాఖ మంత్రి

## గెలుపే లక్ష్యంగా...



వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అవిశ్రాంతంగా పని చేస్తాం. ప్రజా సంక్షేమాన్ని కాంక్షించే ప్రభుత్వం ఉంటే అందరికీ మేలు జరుగుతుంది. ప్రజల్లోకి వెళ్లేందుకు వెనుకబడ్డ నాయకులు మరింత చురుగ్గా పని చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్దేశించారు. లోపాలు సరిచేసుకుని ముందుకెళ్తాం.

\- సీదిరి అప్పలరాజు, పశుసంవర్థక, మత్స్యశాఖ మంత్రి

## క్లుప్తంగా...

### గవర్నర్‌తో సీఎం వైఎస్ జగన్ భేటీ

సాక్షి, అమరావతి: సీఎం వైఎస్ జగన్ గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్‌తో విజయవాడలోని రాజ్‌భవన్‌లో బుధవారం భేటీ అయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం విజయవాడలో గురువారం నిర్వహించనున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా సత్కార కార్యక్రమానికి గవర్నర్‌ను సీఎం జగన్ ఆహ్వానించారు. రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా వ్యవహరించిన జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా ఇటీవల సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందిన విషయం తెలిసిందే. ఆయన గౌరవార్థం రాష్ట్ర ప్రభుత్వం గురువారం విందు సమావేశాన్ని నిర్వహించనుంది. గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్‌తో భేటీ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతోన్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి సీఎం వైఎస్ జగన్ ఆయనకు వివరించారు.

### సీఎం జగన్‌కే మైనార్టీల మద్దతు

- పలు జిల్లాల వక్ఫ్‌బోర్డు అధ్యక్షుల ఉద్ఘాటన



మాట్లాడుతున్న జిల్లాల వక్ఫ్‌బోర్డు అధ్యక్షులు

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): రాష్ట్రంలో మైనార్టీలు అందరూ సీఎం వైఎస్ జగన్‌తోనే ఉన్నామంటున్నారని పలు జిల్లాల వక్ఫ్‌బోర్డు అధ్యక్షులు పేర్కొన్నారు. వివిధ జిల్లాల వక్ఫ్ బోర్డు అధ్యక్షులు ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని జిల్లా వక్ఫ్ బోర్డు కార్యాలయాన్ని బుధవారం సందర్శించారు. స్థానిక జిల్లా వక్ఫ్‌బోర్డు అధ్యక్షుడు గౌస్‌మొహిద్దీన్ వారికి స్వాగతం పలికారు. అనంతరం వారితో కలిసి గౌస్‌మొహిద్దీన్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా నాలుగేళ్ల పాలనలో మైనార్టీలకు జగన్ ప్రభుత్వం అమలు చేస్తోన్న సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ అన్ని జిల్లాల్లో మసీదుల వద్దకు వెళ్లి 'హర్ దిల్ మే వైఎస్సార్–హమ్ సబ్ జగన్ కే సాత్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. మైనార్టీలు గొప్పగా ఆదరిస్తున్నారని చెప్పారు. మైనార్టీలకు పెద్ద పీట వేస్తూ జగన్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధికి రాష్ట్ర వ్యాప్తంగా మద్దతు పలుకుతున్నారన్నారు. అనంతపురం జిల్లా వక్ఫ్ బోర్డు అధ్యక్షుడు ఖాగజ్ ఘర్ రిజ్వాన్, అమలాపురం జిల్లా వక్ఫ్ బోర్డు అధ్యక్షుడు ఖాదర్, ఏలూరు జిల్లా వక్ఫ్ బోర్డు అధ్యక్షుడు డాక్టర్ జమా, తూర్పు గోదావరి జిల్లా వక్ఫ్ బోర్డు అధ్యక్షుడు ఎండీ ఆరిఫ్, కాకినాడ జిల్లా వక్ఫ్ బోర్డు అధ్యక్షుడు రెహ్మాన్ ఖాన్, కర్నూల్ జిల్లా వక్ఫ్ బోర్డు అధ్యక్షుడు నియాజ్ అహ్మద్ పాల్గొన్నారు.

### మక్కా బయల్దేరిన హజ్ యాత్రికుల చివరి బృందం



హజ్ యాత్రికులకు వీడ్కోలు పలుకుతున్న డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా

గన్నవరం (విమానాశ్రయం): విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం (గన్నవరం) నుంచి హజ్ యాత్రికులతో జెడ్డాకు చివరి విమానం బుధవారం సాయంత్రం బయలుదేరి వెళ్లింది. తొలుత ఈ విమానంలో వెళ్తున్న 50 మంది హజ్ యాత్రికులకు ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, పలువురు ప్రజాప్రతినిధులు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా అంజాద్‌బాషా మాట్లాడుతూ.. ఈ నెల 7వ తేదీన ప్రారంభమైన మక్కా యాత్రకు మొత్తం 1,790 మంది వెళ్లినట్టు తెలిపారు. సీఎం వైఎస్ జగన్ కృషి ఫలితంగానే తొలిసారిగా రాష్ట్రం నుంచి హజ్ యాత్రకు వెళ్లినట్టు చెప్పారు. ఎయిర్‌పోర్ట్‌లో ఎంబార్కేషన్ పాయింట్ ఏర్పాటు చేయడంతో పాటు హజ్ యాత్రికులకు అవసరమైన పూర్తి సదుపాయాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందన్నారు.

### ఫ్రాన్సిక కుటుంబానికి వైఎస్సార్‌సీపీ ఆర్థిక సాయం



ఫ్రాన్సిక కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయాన్ని అందిస్తున్న వరప్రసాద్, వైఎస్సార్‌సీపీ నేతలు

దెందులూరు: ఏలూరులో ఈనెల 13న జరిగిన యాసిడ్ దాడిలో గాయపడి అప్పటినుంచి విజయవాడ మణిపాల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వేకువజామున మృతి చెందిన యడ్ల ఫ్రాన్సిక అంత్యక్రియలు బుధవారం దెందులూరులో జరిగాయి. వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆళ్ల నాని ప్రకటించిన ఆర్థిక సాయాన్ని ఏపీ మెడికల్ బోర్డు డైరెక్టర్ దిరిశాల వరప్రసాద్, ఏలూరు కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్‌బాబు, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, కార్పొరేటర్లు కిలాడిజ్యోతి దుర్గారావు, నున్నా స్వాతి, మున్నుల జాన్ గురునాథ్, నరేంద్ర అన్నపూర్ణ, జయకర్, కె.సాంబ కలిసి ఆమె కుటుంబ సభ్యులకు అందజేసి.. వారిని ఓదార్చారు. సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం, వైఎస్సార్‌సీపీ అండగా ఉంటాయని భరోసా ఇచ్చారు.

## సమాజంలో ఇంజనీర్లపాత్ర కీలకం

- వీవీఐటీ స్నాతకోత్సవంలో హైకోర్టు జడ్జి జస్టిస్ జి.రామకృష్ణప్రసాద్



పెదకాకాని: సమాజంలో ప్రతి రంగం సాంకేతికతతో ముడిపడిన తరుణంలో ఇంజనీర్ల పాత్ర కీలకమని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.రామకృష్ణప్రసాద్ చెప్పారు. గుంటూరు జిల్లా పెదకాకాని మండలం నంబూరులోని వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీవీఐటీ)లో తొలి స్నాతకోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. హైకోర్టు న్యాయమూర్తి జి.రామకృష్ణప్రసాద్, జేఎన్‌టీయూ కాకినాడ వైస్ చాన్సలర్ ఆచార్య డాక్టర్ జి.వి.ఆర్.ప్రసాద్‌రాజు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జస్టిస్ రామకృష్ణప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు ఈ డిగ్రీతో సమాజం, తల్లిదండ్రుల పట్ల బాధ్యత మరింత పెరిగిందని చెప్పారు. మానవత్వంతో మెలిగి ఇతరులకు సేవచేయాలని సూచించారు. లక్ష్యాన్ని ఎంచుకోవడం ద్వారా మెరుగైన విజయాలు సాధించవచ్చన్నారు. వీసీ ప్రసాద్‌రాజు మాట్లాడుతూ జేఎన్టీయూ కాకినాడ విశ్వవిద్యాలయం సాంకేతిక విద్యతోపాటు మానవత్వం, విలువలను, మంచి ఆలోచన విధానాన్ని అలవర్చుకునే విధంగా విద్యార్థులకు విద్యను అందిస్తున్నట్లు చెప్పారు. డిగ్రీలు పొందిన విద్యార్థులు భవిష్యత్తులో మెరుగైన విజయాలను సాధించి అందరూ గర్వపడే విధంగా ఉండాలని సూచించారు. వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ ఉత్తమ పౌరులుగా ఎదిగి సమాజానికి సాధ్యమైనంత సాయం చేయాలని కోరారు. ఈ స్నాతకోత్సవంలో క్లాస్ ఆఫ్ ది 2023లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆరుగురు విద్యార్థులకు బంగారు పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. 897 మంది పట్టభద్రులకు డిగ్రీ ప్రదానం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి కళాశాల వార్షిక ప్రణాళికను, భవిష్యత్తు కార్యాచరణను ప్రకటించారు. వీవీఐటీ వైస్ చైర్మన్ వాసిరెడ్డి మహదేవ్, అకడమిక్ డీన్ ఆఫ్ అడ్మిన్ డాక్టర్ ఎం.కుమార్‌స్వామి, డీన్ ఆఫ్ ప్లేస్‌మెంట్స్ డాక్టర్ ఎం.వి.రఘురామ్, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## రిజిస్ట్రేషన్ కాగానే యాజమాన్య హక్కు

- త్వరలో అందుబాటులోకి ఆటో మ్యుటేషన్
- రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖల సాఫ్ట్‌వేర్‌ల అనుసంధానం
- తొలుత రీ సర్వే పూర్తయిన 2 వేల గ్రామాల్లో అమలు
- తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా అమలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఆటో మ్యుటేషన్ విధానం త్వరలో అందుబాటులోకి రానుంది. ప్రస్తుతం అమల్లో ఉన్న మ్యుటేషన్ (యాజమాన్య హక్కు బదిలీ) విధానాన్ని సులభతరం చేసే క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం దీన్ని తీసుకురానుంది. స్థిరాస్తుల క్రయవిక్రయాలు జరిగిన తర్వాత వాటిని తమ పేరు మీదకు మార్చుకోవడం ఇప్పుడున్న విధానంలో క్లిష్టతరంగా ఉంది. రిజిస్ట్రేషన్ పూర్తయిన తర్వాత మళ్లీ మ్యుటేషన్ కోసం రెవెన్యూ శాఖకు దరఖాస్తు చేసుకోవడం, నిర్దిష్ట గడువులో ఆ శాఖ దాన్ని పూర్తి చేయడానికి కొంత సమయం పడుతోంది. మధ్యలో కొన్ని వివాదాలకు సైతం ఆస్కారం ఏర్పడుతోంది. గతంలో ఎంతో ప్రహసనంగా ఉన్న మ్యుటేషన్ ప్రక్రియను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక నిరంతరం సమీక్షలతో ఎప్పటికప్పుడు క్లియర్ చేస్తున్నా.. మరింత సులభతరం చేయాలని నిర్ణయించారు. అందులో భాగంగానే ఎంతోకాలం నుంచి కాగితాలకే పరిమితమైన ఆటో మ్యుటేషన్ ప్రతిపాదనను వాస్తవ రూపంలోకి తీసుకు రానున్నారు.

### రూపొందిన ప్రత్యేక అప్లికేషన్..

ఇందుకోసం స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ సాఫ్ట్‌వేర్‌కు, రెవెన్యూ శాఖ వెబ్‌ల్యాండ్ సాఫ్ట్‌వేర్‌ను అనుసంధానం చేస్తున్నారు. ఇందుకోసం ఒక ప్రత్యేక అప్లికేషన్‌ను రూపొందించారు. తత్ఫలితంగా ఏదైనా ఆస్తి రిజిస్ట్రేషన్ అయిన వెంటనే ఆటోమేటిక్‌గా మ్యుటేషన్ జరిగిపోతుంది. రిజిస్ట్రేషన్ జరిగిందంటే రెవెన్యూ రికార్డుల్లోనూ యాజమాన్య హక్కు దానంతట అదే మారిపోతుంది. రెవెన్యూ వ్యవస్థలో ఇది అత్యంత కీలకమైన మార్పుగా చెబుతున్నారు. ఆటో మ్యుటేషన్ విధానాన్ని తొలుత భూముల రీ సర్వే పూర్తయిన 2 వేల గ్రామాల్లో అమల్లోకి తీసుకురానున్నారు. ఇప్పటికే ఇందుకు సంబంధించిన టెస్టింగ్ ప్రక్రియ కూడా పూర్తయింది. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా ఆటో మ్యుటేషన్‌ను అందుబాటులోకి తీసుకురావాలనే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి.

## విద్యార్థుల్లో ఇంగ్లిష్ నైపుణ్యానికి మరో ముందడుగు

### ఈటీఎస్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ప్రపంచస్థాయిలో ఉన్నత ఉద్యోగాలు సాధించేలా వారికి ఆస్థాయి విద్యను అందించాలని ప్రభుత్వం సంకల్పించింది. అందులో భాగంగా విద్యార్థుల్లో ఇంగ్లిష్ భాషలో నైపుణ్యాన్ని మెరుగుపరచడానికి కంకణం కట్టుకుంది. ఇందుకోసం ఎడ్యుకేషన్ టెస్టింగ్ సర్వీసెస్ (ఈటీఎస్)తో పాఠశాల విద్యాశాఖ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ బుధవారం ఉత్తర్వులిచ్చారు. ఈ ఒప్పందం ప్రకారం ఈటీఎస్ విద్యార్థులకు టెస్ట్ ఆఫ్ ఇంగ్లిష్ యాస్ ఏ ఫారెన్ లాంగ్వేజ్ (టోఫెల్) పరీక్షలు నిర్వహించడంతో పాటు సర్టిఫికెట్ ఇవ్వనుంది.ఇంగ్లిష్‌లో విద్యార్థులు ప్రావీణ్యం సంపాదించడానికి ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోంది. 2021–22 నుంచి 6–10 తరగతుల విద్యార్థులందరికీ ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ అందిస్తోంది. 3–5వ తరగతి వరకు ఆంగ్లం మెరుగుదల కోసం చిత్ర నిఘంటువులు ఇస్తోంది. అంతేగాకుండా 6వ తరగతికి బదులుగా (ప్రామాణిక నిబంధనల ప్రకారం) 3వ తరగతి నుంచే ఆంగ్లం కోసం సబ్జెక్ట్ టీచర్లను ఏర్పాటు చేసింది.

## అందరికీ ఆమోదయోగ్యంగా 'పీఆర్‌సీ'పై నిర్ణయం

- మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కారుమూరి నాగేశ్వరరావు వెల్లడి
- పే రివిజన్ పై విద్యుత్ ఉద్యోగులతో చర్చలు



ఉద్యోగ సంఘాల నేతలతో మాట్లాడుతున్న మంత్రులు పెద్దిరెడ్డి, కారుమూరి

సాక్షి, అమరావతి: విద్యుత్ ఉద్యోగుల పీఆర్‌సీపై అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయాలు తీసుకుంటామని రాష్ట్ర మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కారుమూరి నాగేశ్వరరావు హామీ ఇచ్చారు. వీరు విద్యుత్ ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో సచివాలయంలో బుధవారం భేటీ అయ్యారు. సంఘాల ప్రతినిధులు పే రివిజన్‌పై ఉద్యోగుల డిమాండ్లను మంత్రులకు వివరించారు. ప్రస్తుత విధానాన్ని కొనసాగిస్తూ సింగిల్ మాస్టర్ స్కేల్ అమలు చేయాలని కోరారు. జెన్‌కో ఉద్యోగులకు అలవెన్స్‌లు, ఇతర అలవెన్స్‌లను యథాతథంగా కొనసాగించాలని, వెయిటేజీతో పాటు ఫిట్‌మెంట్లను అలానే ఉంచాలని, అలాకాని పక్షంలో అధిక ఫిట్‌మెంట్ ఇవ్వాలని కోరారు. ఇంధన శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్ మాట్లాడుతూ ఉద్యోగుల డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగానే పరిశీలిస్తోందన్నారు. మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ సంఘాల డిమాండ్లను సీఎం జగన్ దృష్టికి తీసుకువెళతామని, వారం రోజుల్లో మరోసారి ఉద్యోగసంఘాల ప్రతినిధులతో భేటీ ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఇప్పటికే వన్ మెన్ కమిషన్ నివేదికపై ఉద్యోగ సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేస్తోన్న నేపథ్యంలో దానిని పూర్తిస్థాయిలో పరిగణనలోకి తీసుకోవడం లేదని మంత్రి స్పష్టం చేశారు. ఏపీ జెన్‌కో ఎండీ, ట్రాన్స్‌కో జేఎండీ చక్రధర్ బాబు, ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్, ట్రాన్స్ కో విజిలెన్స్ జేఎండీ మల్లారెడ్డి పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో కుప్పకూలిన ఫ్లైఓవర్ శ్లాబ్



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లోని ఎల్బీనగర్ సాగర్ రింగ్‌రోడ్డు వద్ద నిర్మాణంలో ఉన్న ఫ్లైఓవర్ ర్యాంపు శ్లాబ్ కుప్పకూలింది. ఈ ఘటనలో సైట్ ఇంజనీర్‌తోపాటు ఎనిమిది మంది కార్మికులకు గాయాలయ్యాయి. బుధవారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. ఇందులో గాయపడ్డవారంతా ఇతర రాష్ట్రాల కార్మికులేనని అధికారులు తెలిపారు. సాగర్ రింగ్‌రోడ్డు వద్ద ఫ్లైఓవర్ పనుల్లో భాగంగా బైరామల్‌గూడ చెరువు మీదుగా ర్యాంప్ నిర్మిస్తున్నారు. మంగళవారం రాత్రి 9 గంటల సమయంలో ర్యాంప్ శ్లాబ్ పనులు ప్రారంభించారు. బుధవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో రెడీమిక్స్ కాంక్రీటు లారీని రివర్స్ తీస్తుండగా.. డ్రైవర్ అప్రమత్తంగా లేకపోవడంతో శ్లాబ్‌కు సపోర్ట్‌గా ఉన్న ఇనుప రాడ్‌లకు తగిలింది. దీంతో నిర్మాణంలో ఉన్న ర్యాంప్ శ్లాబ్ ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ ఘటనలో రంగారెడ్డి జిల్లాకు చెందిన సైట్ ఇంజనీర్ గోపాలకృష్ణతోపాటు ఉత్తర ప్రదేశ్, బిహార్‌లకు చెందిన కార్మికులు రోహిత్‌కుమార్(25), పునీత్‌కుమార్ (25), శంకర్‌లాల్ (25), జితేందర్‌కుమార్(26), రవికుమార్(26), హరేరామ్‌కుమార్(22), రత్నేష్‌కుమార్, కమల్‌ప్రసాద్‌లకు గాయాలయ్యాయి. వారిని సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. వీరిలో రోహిత్ కుమార్ పరిస్థితి విషమంగా ఉన్నట్టు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.

## ఆర్టీసీ అభివృద్ధికి తోడ్పడండి: ఆర్టీసీ ఎండీ

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ఔదార్యంతో స్పందించి ఆర్టీసీలో కారుణ్య నియామకాలకు ఆమోదం తెలిపిందని ఆర్టీసీ ఎండీ సీహెచ్.ద్వారకాతిరుమలరావు చెప్పారు. కారుణ్య నియామకాల కింద నియమితులైన జూనియర్ అసిస్టెంట్లకు విజయవాడ విద్యాధరపురంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కారుణ్య నియామకాల కింద మొత్తం 294 మందికి ప్రభుత్వం ఉద్యోగాలు ఇచ్చిందని చెప్పారు. చిత్తశుద్ధితో పనిచేసి సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఈడీలు కె.ఎస్.బ్రహ్మానందరెడ్డి, రవాణా అకాడమీ ప్రిన్సిపల్ డి.సామ్రాజ్యం, ట్రైనింగ్ కాలేజీ ప్రిన్సిపల్ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలోని మెడికల్ కాలేజీలపై ఈడీ దాడులు

సాక్షి, హైదరాబాద్: మెడికల్ పీజీ, ఎంబీబీఎస్ సీట్లను బ్లాక్ చేసి అమ్ముకున్నారనే ఆరోపణల నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రంలోని ప్రైవేట్ మెడికల్ కాలేజీలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కొరడా ఝళిపించింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఏకకాలంలో 11 మెడికల్ కాలేజీలు, కార్పొరేట్ ఆఫీసులు కలిపి 22 ప్రాంతాల్లో దాడులు నిర్వహించింది. గురువారం కూడా ఈ సోదాలు కొనసాగే అవకాశం ఉన్నట్టు సమాచారం. నీట్ ఫలితాలు వచ్చి, మెడికల్ కాలేజీల్లో సీట్ల భర్తీకి ఏర్పాట్లు జరుగుతున్న నేపథ్యంలో ఈడీ దాడులు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఈ కాలేజీలన్నీ రాజకీయ నాయకులు, వారి అనుయాయులవే కావడం గమనార్హమని వైద్య వర్గాలు చెప్తున్నాయి. సోదాల్లో మెడికల్ పీజీ, ఎంబీబీఎస్ అడ్మిషన్ల రికార్డులు, కాలేజీల బ్యాంకు లావాదేవీల వివరాలను సేకరించారని, పలు అంశాలపై ప్రిన్సిపాల్‌లను ప్రశ్నించారని తెలిసింది. పలు కంప్యూటర్ హార్డ్‌డిస్క్‌లను, డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం.

## క్లుప్తంగా...

### నెలాఖరులోగా రైతులు ఈకేవైసీ చేయించుకోవాలి

**వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ చేవూరు హరికిరణ్**

**సాక్షి, అమరావతి:** ఇంకా ఈకేవైసీ చేయించుకోని పీఎం కిసాన్ లబ్ధిదారులు ఈ నెలాఖరులోగా తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ చేవూరు హరికిరణ్ విజ్ఞప్తి చేశారు. బయోమెట్రిక్ (వేలిముద్రలు) అథంటికేషన్‌తో పాటు ఈసారి ఫేస్ అథంటికేషన్ మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. వేలి ముద్రలు పడని వారు, ఆధార్-ఫోన్ నంబర్ లింక్ కాని వారు ఈ ఫేస్ అథంటికేషన్ మొబైల్ ద్వారా ఈకేవైసీ నమోదు చేసుకోవచ్చునన్నారు. ఇప్పటి వరకు 20,664 మంది రైతులు ఈ యాప్ ద్వారా ఈకేవైసీ చేయించుకున్నారన్నారు. ఈ యాప్ పనితీరును బుధవారం మంగళగిరిలోని వ్యవసాయ శాఖ కమిషనరేట్ క్యాంప్ కార్యాలయంలో ఆయన పరిశీలించారు. స్వయంగా రైతులకు ఈ యాప్‌ద్వారా ఈకేవైసీ నమోదు చేయించారు.

### త్వరలో డీటీహెచ్ చానల్స్‌లో పాఠాలు

**ఆన్‌లైన్‌లో కంటెంట్‌ను అప్‌లోడ్ చేసిన పాఠశాల విద్యాశాఖ కమిషనర్**

**సాక్షి, అమరావతి:** పాఠశాల విద్యార్థులకు డైరెక్ట్ టు హోమ్ (డీటీహెచ్) చానల్స్ ద్వారా బోధన అందించేందుకు మార్గం సుగమమైంది. 'ప్రధాన మంత్రి ఈ-విద్య' డీటీహెచ్ చానల్స్‌లో టెలికాస్ట్ చేసేందుకు అవసరమైన కంటెంట్‌ను బుధవారం పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్ కుమార్ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అందరికీ సమాన విద్యా అవకాశాలు అందుబాటులో ఉంచే ప్రక్రియలో భాగంగా 200 డైరెక్ట్ టు హోమ్ చానళ్లను రూపొందించి, ఈ నెలాఖరులోగా అందుబాటులోకి తేనుంది. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో పాఠశాల విద్య కోసం ఐదు చానళ్లను కేటాయించింది. వీటి ద్వారా 2023-24 విద్యా సంవత్సరంలో 6 నుంచి 9 తరగతులకు ఒక్కో చానల్ చొప్పున, 3, 4, 5 తరగతులకు ఒక చానల్ కేటాయించినట్టు కమిషనర్ తెలిపారు. ఎస్సీఈఆర్టీ, పాఠశాల విద్య కమిషనర్ (ఇన్‌ఫ్రా) ఆధ్వర్యంలో 6, 7, 8, 9 తరగతుల భాషా విషయాల ఈ-కంటెంట్ రూపొందించామని, ప్రస్తుతం 8వ తరగతి కంటెంట్‌ను డీటీహెచ్ చానళ్లలో ప్రసార నిమిత్తం పంపించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ డాక్టర్ బి.ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

### నోటాకు వచ్చిన ఓట్లు కూడా బీజేపీకి రాలేదంటావ్..

### మళ్లీ మా దగ్గరికే వస్తావ్!

**చంద్రబాబుపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు ధ్వజం**



**ఒంగోలు:** దమ్ముంటే చంద్రబాబు బహిరంగ చర్చకు రావాలని.. అడిగేందుకు తమ వద్ద చాలా ఉన్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు సవాల్ విసిరారు. స్థానిక క్విస్ ఇంజినీరింగ్ కాలేజీలో బుధవారం అంతర్జాతీయ యోగ దినోత్సవంలో పాల్గొనేందుకు ఒంగోలు వచ్చిన ఆయన కొద్దిసేపు మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు సీఎంగా ఉండి కేంద్ర దర్యాప్తు సంస్థలు రాష్ట్రంలోకి అడుగుపెట్టడానికి వీల్లేదంటూ హుకుం జారీచేశారని, కానీ నేడు ప్రతి దానికి కేంద్రం స్పందించాలని కోరడం సరైన చర్య కాదన్నారు. శాంతిభద్రతలు రాష్ట్ర పరిధిలో ఉంటాయన్నారు. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మౌనంగా ఉండి నేడు కేంద్రంపై నిందలు వేస్తే సహించేదిలేదన్నారు. ప్రతిసారి మమ్మల్ని ప్రశ్నించే మీడియా ఒక్కసారి అయినా ప్రత్యేక హోదా ఎందుకు వద్దన్నావ్, రైల్వే జోన్ ఎందుకు తేలేకపోయారంటూ చంద్రబాబును ప్రశ్నించాలని హితవుపలికారు. కేంద్రంలో చక్రం తిప్పి ఐదుగురు ప్రధాన మంత్రులను మార్చిన చంద్రబాబుకు నాడు రైల్వే జోన్ గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. నోటాకు వచ్చినన్ని ఓట్లు కూడా తమకు రాలేదంటూ విమర్శలు గుప్పిస్తూనే మరో వైపు మేమే కావాలంటూ రావడం దేనికి నిదర్శనమని ప్రశ్నించారు.

### డీవోపీగా సుదర్శన్‌రెడ్డి నియామకంపై పిటిషన్

**సాక్షి, అమరావతి:** డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ (డీవోపీ)గా జల్లా సుదర్శన్‌రెడ్డి నియామకాన్ని సవాలు చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. అన్ని అర్హతలున్న తనను కాదని సుదర్శన్‌రెడ్డిని డీవోపీగా నియమించడం చట్ట విరుద్ధమంటూ ప్రాసిక్యూషన్స్ అదనపు డైరెక్టర్ రామకోటేశ్వరరావు ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. సుదర్శన్‌రెడ్డి నియామక జీవోను రద్దు చేయాలని కోర్టును కోరారు. ఈ వ్యాజ్యంపై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది రవీంద్రనాథ్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. చట్ట విరుద్ధంగా జరిగిన సుదర్శన్‌రెడ్డి నియామకానికి హైకోర్టు పాలనాపరంగా తన సమ్మతిని తెలపడం సరికాదన్నారు. కేవలం సుదర్శన్‌రెడ్డిని డీవోపీగా నియమించేందుకే నిబంధనలను సవరించారన్నారు. రాజకీయ నేతగా ఉన్న వ్యక్తిని డీవోపీగా నియమించారన్నారు. డీవోపీ అయ్యేందుకు పిటిషనర్‌కు అన్ని అర్హతలున్నాయన్నారు. హైకోర్టు సైతం గతంలో సానుకూల ఉత్తర్వులిచ్చిందన్నారు. వాదనలు విన్న ధర్మాసనం విచారణను ఈనెల 26కి వాయిదా వేసింది.

# రామోజీ రాసిందే రశీదు!

## మార్గదర్శి ముసుగులో 'నల్ల' దందా!

### రశీదుల ముసుగులో అక్రమ డిపాజిట్లు

ఓ చందాదారుడి నుంచి రూ.2.20 లక్షలు డిపాజిట్ రూపంలో తీసుకున్న నగదుకు ప్రతిగా మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఇచ్చిన రశీదు ఇదీ! భవిష్యత్ చందాలకు సెక్యూరిటీ పేరుతో ఇలా దశాబ్దాలుగా అక్రమంగా డిపాజిట్లను సేకరిస్తోంది. అవే నిధులను సొంత కంపెనీలకు పెట్టుబడులుగా దారి మళ్లిస్తోంది. ఉషాకిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్, మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ (తమిళనాడు - చెన్నై), మార్గదర్శి చిట్‌ఫండ్స్ (కర్ణాటక - బెంగళూరు)కు చేరవేస్తోంది. ఓ ప్రైవేట్ బ్యాంక్ డిపాజిట్లు వసూలు చేసి తన వ్యాపారాలకు మళ్లించిన మాదిరిగా చందాదారుల కష్టార్జితాన్ని కాజేస్తోంది! ఆర్బీఐ నిబంధనలను లెక్క చేయకుండా, కేంద్ర చిట్‌ఫండ్స్ చట్టాన్ని యథేచ్ఛగా ఉల్లంఘిస్తోంది. స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ, సీఐడీ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో ఈ బాగోతం బట్టబయలైంది. ఈ నేపథ్యంలో సహారా, చార్మినార్, కృషి బ్యాంక్ మాదిరిగా మార్గదర్శి చందాదారులు, డిపాజిట్‌దారులు నష్టపోకుండా, వారి ప్రయోజనాలను కాపాడటమే లక్ష్యంగా కఠిన చర్యలకు సీఐడీ సిద్ధమైంది.

**సాక్షి, అమరావతి**

మార్గదర్శి చిట్‌ఫండ్స్ తమ సంస్థలో చిట్టీ పాట పాడిన చందాదారులకు ఆ చిట్టీ మొత్తాన్ని చెల్లించకుండా కొంత మొత్తాన్ని తమ వద్ద డిపాజిట్‌గా ఉంచుకుంటోంది. ఈమేరకు ఓ రశీదు ఇస్తోంది. ఆ చిట్టీకి సంబంధించి మిగిలిన చందాల చెల్లింపునకు ష్యూరిటీగా ఆ మొత్తాన్ని తమ వద్ద డిపాజిట్‌గా ఉంచుతున్నట్లు చెబుతోంది! అలా రూ.50 వేల నుంచి రూ.10 లక్షల వరకు చందాదారుల నుంచి రశీదు రూపంలో డిపాజిట్లను సేకరిస్తోంది. ఆ డిపాజిట్లపై 4 - 5 శాతం వడ్డీ చెల్లిస్తామంటోంది. కొన్ని దశాబ్దాలుగా మార్గదర్శి చిట్‌ఫండ్స్ సాగిస్తున్న ఆర్థిక అక్రమాల దందా ఇదీ! చందాదారులు మునుముందు చెల్లించాల్సిన చందా మొత్తానికి ష్యూరిటీగా ఆ నగదును అట్టిపెట్టుకుంటున్నట్లు మార్గదర్శి చిట్ ఫండ్స్ తరఫున రామోజీరావు తమ పత్రికలో ఈనాడు అడ్డగోలుగా వాదిస్తున్నారు. ఆర్థిక సంస్థల నిర్వహణకు సంబంధించి ఆర్బీఐ, కేంద్ర ప్రభుత్వం రూపొందించిన చట్టాలను ఉల్లంఘిస్తున్న విషయాన్ని ఉద్దేశపూర్వకంగా దాటవేస్తున్నారు.



బంగారు ఆభరణాలు, లైఫ్ ఇన్సూరెన్స్ పత్రాలు, స్థిరాస్తి పత్రాలు, ముగ్గురు వ్యక్తుల హామీని ష్యూరిటీగా పరిగణించేందుకు అవకాశం ఉంది. అంతేగానీ చిట్టీ పాట కింద తాము చెల్లించాల్సిన మొత్తంలోనే కొంత మొత్తాన్ని ష్యూరిటీగా అట్టిపెట్టుకోడానికి వీలు లేదు. అలా కొంత మొత్తాన్ని చిట్‌ఫండ్ సంస్థలు తమ వద్ద ఉంచుకుంటే దాన్ని డిపాజిట్ల సేకరణగానే పరిగణిస్తారు. చిట్‌ఫండ్స్ సంస్థలు డిపాజిట్లను సేకరించడం చట్ట విరుద్ధం కాబట్టి అవి అక్రమ డిపాజిట్లే అవుతాయి.

#### అవి అక్రమ డిపాజిట్లే...

ఏదైనా ఓ ఆర్థిక సంస్థ తమ ఖాతాదారుల నగదును తమ వద్ద అట్టిపెట్టుకుని దానిపై వడ్డీ చెల్లిస్తామని లిఖితపూర్వకంగా తెలిపితే వాటిని డిపాజిట్లుగానే పరిగణిస్తారు. అలా డిపాజిట్లు సేకరించాలంటే ఆర్బీఐ నిబంధనలను అనుసరించాలి. ఆ నిబంధనల ప్రకారం చిట్‌ఫండ్స్ సంస్థలు డిపాజిట్లు వసూలు చేయకూడదు. మార్గదర్శి మాత్రం చిట్‌ఫండ్స్ రశీదు ముసుగులో డిపాజిట్లను సేకరిస్తోంది.

#### ష్యూరిటీగా నగదు డిపాజిట్లు తీసుకోకూడదు

చిట్‌ఫండ్స్ సంస్థలు తమ వద్ద చిట్టీ పాడిన చందాదారుల నుంచి ష్యూరిటీ తీసుకునేందుకు కేంద్ర చిట్ ఫండ్స్ చట్టం అనుమతిస్తోంది. ఈమేరకు నిర్దిష్ట విధానాలను కూడా స్పష్టం చేసింది. జాతీయ / షెడ్యూల్డ్ బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్ల పత్రాలు,

#### నల్లధనం దందానే...!

ష్యూరిటీ పేరుతో సేకరిస్తున్న డిపాజిట్లకు జారీ చేస్తున్న రశీదులో కూడా మార్గదర్శి చిట్‌ఫండ్స్ నిబంధనలను ఉల్లంఘిస్తోంది. వాటిపై చందాదారుడి పాన్ నంబరు పొందుపరచడం లేదు. చందాదారుల పాస్ పుస్తకంలో వారి బ్యాంకు ఖాతా వివరాలుగానీ ఆధార్ నంబరుగానీ ఉండటం లేదు. ఆర్థిక వ్యవహారాలకు సంబంధించి సదరు వ్యక్తుల పాన్ కార్డ్, ఆధార్ నంబరు, బ్యాంకు ఖాతా వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలని ఆర్బీఐ స్పష్టం చేస్తోంది. నల్లధనాన్ని అరికట్టేందుకు ఈమేరకు మార్గదర్శకాలు జారీ చేసింది. మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థ అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తూ రశీదు రూపంలో అక్రమ డిపాజిట్ల ద్వారా భారీగా నల్లధనాన్ని చలామణిలోకి తెస్తున్నట్లు సీఐడీ అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ వ్యవహారంపై దర్యాప్తు చేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ అథారిటీ(ఈడీ)కి నివేదించారు.



Margadarsi
RECEIPT
Two Lakh Twenty Thousand Only
6 Months & above but below 12 months 4.00 %
12 Months & above 5.00 %
220000.00 5.00 31/01/2024 L70717 B 45
for Margadarsi Chit Fund Private Ltd.

మార్గదర్శి చిట్ ఫండ్స్ ష్యూరిటీ పేరిట రశీదు రూపంలో సేకరిస్తున్న డిపాజిట్ పత్రం

#### నా డిపాజిట్లు.. నా వడ్డీ!!

దేశంలో బ్యాంకులు, నాన్ బ్యాంకింగ్ సంస్థలు తమ ఖాతాదారులకు చెల్లించాల్సిన వడ్డీ రేట్లను నిర్ణయించేందుకు ఆర్‌బీఐ నిర్దిష్ట విధానాలను రూపొందించింది. మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థ మాత్రం రశీదు రూపంలో తమ చందాదారుల నుంచి వసూలు చేస్తున్న అక్రమ డిపాజిట్లకు వడ్డీ రేటును ఎలా నిర్ణయిస్తోందో ఆ రహస్యం రామోజీకే తెలియాలి! 6 నెలల నుంచి 12 నెలల వరకైతే 4 శాతం, ఏడాది పైబడితే 5 శాతం వడ్డీ చెల్లిస్తామని రశీదులో మార్గదర్శి పేర్కొంటోంది. వడ్డీ రేటును ఏ ప్రాతిపదికన నిర్ణయించారని సీఐడీ అధికారులు ప్రశ్నిస్తే సమాధానం లేదు.

**అక్రమ డిపాజిట్ల కట్టడికే బీయూడీఎస్ చట్టం**

దేశంలో వివిధ రూపాల్లో సాగుతున్న అక్రమ డిపాజిట్ల దందా కట్టడికి కేంద్ర ప్రభుత్వం 2019లో బ్యానింగ్ ఆఫ్ నాన్ రెగ్యులేటెడ్ డిపాజిట్ స్కీమ్స్( బీఎస్‌డీఎస్) చట్టాన్ని తెచ్చింది. ఆర్థిక సంస్థలు, చిట్‌ఫండ్స్ సంస్థలు, ఇతర సంస్థలు, వ్యక్తులు యథేచ్ఛగా వివిధ రూపాల్లో అక్రమ డిపాజిట్లు వసూలు చేస్తూ చట్టాన్ని ఉల్లంఘిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. నియంత్రణ లేని డిపాజిట్లపై కఠినంగా వ్యవహరించడమే కాకుండా వాటిని నిషేధించేందుకు చట్టం చేసింది. కేంద్ర చట్టానికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం 2022లో మార్గదర్శకాలను జారీ చేసింది. సీఐడీ విభాగం ఆ చట్టం ప్రకారమే మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమ డిపాజిట్లపై కఠిన చర్యలకు ఉపక్రమించింది. దీంతోతమ బండారం బట్టబయలవుతోందని మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థ గగ్గోలు పెడుతోంది.

# కిడ్నాప్‌పై సీబీఐ విచారణకు సిద్ధం

- నా కుటుంబం కిడ్నాప్‌ను ఓ వర్గం మీడియా వక్రీకరిస్తోంది
- మనస్తాపంతోనే వ్యాపారాలు హైదరాబాద్‌కి షిఫ్ట్ చేస్తా అన్నాను
- నా కారణంగా ప్రభుత్వానికి, సీఎంకి చెడ్డ పేరు రాకూడదనే ఈ నిర్ణయం
- కిడ్నాపర్ హేమంత్‌తో నాకెలాంటి సంబంధం లేదు
- యర్ర గంగిరెడ్డి ఎవరో తెలియదు
- రఘురామకృష్ణరాజు గజ్జి కుక్కలాంటి వ్యక్తి
- విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

**సాక్షి, విశాఖపట్నం:** తన కుటుంబం కిడ్నాప్‌నకు గురైన వ్యవహారంపై కొందరు రాజకీయ నేతలు సీబీఐతో విచారణ చేయించాలని కోరుతున్నారని, వాళ్లనడం కాదు.. సీబీఐ విచారణకు తానే సిద్ధంగా ఉన్నానని విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ చెప్పారు. ఎంపీ బుధవారం ఇక్కడ మీడియాతో మట్లాడుతూ.. రౌడీషీటర్లు డబ్బు కోసం తన కుటుంబాన్ని కిడ్నాప్ చేసి, చిత్రహింసలకు గురి చేస్తే కొందరు రాజకీయవేత్తలు, ఓ వర్గం మీడియా దానిని వక్రీకరిస్తోందని చెప్పారు. ఆ మనస్తాపంతోనే విశాఖ వీడుతానని చెప్పానన్నారు. తన వ్యాపారాల కారణంగా ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి చెడ్డ పేరు రాకూడదనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. రెండేళ్ల కిందటే మాజీ ఎస్పీతో



భూవివాదం కారణంగా తనపై ఆరోపణలు చేశారని, అప్పుడే తాను ఈ నిర్ణయం ప్రకటించానని చెప్పారు. ప్రస్తుతం విశాఖలో చేపట్టిన నిర్మాణాలు పూర్తి చేస్తానన్నారు. తన నిర్ణయాన్ని వక్రీకరిస్తూ కొన్ని రాజకీయ పార్టీలు, ఒక వర్గం మీడియా ప్రభుత్వ ప్రతిష్టను, విశాఖ బ్రాండ్ ఇమేజ్‌ని దెబ్బతీసేలా ప్రయత్నిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో దేశంలోనే ఏపీ ప్రథమ స్థానంలో ఉందన్న విషయం ప్రజలందరికీ తెలుసన్నారు. కిడ్నాపర్ హేమంత్‌కుమార్‌తో తనకు ఎటువంటి సంబంధం లేదన్నారు. ఎవరితోనూ రాజకీయ కక్షలు, వ్యాపార లావాదేవీలు లేవని చెప్పారు.

హేమంత్‌కుమార్, రాజేష్‌పై అనేక క్రిమినల్ కేసులున్నాయని తెలిపారు. భీమవరం, తిరుపతి, విజయవాడలో కూడా వాళ్లు నేరాలకు పాల్పడ్డాడన్నారు. ఇలాంటి నేరస్తులు ఓ ఎంపీ కుటుంబ సభ్యులను కిడ్నాప్ చేస్తే.. ఎవరూ స్పందించక పోగా, డ్రామా అని కొందరు అంటున్నారన్నారు. ఎంపీ రఘురామకృష్ణరాజు గజ్జి కుక్కలాంటి వ్యక్తి అని మండిపడ్డారు. జనసేన కార్పొరేటర్ మూర్తియాదవ్ ఓ పిల్ల కుక్క అని అన్నారు. ఎర్ర గంగిరెడ్డి ఎవరో తెలియదని, ఆయనతో తనకు వెయ్యి కోట్ల లావాదేవీలు ఉన్నాయంటున్నారని, తన ఆస్తి మొత్తం వెయ్యి కోట్లు ఉండదని అన్నారు. చంద్రబాబు హయాంలో అప్పటి అరకు ఎమ్మెల్యే హత్యకు గురవలేదా, బాబు వాహనాన్నే పేల్చేశారే.. అప్పుడు ఆయనేం రక్షణ కల్పించాడు అని ప్రశ్నించారు.

## కిడ్నాప్ జరిగిందిలా..

'నా కుమారుడు శరత్ ఈ నెల 12వ తేదీ రాత్రి లాసన్స్‌బే కాలనీలోని మా ఇంటి నుంచి రుషికొండలోని నివాసానికి వెళ్లాడు. మరుసటి రోజు తెల్లవారుజామున కిడ్నాపర్లు హేమంత్, రాజేష్, సాయి ఇంట్లోకి ప్రవేశించి శరత్‌పై కత్తితో దాడి చేసి, బంధించారు. ఇంట్లో ఉన్న కొద్దిపాటి డబ్బు, శరత్ ధరించిన బంగారు ఆభరణాలు తీసుకున్నారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఆరోగ్యం బాగోలేదని శరత్‌తో వాళ్ల అమ్మకు ఫోన్ చేయించారు. శరత్‌కు ఆరోగ్యం బాగోలేదని, చూసొద్దామని ఆరోజు రాత్రి నా భార్య అనగా.. తాను మరునాడు వ్యాపారం నిమిత్తం హైదరాబాద్ వెళ్లాలని, ఉదయం తనని వెళ్లమని చెప్పాను. మరుసటిరోజు ఉదయం నేను హైదరాబాద్ వెళ్లాను. నన్ను విశాఖ ఎయిర్‌పోర్టు వద్ద డ్రాప్ చేసిన నా భార్య, డ్రైవర్ అదే కారులో రుషికొండ నివాసానికి వెళ్లారు. గుర్తు తెలియని వ్యక్తి తలుపు తీయడంతో ఎవరని అడిగితే.. చెత్త తీయడానికి వచ్చానని చెప్పాడు. లోపలికి వెళ్లిన నా భార్యను బంధించారు. డ్రైవర్‌ను వెళ్లి పొమ్మని శరత్‌తో ఫోన్ చేయించారు. వెంటనే నా స్నేహితుడు, ఆడిటర్ గన్నమనేని వెంకటేశ్వర్లు (జీవీ)కి కూడా ఫోన్ చేయించి రప్పించారు. ఆ తర్వాత వారిని చిత్ర హింసలు పెట్టారు. జీవీ చేత తెలిసిన వారికి ఫోన్లు చేయించి రూ.1.75 కోట్లు వసూలు చేశారు. అయినా వారు సంతృప్తి చెందలేదు. అదేరోజు నా స్నేహితుడొకరికి ఆడిటర్ అవసరం వస్తే నేను జీవీకి పలుమార్లు ఫోన్ చేశాను. ఫోన్ ఎత్తకపోవడంతో వాట్సాప్‌కి మెసేజ్ పెట్టాను. దానికీ రిప్‌లెట్రాలేదు. తర్వాతి రోజు ఉదయం మా ఇద్దరికీ స్నేహితుడైన ఒక వ్యక్తికి ఫోన్ చేయగా, అర్జెంటుగా రూ.20 లక్షలు అర్జెంట్‌గా కావాలని ఫోన్ చేశారని, ఎంపీ గారికి చెప్పొద్దన్నారని చెప్పాడు. దీంతో నాకు అనుమానం వచ్చింది. వెంటనే విశాఖ పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మకి ఫోన్ చేశాను. జీవీ నంబర్ నంబరు రుషికొండలో ఉన్నట్లు చూపిస్తోందని చెప్పారు. పోలీసులు పదే పదే జీవీకి ఫోన్ చేయడంతో కిడ్నాపర్లకు అనుమానం కలిగింది. అక్కడ నుంచి శరత్ కారులో వారిని తరలించే క్రమంలో రెండు గంటల్లోనే పోలీసులు వారిని పట్టుకున్నారు' అని ఎంపీ వివరించారు.

### భీమవరం మున్సిపల్ కమిషనర్ ఆస్తులపై ఏసీబీ దాడులు

**రూ.10 కోట్ల వరకు అక్రమ ఆస్తుల గుర్తింపు**



నగదుతో మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ

**భీమవరం(ప్రకాశం చౌక్):** పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మున్సిపల్ కమిషనర్ సబ్బి శివరామకృష్ణ ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారని ఫిర్యాదుతో డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు విజయవాడ ఏసీబీ డీఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం వేకువజామున భీమవరంలోని మున్సిపల్ కమిషనర్ ఇల్లు, కార్యాలయం, మున్సిపల్ ఉద్యోగి(ఆర్ఐ) కృష్ణమోహన్ ఇంట్లో, తణుకు, ఉండ్రాజవరం మండలం పాలంగి గ్రామం, పాలకొల్లు, బాపట్ల, విజయవాడలో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణకు సంబంధించి రూ.10 కోట్ల దాకా అక్రమ ఆస్తులను ఏసీబీ అధికారులు గుర్తించారు. ఏసీబీ డీఎస్పీ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పు గోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం పాలంగి గ్రామంలో 3.03 ఎకరాల భూమి, పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జీప్లస్ 1 భవనం, తణుకులో రెండు జీప్లస్ 1 భవనాలు, పాలకొల్లులో జీప్లస్ భవనం, ఒక ఖాళీ నివాస స్థలం, విజయవాడలో రెండు అపార్ట్‌మెంట్‌లు, ఇంట్లో నగదు రూ.20 లక్షలు, 500 గ్రాముల బంగారం, రెండు కార్లు, ఒక ద్విచక్ర వాహనంతో పాటు విలువైన పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అలాగే విజయవాడలో ఒక అపార్ట్‌మెంట్‌కు సంబంధించి సోదాలు కొనసాగించాల్సి ఉందని డీఎస్పీ శ్రీనివాస్ తెలిపారు. కమిషనర్‌ను అరెస్ట్ చేసి విజయవాడ ఏసీబీ కోర్టుకు హాజరు పరుస్తామన్నారు.

### అమర్నాథ్ హత్య కేసులో మరొకరి అరెస్ట్

**చెరుకుపల్లి:** బాపట్ల జిల్లాలో విద్యార్థి ఉప్పాల అమర్నాథ్ హత్యకేసులో నాలుగో నిందితుడు తుమ్మా సాంబిరెడ్డిని అరెస్ట్ చేసినట్టు వేమూరు సీఐ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం రాత్రి అరెస్టు చేసిన అతడిని బుధవారం కోర్టులో హాజరుపరిచినట్లు చెప్పారు. సీఐ బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మీడియాతో మాట్లాడారు. ఈ నెల 16న రాజవోలు గ్రామంలో పదోతరగతి విద్యార్థి ఉప్పాల అమర్నాథ్‌ను పెట్రోలు పోసి అతికిరాతంగా చంపిన కేసులో అదేరోజు పాము వెంకటేశ్వరరెడ్డి, పాము గోపిరెడ్డి, మద్దెల వీరబాబులను అరెస్టు చేసి మరుసటిరోజు కోర్టులో హాజరుపరిచినట్లు చెప్పారు.

### మళ్లీ ఓడిపోతానని తెలుసు.. అయినా నిలబడుతున్నా..: పవన్ కళ్యాణ్

**సాక్షి, అమలాపురం/ముమ్మిడివరం:** 'వచ్చే ఎన్నికల్లో ఓడిపోయినా.. నిలబడి ఉండటానికి సిద్ధపడి గొడవ పెట్టుకుంటున్నాను. మా నాన్న చెప్పేవాడు కీడెంచి మేలెంచమని. నేను ఇంకొకసారి ఓడిపోతానని నిర్ణయించుకునే వైఎస్సార్‌సీపీ క్రిమినల్ గ్యాంగ్స్‌తో గొడవ పెట్టుకుంటున్నాను' అని జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ అన్నారు. వారాహి విజయ యాత్రలో భాగంగా అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ముమ్మిడివరంలో బుధవారం రాత్రి బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. జనసేన గెలవకపోయినా.. తాను ఎమ్మెల్యేగా ఓడిపోయినా.. ప్రశ్నిస్తున్నాననే భయం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ఉందన్నారు. అందుకే తాను వస్తున్నానని తెలిసి హడావిడిగా ధాన్యం కొన్నారని, ధాన్యం సొమ్ములు కూడా రైతుల అకౌంట్లలో వేశారని తెలిపారు. గతంలోనూ తన సభలకు ఇలాగే జనం వచ్చారని, కానీ ఓటు వైఎస్సార్‌సీపీకి వేశారన్నారు. 'ముఖ్యమంత్రి జగన్‌ను 75 శాతం మంది వ్యతిరేకిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో వీరంతా ఐక్యంగా ఉండి, ఉమ్మడి కార్యాచరణ ప్రణాళికను అర్థం చేసుకోకపోతే మరోసారి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చి తీరుతుంది' అని పవన్ స్పష్టం చేశారు. కోనసీమలో ఒక ఎమ్మెల్యే స్నానాల రేవులో ఇసుక తవ్వేశారని, స్నానాలకు వెళ్లి ఇప్పటివరకు అక్కడ నలుగురు మునిగి చనిపోయారని ఆరోపించారు. కోనసీమ జిల్లాకు అంబేడ్కర్ పేరు పెట్టేందుకు జనసేన అంగీకారం తెలిపిందని, అంబేడ్కర్ పేరును వ్యతిరేకించిన వారిని ప్రభుత్వం ఒప్పించాల్సింది పోయి రెచ్చగొట్టి కులాల మధ్య చిచ్చుపెట్టిందన్నారు. తాను కులాల గురించి మాట్లాడతే తప్పా అని ప్రశ్నించారు. అమరావతి ఒక కులానికి చెందిన రాజధాని అని మీరు అనొచ్చా.. అని ప్రశ్నించారు.

**కోనసీమలో ఒక పంట వేయడం లేదు**

ఏటా మూడు పంటలు పండే కోనసీమలో తొలి పంట వేయడం లేదని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. పోలవరం వంటి ప్రాజెక్టులే కట్టడమే కాదని.. పంట కాలువల్లో పూడిక కూడా తీయాలన్నారు. కొబ్బరికి తెల్లదోమ ఆశించి రైతులు నష్టపోతుంటే.. రాష్ట్రానికి వైఎస్సార్‌సీపీ అనే తెల్ల దోమ ఆశించింది అని పవన్ ఎద్దేవా చేశారు. 'ద్వారంపూడి కుటుంబంపైన, వైఎస్సార్‌సీపీ నేతల మీద నాకు ఎటువంటి కోపం లేదు. కాని వారు బియ్యం వ్యాపారాన్ని శాసిస్తున్నారు. గోదావరి జిల్లా రైతులు నష్టపోతున్నారనే నా కోపమంతా' అని వ్యాఖ్యానించారు. జనసేన అధికారంలోకి వస్తే మత్స్యకారులకు నియోజకవర్గానికి 500 మందికి బోట్లు అందిస్తామన్నారు. లక్ష మంది యువతకు రూ.పది లక్షల చొప్పున పెట్టుబడి అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అంతకుముందు ఆయన జనవాణి కార్యక్రమం నిర్వహించి రైతులు, మత్స్యకారులు, నియోజకవర్గంలో వివిధ వర్గాల సమస్యలను తెలుసుకున్నారు.

### 'సింగిల్ యూజ్' వినియోగం తక్కువే!

- భారత్‌లో ఏటా ప్రతి వ్యక్తి సగటున 4 కేజీల సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వ్యర్థాల ఉత్పత్తి
- అత్యధికంగా ఆస్ట్రేలియాలో 59 కేజీలు, అమెరికాలో 53 కేజీల వినియోగం
- భారత్‌లో సగటు వినియోగం తక్కువే అయినా.. జనాభా పరంగా ఎక్కువే అంటున్న పర్యావరణవేత్తలు
- నిషేధించి ఏడాది అవుతున్నా ప్రభావం కనిపించట్లేదని ఆందోళన

**సాక్షి, అమరావతి:** భారత్‌లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం కాస్త తక్కువగానే ఉన్నట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అమెరికా, ఆస్ట్రేలియా, బ్రిటన్, కొరియా, జపాన్ వంటి అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే భారత్‌లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వ్యర్థాల ఉత్పత్తి చాలా తక్కువగా ఉన్నట్లు వరల్డ్ స్టాటిస్టిక్స్ సర్వే వెల్లడించింది. భారత్‌లో ప్రతి వ్యక్తీ సగటున 4 కేజీల సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వ్యర్థాలను ఉత్పత్తి చేస్తుండగా.. ఆస్ట్రేలియాలో అత్యధికంగా 59 కేజీలు, అమెరికాలో 53, కొరియా, బ్రిటన్ దేశాల్లో 44, జపాన్‌లో 37 కేజీల వ్యర్థాలను ఉత్పత్తి చేస్తున్నట్లు తెలిపింది. భారత్‌లో ప్రతి వ్యక్తి ఉత్పత్తి చేస్తున్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వ్యర్థాల సగటు తక్కువగా ఉన్నప్పటికీ.. ఇతర దేశాలతో పోలిస్తే జనాభా అధికం కనుక వ్యర్థాలు ప్రమాదకరస్థాయిలోనే ఉంటాయని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**13 శాతం రీసైక్లింగ్..**

ప్రపంచవ్యాప్తంగా ప్లాస్టిక్ రీసైక్లింగ్ సగటున 9 శాతంగా ఉంటే.. భారత్‌లో 13 శాతం వరకు ఉంది. కానీ ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణలో భారత్ వెనుకబడి ఉందని ఓఈసీడీ నివేదిక వెల్లడించింది. ఉత్పత్తి అవుతున్న ప్లాస్టిక్ వ్యర్థాల్లో 46 శాతం సేకరణే జరగడం లేదని పేర్కొంది. అలాగే 36 శాతం భూమిలోకి వెళ్లిపోతోందని తెలిపింది. వీటిపై దృష్టి సారించాలని ప్రభుత్వాలకు పర్యావరణవేత్తలు విజ్ఞప్తి చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం గతేడాది జూలై నుంచి సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు సంబంధించిన 21 ఉత్పత్తుల వినియోగాన్ని నిషేధించింది. ఏడాది కావస్తున్నా ఈ నిర్ణయం పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని పర్యావరణవేత్తలు చెబుతున్నారు. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగిస్తున్న వారిపై రూ.5.8 కోట్ల మేర జరిమానాలు విధించడంతో పాటు 7,75,577 కేజీల ప్లాస్టిక్‌ను సీజ్ చేశారు. నిషేధం విధించిన మొదట్లో ఈ దాడులు నిర్వహించినా.. ఇప్పుడు యథేచ్ఛగా వినియోగిస్తున్నారని, దీని వల్ల జరిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ప్రభుత్వాలను పర్యావరణవేత్తలు కోరుతున్నారు.



# రాజకీయ ఆత్మహత్య దిశగా పవన్

**మీడియాతో జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు**

**సాక్షి, అమరావతి:** రాజకీయ ఆత్మహత్య దిశగా పవన్‌కళ్యాణ్ పయనిస్తున్నారని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. ఆయన బుధవారం తాడేపల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడారు. నిత్యం పిచ్చి వ్యాఖ్యలతో గ్రాఫ్ దిగజారిపోవడంతో పాటు, రాజకీయాల్లో మోస్ట్ కన్‌ఫ్యూజ్డ్ వ్యక్తిగా పవన్ మిగిలిపోయారని ఎద్దేవా చేశారు. 'పవన్ నువ్వు ఎక్కింది వారాహి కాదు పందిని. ఆ పందిపై తిరుగుతూ నీపై నువ్వే బురద చల్లుకుంటున్నావు. నీ పిరికితనం తప్పు.. నిన్ను చంపాల్సిన అవసరం ఏంటి. అసలు నీస్థాయి ఎంత.. నువ్వు గెలిచిన సీట్లు ఎన్ని. నీ మాటలు చాలదా.. ఒకడు నిన్ను చంపాలా? నీ వ్యాఖ్యలతో నువ్వే రాజకీయంగా చచ్చిపోయేలా ఉన్నావు. నీకే నమ్మకం లేని ఎన్నికలకు నువ్వే ప్రచారం చేసుకోవడం చూస్తే నవ్వొస్తోంది. ఒకవేళ నిన్ను చంపాల్సి వస్తే.. వంగవీటి మోహనరంగాను హతమార్చిన వాళ్లకే ఆ ఆలోచన ఉంటుంది. నువ్వు చెగువేరా బొమ్మ వేసుకుని ప్రాణహాని గురించి ప్రస్తావించడం సిగ్గుచేటు..' అని మండిపడ్డారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తాము ప్రధాన ప్రతిపక్షమైన చంద్రబాబును మాత్రమే కాదని, దుష్టచతుష్టయంతో పాటు దత్తపుత్రుడు పవన్‌ను కూడా ఒంటరిగానే ఎదుర్కొంటున్నట్టు చెప్పారు. ప్రజల్లో సీఎం జగన్‌కు ఉన్న ఆదరణ చూసి జీర్ణించుకోలేక భయపడుతున్న రామోజీరావు.. పవన్‌ను అడ్డుపెట్టుకుని కుటిల రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. హైదరాబాద్‌లో ఉండే రామోజీరావు, అప్పుడప్పుడు రాష్ట్రానికి వచ్చిపోయే పవన్ కలిసి.. నిత్యం ప్రజాసంక్షేమం కోసమే పనిచేస్తున్న సీఎం జగన్‌ను ఎక్కడికి పంపించగలరని నిలదీశారు. 'రామోజీరావు లేనిపోనిదిరాసి.. గందరగోళం చేసి ప్రజల మనసులను మార్చాలనుకోవడం పూర్వం చెల్లింది. ఎన్టీఆర్‌పై అలాంటి రాతలేరాసి భ్రష్టుపట్టించారు. ఆ పాపానికి ఇప్పుడు ఖర్మ అనుభవించక తప్పదు..' అని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో పేదలకు, పెత్తందారులకు మధ్య జరిగే కురుక్షేత్ర యుద్ధంలో కౌరవ కూటమిని ఓడించేందుకు ప్రజలు ఎప్పుడో సిద్ధమయ్యారన్నారు. పవన్‌కు ప్రాణహానిపై భయం ఉంటే ఫిర్యాదు చేయాలని, ప్రభుత్వం కచ్చితంగా విచారణ చేస్తుందని చెప్పారు.

### వైట్‌కాలర్ నేరగాడు రామోజీ

భారతదేశంలోనే రామోజీరావుకి మించిన వైట్‌కాలర్ నేరస్తులు లేరని చెప్పారు. చిట్‌ఫండ్ చట్టాలను యథేచ్ఛగా ఉల్లంఘించి, మనీలాండరింగ్‌కు పాల్పడ్డారన్నారు. న్యాయస్థానాలు సైతం విచారణను ఎక్కడా అపమని చెప్పలేదని.. పవన్ మాత్రం రామోజీకి ఒత్తాసు పలకడం సిగ్గుచేటని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాపుల కోసం తన రాజకీయ జీవితాన్ని ఫణంగా పెట్టి అండగా నిలబడింది ముద్రగడ పద్మనాభం ఒక్కరేనని చెప్పారు. వంగవీటి మోహన రంగారావు మరణానికి ముందే తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేసి అప్పుడు విజయవాడలో నిర్వహించిన కాపునాడులో కాపుల కోసం గొంతెత్తారన్నారు. కాపులకు రిజర్వేషన్లు ఇస్తానని మోసం చేసిన చంద్రబాబును ప్రశ్నించిన ముద్రగడను చిత్రహింసలకు గురిచేసినప్పుడు పవన్ ఎక్కుడున్నారని నిలదీశారు. ఎప్పుడూ కాపు ఉద్యమాల్లో పాల్గొనని వ్యక్తికి ముద్రగడ గురించి మాట్లాడే నైతికహక్కు లేదని చెప్పారు. కాపులను వాడుకుని వదిలేసేలా పవన్‌కళ్యాణ్ వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. వచ్చే ఎన్నికల్లో 175కి 175 స్థానాలను గెలుస్తామనే ఆత్మవిశ్వాసంతో తాము ప్రజలకు చిత్తశుద్ధితో సేవచేస్తున్నామని చెప్పారు. ఈనాడు ఎంత రాసినా ప్రజలు నమ్మే పరిస్థితి లేదని, దుష్టచతుష్టయం ఓటమి ఖాయమని స్పష్టం చేశారు. కాపుల రిజర్వేషన్లు రాజ్యాంగ సవరణ, కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడి ఉంటాయని.. పవన్ అనుకుంటే ఇచ్చేసేంత సులభం కాదని చెప్పారు. కాపులను మోసగించే మాటలు కాకుండా బీజేపీతో అఫిషియల్‌గా పొత్తులో ఉన్న పవన్.. దమ్ముంటే కేంద్రం వద్ద పెండింగ్‌లోని రిజర్వేషన్ల అంశంపై నిర్ణయం తీసుకునేలా ఒప్పించాలని ఆయన హితవు పలికారు.



ప్రతి రోజూ మేల్కొనడం... కొంచెం జన్మించడం,
ప్రతి తాజా ఉదయం... కొంచెం యవ్వనం,
ప్రతి రాత్రి నిద్రకు ఉపక్రమించడం... కొంచెం మరణం.
– హానొరే డె బాల్జాక్



సాక్షి

గురువారం, 22 జూన్ 2023

# ఎట్టకేలకు ఒక ముందడుగు!

ప్రపంచంలోని రెండు అతి పెద్ద ఆర్థిక వ్యవస్థలు... ఒకదానిపై మరొకదానికి ఒంటి నిండా అనేక అనుమానాలు, అపనమ్మకాలు. అలాంటి దేశాలు కూర్చొని చర్చించుకుంటే అది పెద్ద విశేషమే. అమెరికా, చైనాల మధ్య ఈ వారం అదే జరిగింది. అస్తుబిస్తుగా ఉన్న తమ సంబంధాలను చక్కదిద్దుకొనేందుకు అవసరమైన ఒక అడుగు ముందుకు వేశాయవి. అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ తాజా చైనా పర్యటన అనేక విధాల గుర్తుండిపోయేది అందుకే. 2018 తర్వాత గడచిన అయిదేళ్ళలో అమెరికా విదేశాంగ మంత్రి ఒకరు చైనాలో పర్యటించడం ఇదే తొలిసారి. పర్యటనలో భాగంగా చివరిరోజైన సోమవారం సాక్షాత్తూ చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో సైతం బ్లింకెన్ సమావేశమై, ద్వైపాక్షిక సంబంధాల పునరుద్ధరణ కోసం ప్రయత్నించడం ప్రపంచ వ్యాప్తంగా ఆసక్తి రేపింది.

అరుదైన ఈ పర్యటనలో కళ్ళు చెదిరే కీలక ప్రకటనలేవీ లేకపోవచ్చు. కానీ, అసలంటూ ఘర్షణ వాతావరణాన్ని ఉపశమింపజేసి, తమ మధ్య సంబంధాలను సమస్థితికి తీసుకురావాలని రెండు దేశాలూ అంగీకరించడమే అతి పెద్ద వార్త అయింది. పరస్పరం నిష్కర్షగా అభిప్రాయాలు పంచుకొన్న ఈ చర్చలు భవిష్యత్తు పట్ల ఆశలు రేపాయి. నిజానికి, మునుపటి అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హయాం నుంచి కొన్నేళ్ళుగా అమెరికా తన దూకుడు చర్యలతో డ్రాగన్‌కు కోపం తెప్పించింది. ఫలితంగా ఇరు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. మళ్ళీ గాడిన పెట్టాలనుకున్నా, ఫిబ్రవరిలో గగనతలంలో పయనిస్తూ భారీ బెలూన్ అమెరికాలో కనిపించేసరికి వ్యవహారం ముదిరింది. చైనా బెలూన్ గూఢచర్యానికి పాల్పడుతోందంటూ ఆరోపణలు మిన్నంటాయి. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ బాహాటంగానే చైనాను తప్పుబట్టారు. ఈ నేపథ్యంలో బ్లింకెన్ తాజా చైనా పర్యటన, సత్సంబంధాల పునరుద్ధరణ ప్రయత్నం ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

ఒక విధంగా– బీజింగ్‌తో సంభాషణ వాషింగ్టన్ ఏరికోరి ఎంచుకున్నది కాదు. తప్పనిసరి అనివార్యత. తాజా సంభాషణల్లో సైతం బీజింగ్ తన మూతి బిగింపు పూర్తిగా వీడినట్టు లేదు. ఆ దేశం కాస్తంత నిష్ఠురంగానే ఉన్నా వైట్‌హౌస్ వర్గం తమ పని తాము కొనసాగించక తప్పదు. స్వీయ ప్రయోజనాల రీత్యా డ్రాగన్‌తో మాటామంతీ కొనసాగించే అమెరికాకు ఉన్న మార్గం. కొద్ది వారాలుగా ఈ ప్రయత్నాలు కాస్త ముమ్మరించాయి. చైనాకు చెందిన అగ్ర దౌత్యవేత్త వాంగ్ యీతో అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జేక్ సల్లివాన్ గత నెల వియన్నాలో రెండు రోజులు ''నిర్మాణాత్మక'' సమావేశాలు జరపడాన్ని ఈ దృష్టితోనే చూడాలి. ఫలితంగా అమెరికా వాణిజ్య కార్యదర్శి, చైనా వాణిజ్య శాఖ మంత్రితో అమెరికాలో మాట కలిపేందుకు తలుపులు తెరుచుకున్నాయి. ఇక, మధ్యశ్రేణి అమెరికన్ అధికారులు బీజింగ్‌లో పర్యటించారు. అమెరికా గూఢచారి విభాగం సీఐఏ డైరెక్టర్ సైతం సద్దు లేకుండా చైనా సందర్శించిన సంగతి మర్చిపోలేం. దీన్నిబట్టి భౌగోళిక రాజకీయాలకు అతీతంగా డ్రాగన్‌తో దోస్తీకి అగ్రరాజ్యం చేయిచాస్తోందని అర్థమవుతోంది.

బంధాలు మెరుగుపడడం దేవుడెరుగు, కనీసం మరింత క్షీణించకుండా ఆపడానికి బ్లింకెన్ పర్యటన ఉపకరిస్తుంది. తక్షణ ప్రయోజనాలు ఆశించలేం కానీ, చైనా విదేశాంగ మంత్రితో, అగ్ర దౌత్యవేత్తతో 'నిక్కచ్చిగా' సంభాషణలు సాగడంతో, ఆఖరి రోజున డ్రాగన్ దేశాధినేతతో బ్లింకెన్ భేటీకి మార్గం సుగమం అయింది. రానున్న రోజుల్లో ఇది రెండు అగ్రరాజ్యాల అధినేతల మధ్య భేటీకి దారి తీయగలదని ఆశించడానికి వీలు కలిగింది. సైనిక ఘర్షణ ముప్పును తగ్గించుకోవాలని రెండు దేశాలూ ఒకే ఆలోచనకైతే వచ్చాయి. ఈ దిగ్గజ దేశాల మధ్య బంధం సుస్థిరంగా ఉండడం ప్రపంచ శాంతికి సైతం అవసరం. నిజానికి, చైనా ఆశలు, ఆకాంక్షలు అపరిమితమే అయినా, షీ మాత్రం విశ్వనేతగా అమెరికా స్థానంలోకి రావాలనే ఆలోచన, వ్యూహం తమకు లేదని చెబుతున్నారు.

చైనా తనదిగా ప్రకటించుకొనే స్వయంపాలిత ద్వీపం తైవాన్‌కు వచ్చే ఏడాది ప్రథమార్ధంలో అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి. తైవాన్‌పై డ్రాగన్ వేసే అడుగులను గ్రహించడంలో అంచనాలు తప్పితే ప్రమాదం తప్పదన్న తెలివిడి అమెరికాకు ఉంది. అందుకే, సంబంధాల మెరుగుదలకు, మరీ ముఖ్యంగా సైనిక చర్చల పునరుద్ధరణకు వాషింగ్టన్ తహతహలాడింది. కానీ, తమ రక్షణ మంత్రిపైన అమెరికా ఆంక్షలు కొనసాగుతున్న వేళ బీజింగ్ అందుకు ఇష్టపడలేదు. అమెరికా మరింత స్పష్టమైన చర్యలతో, సంకల్పంలో నిజాయతీ ఉందని నిరూపించుకొనేలా ముందుకు రావాలని చూస్తోంది. ఆ మాటకొస్తే, గతంలో తనకూ, బైడెన్‌కూ మధ్య కుదిరిన ఒప్పందాల పైనే ఇరుపక్షాలూ ఇంకా చర్యలు చేపట్టాల్సి ఉందని బ్లింకెన్‌కు షీ గుర్తు చేశారు.

రానున్న నెలల్లో పరిణామాల్ని బట్టి, షీ– బైడెన్‌ల శిఖరాగ్ర సమావేశానికి అవకాశాలుంటాయి. సొంతగడ్డపై రాజకీయ ఒత్తిళ్ళ రీత్యా చైనాపై కఠిన వైఖరిని బైడెన్ సర్కార్ ఏ మేరకు మార్చుకోగలుగుతుందన్నది సందేహమే. అధ్యక్ష పదవికి ఎన్నికల ప్రచారం దగ్గరవుతున్న వేళ బైడెన్‌కు అది మరీ కష్టం. అయితే, భౌగోళిక రాజకీయాల్లో పొరపొచ్చాలెన్ని ఉన్నా, ప్రపంచ కుగ్రామంలో ఆర్థిక అనివార్యతలే కీలకమనే స్పృహ ఈ అగ్రశక్తులు రెంటికీ పుష్కలం. అదే ఇప్పుడు ఇరు పక్షాల మధ్య అపనమ్మకాన్ని వదిలించుకొనే మాటలకు దృశ్యాదృశ్య హేతువు. పరిమిత సహకారం, ఉద్రిక్తతల్లో కొంత ఉపశమనం సరిపోతాయా? చెప్పలేం. కానీ, నిరంతర సంభాషణలకు సిద్ధంగా ఉన్నామన్న ఈ సంకేతమే గనక ఇవ్వకుంటే, విశ్వశాంతికి కీలకమైన బంధాన్ని చేతులారా చెడగొడుతున్న బాధ్యతారహిత పెద్దన్నలనే ముద్ర మిగిలిపోతుంది. ఆ ఎరుక అమెరికా, చైనాలకు దండిగా ఉంది.

## గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, **తిథి:** శు.చవితి ప.2.46 వరకు, తదుపరి పంచమి, **నక్షత్రం:** ఆశ్లేష రా.2.21 వరకు, తదుపరి మఖ, **వర్జ్యం:** ప.1.54 నుండి 3.42 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.51 నుండి 10.44 వరకు తదుపరి ప.3.05 నుండి 3.55 వరకు, **అమృతఘడియలు:** రా.12.54 నుండి 2.21 వరకు.

**సూర్యోదయం :** 5.30
**సూర్యాస్తమయం:** 6.33
**రాహుకాలం :** ప.1.30 నుండి 3.00 వరకు
**యమగండం :** ఉ. 6.00 నుండి 7.30 వరకు

# ఈ శతాబ్దం మనదే(నా?)

**భారతీయ శాస్త్ర రంగం ఎలాంటి లక్ష్యాన్ని కలిగి ఉండాలి అన్న ప్రశ్నకు, ''ఈ శతాబ్దాన్ని తీసుకోవలసింది ఇండియా. దాని లక్ష్యం కూడా అందుకు తగ్గకుండా ఉండాలి'' అన్నారు థామస్ బార్లో. జర్మనీ, అమెరికా, తాజాగా చైనా తర్వాత సైన్సులో ఇప్పుడిక భారత్ వంతు. ఈ దేశాల నుంచి నేర్చుకోవాల్సిన అంశాలు నేర్చుకుంటూనే భారత్ తనదైన ప్రత్యేక నమూనాను రూపొందించుకుని ముందుకు వెళ్లాల్సి ఉంటుంది. శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞాన రంగాల్లో భారత్ టాప్–3లో ఉండాలన్నదే మన లక్ష్యం కావాలి. మన పరిశోధనలు భారత్‌తో పాటు అంతర్జాతీయ సమాజం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై కూడా దృష్టి పెట్టాలి. గంగానదిని సమర్థంగా శుద్ధి చేయగలిగితే... అది ప్రపంచవ్యాప్తంగా కలుషిత జలాల శుద్ధికి ఉపయోగపడుతుంది కదా!**

హైదరాబాద్ నగరంలో ఈ ఏడాది మొదట్లో జరిగిన ఇండియా సైన్స్ ఫెస్టివల్‌లో మేము బిడియపడకుండా ఓ ప్రశ్న వేశాం: ''భారతీయ శాస్త్ర రంగం ఎలాంటి లక్ష్యాన్ని కలిగి ఉండాలి?'' మాతోపాటు చర్చలో పాల్గొన్న గ్లోబల్ ఇన్నొవేషన్ నిపుణుడు థామస్ బార్లో సమాధానమిస్తూ... ''ఈ శతాబ్దాన్ని తీసుకోవలసింది ఇండియా. దాని లక్ష్యం కూడా అందుకు తగ్గకుండా ఉండాలి'' అన్నారు.



ఇదేదో యథాలాపంగా ఇచ్చిన సమాధానం కాదు. ప్రపంచ వ్యాప్తంగా సంచలనాత్మకమైన సైన్స్ మోడల్స్ పుట్టుకొచ్చిన తీరును, చరిత్రను గమనించినా ఇదే స్పష్టమవుతుంది. జర్మనీ పరిశోధనలు, టెక్నికల్ యూనివర్సిటీల ఏర్పాటు; అమెరికాలో యూనివర్సిటీ నెట్‌వర్క్, పరిశ్రమతో దాన్ని అనుసంధానించడం, అంతరిక్ష, రక్షణ సంస్థల ఏర్పాటు; తాజాగా కృత్రిమ మేధ, రసాయన, జీవశాస్త్ర రంగాల్లో చైనా పురోగతి–– వీటన్నింటిని చూస్తే ఇప్పుడిక భారత్ వంతు. ఈ దేశాల నుంచి నేర్చుకోవాల్సిన అంశాలు నేర్చుకుంటూనే భారత్ తనదైన ప్రత్యేక నమూనాను రూపొందించుకుని ముందుకు వెళ్లాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఈ రకమైన ఏర్పాటు సాధ్యమే. ఎందుకంటే... ఆర్థిక వ్యవస్థ విస్తృతి బాగా ఉంది. పరిశ్రమలు తగినన్ని ఉన్నాయి. స్టార్టప్‌లతో కూడిన వ్యవస్థ, మార్కెట్ వ్యాప్తి, సైన్స్ అండ్ టెక్నాలజీల్లో పెట్టుబడులు పెట్టేందుకు తగిన వనరులు ఉన్నాయి. కానీ భారత్‌కు లేనిదల్లా సైన్స్ అండ్ టెక్నాలజీ వ్యూహంలో ఫోకస్!

మన లక్ష్యం ఏమిటన్న విషయాన్ని చర్చించే ముందు మన ఆశయం ఎంత పెద్దదిగా ఉందన్నది మాట్లాడుకోవాలి. 2019లో జరిగిన మొదటి ఇండియా సైన్స్ ఫెస్టివల్‌లో 'మసాచూసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ' లాంటి సంస్థను భారత్ ఎలా నిర్మించగలదని ప్రశ్నించాం. దానికి సైన్స్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ ఒకరు సమాధానమిస్తూ... భారత సైన్స్ సంస్థలు కూడా అంతర్జాతీయ స్థాయి పరిశోధనలు చేస్తున్నాయని అన్నారు. అదే రోజు మేము ఒక చైనా శాస్త్ర నిపుణుడిని చైనీస్ మోడల్ నుంచి భారత్ నేర్చుకోదగ్గ అంశాలేమిటని అడిగాం. ''చైనాలో సైన్స్ పురోగమిస్తోందని ఎవరు చెప్పారు? ఎంత మంది చైనీయులకు నోబెల్ అవార్డులు వచ్చాయి? ప్రపంచాన్ని మార్చేసే ఆవిష్కరణలు మేమెన్ని చేశాం? చేయాల్సింది చాలా ఉంది'' అని ఆయన సమాధానమిచ్చారు. ఇరు దేశాల ఆశయాల్లో ఉన్న వైరుధ్యాన్ని ఈ ఉదంతం స్పష్టం చేస్తుంది. ఆత్మ విమర్శ, ఉన్నతమైన ఆశయం, తగిన కార్యాచరణల మేళవింపుతోనే మనం సరైన ఫలితాలను చూడవచ్చు. వీటిల్లో ఒకటి మాత్రమే కలిగి ఉంటే మాటలకే పరిమితమవుతాం.

శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞాన రంగాల్లో భారత్ టాప్–3లో ఉండాలన్నదే మన లక్ష్యం కావాలి. అయితే దాన్ని అందుకోవడం ఎలా అన్నదే ప్రశ్న. ఓపెన్ ఎండెడ్ అంటే నిర్దిష్ట లక్ష్యమేదీ లేకుండా పరిశోధనలు చేయడమా, లేక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పరిశోధనలు చేయడమా అన్నది మనం నిర్ణయించుకోవాలి.

దేశంలో మౌలిక శాస్త్ర పరిశోధనలు, అప్లైడ్ రీసెర్చ్ రెండూ వేర్వేరుగా ఎవరికి వారు చేసుకుంటున్నారు. ఈ అంతరం చెరిగిపోవాలి. 'సైకిల్స్ ఆఫ్ ఇన్వెన్షన్స్ అండ్ డిస్కవరీ' పుస్తకంలో వెంకటేశ్ నారాయణ మూర్తి (హార్వర్డ్ స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ అప్లైడ్ సైన్స్ మాజీ డీన్) బేసిక్, అప్లైడ్ రీసెర్చ్ రెండింటి మేళవింపుతోనే మేలైన సృజన సాధ్యమంటారు. ఉదాహరణకు ఒకప్పటితో పోలిస్తే ఇప్పుడు జన్యుక్రమ నమోదు వెయ్యి రెట్లు వేగవంతం అయ్యింది. ఎందుకంటే శంకర్ బాల సుబ్రమణ్యన్, డేవిడ్ క్లెనెర్‌మాన్ కలిసికట్టుగా చేసిన 'సరళమైన' రసాయన శాస్త్ర ఆవిష్కరణ ఇందుకు దోహదపడింది. వీళ్లు అంతకుముందరి మైక్రోఫ్లూయిడ్స్, లేజర్, కంప్యూటింగ్ లాంటి సాంకేతిక విజ్ఞానం మీద ఆధారపడి ఈ పనిచేయగలిగారు.

అందుకే బేసిక్, అప్లైడ్ పరిశోధనల్లో ఏది ఎంపిక చేసుకోవాలి అన్న ప్రశ్న అర్థరహితం. ట్రాన్స్‌లేషనల్ రీసెర్చ్ వేగంగా ఫలితాలనిస్తుంది. మరోవైపు మౌలిక శాస్త్ర పరిశోధనలకు ఉన్న సామర్థ్యం చాలా ఎక్కువ. మధ్య, దీర్ఘకాలిక ప్రయోజనాలకు ఇది భారతదేశానికి బాగా అక్కరకొచ్చే విషయం. రెండింటిపైనా పెట్టుబడులు పెట్టాలన్న దానికి రెండు వాదనలు ఉన్నాయి. తరచూ వినిపించే విమర్శల గురించి కూడా చూద్దాం. మొదటి వాదన... కీలకమైన, ఓపెన్ ఎండెడ్ పరిశోధనలపై భారత్ డబ్బు ఖర్చుపెట్టదు అన్నది. పరిశోధనలపై పెట్టే ఖర్చు గణనీయంగా పెరగాలనే విషయాన్ని మేము అంగీకరిస్తున్నాం. అయితే నిధులు సమర్థంగా ఖర్చు పెట్టడం ఎలా అన్న విషయంలో మనం ఇంకా ఎంతో పురోగతి సాధించవచ్చు. ప్రస్తుతం ప్రభుత్వ నిధుల్లో సింహభాగం ప్రభుత్వ పరిశోధన సంస్థలకే వెళుతోంది. యూనివర్సిటీలకు దక్కుతున్నది కేవలం 10–15 శాతం మాత్రమే. ఈ మొత్తాదు అమెరికాలో 63 శాతం వరకూ ఉంటే, యునైటెడ్ కింగ్‌డమ్‌లో 80 శాతం, దక్షిణ కొరియాలో 50 శాతం ఉండటం గమనార్హం. 'ఫాస్ట్ ఇండియా' ఇటీవల సిద్ధం చేసిన 'ఈజ్ ఆఫ్ డూయింగ్ సైన్స్ ఇన్ ఇండియా' నివేదిక ప్రకారం దేశంలోని అత్యున్నత సంస్థలు కూడా పరిపాలనపరమైన అడ్డంకుల కారణంగా పరిశోధనలకు నిధులు సేకరించలేకపోతున్నాయి. ఖర్చు కూడా పెట్టలేకపోతున్నాయి.

వనరుల కేటాయింపును సమర్థంగా చేసి పరిశోధనలకు నిధులివ్వడంలోనూ పోటీతత్వాన్ని తెస్తే ఓపెన్ ఎండెడ్ రీసెర్చ్ పుంజుకునే అవకాశం ఉంది. ఈ విషయంలో ఇప్పటికే కొంత కదలిక కనపడుతోంది. రక్షణ రంగ పరిశోధనలకు సంబంధించిన బడ్జెట్‌లో 25 శాతాన్ని డీఆర్‌డీఓ ప్రయోగశాలల్లో కాకుండా, యూనివర్సిటీలు, పరిశ్రమకు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది.

ఇక రెండో వాదన గురించి... దీని ప్రకారం పాశ్చాత్య దేశాలు ఖరీదైన ఓపెన్ ఎండెడ్ రీసెర్చ్ ఇప్పటిలాగే కొనసాగించాలి. భారతదేశం ఆ పరిశోధనలను ఆవిష్కరణలుగా మార్చే ప్రయత్నించాలి. ఈ వాదన మనకు ఉపయోగపడదు. ఎందుకంటే... ఓపెన్ ఎండెడ్ పరిశోధనలను ఆవిష్కరణలుగా మార్చేందుకు ఆయా నిర్దిష్ట అంశాలపై పరిశోధనలు చేస్తున్న శాస్త్రవేత్తలు, అది కూడా చెప్పుకోదగ్గ సంఖ్యలో ఉండాలి. ఉదాహరణకు, కృత్రిమ మేధ రంగంలో 2012లోనే కీలక పరిశోధనలు జరిగినా, ఐటీ దిగ్గజంగా ఉన్నా భారత్ ఆ రంగంలోకి చెప్పుకోదగ్గ స్థాయిలో భాగస్వామి అయ్యేందుకు పదేళ్లు పట్టింది. ఎందుకంటే కృత్రిమ మేధ రంగంలో పరిశోధనలు చేస్తున్న శాస్త్రవేత్తలు తగినంత మంది భారత్‌లో లేకపోవడమే. క్వాంటమ్ కంప్యూటింగ్, న్యూరోసైన్స్, అంతరిక్షం, జన్యుశాస్త్ర రంగాల్లోనూ మనకు ఇదే రకమైన అనుభవాలు ఉన్నాయి. ఓపెన్ ఎండెడ్ పరిశోధనల్లో మన సామర్థ్యాన్ని పెంచుకోకపోతే మనం ఇతరులను అనుసరించే వారిగానే మిగిలిపోతాం. నేతృత్వం వహించే స్థాయికి ఎదగలేము.

చివరగా... ప్రపంచ సమస్యలను భారత్ పరిష్కరించాలా అన్న ప్రశ్నను పరిశీలిస్తే... ఈ ప్రశ్న ఎక్కువగా ట్రాన్స్‌లేషనల్ రీసెర్చ్ నేపథ్యంలో వస్తూంటుంది. ఇది దేశానికి ఉపయోగపడే, తొందరగా సాధించగలిగే విషయం. మన పరిశోధనలు భారత్‌తో పాటు అంతర్జాతీయ సమాజం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై కూడా దృష్టి పెట్టాలి. గంగానదిని సమర్థంగా శుద్ధి చేయగలిగితే... అది ప్రపంచవ్యాప్తంగా కలుషిత జలాల శుద్ధికి ఉపయోగపడుతుంది కదా! ఇలాంటి పలు అంశాలను భారతీయ శాస్త్రవేత్తలు చేపట్టాలి. ఇవి మన ఎగుమతుల సామర్థ్యాన్ని పెంచుతాయి.

కె. విజయ్ రాఘవన్, 'ఫాస్ట్ ఇండియా' ఛైర్మన్; కేంద్ర మాజీ ప్రధాన శాస్త్రీయ సలహాదారు; వరుణ్ అగర్వాల్, 'ఫాస్ట్ ఇండియా' సహ వ్యవస్థాపకుడు ('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

## సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!




### చంపేశాయా?



ఆస్ట్రేలియా క్రికెట్ లెజెండ్ షేన్ వార్న్ హఠాత్తుగా మరణించడానికి తొమ్మిది నెలల ముందు తీసుకున్న కోవిడ్ ఎంఆర్‌ఎన్‌ఏ టీకాలే ఆయన గుండెపోటును వేగవంతం చేసి వుంటాయని ఇద్దరు ప్రముఖ కార్డియాలజిస్టులు చెబు తున్నారు. ఇది చాలా తీవ్రమైన విషయం!

– టోబీ యంగ్, యాక్టివిస్ట్

### అనకూడని మాటలు



ఏ అకౌంటునైనా లక్ష్యంగా చేసుకుని మళ్లీ మళ్లీ వేధిస్తే, ఆ వేధింపు అకౌంట్లు కనిష్ఠంగా తాత్కాలిక సస్పెన్షన్లను అందుకుంటాయి. 'సిస్' లేదా 'సిస్ జెండర్' (జన్మతః వచ్చిన లింగం) అనే మాటలు ట్విట్టర్ వేదిక మీద దూషణలుగా పరిగణించబడతాయి.

– ఎలాన్ మస్క్, ట్విట్టర్ అధినేత

### యథా రాజా...



చైనా ప్రభుత్వ అధికారులు ఎక్కడున్నా చాలా మర్యాదస్థులుగా ఉండేవారు. మీరు వాళ్లను చికాకుపెట్టినా కూడా మర్యాదగా, అణకువగా వ్యవహరించేవాళ్లు. కానీ షీ జిన్‌పింగ్ అధికారంలోకి వచ్చినప్పటినుంచీ 'ఉల్ఫ్ వారియర్ డిప్లొమసీ' (తోడేలు యోధ దౌత్యం) మొదలైంది. వాళ్ల ప్రవర్తనలో కూడా విపరీతమైన దురుసుతనం పెరిగింది.

– జాన్ సింప్సన్, బ్రాడ్‌కాస్టర్

### ముఖం వెలిగింది



పన్నెండో తరగతి పరీక్షలు రాశాను. ఇంగ్లిష్ పేపర్ ఇవ్వాళ... అందులో 'విదేశంలో చదువుతున్న మిత్రుడికి మామల్లపురంలో 44వ చెస్ ఒలింపియాడ్ ఎలా జరిగిందో వివరించండి' అన్న ప్రశ్న కనబడటం సంతోషం కలిగించింది. (పోటీల జ్యోతి వెలిగించిన ఇద్దరిలో ప్రజ్ఞానంద ఒకరు.)

– ఆర్. ప్రజ్ఞానంద, చెస్ గ్రాండ్‌మాస్టర్

### వాళ్లే నిర్ణయిస్తారా?



నేను 'సిస్' అనే మాటను తిరస్కరిస్తాననీ, అలా నన్ను పిలవొద్దనీ నిన్న ఒక ట్వీట్ చేయగానే, ట్రాన్స్ యాక్టివిస్టుల నుంచి నన్ను 'సిస్సీ' అంటూ, 'నచ్చినా నచ్చకపోయినా' అలాగే పిలుస్తామంటూ వరుసగా సందేశాలు వచ్చాయి. ఇవే పాత్రలు తారుమారైతే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించండి.

– జేమ్స్ ఎస్సెస్, కామెంటేటర్

### యోగా మంచిదేగా!



రన్నింగ్ చేసిన తర్వాత మేము (భార్యతో కలిసి) కొన్ని యోగాసనాలు ప్రయత్నించాం. యోగా వల్ల బహువిధ ఆరోగ్య లాభాలున్నాయి. మీ వ్యాయామ దినచర్యలో, మీ మొత్తం జీవితంలో యోగాను ఒక భాగం చేసుకోండి. (జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవం)

– సుధీర్ కుమార్, న్యూరాలజిస్ట్

### ఎక్కడున్నారు?



భారత స్త్రీవాద ఉద్యమం 1980ల్లో వరకట్న మరణాలకు వ్యతిరేకంగా మొదలైంది. ఇప్పుడు ఎవరూ వాటి గురించి మాట్లాడటం లేదు. స్త్రీవాదులందరూ చిన్న అంశాలైన లైంగికత, మీ టూ, ఎంపిక... ఇలాంటివే మాట్లాడుతున్నారు. కానీ ఇప్పటికీ మహిళలు ఎక్కువ హింసను గృహసంబంధ అంశాల్లోనే ఎదుర్కొంటున్నారు. అయినా దేశంలో స్త్రీవాద ఉద్యమమే లేనప్పుడు స్త్రీవాదులు వీటి గురించి మాట్లాడటం లేదనడం అర్థరహితం.

– సంజుక్తా బాసు, పాత్రికేయురాలు

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

# సామాజిక న్యాయానికి కొత్త నిర్వచనం!

అభిప్రాయం



జి. కిరణ్ కుమార్

సామాజిక న్యాయం ఏ అభ్యుదయ సమాజానికైనా మూలస్తంభంగా నిలుస్తుంది. పౌరులందరికీ సమానత్వం, సమ్మిళితత్వం, సాధికారతలను నిర్ధారిస్తుంది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సామాజిక న్యాయానికి ఒక దార్శనిక నాయకుడిగా అవతరించారు. ప్రతి వ్యక్తి అభివృద్ధి చెందడానికీ, అవకాశాలను పొందడానికీ ఒక వాతావరణాన్ని సృష్టించడానికి కృషి చేస్తున్నారాయన. అనేక కార్యక్రమాలు, పథకాల ద్వారా అట్టడుగు వర్గాల అవసరాలను తీర్చి, సమసమాజ అభివృద్ధిని పెంపొందించే దిశగా ఆయన ప్రభుత్వం అడుగులు వేస్తోంది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుండి జగన్ మోహన్ రెడ్డి సామాజిక న్యాయానికి కొత్త నిర్వచనాన్ని ఇచ్చారు. విద్య, ఉద్యోగాలలో రిజర్వేషన్లను అమలు చేయడం మాత్రమే సామాజిక న్యాయంగా పరిగణించిన వారు... జగన్ తీసుకున్న నిర్ణయాలు దేశంలో సామాజిక న్యాయానికి కొత్త ఒరవడిని సృష్టించాయని హర్షం వ్యక్తం చేస్తున్నారు. అందరికీ తప్పనిసరిగా ఇంగ్లిష్ మీడియం విద్యను అందించడం, దేశంలో ఎక్కడా లేని విధంగా రాజకీయ రంగంలో అన్ని కులాల వాళ్లకి సముచిత స్థానాన్ని కల్పించడం, 'అమ్మ ఒడి', 'నవ రత్నాలు' వంటి పథకాల ద్వారా ప్రభుత్వ ఫలాలను అందరికీ, ముఖ్యంగా బీసీ కులాలకు అందేలా చర్యలు చేపట్టి అమలు చేయడం. ఆర్థికంగా వెనుకబాటుకు గురైన వెనుకబడిన తరగతులకు కార్పొరేషన్‌లు ఏర్పాటు చేయడం వంటి ఎన్నో జగన్ నిర్ణయాలు విప్లవాత్మకమైనవి. సమకాలీన రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో ఈ నిర్ణయాల వల్ల ఏపీలో పెను మార్పులు చోటుచేసుకుంటున్నాయి. సమాజంలో అత్యధికులుగా ఉన్న బీసీలను పేదరికమనే గీతను దాటించేందుకు సీఎం దీర్ఘ దృష్టితో పనిచేస్తున్నట్లు ఆయన చేపట్టిన పథకాలు నిరూపిస్తున్నాయి.

ఇటీవలి సంవత్సరాలలో, భారతదేశంలో ఆంగ్ల విద్య ప్రాముఖ్యం మరింత స్పష్టంగా కనిపిస్తోంది. సార్వత్రిక అవకాశాల భాషగా ఇంగ్లిష్ ఆవిర్భవించింది. ఆంగ్ల భాషా నైపుణ్యాల పరివర్తన శక్తిని గుర్తించిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి రాష్ట్రంలోని పాఠశాలలకు వెళ్లే విద్యార్థులందరికీ ఆంగ్ల విద్యను అందించడానికి పూనుకున్నారు. ఇంగ్లిష్‌లో ప్రావీణ్యం వ్యక్తులను మెరుగైన ఉపాధి అవకాశాలతో సన్నద్ధం చేస్తుంది, విస్తృత శ్రేణి విద్యా వనరులను పొందడానికి వీలు కల్పిస్తుంది. సాంస్కృతిక మార్పిడిని ప్రోత్సహిస్తుంది. నేటి పరస్పర అనుసంధానిత ప్రపంచంలో, సామాజిక చలనశీలత, వ్యక్తిగత ఎదుగుదలకు ఆంగ్లంలో ప్రావీణ్యం ఒక ముఖ్యమైన సాధనంగా మారింది.

గత మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో జగన్ బీసీలకు ఒక డిప్యూటీ సీఎం పదవితో పాటు 11 మంత్రి పదవులూ ఇచ్చారు. షెడ్యూల్డ్ కులాలకు చెందిన ఐదుగురికీ, షెడ్యూల్డ్ తెగకు చెందిన ఒకరికీ తన 25 మంది సభ్యులున్న కేబినెట్‌లో స్థానం కల్పించారు. వైసీపీ ప్రభుత్వ ప్రారంభించిన 56 వెనుకబడిన కులాల కార్పొరేషన్లు బీసీ కులాలకు వైసీపీని దగ్గర చేశాయి. ఈ కార్పొరేషన్‌లలో సగానికి పైగా నామినేటెడ్ పదవులను మహిళలకు కేటాయించడం మరో విశేషం.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చెప్పిన విధంగా రాజ్యాధికారమే అన్నిటికీ 'మాస్టర్ కీ' అనే మాటను విశ్వసించి బీసీలకు దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా జగన్ క్యాబినెట్‌లో ఉన్నత స్థానాన్ని కల్పించారు. అప్పట్లో ఎన్టీఆర్ బీసీ నాయకత్వాన్ని ప్రోత్సహించిన విధంగానే ఇప్పుడు జగన్ బీసీ రాజకీయాల్లో నాయకత్వాన్ని ప్రోత్సహిస్తున్నారు. ఈ చర్య కుల వివక్ష అడ్డంకులను విచ్ఛిన్నం



చేయడమే కాకుండా, ఆంధ్రప్రదేశ్‌లో సమ్మిళిత, వైవిధ్య భరితమైన రాజకీయ ముఖచిత్రాన్ని సృష్టించడానికి జగన్ నిబద్ధతను స్పష్టం చేస్తోంది. ఒకటి రెండు కులాలకే కాకుండా బీసీల్లో ఉన్న అత్యధిక కులాలకు రాజకీయ నాయకత్వాన్ని ఇచ్చిన లీడర్ జగన్ మోహన్ రెడ్డి. వైఎస్సార్ సీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి అసెంబ్లీ, లోక్ సభల్లో బీసీ రిజర్వేషన్ల కోసం ప్రైవేట్ బిల్లును ప్రవేశపెట్టారు. ఈ చర్య జగన్‌కు ఓబీసీల పట్ల ఉన్న నిబద్ధతకు మరో నిదర్శనం.

కులగణన చేయడం బీసీలకు న్యాయం చేస్తుంది అనడంపై ఎటువంటి సందేహం లేదు. వివిధ కులాలకు సంబంధించిన సామాజిక, విద్య, ఆర్థిక పరంగా సమాచారాన్ని కులగణన ద్వారా స్వీకరించవచ్చు. ఈ విలువైన సమాచారాన్ని వివిధ ప్రజా సంక్షేమ విధానాల రూపకల్పన కోసం ఉపయోగించవచ్చు. కుల గణనకు జగన్ మోహన్ రెడ్డి పూర్తి మద్దతు ఇస్తున్నారు. రాజ్యాంగ పరంగా చూసినట్లయితే కులగణన చేపట్టాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉంది కానీ ఇప్పటివరకు బీజేపీ పార్టీ దీని మీద స్పష్టమైన విధానాన్ని తెలియజేయలేదు. కుల గణనపై స్పష్టతలేని బీజేపీ సామాజిక న్యాయంపై మాట్లాడటం విడ్డూరంగా ఉంది. అలాంటి బీజేపీతో తెలుగుదేశం, జనసేనలు పొత్తు కోసం ప్రయత్నించడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? బీసీలు ఈ సంగతిని గమనించాలి.

బీసీల రాజకీయ భాగస్వామ్యాన్ని మెరుగుపరిచేందుకు చంద్రబాబు నాయుడు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. బీసీ సాధికారత, వారి రాజకీయ భాగస్వామ్యానికి సంబంధించిన పరిజ్ఞానం పవన్ కల్యాణ్‌కు లేదు. ఒక్క కులానికి మాత్రమే మద్దతిచ్చే ఇమేజ్ చంద్రబాబు నాయుడికి ఉంది. ఈ నేపథ్యంలో బీసీలు వచ్చే ఎన్నికల్లో ఎవరికి ఓటు వేయాలో ఆలోచించాలి. రాజకీయ సాధికారత, విద్య, సామాజిక అభివృద్ధి వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తూ సామాజిక న్యాయానికి కొత్త నిర్వచనం ఇచ్చిన జగన్‌మోహన్ రెడ్డికి బీసీలందరూ మద్దతివ్వాల్సిన సమయం ఆసన్నమైంది.

వ్యాసకర్త జాతీయ అధ్యక్షుడు,
ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్

# ఉత్తములు కాలాతీతులు!

హాలుడు శాతవాహన వంశపు రాజులలో ఒకడు. శాతవాహన చక్రవర్తులు ఆంధ్రులని ప్రతీతి. క్రీ.శ. ఒకటవ శతాబ్దంలో, అనగా ఇప్పటికి దాదాపు రెండు వేల సంవత్సరాల క్రితం హాలుడు తన పరిపాలనా కాలమైన ఆరేళ్ళ వ్యవధిలో, సంకలనం చేసి భావి తరాలకు తన కానుకగా వదిలి వెళ్ళిన గ్రంథం 'గాథాసప్తశతి'. ప్రాకృతభాషలో గాథా ఛందస్సులో ఆనాటి కవులు చెప్పిన వేల కొలది గాథలలోంచి అత్యుత్తమమైన ఏడువందల గాథలను సంకలించి తయారు చేసిన గ్రంథం ఇది. ప్రపంచంలోని అత్యుత్తమ గ్రంథాలలో ఒకటిగా పేరుపొందినది. మనుషులలో ఉత్తములైనవారు ఎలా ఉంటారు, వారి పట్ల ఇతరుల ప్రవర్తన ఎలా ఉండాలి అన్న విషయంపై గాథాసప్తశతిలోని, మూడవ శతకం 27వ గాథలో ఉన్నంత హృద్యంగా, అంత సంక్షిప్తంగా, అంత గొప్పగా ఆ తరువాత మరెవ్వరూ చెప్పలేదు. **'పానకుట్యామపి జ్వలిత్వా/హుతవహో జ్వలతి యజ్ఞవాటే పి/ న ఖలు తే పరిహర్తవ్యా/ విషమదశాసంస్థితాః పురుషాః'** అని ఆ ప్రాకృత గాథకు సంస్కృత ఛాయ.

జ్యోతిర్మయం

ఒక సామాన్య నిరుపేద గృహస్థుని పూరిగుడిసెలో అగ్నిదేవుడు ఏ తేజస్సుతో మండుతాడో అదే తేజస్సుతో ఒక యజ్ఞకుండంలో మండుతాడు. అలాగే ఒక సారాయి అంగడిలోని పొయ్యిలోనూ మండుతాడు. అగ్నిదేవుని జ్వలనంలోని తేజస్సులో, స్వచ్ఛతలో అక్కడ కూడా ఏ దోషమూ కనపడదు. అలాగే సత్పురుషుల గమనంలో కూడా అని గుర్తించడం ముఖ్యం అని ఈ గాథ చెబుతోంది. కాలం కలిసిరాక, కష్టాలలో చిక్కుకుని, కాని ప్రదేశంలో ఉండాల్సి వచ్చినంత మాత్రాన మనుషులలో ఉత్తములైన వ్యక్తుల నిర్మలత్వానికీ, వారి పాండిత్యానికీ, సహృదయతకూ హాని కలగదు. వారు అగ్నిదేవునితో సమానమైనవారని పోలిక. సారాయి కాచే వ్యక్తి ఉపయోగించే పొయ్యిలో మండిన దోషానికి అగ్నిదేవుడిని ఎలాగైతే దూరం చేసుకోలేమో, అలాగే వారు ఉండదగని ప్రదేశంలో కనపడినంత మాత్రంచేతనే ఉత్తములైన వ్యక్తుల సాంగత్యాన్ని విడనాడడం, వారిని దూరం చేసుకోవడం హర్షించదగిన పని కాదని పై గాథలో రెండు వేల సంవత్సరాల క్రితమే చెప్పినా... అది ఇప్పటికీ నూతనంగా వినిపించే గొప్ప నీతి.

– వెంకట్ భట్టు

## కాచిగూడ-ఖుర్దారోడ్డు మధ్య ప్రత్యేక రైలు

- 24న కాచిగూడ నుంచి ప్రారంభం



రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా విజయవాడ మీదుగా కాచిగూడ-ఖుర్దారోడ్డు మధ్య ప్రత్యేక రైలు నడపనున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. కాచిగూడ-ఖుర్దారోడ్డు (07223) రైలు ఈ నెల 24న రాత్రి 8.30 గంటలకు కాచిగూడలో బయలుదేరి, మరుసటి రోజు సాయంత్రం 4.30 గంటలకు ఖుర్దారోడ్డు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు (07224) ఈ నెల 25న ఖుర్దారోడ్డులో సాయంత్రం 6.30 గంటలకు బయలుదేరి, మరుసటి రోజు సాయంత్రం 4.00 గంటలకు కాచిగూడ చేరుతుంది. రెండు మార్గాలలో ఈ రైలు మల్కాజ్‌గిరి, నల్గొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ల, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, తుని, అనకాపల్లి, దువ్వాడ, సింహాచలం, కొత్తవలస, విజయనగరం, శ్రీకాకుళం రోడ్డు, పలాస, బెరంపూర్ స్టేషన్లలో ఆగుతుంది.

## గారడీ వేషగాళ్లను తరిమికొడతాం

- 977వ రోజు రిలే దీక్షలో బహుజన నేతల హెచ్చరిక



తాడికొండ: బాబు అండ్‌కో ఆధ్వర్యంలో రాష్ట్రాన్ని దోచుకునేందుకు వస్తున్న పవన్‌కళ్యాణ్ వంటి గారడీ వేషగాళ్లను తరిమికొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయని బహుజన పరిరక్షణ సమితి నాయకులు హెచ్చరించారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 977వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో బుధవారం పలువురు మాట్లాడారు. బహుజనులను ఆర్థికంగా అణగదొక్కడమే లక్ష్యంగా రాష్ట్రంలో కుల రాజకీయాలు నడుస్తున్నాయన్నారు. పేదలు ఆర్థికంగా స్థిరపడితే తమ ఉనికి ప్రమాదంలో పడుతుందనే ఆందోళనలో ఉన్న కులవాదులంతా ఏకమై తప్పుడు కేసులు వేస్తుండటం దుర్మార్గం కాదా అని ప్రశ్నించారు. జవసత్వాలు లేని రాజకీయ పార్టీని నడుపుతున్న పవన్‌కళ్యాణ్ తాను వార్డు కౌన్సిలర్‌గా కూడా గెలవలేక బాబును గెలిపించేందుకు పడుతున్న తపన చూసి రాష్ట్ర ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. మాతృభాష మాట్లాడటం రాని లోకేశ్‌బాబు యువగళం పేరుతో చేస్తున్న యాత్రలు హాస్యాస్పదంగా ఉన్నాయని ఎద్దేవా చేశారు. ఏపీలో వామపక్షాలు సిద్ధాంతాలు మరచి రాజకీయాలు చేస్తున్నారన్నారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, పెరికే వరప్రసాద్, ఈపూరి ఆదాం, పులి దాసు, పల్లె బాబు, బేతపూడి సాంబయ్య, కారుమూరి పుష్పరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠ్యపుస్తకాల్లో 'పైడిమర్రి' ఫొటో

తిరువూరు: 'భారతదేశం నా మాతృభూమి' ప్రతిజ్ఞ రచయిత పైడిమర్రి వెంకట సుబ్బారావు ఫొటోని కొత్తగా ముద్రించిన తొమ్మిదో తరగతి తెలుగు పాఠ్యపుస్తకంలో ప్రతిజ్ఞ వద్ద ముద్రించారు. ఈ విషయాన్ని జనవిజ్ఞాన వేదిక ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి ఎం.రాంప్రదీప్ బుధవారం చెప్పారు. దేశ ఖ్యాతి ఇనుమడించేలా పైడిమర్రి రాసిన ప్రతిజ్ఞను నేటి తరానికి తెలియజేసేందుకు దేశంలోని అన్ని రాష్ట్రాల్లో పాఠ్యపుస్తకాల్లో ఆయన పేరు చేర్చాలని జనవిజ్ఞాన వేదిక 2015 నుంచి డిమాండ్ చేస్తున్నట్లు గుర్తు చేశారు. గతంలో తెలుగు రాష్ట్రాల పాఠ్యపుస్తకాల్లో పైడిమర్రి పేరును ప్రతిజ్ఞ పేజీలో చేర్చగా, ఇప్పుడు ఏపీ ప్రభుత్వం పైడిమర్రి కృషికి గుర్తింపుగా ఆయన ఫొటోను కూడా ముద్రించడం హర్షణీయమన్నారు. పైడిమర్రి వర్ధంతి, జయంతి కార్యక్రమాలను కూడా ప్రభుత్వం నిర్వహించాలని కోరినట్లు పేర్కొన్నారు.

## 'నాయీబ్రాహ్మణ'గానే కుల ధ్రువీకరణ ఇవ్వాలి

- ఏపీ నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ యానాదయ్య

భవానీపురం (విజయవాడ పశ్చిమ): రాష్ట్రంలోని నాయీ బ్రాహ్మణులకు ఇకపై 'నాయీ బ్రాహ్మణ'(బీసీ-ఏ) కింద మాత్రమే కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని ఏపీ నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సిద్దవటం యానాదయ్య కోరారు. ఇప్పుడు జారీ చేస్తోన్న కుల ధ్రువీకరణ పత్రాలపై 'మంగలి', 'మంగళి', 'నాయీ బ్రాహ్మణ', 'భజంత్రి' అని ఉంటోందని పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని రాష్ట్ర వెనకబడిన తరగతుల కమిషన్ చైర్మన్ జస్టిస్ శంకరనారాయణను ఆయన బుధవారం కలిసి వినతి పత్రమిచ్చారు. యానాదయ్య మాట్లాడుతూ..రాష్ట్రంలో నాయీ బ్రాహ్మణులు క్షౌర వృత్తిని నిర్వహిస్తున్నారని, వీరిలో వాయిద్య కళాకారులు కూడా ఉన్నారని తెలిపారు. ప్రస్తుతం కులాలకతీతంగా అన్ని వర్గాలవారు ప్రజల ఆయా అవసరాలను తీర్చేలా పనిచేస్తున్నారన్నారు. ఈ కులానికి సంబంధించిన పలు పేర్లను నిషేధిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసిందని చెప్పారు. ఈ నేపథ్యంలో కేవలం 'నాయీ బ్రాహ్మణ' పేరుతోనే కుల ధ్రువీకరణ పత్రాలను మంజూరు చేయాలని కోరారు.

# ఆర్బీకేలు ఓ వినూత్నమైన ఆలోచన

### పశుపోషకులకు గ్రామ స్థాయిలోనే సేవలు

- కియోస్క్‌ల ద్వారా సంపూర్ణ మిశ్రమ దాణా
- సంచార వైద్య ఆరోగ్య సేవా రథాలు డిజైనింగ్ అద్భుతం
- ఇలాంటి సౌకర్యాలు కేరళలో లేవు
- ఏపీని చూసి చాలా నేర్చుకోవాలి
- కేరళ పశుసంవర్ధక శాఖ మంత్రి చించురాణి ప్రశంసలు
- జూపూడి ఆర్బీకే సందర్శించిన కేరళ ప్రభుత్వ బృందం



జూపూడిలో జీవానికి వ్యాధి నిరోధక టీకా వేస్తున్న కేరళ పశు సంవర్ధక శాఖ మంత్రి చించురాణి తదితరులు

సాక్షి, అమరావతి/ఇబ్రహీంపట్నం (మైలవరం): ఆంధ్రప్రదేశ్‌లో రైతు భరోసా కేంద్రాల (ఆర్బీకే) ద్వారా గ్రామ స్థాయిలో పశుపోషకులకు నాణ్యమైన సేవలు అందిస్తున్నారని కేరళ రాష్ట్ర పశుసంవర్ధక శాఖమంత్రి జె. చించురాణి అన్నారు. ఆర్బీకేలే ఓ వినూత్నమైన ఆలోచన అని, వీటి ద్వారా గ్రామ స్థాయిలో సేవలందించడం నిజంగా గొప్ప విషయమని ప్రశంసించారు. ఏపీ పశు దాణా చట్టం – 2020 అమలుపై అధ్యయనం చేసేందుకు మంత్రి చించురాణి నేతృత్వంలోని కేరళ ప్రభుత్వ సెలక్ట్ కమిటీ బృందం బుధవారం ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం జూపూడి ఆర్బీకేను సందర్శించింది. ఆర్బీకే ద్వారా పశుపోషకులకు అందిస్తున్న సేవలను బృందం సభ్యులు పరిశీలించారు. కియోస్క్ ద్వారా సంపూర్ణ మిశ్రమ దాణా (టీఎంఆర్)ను పాడి రైతులు స్వయంగా బుక్ చేసుకొనే విధానాన్ని పరిశీలించారు. డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ వాహనంలోని అత్యాధునిక సౌకర్యాలను పరిశీలించారు. అంబులెన్స్ ద్వారా మూగ, సన్న జీవాలకు అందిస్తున్న సేవలను తెలుసుకున్నారు. హైడ్రాలిక్ లిఫ్ట్‌తో పశువును వాహనంలోకి ఎక్కించడం, ఆస్పత్రికి తరలించడాన్ని పరిశీలించారు. వెల్‌నెస్ సెంటర్‌లో అందుతున్న వైద్యం, మందులు, 104 సేవలు తెలుసుకున్నారు. మంత్రి చించురాణి, ఇతర సభ్యులు నట్టల నివారణ మందును పశువులకు తాగించారు. అనంతరం కంచికచర్ల మండలం పరకాలపాడులోని డాక్టర్ వైఎస్సార్ దేశీయ గో జాతుల పెంపక కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ ఉత్పత్తి చేసే పాల పదార్థాలు, గో మూత్రం, పేడ ఉత్పత్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచి దేవమాత వారిని సత్కరించారు. అనంతరం మంత్రి చించురాణి మాట్లాడుతూ రాష్ట్రం పశుపోషణకు పెద్ద పీట వేస్తూ గ్రామ స్థాయిలో పశుసంవర్ధక అధికారి ద్వారా రైతు ముంగిటే సేవలందిస్తున్న తీరు అద్భుతమన్నారు. నాణ్యమైన సంపూర్ణ మిశ్రమ దాణాను 60 శాతం సబ్సిడీపై అందించడం మంచి విధానమని చెప్పారు. సంచార పశు ఆరోగ్య సేవా రథం డిజైన్ చాలా బాగుందని, ఇలాంటి సౌకర్యాలు తమ రాష్ట్రంలోని అంబులెన్స్‌లో లేవన్నారు. ఏపీని చూసి నేర్చుకోవాల్సిన విషయాలు చాలా ఉన్నాయన్నారు. ఈ బృందంలో కేరళ ఎమ్మెల్యేలు సీకే ఆశా, జాబ్‌మైఖిల్, సీహెచ్ కుంబంబు, కేపీ కున్హమ్మద్ కుట్టీ, డాక్టర్ మాథ్యూ కుజల్ నాదన్, కురుక్కోలి మొయిద్దీన్, డీకే మురళి, మోన్స్ జోసఫ్, కేపీ మోహన్, యూ ప్రతిభ, కేడీ ప్రసేనన్, ఆ రాష్ట్ర పశు సంవర్ధక శాఖ డైరెక్టర్ డాక్టర్ ఏక కొసిగన్, ఇతర ఉన్నతాధికారులు ఉన్నారు. ఏపీ పసుసంవర్ధక శాఖ అదనపు డైరెక్టర్ ఎస్.వెంకట్రావు కూడా ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

## వంద పర్యాటక ప్రాంతాల అభివృద్ధి

- అటవీశాఖ చీఫ్ ప్రిన్సిపల్ కన్జర్వేటర్ మధుసూదనరెడ్డి



మాట్లాడుతున్న పీపీసీఎఫ్ మధుసూదనరెడ్డి

రాజవొమ్మంగి (అల్లూరి సీతారామరాజు జిల్లా): రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో విస్తరించి ఉన్న అడవుల్లో ప్రాచుర్యం పొందిన వంద పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని అటవీశాఖ చీఫ్ ప్రిన్సిపల్ కన్జర్వేటర్ మధుసూదనరెడ్డి తెలిపారు. జిల్లాలోని అరకు, మారేడుమిల్లి, రంపచోడవరం, గుడిసె, చింతపల్లి తదితర ప్రాంతాలను ఆయన బుధవారం సందర్శించారు. స్థానిక అటవీ క్షేత్ర కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడారు. పర్యాటకులు బస చేసేందుకు సౌకర్యవంతమైన కాటేజీలు, ట్రెక్కింగ్‌కు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆదివాసీల సేవలు ఉపయోగించుకుని వారికి ఉపాధి కల్పిస్తామని తెలిపారు. పర్యాటక ప్రదేశాలను ప్లాస్టిక్ రహిత ప్రాంతాలుగా తీర్చిదిద్దుతామన్నారు.

**పెద్ద పులుల స్థావరంగా నల్లమల:**
శ్రీశైలం ప్రాజెక్టు పరిసరాల్లో నల్లమల అడవులు పెద్ద పులుల స్థావరంగా మారిందని చెప్పారు. గతంలో ఇక్కడ 45 పులులు మాత్రమే ఉండగా, ఇప్పుడు వీటి సంఖ్య 75కు పెరిగిందన్నారు. పాపికొండల ఏరియాలో గతంలో రెండు పులులు ఉండగా, ప్రస్తుతం మరో రెండు పులులు చేరాయన్నారు. మారేడుమిల్లి, రంపచోడవరం తదితర అటవీ ప్రాంతాల్లో చిరుతల సంచారం బాగా పెరిగిందని చెప్పారు. వన్యప్రాణుల సంరక్షణకు అటవీ చట్టాలను కఠినంగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. స్క్వాడ్ డీఎఫ్‌వో త్రిమూర్తుల రెడ్డి, స్థానిక ఫారెస్ట్ రేంజర్ అబ్బాయిదొర పాల్గొన్నారు.

## రుషికేష్ వెళ్లిన స్వరూపానందేంద్ర సరస్వతి

**జూలై 3 నుంచి అక్కడ చాతుర్మాస దీక్ష**



రుషికేష్‌కి బయలుదేరుతున్న స్వరూపానందేంద్ర సరస్వతికి గురువందనం సమర్పిస్తున్న వేద విద్యార్థులు

సింహాచలం/సాక్షి, న్యూఢిల్లీ: చాతుర్మాస దీక్ష చేసేందుకు విశాఖ శ్రీ శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి బుధవారం విశాఖలోని చినముషిడివాడలో ఉన్న శారదా పీఠం నుంచి ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని రుషికేష్‌కి వెళ్లారు. అంతకుముందు ఆయన పీఠం అధిష్టానదైవం రాజశ్యామల అమ్మవారికి, ఆరాధ్యదైవం సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. జగద్గురు శంకరాచార్య వేదపాఠశాల విద్యార్థులు గురువందనం సమర్పించారు. స్వరూపానందేంద్ర సరస్వతి అక్టోబరు 5వ తేదీ వరకు రుషికేష్‌లోని శారదాపీఠం ఆశ్రమంలోనే ఉంటారు. ఆయన జూలై 3వ తేదీ నుంచి చాతుర్మాస దీక్ష చేపట్టనున్నారు.

**స్వాత్మానందేంద్ర సరస్వతిని కలిసిన సీఎస్**
విశాఖ శ్రీశారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతిని బుధవారం న్యూఢిల్లీలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) జవహర్‌రెడ్డి కలిశారు. జూలై 3వ తేదీ నుంచి రుషికేష్‌లో ప్రారంభం కానున్న చాతుర్మాస దీక్ష ఆహ్వానపత్రికను స్వాత్మానందేంద్ర సరస్వతి.. జవహర్‌రెడ్డికి అందజేశారు. దీక్షాకాలంలో రుషికేష్ రావాలని ఆహ్వానించారు. జవహర్‌రెడ్డితో పాటు జాతీయ పర్యాటకాభివృద్ధి సంస్థ ఎండీ కమల్‌వర్ధన్.. స్వాత్మానందేంద్ర సరస్వతిని కలిసి ఆశీస్సులు తీసుకున్నారు.

## 2న సింహగిరి ప్రదక్షిణ

- 3న సింహగిరిపై ఆషాఢ పౌర్ణమి ఉత్సవాలు



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

సాక్షి, విశాఖపట్నం: సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి వార్షిక 'గిరి ప్రదక్షిణ' జూలై 2న నిర్వహించనున్నట్లు కలెక్టర్ మల్లికార్జున తెలిపారు. సింహాచలంలో నిర్వహించే గిరి ప్రదక్షిణ ఏర్పాట్లపై దేవస్థానం, జీవీఎంసీ, పోలీస్, ట్రాఫిక్, ఆర్టీసీ, అగ్నిమాపక, రెవెన్యూ, వైద్యారోగ్య శాఖ అధికారులతో ఆయన బుధవారం తన కార్యాలయంలో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జూలై 2న ఉదయం నుంచి భక్తులందరూ సింహగిరి చుట్టూ సుమారు 32 కిలోమీటర్ల మేర గిరి ప్రదక్షిణ చేస్తారని చెప్పారు. అడవివరం జంక్షన్ మీదుగా సెంట్రల్ జైల్, విశాలాక్షినగర్, జోడుగుళ్లపాలెం, ఎంవీపీ కాలనీ డబుల్ రోడ్డు, మాధవధార, ప్రహ్లాదపురం గోశాల మీదుగా తిరిగి స్వామి వారి కొండ దిగువ తొలి పావంచాకు చేరుకుంటారన్నారు. గిరి ప్రదక్షిణ రోజున 70 వేల మందికి పైగా భక్తులు, 3న నిర్వహించే ఆషాఢ పౌర్ణమికి లక్ష మందికిపైగా భక్తులు స్వామివారి దర్శనానికి వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ రెండు రోజులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. కొండ చుట్టూ 25 స్టాళ్లు ఏర్పాటు చేసి నీటి సౌకర్యంతో పాటు వైద్య సిబ్బంది, అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచాలని సూచించారు. 3న ఆషాఢ పౌర్ణమి సందర్భంగా నాలుగో విడత చందన సమర్పణ జరుగుతుందన్నారు. సమీక్షలో సీపీ త్రివిక్రమ్ వర్మ, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, జేసీ విశ్వనాథన్, ఆలయ ఈవో భ్రమరాంబ తదితరులు పాల్గొన్నారు.

## హత్య కేసులో 13 మందికి జీవిత ఖైదు

తెనాలిరూరల్ : బాపట్ల జిల్లా నిజాంపట్నం మండలం అడవులదీవి పంచాయతీ పరిధిలోని మహమ్మదీయపాలెంలో 2016లో జరిగిన హత్య కేసులో 13 మందికి జీవిత ఖైదు విధిస్తూ 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.మాలతి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు వివరాలు.. మహమ్మదీయపాలేనికి చెందిన జాస్మిన్ 2016లో ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె మరణానికి అదే గ్రామానికి చెందిన యువకులు శ్రీసాయి, పవన్ కారణమని భావించిన గ్రామస్తులు.. ఇద్దరినీ చెట్టుకుకట్టేసి తీవ్రంగా కొట్టారు. దెబ్బలకు తాళలేక శ్రీసాయి మృతి చెందాడు. మృతిపై కేసు నమోదు చేసిన పోలీసులు 21 మందిని నిందితులుగా పేర్కొంటూ చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు విచారణలో ఉండగా నలుగురు మృతి చెందారు. బుధవారం కేసు విచారణకు రావడంతో సాక్ష్యాధారాలను పరిశీలించిన 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి 13 మందికి జీవిత ఖైదుతో పాటు రూ.52 వేల జరిమానా విధించారు.

## దుఃఖాన్ని దిగమింగి..!

- బ్రెయిన్‌డెడ్ అయిన యువకుడి అవయవదానానికి కుటుంబీకుల అంగీకారం



సంతోష్‌కుమార్ (ఫైల్)

ఆరిలోవ: విశాఖలోని ఆరిలోవ ప్రాంతం అంబేడ్కర్‌నగర్‌కు చెందిన బొండా వెంకట సంతోష్‌కుమార్ (31) బ్రెయిన్‌డెడ్‌కు గురికాగా అతడి అవయవాలను దానం చేసేందుకు కుటుంబీకులు అంగీకరించారు. ఏసీ మెకానిక్ అయిన సంతోష్ మంగళవారం మరమ్మతుల పని మీద కొమ్మాది వెళ్లాడు. అక్కడ ఓ ఇంటి రెండో అంతస్తులో పనిచేస్తుండగా అదుపు తప్పి కిందపడిపోయాడు. ఈ ఘటనలో అతని తలకు తీవ్రగాయమైంది. కుటుంబీకులు అతడిని స్థానికుల సహాయంతో వెంకోజీపాలెం వద్ద ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. వైద్యులు ఆయన్ని పరిశీలించి బ్రెయిన్ డెడ్ అయినట్లు చెప్పారు. ఈ విషయం తెలుసుకున్న జీవన్‌దాన్ ప్రతినిధులు యువకుడి కుటుంబ సభ్యులతో మాట్లాడి అవయవాలను దానం చేయాలని, దానివల్ల మరికొంత మంది ప్రాణాలు నిలుస్తాయని వివరించారు. దీనికి కుటుంబ సభ్యులు అంగీకరించడంతో యువకుడి దేహాన్ని జీవన్‌దాన్ ప్రతినిధులు బుధవారం విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)కు తీసుకువచ్చారు. అక్కడ వైద్యులు వెంకట సంతోష్‌కుమార్ అవయవాలను పరిశీలించారు. అవయవాలను తీసేందుకు ఆపరేషన్ చేసినట్లు మృతుడు సంతోష్ అన్నయ్య వైఎస్సార్ సీపీ ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు బొండా ఉమామహేశ్వరరావు తెలిపారు.

**గ్రీన్ చానెల్ ద్వారా అవయవాలు కిమ్స్‌కు తరలింపు..**
విమ్స్‌లో ఆపరేషన్ అనంతరం తీసిన అవయవాలను సకాలంలో వేరే ఆస్పత్రికి తరలించారు. నగర సీపీ త్రివిక్రమ్‌వర్మ ఆదేశాలతో ట్రాఫిక్ పోలీసులు విమ్స్ నుంచి బీఆర్‌టీఎస్‌లో అడవివరం, సింహాచలం, గోపాలపట్నం మీదుగా షీలానగర్‌లో కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి వరకు గ్రీన్ చానెల్ ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ లేకుండా చర్యలు చేపట్టారు. ఆ రోడ్డు మార్గంలో సకాలంలో అవయవాలను విమ్స్ నుంచి కిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

## తొమ్మిదేళ్లలో రాష్ట్రానికి రూ.8.16 లక్షల కోట్లు

- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి దుష్యంత్‌కుమార్ గౌతం



మాట్లాడుతున్న బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి దుష్యంత్‌కుమార్ గౌతం


కావలి: 'రాష్ట్రం ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాలకు కేంద్రం కూడా నిధులిస్తోంది. తొమ్మిదేళ్లలో రాష్ట్రానికి రూ.8.16 లక్షల కోట్లు కేటాయించింది. పేదల కోసం 24 లక్షల పక్కా ఇళ్లు కూడా మంజూరు చేసింది' అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి దుష్యంత్ కుమార్‌గౌతం అన్నారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి పట్టణంలో మహాజన సంపర్క్ అభియాన్ సభ పేరుతో బీజేపీ నేతలు బుధవారం బహిరంగ సభ నిర్వహించారు. ముఖ్యఅతిథి దుష్యంత్‌కుమార్ గౌతం మాట్లాడుతూ మోదీ పాలన ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు మాట్లాడుతూ కేంద్రం నిధులతో రాష్ట్రంలో పథకాలు అమలు చేస్తూ స్టిక్కర్లపైన మాత్రం తమ ఫొటోలు వేసుకుంటున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో మద్యం, మైనింగ్ మాఫియాల దోపిడీ పెరిగిపోయిందన్నారు. కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డిపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు.

# 'గుర్ర్'మరణాలు

**తెల్లవారు జామునే తెల్లారిపోతున్న బతుకులు**

- అలసట, నిద్రలేమి వల్ల రోడ్డు ప్రమాదాలు
- భారీ ప్రమాదాలన్నీ వేకువ జామునే
- జాతీయ రహదారిలో 12 ఏళ్లలో 150 వరకూ దుర్ఘటనలు
- పదుల సంఖ్యలో మృత్యువాత, వందలాది మంది క్షతగాత్రులు

ఆలమూరు: వేగంగా గమ్యం చేరాలనే ఆతృత, ఆలసట, నిద్రలేమి తదితర కారణాల వల్ల ఎక్కువగా తెల్లవారుజామునే ప్రమాదాలు సంభవిస్తున్నాయే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఆహ్లాదకర చల్లని వాతావరణంలో ప్రయాణం సులభంగా సాగుతుందనే అభిప్రాయంతో అనేకమంది వాహనదారులు తెల్లవారుజామున రాకపోకలు సాగిస్తుంటారు. అంతర్రాష్ట్ర సర్వీసులు నడిపే కొందరు లారీ డ్రైవర్లు పగలు కొంత సమయం విశ్రాంతి తీసుకుని రాత్రి వేళల్లో ప్రయాణం చేస్తుంటారు. ఈ వాహనాలు నడిపే డ్రైవర్లకు ఎక్కువగా తెల్లవారు జామునే కునికిపాట్లు వచ్చి డ్రైవింగ్ అదుపు తప్పుతోంది. మితిమీరిన వేగంతో పాటు నిద్రలేమి అనేక ప్రమాదాలకు కారణమవుతోంది. గడచిన 12 ఏళ్లలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో గోపాలపురం నుంచి తుని వరకూ అత్యధిక భారీ ప్రమాదాలు అర్ధరాత్రి నుంచి తెల్లవారుజామునే జరగడం గమనార్హం. 1967 ఏప్రిల్ 20న అప్పటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి, మంత్రి కళా వెంకట్రావు చేతుల మీదుగా ఆలమూరు-రావులపాలెం, సిద్ధాంతం-గోపాలపురం వంతెనలు ప్రారంభోత్సవం జరుపుకోవడంతో అప్పటి నుంచి ఐదవ నంబరు జాతీయ రహదారిగా ప్రాచుర్యం పొందింది. 2003లో అప్పటి ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి హయాంలో ఈ రహదారి స్వర్ణ చతుర్భుజి విస్తరణలో భాగంగా 2003లో గౌతమీ, వశిష్ట నదులకు అదనంగా రెండు వంతెనలు ఏర్పాటు చేసి ఈ రహదారికి 16 నంబరు కేటాయించారు. మళ్లీ దివాన్ చెరువు నుంచి నల్లజర్ల మీదుగా ఏలూరుకు అభివృద్ధి చేసిన రహదారికి 16 నంబరు కేటాయించగా రావులపాలెం మీదుగా ఉన్న రహదారికి 216ఏ నంబరును కేటాయించారు.





జొన్నాడలోని ఏటిగట్టు జంక్షన్ వద్ద కాలువలో బోల్తా పడిన లారీ (పాత చిత్రం)

- 2001 జనవరి నుంచి 2023 జూన్ వరకూ సుమారు 150 ప్రమాదాలు జరగ్గా అందులో జరిగిన 11 భారీ ప్రమాదాల్లో అధిక సంఖ్యలో మృతుల సంఖ్య నమోదైంది. వందలాది మంది క్షతగాత్రులు కాగా అనేక మంది అవయవాలు కోల్పోయారు.
- 2001లో గౌతమీ పాత వంతెన రైయిలింగ్‌ను వ్యాన్ ఢీకొన్న ఘటనలో గోదావరిలో పడి 10 మంది ప్రయాణికులు గల్లంతయ్యారు.
- 2009 డిసెంబర్ ఒకటో తేదీ తెల్లవారు జామున నల్లగొండ జిల్లా దామనచర్ల నుంచి సిమెంటు లోడుతో వస్తున్న లారీ పాత వంతెనపై నుంచి రైయిలింగ్‌ను ఢీకొని నదిలో పడిన ఘటనలో ఇద్దరి ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి.
- 2011 జనవరి 11న పశ్చిమగోదావరి జిల్లా గౌరీపట్నంకు చెందిన లారీ గోదావరిలోని ఇసుక తిన్నెలపై పడి ముగ్గురు మృత్యువాత పడ్డారు.
- విశాఖ జిల్లా ఏజెన్సీ ప్రాంతమైన ముంచింగిపుట్టుకు చెందిన సుమారు 40 మంది కూలీలు ఒంగోలులో తమ కూలి పనులు ముగించుకుని సిమెంట్ లారీపై 2012 జూలై 18న స్వగ్రామం వెళుతుండగా ఏటిగట్టు జంక్షన్‌లోని పంట కాలువలోకి దూసుకువెళ్లి ప్రమాదానికి గురైంది. సిమెంట్ లారీ కింద పడి ఆరుగురు మృతి చెందగా 11 మందికి తీవ్ర గాయాలయ్యాయి.
- 2016 ఫిబ్రవరి 29న ఇసుక లారీ కాలువలో పడిన ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా ఒకరు మృతి చెందారు.
- 2016 ఏప్రిల్ 16న పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం మండలం విస్సాకోడేరుకు చెందిన 11 మంది పెళ్లి బృందం ఇన్నోవా కారులో పుణ్యక్షేత్రమైన అన్నవరం వెళుతుండగా అదే ప్రదేశంలో కాలువలో పడిపోయింది. ఈ ప్రమాదంలో ఇద్దరు చిన్నారులతో సహా ఒక వ్యక్తి మృతి చెందగా వధూవరులతో పాటు మరో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి.
- 2019 నవంబర్ నాలుగున చెన్నై నుంచి హ్యుండాయ్ కార్ల లోడుతో వెళుతున్న కంటైనర్ ప్రమాదవశాత్తు అదుపు తప్పి కాలువలోకి దూసుకుపోయిన ఘటనలో డ్రైవర్, క్లీనర్ ఇద్దరూ మృతిచెందారు.
- 2020 అక్టోబర్ తొమ్మిదిన ఆలమూరు మండలం మూలస్థాన అగ్రహారం నుంచి వ్యవసాయ పనుల కోసం బైక్‌పై వెళుతున్న ముగ్గురు యువకులను ఐషర్ వేన్ ఢీకొన్న ఘటనలో ముగ్గురూ అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు.
- 2023 జూన్ 12న 16 నంబరు జాతీయ రహదారిలోని నల్లజర్ల వద్ద ఆగి ఉన్న లారీని కారు ఢీకొన్న ఘటనలో ప్రమాదంలో ఏడుగురు అక్కడికక్కడే మృతి చెందారు. దివాన్‌చెరువు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృత్యువాత పడగా పలువురు క్షతగాత్రులయ్యారు.
- 2023 ఏప్రిల్ ఏడున మూలస్థాన అగ్రహారంలో గుర్తు తెలియని వాహనం కారును ఢీకొన్న ఘటనలో ఆలమూరుకు చెందిన ఒకరు మృతి చెందగా నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి.
- 2023 జూన్ 17న టాటా ఏస్ వాహనాన్ని వెనుక నుంచి కారు ఢీకొన్న ఘటనలో అనకాపల్లి జిల్లా చోడవరం మండలంలోని ముద్దుర్తి గ్రామానికి చెందిన నలుగురు, పాలకొల్లుకు చెందిన ఒకరితో కలిపి మొత్తం ఐదురుగు మృత్యువాత పడగా ఎనిమిది మందికి తీవ్ర గాయాలయ్యాయి.

### స్వీయ రక్షణ చర్యలు తప్పనిసరి

జాతీయ రహదారుల్లో ప్రయాణం చేసేటప్పుడు స్వీయ రక్షణ, జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి. రాత్రి వేళల్లో ప్రయాణించే వాహనదారులు తప్పనిసరిగా కొద్దిసేపు విశ్రాంతి తీసుకోవాలి. ప్రతి 15 కిలోమీటర్ల దూరంలో ఏర్పాటు చేసిన సైడ్ బార్‌లను డ్రైవర్లు సద్వినియోగం చేసుకోవాలి. ప్రతి టోల్‌గేట్ వద్ద వాహనదారులకు విశ్రాంతి గదులు, ఇతర సదుపాయాలను కల్పిస్తున్నాం. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా ఉన్న జాతీయ రహదారుల్లో అత్యధికంగా ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి ప్రభుత్వానికి నివేదికను అందించనున్నాం.

– డి.అశోక్ ప్రతాప్‌రావు, ఆర్‌టీఓ, అమలాపురం

## చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలి

- రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ కమిషనర్ అరుణ్‌కుమార్



కందులు, చిరుధాన్యాల సేకరణపై సమీక్షిస్తున్న రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ కమిషనర్ అరుణ్‌కుమార్

ఒంగోలు అర్బన్: చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలని, ఆ దిశగా రైతుల్లో అవగాహన కల్పించాలని రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ కమిషనర్ హెచ్ అరుణ్‌కుమార్ సూచించారు. కందులు, చిరుధాన్యాల సేకరణపై బుధవారం ప్రకాశం భవనంలో ఏడు జిల్లాల జాయింట్ కలెక్టర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. దీనిలో పౌర సరఫరాల సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వీరపాండ్యన్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఎండీ శేఖర్‌బాబు, కలెక్టర్ దినేష్‌కుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు. అరుణ్‌కుమార్ మాట్లాడుతూ 2023ను అంతర్జాతీయ చిరుధాన్యాల దినోత్సవంగా గుర్తించినందున చిరుధాన్యాల వినియోగంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. అదే విధంగా సాగును ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వాటిని పౌర సరఫరాల సంస్థ ద్వారా రేషన్ కార్డుదారులకు పంపిణీ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలన్నారు. పౌర సరఫరాల సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వీరపాండ్యన్ మాట్లాడుతూ కందుల సేకరణకు అవసరమైన కేంద్రాలను ఆగస్టు నెల చివరికి రైతు భరోసాకేంద్రాల స్థాయిలో ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఎండీ శేఖర్‌బాబు మాట్లాడుతూ రైతులకు అవసరమైన విత్తనాలు ఆర్బీకేల ద్వారా అందిస్తామన్నారు.ప్రకాశం జిల్లా జాయింట్ కలెక్టర్ కే శ్రీనివాసులు, బాపట్ల జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్‌బాబు, పల్నాడు జేసీ శ్యాంప్రసాద్, నంద్యాల జేసీ నిషాంతి, అనంతపురం జేసీ కేతన్‌గార్గ్, శ్రీసత్యసాయి జిల్లా జేసీ టీఎస్ చేతన్, మార్కాపురం సబ్ కలెక్టర్ సేతుమాధవన్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా...

### చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఓ నియంత

**అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఆగ్రహం**



**బీజింగ్:** అమెరికా, చైనా నాయకుల మధ్య మాటల యుద్ధం ముదురుతోంది. అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ చైనా పర్యటన పూర్తయిన మరుసటి రోజే ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. చైనా అధినేత షీ జిన్‌పింగ్‌పై అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనొక నియంత అంటూ మండిపడ్డారు. తాజాగా కాలిఫోర్నియాలో నిధుల సేకరణ కార్యక్రమంలో బైడెన్ మాట్లాడారు. చైనాకు చెందిన అనుమానిత నిఘా బెలూన్‌ను తమ అధికారులు పేల్చివేసినప్పుడు జిన్‌పింగ్ చాలా ఆందోళనకు గురయ్యారని, ఆయన ఎందుకలా ప్రవర్తించారో తెలియదని అన్నారు. చైనా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోందని చెప్పారు. జిన్‌పింగ్‌పై బైడెన్ చేసిన వ్యాఖ్యలను చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మావో నింగ్ ఖండించారు. బైడెన్ ఆరోపణలు అసంబద్ధం, బాధ్యతారాహిత్యం అని ఆక్షేపించారు.

### కేంద్ర ఆర్డినెన్స్‌పై విపక్షాల భేటీలో చర్చించాలి

**ప్రతిపక్ష నాయకులకు అరవింద్ కేజ్రీవాల్ లేఖ**



**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో పరిపాలనా అధికారాలను నియంత్రిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌ను ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ మరోసారి తప్పుపట్టారు. ఈ నెల 23న పట్నాలో జరిగే విపక్షాల భేటీలో ఈ ఆర్డినెన్స్ వ్యవహారంపై చర్చించాలని ఆయన కోరారు. ఈ మేరకు విపక్ష నేతలు బుధవారం లేఖ రాశారు. ఆర్డినెన్స్‌పై బీజేపీయేతర పార్టీలు తమ వైఖరిని బహిర్గతం చేయాలని కేజ్రీవాల్ డిమాండ్ చేశారు. ఇది కేవలం ఢిల్లీకి సంబంధించిన సమస్యగా చూడొద్దని అన్నారు. ఇప్పుడు అడ్డుకోకపోతే ఇతర రాష్ట్రాల్లో అధికారాలను సైతం కేంద్రం గుప్పిట్లో పెట్టుకుంటుందని హెచ్చరించారు.

# నింగి.. నేల.. నీరు.. ఎక్కడైనా పవర్‌ఫుల్

అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, భారత ప్రధాని నరేంద్ర మోదీ మధ్య ఇవాళ కీలక భేటీ జరగనుంది. ఈ సమావేశంలో ఇరువురు నేతలు రక్షణ రంగంలో పటిష్ట బంధాలకే ప్రాధాన్యం ఇవ్వనున్నారు. రక్షణ రంగంలో వేలాది కోట్ల రూపాయల ఒప్పందాలు కుదుర్చుకునే అవకాశాలున్నాయి. అందులో అందరి దృష్టిని ఎంక్యూ9 రీపర్ డ్రోన్లు ఆకర్షిస్తున్నాయి. ఈ డ్రోన్ల కొనుగోలుకు ఇప్పటికే కేంద్ర కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ డ్రోన్ల ప్రత్యేకతలు భారత్‌కు ఒనగూరే ప్రయోజనాలేంటో చూద్దాం..

**సాక్షి, నేషనల్ డెస్క్**



నింగి, నేల, నీరు ఎక్కడైనా, ఏ పనైనా ఈ డ్రోన్లు చేయగలవు. కదన రంగంలో అరివీర భయంకరమైనవిగా గుర్తింపు సంపాదించాయి. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జపాన్ వంటి అగ్రదేశాలు విస్తృతంగా వినియోగిస్తున్నాయి. ఎంక్యూ–9 రీపర్ డ్రోన్లు బహుళ ప్రయోజనాలకు వినియోగపడతాయి. అమెరికాకు చెందిన జనరల్ ఆటమిక్స్ ఏరోనాటికల్ వ్యవస్థ ఈ డ్రోన్లను అభివృద్ధి చేసింది. సరిహద్దు ప్రాంతాల్లో నిఘా, శత్రుదేశాల రహస్యాల సేకరణ వంటి కార్యక్రమాలతో పాటు బాంబు దాడుల్ని కూడా ఈ డ్రోన్లు చేయగలవు. ఈ డ్రోన్లను కొనుగోలు చేయడానికి ఇప్పటికే కేంద్ర కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. త్రివిధ బలగాలైన భారత వైమానిక దళం, నావికా దళం, ఆర్మీలకు ఒక్కో దానికి 10 డ్రోన్ల చొప్పున మొత్తం 30 డ్రోన్లను కొనుగోలు చేయడానికి భారత్ సిద్ధమైంది. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, భారత ప్రధాని నరేంద్ర మోదీ మధ్య గురువారం నాడు జరిగే భేటీలో 300 కోట్ల డాలర్ల విలువైన (రూ.24,600 కోట్లు) ఈ ఒప్పందాన్ని కుదుర్చుకునే అవకాశాలున్నాయి. మిలటరీ ఆపరేషన్లు, సరిహద్దుల్లో నిఘా, ఉగ్రవాదాన్ని ఎదుర్కొనే చర్యల్లో ఈ డ్రోన్లు కీలకంగా వ్యవహరిస్తాయి. మానవ రహిత డ్రోన్లు కావడంతో కదన రంగంలో వినియోగించినా ప్రాణనష్టం ఉండదు. గ్రౌండ్ కంట్రోల్ స్టేషన్‌లో ఇద్దరు పైలట్లు ఈ డ్రోన్‌ను నియంత్రిస్తూ ఉంటారు

దీర్ఘకాలం పనిచేయడం, నిరంతరాయంగా నిఘా పెట్టే సామర్థ్యం, దాడులకు దిగే సత్తా వంటి బహుళ ప్రయోజనాలు కలిగిన ఎంక్యూ–9 రీపర్ డ్రోన్లు భారత త్రివిధ బలగాల మేధస్సు, నిఘా, పర్యవేక్షణ సామర్థ్యాన్ని పెంచుతాయి. పాకిస్తాన్, చైనా సరిహద్దుల్లో మనకి నిరంతరాయంగా ఘర్షణలు, చొరబాట్లు జరుగుతూనే ఉంటాయి. ఈ డ్రోన్లు మన దగ్గరుంటే సరిహద్దు ప్రాంతాల్లో నిరంతర నిఘా ఏర్పాటు చేసి, ముప్పుల్ని ముందే పనిగట్టడం, వాటికి సంబంధించిన ఇమేజీలను పంపించి అప్రమత్తం చేయడం వంటివి చేస్తాయి. ఉగ్రవాద కార్యకలాపాలను కూడా ఇవి గుర్తించి

### భారత్‌కు ఎలా ఉపయోగం ?

వాయువేగంతో వాటికి సంబంధించిన సమాచారాన్ని పంపుతాయి. మన దేశానికి అతి పెద్ద సముద్ర తీరప్రాంతం ఉంది. ఈ ప్రాంతాల్లో భద్రత అత్యంత కీలకం. సముద్ర తీర ప్రాంతాల్లో కూడా ఈ డ్రోన్లు పర్యవేక్షించగలవు. స్మగ్లింగ్, పైరసీ వంటి కార్యకలాపాలను గుర్తించడమే కాకుండా, సహాయ కార్యక్రమాల్లోనూ ఉపయోగపడతాయి. ప్రకృతి విపత్తులైన వరదలు, తుపాన్లు, భూకంపాలు వంటి సమయాల్లో విపత్తు నిర్వహణ కూడా చేయగలవు. మనుషులు వెళ్లలేని ప్రాంతాలకు ఈ డ్రోన్లు వెళ్లి సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తాయి.

### ప్రత్యేకతలు

- 50 వేల అడుగుల ఎత్తులో 40 గంటల సేపు నిరంతరాయంగా ప్రయాణించగలదు
- అధునాతన కెమెరాలు, సెన్సార్లు, రాడార్లతో సరిహద్దుల్లో గట్టిగా నిఘా పెట్టి సున్నితమైన అంశాలను, అత్యంత స్పష్టంగా ఫొటోలు తీసి పంపించగలదు
- 240 నాట్స్ ట్రూ ఎయిర్ స్పీడ్ (కేటీఏఎస్) వేగంతో ప్రయాణిస్తుంది
- ఆటోమేటిక్ టేకాఫ్, ల్యాండింగ్, ఎన్‌క్రిప్టెడ్ కమ్యూనికేషన్ వంటివి చేయగలదు
- 12,177 కేజీల బరువైన పేలోడ్‌ను మోసుకుపోగలదు
- -2,721 కేజీల ఇంధనాన్ని నింపవచ్చు
- 114 హెల్‌ఫైర్ క్షిపణులు, జీబీయూ–12 పేవ్‌వే లైజర్ గైడెడ్ బాంబుల్ని మోసుకుపోగలదు
- ఆకాశంపై నుంచి బాంబుల్ని కూడా కురిపించగలదు

### ఏయే దేశాలు వినియోగిస్తున్నాయి?

ఈ డ్రోన్లను అమెరికా చాలా విస్తృతంగా వినియోగిస్తోంది. అఫ్గానిస్తాన్, ఇరాక్ సహా ఇతర ఘర్షణ ప్రాంతాల్లో వీటిని మోహరించింది. అమెరికాలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ, నాసా ఈ డ్రోన్లను వినియోగిస్తున్నాయి. యూకే రాయల్ ఎయిర్‌ఫోర్స్, ఇటలీ ఎయిర్ ఫోర్స్, ఫ్రెంచ్, స్పెయిన్ ఎయిర్‌ఫోర్స్ , జపాన్ దేశాలు ఈ డ్రోన్లు వాడుతున్నాయి. 2014–2018 మధ్య కాలంలో ఇరాక్, సిరియాలో నిర్వహించిన 2,400 మిషన్లలో బ్రిటన్ ఈ డ్రోన్లనే మోహరించింది. 398 సార్లు ఈ డ్రోన్లతో దాడులకు పాల్పడింది. అమెరికాకు చెందిన ఎంక్యూ–9 డ్రోన్ తమ దేశ రహస్యాలను ఉక్రెయిన్‌కు చేరవేస్తోందన్న అనుమానంతో నల్లసముద్రంలో గత మార్చిలో కూల్చేసింది. 2020 జనవరిలో ఇరాన్‌లో జనరల్ క్వాజిం సొలెమినీ ఈ డ్రోన్‌తో అమెరికా చేసిన బాంబు దాడిలోనే మరణించారు.

### హోండురస్‌లో దారుణం

**46 మంది ఖైదీల దుర్మరణం**



**తెగుసిగల్పా(హోండురస్):** హోండురస్ దేశంలోని మహిళా చెరసాల 46 మంది మహిళా ఖైదీల పాలిట మరణశాసనమైంది. దేశ రాజధాని తెగుసిగల్పాకు 50 కిలోమీటర్ల దూరంలోని తమారా పట్టణంలోని ఉమెన్స్ జైలులో ముఠాల మధ్య ఘర్షణలు మంగళవారం తారాస్థాయికి చేరుకున్నాయి. రెండు ముఠాలకు చెందిన మహిళా ఖైదీలు తుపాకులతో కత్తులతో బాహాబాహీకి దిగారు. ఈ సందర్భంగా అగ్నికీలలు ఎగసిపడిన ఘటనలో మొత్తంగా 46 మంది ఖైదీలు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఎక్కువ మంది సజీవ దహనం అయినట్లు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తెలుస్తోంది. జైళ్లలో వేళ్లూనుకున్న వ్యవస్థీకృత నేరాలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపడంతో ఈ సమస్య పెద్దదైంది. హోండురస్ కారాగారాల్లో చాలా వరకు నేరగాళ్లు తమకు నచ్చినట్లు వ్యవహరిస్తారు. సొంత నియమాలనే పాటిస్తారు. అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా అక్కడి జైళ్లు వర్ధిల్లుతున్నాయి. నిషేధిత వస్తువులను జైళ్లలో విక్రయిస్తూ ముఠాలు సొమ్ముచేసుకుంటాయి. మంగళవారం నాటి ఘటనలో బారో 18, మారా సాల్వాట్రూకా(ఎంఎస్–13) అనే రెండు గ్యాంగ్‌ల మధ్య ఘర్షణే ప్రధాన కారణంగా తెలుస్తోంది. గడిచిన శతాబ్దకాలంలో చూస్తే అతిపెద్ద చెరసాలల్లో విషాద ఘటన హోండురస్‌లోనే నమోదైంది. 2012లో కొమయగువా జైలులో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘోర ప్రమాదంలో ఏకంగా 361 మంది కారాగారవాసులు ప్రాణాలు కోల్పోయారు.

### ఎన్డీయే గూటికి మాంఝీ



**న్యూఢిల్లీ:** జితిన్ రామ్ మాంఝీ నేతృత్వంలోని హిందూస్తానీ అవామ్ మోర్చా (హెచ్ఏఎం) ఎన్డీయేలో చేరింది. ఇకపై బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేతో సాగుతామని బుధవారం కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కలిసిన అనంతరం మాంఝీ ప్రకటించారు. నితీశ్ కుమార్ నాయకత్వంలోని సంకీర్ణానికి (జేడీయూ, ఆర్జేడీ, కాంగ్రెస్) గుడ్‌బై చెప్పిన రెండు రోజులకే ఈ పరిణామం చోటు చేసుకోవడం గమనార్హం. జితిన్ రామ్ కుమారుడు సంతోష్ సుమన్ ఇటీవలే మంత్రి పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. హెచ్ఏఎం.. బీజేపీకి సన్నిహితమవుతున్నదనే అనుమానంతో ఆ పార్టీని జేడీయూలో విలీనం చేయాలని నితీశ్‌కుమార్ కోరారు. పార్టీని విలీనం చేయడానికి విముఖంగా ఉన్న మాంఝీ జేడీయూ నేతృత్వంలోని సంకీర్ణంతో తెగదెంపులు చేసుకొని ఎన్డీయేలో చేరారు.

## చైనా ‘ఉగ్ర’ వైఖరిపై భారత్ ఆగ్రహం

**ఐక్యరాజ్య సమితి:** పాకిస్తానీ ఉగ్రవాది సాజిద్ మిర్‌ను ప్రపంచస్థాయి ఉగ్రవాదిగా ప్రకటించేందుకు ఐరాస వేదికగా చేసిన ప్రయత్నాన్ని చైనా అడ్డుకోవడాన్ని భారత్ తీవ్రంగా తప్పుబట్టింది. 26/11 ముంబై దాడుల కేసులో సూత్రధారుల్లో ఒకడిగా పేరొందిన లష్కరే తోయిబా ఉగ్రసంస్థ ముఖ్య నేత సాజిద్‌ను గ్లోబల్ టెర్రరిస్ట్‌గా ప్రకటించాలంటూ భారత్, అమెరికా చేసిన ప్రతిపాదనకు చైనా మోకాలడ్డుపెట్టడం తెల్సిందే. దీనిపై భారత్.. ఐరాస ఉగ్రవ్యతిరేక సమావేశం వేదికగా ఘాటుగా స్పందించింది. ఈ మేరకు మంగళవారం న్యూయార్క్‌లో భారత శాశ్వత మిషన్ సంయుక్త కార్యదర్శి ప్రకాశ్ గుప్తా మాట్లాడారు. ‘ భౌగోళిక స్వప్రయోజనాల కారణంగా ఉగ్రవాదులపై నిషేధం విధించటంలో మనం విఫలమయ్యామంటే అది మనలో నిజమైన రాజకీయ సంకల్పం లేదని స్పష్టం చేస్తోంది. ఉగ్రవాదం విసిరే సవాళ్లను ఎదుర్కోలేము. స్వీయ ఓటమిని చూపేలా మంచి ఉగ్రవాదులు, చెడు ఉగ్రవాదులు అంటూ వింత, వితండ వాదనలు ఆపండి. ఇలాంటి ద్వంద్వ వైఖరి విధానాలను రూపుమాపాలి. సహేతుకమైన కారణాలు చూపకుండానే ఇలాంటి ఆధారసహిత ప్రతిపాదనలను తుంగలో తొక్కడం దారుణం’ అని గుప్తా ఆగ్రహం వ్యక్తంచేశారు. సాజిద్ ఉగ్రవాది అని ఇప్పటికే పలు ప్రపంచ దేశాలు ప్రకటించాయి. సాజిద్ తలపై అమెరికా సైతం 50 లక్షల డాలర్ల రివార్డ్ ప్రకటించింది. గతంలో సాజిద్ ఆచూకీ దాచేందుకు పాక్ ప్రయత్నించింది. గత ఏడాది జూన్‌లో పాకిస్తాన్‌లోని ఉగ్ర వ్యతిరేక కోర్టు సాజిద్‌కు 15 ఏళ్ల జైలు శిక్ష విధించింది.

# మా అభివృద్ధి ప్రయాణమిదీ..

- సంస్కరణలతో ఆర్థిక ప్రగతి సాధిస్తున్నామన్న ప్రధాని మోదీ
- న్యూయార్క్‌లో ఆర్థిక, వ్యాపార రంగ నిపుణులు, ప్రముఖులతో సమావేశం

**న్యూయార్క్:** ప్రధాని మోదీ అమెరికా పర్యటనలో భాగంగా తొలిరోజు బుధవారం బిజీబిజీగా గడిపారు. అమెరికా ఆర్థిక రాజధాని న్యూయార్క్‌లో వివిధ రంగాల ప్రముఖులతో వరుసగా సమావేశమయ్యారు. ఆర్థిక, వ్యాపార రంగ నిపుణులు, ప్రముఖులు, నోబెల్ బహుమతి గ్రహీతలు, విద్యావేత్తలతో భేటీ అయ్యారు. అమెరికన్ ఆర్థికవేత్త, నోబెల్ బహుమతి గ్రహీత ప్రొఫెసర్ పాల్ రోమర్, పెట్టుబడిదారుడు, హెడ్జ్ ఫండ్ సహ వ్యవస్థాపకుడు, బ్రిడ్జివాటర్ అసోసియేట్స్ అధినేత, రచయిత రే డాలియోతో మోదీ భేటీ అయ్యారు. భారత్‌లో పెట్టుబడులు మరిన్ని పెట్టాలని డాలియోను ఆహ్వానించారు.

**అంతరిక్ష రంగంలో సంస్కరణలు**

ప్రముఖ ఆస్ట్రోఫిజిసిస్ట్, రచయిత నీల్ డిగ్రాసీ టైసన్‌ను మోదీ కలుసుకున్నారు. యువతలో శాస్త్రీయ దృక్పథం పెంచడంపై, అంతరిక్ష ప్రయోగాలపై చర్చించారు. భారత ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన నేషనల్ స్పేస్ పాలసీ గురించి మోదీ వివరించారు. స్పేస్ సెక్టార్‌ను సంస్కరిస్తున్నామని తెలిపారు. అమెరికన్ గణిత శాస్త్రవేత్త నాసిమ్ నికోలస్ తాలిబ్‌తో భేటీ అయ్యారు. భారత్‌లో స్టార్టప్‌ల వ్యవస్థ



అబండెన్స్ ఇన్ మిల్లెట్స్ పోస్టర్ వద్ద మోదీ

వేగంగా అభివృద్ధి చెందుతోందని మోదీ వివరించారు. అనంతరం గ్రామీ అవార్డు విజేత, ఇండియన్–అమెరికన్ గాయకురాలు ఫల్గునీ షాతో సమావేశమయ్యారు. సంగీతం ద్వారా భారతీయులను, అమెరికన్లను ఏకం చేస్తున్నారంటూ ఆమెపై ప్రశంసల వర్షం కురిపించారు. తృణధాన్యాల ఆవశ్యకతను వివరిస్తూ ఫల్గునీ షా పాడిన ‘అబండెన్స్ ఇన్ మిల్లెట్స్’ అనే పాటను మోదీ ప్రత్యేకం ప్రస్తావించారు.

**ప్రజారోగ్య సంరక్షణకు పెద్దపీట**

అమెరికాలో ఆరోగ్య సంరక్షణ రంగంలో విశిష్టమైన సేవలందిస్తున్న పలువురు ప్రముఖులను కలుసుకున్నారు. దేశంలో ప్రజారోగ్య సంరక్షణకు పెద్దపీట వేస్తున్నామని, ఇందుకోసం ఆధునిక టెక్నాలజీని వాడుకుంటున్నామని వెల్లడించారు. డాక్టర్ పీటర్ హోటెజ్, డాక్టర్ సునీల్ ఎ.డేవిడ్ తదితరులతో మోదీ మాట్లాడారు. దౌత్య రంగ పెద్దలు, అంతర్జాతీయ వ్యవహారాల నిపుణులు మైఖేల్ ఫ్రోమాన్, డేనియల్ రస్సెల్, గురు సోలీ తదితరులతో మోదీ సమావేశమై, భౌగోళిక రాజకీయాలపై సంప్రదింపులు జరిపారు. భారత్‌లో పర్యటించాలంటూ వారిని ఆహ్వానించారు. విద్యావేత్తలనూ మోదీ కలిశారు. చంద్రికా టాండన్, నీలి బెండపూడి, ప్రదీప్ ఖోస్లా,ప్రొఫెసర్ జగ్‌మోహన్ రాజుతో సమావేశమయ్యారు. మరోవైపు, న్యూయార్క్‌లో కార్యక్రమాలు ముగించుకుని మోదీ ఆ తర్వాత వాషింగ్టన్‌కు చేరుకున్నారు.

### భారత్‌లో టెస్లా కంపెనీ: మస్క్

భారత్‌కు భవ్యమైన భవిష్యత్తు ఉందని టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్ చెప్పారు. మోదీ మంగళవారం మస్క్‌తో సమావేశమయ్యారు. భారత్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని కోరారు. ఇంధనం నుంచి ఆధ్యాత్మిక వరకూ వివిధ అంశాలపై ఇరువురూ చర్చించుకున్నారు. సమావేశం అనంతరం ఎలాన్ మస్క్ మీడియాతో మాట్లాడారు. వచ్చే ఏడాది భారత్‌లో పర్యటిస్తానని చెప్పారు. భారత్‌లో టెస్లా కంపెనీని స్థాపిస్తామన్న నమ్మకం ఉందన్నారు. భారత్‌లో తాను పెట్టుబడులు పెట్టడం ఖాయమని స్పష్టం చేశారు. నరేంద్ర మోదీకి తాను అభిమానినని మస్క్ పేర్కొన్నారు. ఈ మేరకు వీడియో స్టేట్‌మెంట్ విడుదల చేశారు. మోదీతో చర్చలు అద్భుతంగా జరిగాయన్నారు.

## ఐరాసలో మోదీ గిన్నిస్ రికార్డ్ యోగా సెషన్



గిన్నిస్ రికార్డు నమోదైన సందర్భంగా ఆనందం వ్యక్తంచేస్తున్న మోదీ

**ఐక్యరాజ్యసమితి:** ఐక్యరాజ్యసమితిలో తొలిసారిగా అధికారికంగా, ప్రధాని మోదీ సారథ్యంలో సాగిన యోగా సెషన్ గిన్నిస్ ప్రపంచ రికార్డు సృష్టించింది. ఈ సందర్భంగా మోదీ మాట్లాడారు. ‘ యోగా అనేది కాపీరైట్లు, పేటెంట్, రాయల్టీ చెల్లింపుల వంటి మేధోపర హక్కులకు అతీతం. లింగభేదం లేకుండా అన్ని వయసుల వారికి ఆరోగ్య యోగ్యతతో సంబంధం లేకుండా అందరికీ అనువైనది యోగా. నిజంగా యోగా విశ్వజనీనం, విశ్వవ్యాప్తం ’ అని వ్యాఖ్యానించారు. తొలుత న్యూయార్క్‌లోని ఐరాస ప్రధాన కార్యాలయంలోని ఉత్తరవైపు ప్రాంగణంలోని గాంధీజీ ప్రతిమకు మోదీ నివాళులర్పించారు. తర్వాత పలు దేశాల ప్రతినిధులకు యోగా సెషన్‌లోకి స్వాగతం పలికారు. ‘ యోగా కోసం అన్ని దేశాల ప్రతినిధులు ఇలా ఒక్కటిగా కలసి రావడం అద్భుతంగా ఉంది. ఈ రోజు ఇక్కడ ప్రతీ జాతీయునికీ సమ గౌరవం దక్కుతోంది’ అని అన్నారు. ఐరాస సర్వప్రతినిధి సభ 77వ సెషన్ అధ్యక్షుడు కసాబా కొరిసి, న్యూయార్క్ మేయర్ ఎరిక్, హాలీవుడ్ నటుడు రిచర్డ్ గెరే, అయ్యంగార్ యోగాతో చిరపరిచితమైన డియిడ్రా డీమెన్స్, ప్రముఖ అమెరికా గాయని మేరీ మిల్బెన్‌సహా పలు ప్రపంచ దేశాల ప్రతినిధులు యోగా చేశారు. ఇలా ఒకేసారి ఒకేచోట అత్యంత ఎక్కువ దేశాలకు చెందిన వ్యక్తులు పాల్గొన్న యోగా సెషన్‌గా ఇది గిన్నిస్ ప్రపంచ రికార్డును నమోదుచేసుకుంది. సెషన్‌లో ఐరాస ఉన్నతాధికారులు, వివిధ దేశాల రాయబారులు, దౌత్యవేత్తలు, ఐరాస సభ్యదేశాల ప్రతినిధులు, ప్రపంచ స్థాయి ప్రముఖులు, భిన్న సంస్థల వ్యక్తులు పాల్గొన్నారు. ‘భిన్న పోకడలతో విచ్ఛిన్నమవుతున్న ప్రపంచం నేడు యోగా లాంటి అత్యంత అమూల్యమైన విధానం నుంచి ఎంతో నేర్చుకోవాలి. ప్రయోజనం పొందాలి’ అని ఐరాస ప్రధాన కార్యదర్శి గుటెరస్ అన్నారు.

> ‘మన మధ్య ఉన్న అభిప్రాయభేదాలు, అంతరాలను, వ్యతిరేక భావాలను యోగా తో చెరిపేసుకుందాం. ఏక్ భారత్ శ్రేష్ఠ్ భారత్ స్ఫూర్తిని ఇంకోసారి ప్రపంచానికి చాటుదాం. భారత్ ఇచ్చిన పిలుపుతో 180కిపైగా దేశాల ప్రజలు ఇలా ఒకే తాటి మీదకు రావడం చరిత్రాత్మకం, అపూర్వం’
>
> \- మోదీ



హోరు వానలో బుధవారం వాషింగ్టన్ డీసీకి చేరుకున్న ప్రధాని మోదీకి స్వాగతం పలుకుతున్న దృశ్యం

### మణిపూర్‌లో తక్షణమే శాంతి నెలకొనాలి

**కాంగ్రెస్ నేత సోనియా గాంధీ ఆకాంక్ష**



**న్యూఢిల్లీ:** మణిపూర్‌లో కొనసాగుతున్న హింసాకాండపై కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. హింసాత్మక సంఘటనలో అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోవడం, వేలాది మంది నిరాశ్రయులు కావడం చాలా బాధాకరమని పేర్కొన్నారు. ఇన్నాళ్లూ అన్నదమ్ముల్లా కలిసి ఉన్న ప్రజలే నేడు శత్రువులుగా మారిపోవడం చాలా విచారకరమని అన్నారు. భిన్న వర్గాల ప్రజలను ఆప్యాయంగా అక్కున చేర్చుకున్న ఘన చరిత్ర మణిపూర్‌కు ఉందన్నారు. ఈ మేరకు బుధవారం ఒక వీడియో సందేశం విడుదల చేశారు. రాష్ట్రంలో అందరూ సహనం వహించాలని విజ్ఞప్తి చేశారు. హింసకు తక్షణమే తెరపడాలని, శాంతియుత పరిస్థితులు నెలకొనాలని ఆకాంక్షించారు. మృతులకు సంతాపం ప్రకటించారు. ఆప్తులను కోల్పోయినవారికి సానుభూతి తెలిపారు. మణిపూర్ హింసాకాండలో ఇప్పటిదాకా 100 మందికిపైగా మరణించినట్లు సమాచారం. వేలాది మంది సొంత ఊళ్లను వదలేసి సురక్షిత ప్రాంతాలకు తరలిపోయారు.

### తీవ్రవాదం విభజిస్తుంది.. పర్యాటకం ఏకం చేస్తుంది

**జీ20 పర్యాటక మంత్రుల సదస్సులో ప్రధాని మోదీ**

**సాక్షి, న్యూఢిల్లీ:** తీవ్రవాదం విభజిస్తే పర్యాటకం ఏకం చేస్తుందని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. అన్ని వర్గాల ప్రజలనూ ఏకం చేసి సామరస్య సమాజాన్ని సృష్టించే శక్తి పర్యాటక రంగానికి ఉందని ఉద్బోధించారు. ‘ఒక కుటుంబం, ఒక భూమి, ఒక భవిష్యత్తు’ భావన ప్రపంచ పర్యాటకానికి వర్తిస్తుందన్నారు. గోవాలో జరిగిన జీ20 పర్యాటక మంత్రుల సమావేశాన్ని ఉద్దేశించి ప్రధాని మోదీ బుధవారం వీడియో సందేశంలో ప్రసంగించారు. అందులో ఆయన ఏమన్నారంటే..

**‘అతిథి దేవోభవ’పైనే పర్యాటకం ఆధారం**

‘‘పర్యాటక రంగం పట్ల భారతదేశ వైఖరి ‘అతిథి దేవోభవ’ భావన మీద ఆధారపడింది. పర్యాటకమంటే కొత్త ప్రదేశాలు చూడటం కాదు. ఆ పరిసరాలలతో లీనమవడం. పర్యాటక రంగంలో అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాలు కల్పిస్తూ సుసంపన్న దేశ వారసత్వ సంపదను కాపాడటం భారత పర్యాటక రంగానికి కీలకం. గత తొమ్మిదేళ్లలో దేశంలోని మొత్తం పర్యాటక పర్యావరణాన్ని అభివృద్ధి చేయటంపై దృష్టి పెట్టాం. ఈరంగంలో రవాణా మౌలిక సదుపాయాలు, ఆతిథ్యం, నైపుణ్యాభివృద్ధి, చివరికి వీసా వ్యవస్థ దాకా ఎన్నో సంస్కరణలు తెచ్చాం. ఉపాధి కల్పన, సామాజిక సమ్మిళిత, ఆర్థికాభివృద్ధిలో ఆతిథ్య రంగానికి అవకాశం ఎక్కువ’’ అని మోదీ అన్నారు.

**అనుసంధానంతో సానుకూల ఫలితాలు: కిషన్‌రెడ్డి**

పర్యాటక రంగం అత్యంత వేగంగా ఎదుగుతూ ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థలో కీలకపాత్ర పోషిస్తోందని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ‘ప్రపంచ పర్యాటక రంగం ద్వారా పెద్దసంఖ్యలో ఉపాధి కల్పనతోపాటుగా సామాజిక–ఆర్థిక ప్రగతి సాధ్యం. వాణిజ్యం, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల కల్పన, సామాజిక సమగ్రతకు పర్యాటక రంగం ఎంతగానో తోడ్పడుతోంది. ఈ పరిస్థితుల్లో యువత, మహిళలను పర్యాటక రంగంతో అనుసంధానం చేయడం ద్వారా మరింత సానుకూల ఫలితాలు సాధించవచ్చు’ అని మంత్రి అభిప్రాయపడ్డారు.

# మహా ఉత్కంఠ

**అట్లాంటిక్ మహా సముద్రంలో ఇంకా దొరకని టైటాన్ జలాంతర్గామి ఆచూకీ**

**సముద్ర అంతర్భాగంలో శబ్దాలను గుర్తించిన కెనడా నిఘా విమానం**



టైటాన్ లోతులోకి వెళ్తున్నప్పటి దృశ్యం



టైటాన్‌లో చిక్కుకున్న ప్రముఖులు(ఫైల్)

**బోస్టన్:** ఉత్తర అట్లాంటిక్ మహా సముద్రంలో టైటానిక్ ఓడ సందర్శన కోసం వెళ్లి గల్లంతయిన జలాంతర్గామి ‘టైటాన్’ జాడ ఇంకా తెలియరాలేదు. టైటాన్‌లోని ఐదుగురు సందర్శకుల పరిస్థితి ఏమిటన్న దానిపై ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఉత్కంఠ నెలకొంది. వారి ఆచూకీ గుర్తించేందుకు అమెరికా కోస్ట్ గార్డ్ సిబ్బంది తీవ్రంగా శ్రమిస్తున్నారు. బుధవారం ఉదయం నుంచి తమ కార్యాచరణను ముమ్మరం చేశారు. ఇదిలా ఉండగా, సముద్ర అంతర్భాగం నుంచి శబ్దాలు వెలువడుతున్నట్లు కెనడా సైనిక నిఘా విమానం కనిపెట్టడం ఆశలు రేకెత్తిస్తోంది. టైటాన్ గల్లంతయినట్లు భావిస్తున్న ప్రాంతం నుంచి ప్రతి 30 నిమిషాలకోసారి బిగ్గరగా శబ్దాలు వెలువడుతున్నట్లు సమాచారం. అయితే, ఈ శబ్దాలు టైటాన్‌కు సంబంధించినవేనా? అనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు. టైటాన్‌లో కొంత ప్రాణవాయువు ఇంకా మిగిలే ఉందని, సందర్శకుల ప్రాణాలకు ఇప్పటికిప్పుడు అపాయం వాటిల్లకపోవచ్చన్న అంచనాలు వెలువడుతున్నాయి.

**గురువారం ఉదయానికల్లా ఆక్సిజన్ మాయం!**

టైటాన్ ఆచూకీ కోసం జాన్ కాబోట్, స్కాండీ విన్‌ల్యాండ్, అట్లాంటిక్ మెర్లిన్ అనే మూడు పడవలను అమెరికా కోస్ట్ గార్డ్ సిబ్బంది రంగంలోకి దించారు. టైటాన్ జలాంతర్గామి ప్రస్తుతం సముద్ర ఉపరితలం నుంచి 12,500 అడుగుల(3,800 మీటర్లు) లోతున ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. ఇది సామాన్యమైన లోతు కాదు. అక్కడిదాకా సురక్షితంగా చేరుకోవడం కష్టమైన పని అని చెబుతున్నారు. అండర్‌వాటర్ రోబోను పంపించినట్లు తెలుస్తోంది. సహాయక చర్యల కోసం అమెరికా సైన్యానికి చెందిన మూడు సి–17 రవాణా విమానాలను పంపించినట్లు యూఎస్ ఎయిర్ మొబిలిటీ కమాండ్ అధికార ప్రతినిధి చెప్పారు. ఒక పెట్రోలింగ్ విమానం, రెండు ఓడలతో గాలింపు చర్యలు చేపడుతున్నామని కెనడా సైన్యం ప్రకటించింది. గురువారం ఉదయానికల్లా టైటాన్‌లో మొత్తం ఆక్సిజన్ ఖర్చయిపోతుంది. అప్పటిలోగా దాని జాడ తెలియకపోతే అందులోని సందర్శకులు ప్రాణాలపై ఆశలు వదులుకోవాల్సిందేనని నిపుణులు పేర్కొంటున్నారు. ఆదివారం ఉదయం 6 గంటలకు ఈ జలాంతర్గామి టైటానిక్ దిశగా తన ప్రయాణం ప్రారంభించింది. సరిగ్గా నాలుగు రోజులకు సరిపడా ఆక్సిజన్ మాత్రమే అందులో ఉంది. టైటాన్‌లో రెండు రకాల కమ్యూనికేషన్ వ్యవస్థలు ఉన్నాయి. నీటిలోకి వెళ్లిన 1.45 గంటల లోపే అవి పనిచేయడం ఆగిపోయింది.

### క్షేమంగా తిరిగి రావాలని ప్రార్థనలు

టైటాన్ గల్లంతు కావడం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఐదుగురు సందర్శకులు క్షేమంగా తిరిగిరావాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు వివిధ దేశాల అధినేతలు పేర్కొన్నారు. సందర్శకుల క్షేమాన్ని కోరుతూ నెటిజన్లు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. టైటాన్‌లో ఓషియన్‌గేట్ కార్పొరేషన్ వ్యవస్థాపకుడు స్టాక్‌టన్ రష్, బ్రిటిష్ వ్యాపారవేత్త హమిష్ హర్డింగ్, పాకిస్తాన్‌కు చెందిన తండ్రీకొడుకులు షహ జాదా, సులేమాన్ దావూద్, ఫ్రెంచ్ నావికాదళం మాజీ అధికారి పాల్–హెన్రీ నార్జియోలెట్ ఉన్నారు. వీరంతా 1912లో అట్లాంటిక్ సముద్రంలో మునిగిపోయిన టైటానిక్ ఓడ శిథిలాలను సందర్శించడానికి టైటాన్ జలాంతర్గామిలో వెళ్లారు. ఆదివారం రాత్రి కెనడా తీరానికి 700 కిలోమీటర్ల దూరంలో అట్లాంటిక్ సముద్రంలో టైటాన్ గల్లంతయ్యింది.

## నగరంలో ఇంటిగ్రేటెడ్ పార్కింగ్

కొరుక్కుపేట: ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం ద్వారా నాలుగు ప్రదేశాలలో సమగ్ర ఇంటిగ్రేటెడ్ పార్కింగ్, వాణిజ్య అభివృద్ధిని ప్రారంభించాలని చెన్నై కార్పొరేషన్ యోచిస్తోంది. ఈ మేరకు చెన్నై కార్పొరేషన్ సమాచారాన్ని వెల్లడించింది. మొదటి దశలో నాలుగు చోట్ల ఏర్పాటు చేసేందుకు కార్పొరేషన్ సన్నాహాలు చేస్తోంది. ఆర్‌ఏ పురం కమర్షియల్ కాంప్లెక్స్, కార్పొరేషన్ కోడంబాక్కం జోనల్ కార్యాలయం, అల్వార్‌పేటలోని సీపీ రామస్వామి రోడ్డు, టీ.నగర్‌లోని డాక్టర్ నాయర్ రోడ్డులో పార్కింగ్ స్థలాలు, వాణిజ్య భవనాలు నిర్మించాలని నిర్ణయించారు. ఇది 40వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో విస్తరించి ఉంది. అడ్వైజరీ బోర్డు అందించే నివేదిక ఆధారంగా కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో దీనిపై చర్చించనున్నారు. దీనిపై పూర్తి సంప్రదింపులు జరిపి ఆ తరువాత ప్రాజెక్టును అమలు చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందని కార్పొరేషన్ అధికారులు భావిస్తున్నారు.

## న్యూస్‌రీల్

### నమ్మకంతో బిహార్ పయనం

- కేడర్‌కు సీఎం స్టాలిన్ లేఖ



సాక్షి, చెన్నై: బీజేపీ పతనం లక్ష్యంగా ప్రజాస్వామ్య, లౌకికవాదులు ఒకే వేదికపైకి వస్తారన్న నమ్మకంతో బిహార్‌కు వెళ్లనున్నట్టు సీఎం స్టాలిన్ తెలిపారు. ఈ మేరకు బుధవారం డీఎంకే కేడర్‌కు ఆయన బిహార్ పర్యటన గురించి లేఖ రాశారు. ముందుగా తిరువారూర్‌లో జరిగిన కలైంజ్ఞర్ కోట్టం ప్రారంభోత్సవం విజయవంతం చేసి నందుకు ప్రతిఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే బిహార్, పాట్నా వేదికగా ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నితీష్ కుమార్ నేతృత్వంలో ఈనెల 23న బ్రహ్మాండ సమావేశం జరగబోతోందని గుర్తు చేశారు. 2024 లోక్‌సభ ఎన్నికల ద్వారా బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించడం లక్ష్యంగా లౌకిక వాద పార్టీలు, ప్రజా స్వామ్యవాదులు ఐక్యతతో ఒకే వేదికపైకి సమావేశం ద్వారా వస్తారన్న నమ్మకం ఉందన్నారు. అదే నమ్మకంతో తానూ సమావేశానికి స్వయంగా హాజరు కానున్నట్టు తెలిపారు. గురువారం చెన్నై నుంచి బిహార్‌కు పయనం కానున్నానని చెప్పారు. బీహార్ సీఎం నితిన్‌కుమార్ చేపట్టిన ఈ ప్రయత్నానికి కలైంజ్ఞర్ కరుణానిధి ప్రతినిధిగా తాను హాజరవుతున్నానని తెలిపారు. ఈ భేటీ, ఐక్యత భారత దేశాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు ఒక గొప్పవేదికగా అవతరిస్తుందని, ఇది 2024 ఎన్నికలలో మంచి ఫలితాన్ని ఇస్తుందన్న నమ్మకం తనకు ఉందన్నారు.

### నేడు విద్యుత్ ఉద్యోగుల సమ్మె

- విధులకు రాకుంటే జీతం కట్

సాక్షి, చెన్నై: తమ డిమాండ్ల పరిష్కారం కోసం గురువారం రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ కార్మికులు ఒక రోజు సమ్మెకు నిర్ణయించారు. విధులకు రాకుంటే జీతంలో కోత తప్పదని కార్మికులకు విద్యుత్‌శాఖ హెచ్చరించింది. జీతాల పెంపు, పదోన్నతులు, ఖాళీల భర్తీ డిమాండ్ల పరిష్కారం కోసం విద్యుత్ కార్మికులు ఒక రోజు సమ్మెకు నిర్ణయించారు. ఇందుకు పలు కార్మిక సంఘాలు మద్దతు ప్రకటించాయి. గురువారం విధులను బహిష్కరించి నిరసనలతో తమ డిమాండ్‌ను విద్యుత్ బోర్డు, విద్యుత్‌శాఖ దృష్టికి తీసుకెళ్లే విధంగా కార్మికులు నిర్ణయించారు. అయితే, కార్మికుల సమ్మె కారణంగా ప్రజలు ఇబ్బందులకు గురయ్యే పరిస్థితి ఉందని అధికారులు గుర్తించారు. ప్రజలకు ఇబ్బంది కల్గకుండా, విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా ముందు జాగ్రత్తలపై అధికారులు దృష్టిపెట్టారు. అదేసమయంలో విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయడం వంటి చర్యలకు కార్మికులు పాల్పడే అవకాశాలు ఉన్నట్టు సమాచారం అందింది. దీంతో కార్మికులకు తీవ్ర హెచ్చరికలు చేస్తూ బుధవారం విద్యుత్ అధికారులు ప్రకటన విడుదల చేశారు. విధులకు హాజరు కాని వారికి జీతంలో కోత తప్పదని హెచ్చరించారు. గురువారం ఉదయం 10.45 గంటలలోపు విధులకు రాని కార్మికుల వివరాలను డివిజన్ల వారీగా విద్యుత్ శాఖకు పంపించాలని ఆదేశాలు జారీ అయ్యాయి.

### కరూర్ పోలీసులకు హైకోర్టు నోటీసులు

- ఐటీ అధికారులపై దాడి కేసు

సాక్షి, చెన్నై: కరూర్‌లో ఐటీ అధికారులపై దాడి కేసులో పోలీసులకు మదురై ధర్మాసనం బుధవారం నోటీసులు జారీ చేసింది. వివరణ ఇవ్వాలని ఆదేశించింది. గత నెల 25న ఐటీ అధికారులు కరూర్‌లో మంత్రి సెందిల్ బాలాజీని టార్గెట్ చేసి పలు చోట్ల దాడులు చేసిన విషయం తెలిసిందే. ఇందులో అనేక చోట్ల వివాదాలు చోటుచేసుకున్నాయి. ఐటీ అధికారులపై డీఎంకే వర్గాలు, మంత్రి మద్దతుదారులు తిరగబడడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. చివరకు ఐటీ అధికారులు భద్రత కోసం ఎస్పీని ఆశ్రయించారు. ఐటీ వర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పలువురు డీఎంకే నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. ఐటీ సోదాలకు వచ్చే సమయంలో తమకు అధికారులు సమాచారం ఇవ్వలేని కరూర్ జిల్లా పోలీసు యంత్రాంగం స్పష్టం చేసింది. ప్రస్తుతం ఈ వ్యవహారం మద్రాసు హైకోర్టు మదురై ధర్మాసనానికి చేరింది. అరెస్టయిన డీఎంకే నాయకులు బెయిల్‌పై బయటకు రావడం, మరికొందరు ముందస్తు బెయిల్ పొంది ఉండడం వంటి అంశాలు మదురై ధర్మాసనంకు చేరాయి. బుధవారం పిటిషన్ విచారణ సమయంలో ఈ వ్యవహారంపై సమగ్ర వివరణ ఇవ్వాలని కరూర్ నగర పోలీసు అధికారులతోపాటు 19 మందికి న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. అదే సమయంలో ఈ విచారణ సమయంలో ఐటీ తరఫున కోర్టుకు పలు వివరాలు తెలియజేశారు. కరూర్‌లో జరిగిన సోదాలలో రూ.కోటి మేరకు నగదు, పలు ఆస్తుల రికార్డులు వంటివి చిక్కినట్టు వివరించారు. ఈ వాదన అనంతరం సమగ్ర వివరణ జూలై 10వ తేదీలోపు దాఖలు చేయాలని పేర్కొంటూ, తదుపరి విచారణను అదే రోజుకు న్యాయమూర్తులు ఆదేశించారు.

# నమో యోగా!

- వాడవాడల్లో 'యోగా' డే
- చిదంబరంలో గవర్నర్ రవి యోగా
- పుదుచ్చేరిలో లెఫ్టినెంట్ గవర్నర్ తమిళిసై



ధ్యానం చేస్తున్న మహర్షి విద్యా మందిర్ విద్యార్థులు

సముద్రంలో గస్తీ నౌకలో కోస్టుగార్డుల యోగాసనం



సేలంలో యోగా చేస్తున్న మహిళలు





శివతాండవంతో యోగా



యోగా చేస్తున్న ఎల్జీ తమిళిసై సౌందరరాజన్



చిదంబరంలో విద్యార్థుల యోగాసనాలు



యోగా కార్యక్రమంలో బీజేపీ నాయకులు

సాక్షి, చెన్నై: అంతర్జాతీయ యోగా దినోత్సవం కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరితో పాటు తమిళనాట బుధవారం వాడవాడల్లో జరిగింది. చిన్న, పెద్ద, స్త్రీ, పురుషులు అన్న భేదం లేకుండా అందరూ యోగాసనాలు నిర్వహించారు. చెన్నైలో ఈషా ఫౌండేషన్ నేతృత్వంలో భారీ యోగా కార్యక్రమం జరిగింది. జూన్ 21వ తేదీని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా గతంలో ఐక్యరాజ్యసమితి ప్రకటించిన విషయం తెలిసిందే. భారత ప్రాచీన కళకు లభించిన ఈ గుర్తింపును అధికారిక వేడుక తరహాలో ప్రతిఏటా కేంద్రం నిర్వహిస్తున్నది. 9వ సంవత్సరంగా బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా యోగా డే వాడవాడల్లో ఘనంగా జరిగాయి. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, విద్యాలయాలు, ఆధ్యాత్మిక కేంద్రాలు, ఉద్యాన వనాలు, పార్కులు వంటి ప్రాంతాల్లో యోగా కార్యక్రమాలు జరిగాయి.

**వాడ వాడల్లో..**

చెన్నైతో పాటు తిరుచ్చి, మదురై, తిరునల్వేలి, సేలం, తూత్తుకుడి, తంజావూరు, నాగపట్నం నగరాల్లో యోగా డే వేడుకలు ఘనంగా జరిగాయి. చిన్నపాటి స్కూళ్లలోనూ విద్యార్థులు తమకు తెలిసిన యోగాను పలువురికి నేర్పించే ప్రయత్నం చేశారు. కోయంబత్తూరు, తిరుచ్చి, ఈరోడ్, దిండుగల్‌లోని క్రీడా మైదానాల్లో యోగా డే జరిగింది. యోగా గురువులు ఆసనాలను ప్రదర్శించి హాజరైన వారి చేత చేయించారు. చెన్నైలోని ఆర్మీ క్యాంప్ కార్యాలయం, ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ, కోస్టు గార్డు కార్యాలయాలు, శిక్షణ కేంద్రాల్లో అధికారులు, సిబ్బంది అన్న భేదం లేకుండా అందరూ కలిసి యోగా శిక్షణను అభ్యసించారు. కాంచీపురం, వేలూరు, మదురై, తెన్‌కాశి, తూత్తుకుడి, రాజపాళయం, నాగర్ కోవిల్ ప్రాంతాల్లో ఏకకాలంలో విద్యార్థులు, యువత, పెద్దలు యోగాసనాలు చేశారు. మహాబలిపురం సముద్రతీరంలోని సీసోర్ ఆలయం వద్ద యోగా కార్యక్రమం జరిగింది. కోయంబత్తూరు ఈషా యోగా కేంద్రంలోని ఆదియోగి విగ్రహం వద్ద బ్రహ్మాండ యోగాసన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు.

**విద్యార్థులతో ధ్యానం..**

పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ మూమెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బుధవారం ఉదయం చెన్నై తిరువొత్తియూర్‌లోని మహర్షి విద్యా మందిర్‌లో 250 మంది విద్యార్థులతో ధ్యానం చేయించారు. చెన్నై పిరమిడ్ స్పిరిచ్యువల్ ట్రస్ట్ సెక్రటరీ అమరా చంద్రశేఖర్, పీఎంసీ చానల్ మేనేజింగ్ డైరెక్టర్ జయకుమార్ నేతృత్వంలో కార్యక్రమం జరిగింది. ధ్యాన గురువులు ప్రశాంతి, బిందు కలిసి విద్యార్థులకు ధ్యానం, ధ్యానం వలన కలిగే ప్రయోజనాలు, శారీరక మానసిక ఆరోగ్యం, మేధో సంపత్తి వంటి అంశాలపై అవగాహన కల్పించారు.

**యోగా డేలో గవర్నర్లు..**

తూత్తుకుడి ముత్తునగర్ సముద్ర తీరంలో నౌకాదళం నేతృత్వంలో బ్రహ్మాండ కార్యక్రమం జరిగింది. రామేశ్వరంలో సముద్ర తీర భద్రతా విభాగం కోస్టుగార్డు వర్గాల నేతృత్వంలో యోగా డే నిర్వహించారు. చిదంబరం అన్నామలై వర్సిటీలో జరిగిన కార్యక్రమానికి తన సతీమణితో కలిసి గవర్నర్ ఆర్‌ఎన్ రవి హాజరయ్యారు. తిరుక్కురల్‌లోని రచనలకు అనుగుణంగా ఓ విద్యార్థిని, శివతాండవంతో మరో విద్యార్థిని చేసిన యోగాసనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈసందర్భంగా యోగా విశిష్టతను గవర్నర్ ఆర్‌ఎన్ రవి విద్యార్థులకు వివరించారు. పుదుచ్చేరి సముద్ర తీరంలోని లైట్ హౌస్ వద్ద జరిగిన వేడుకకు లెఫ్టినెంట్ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ హాజరయ్యారు. అధికారులు, విద్యార్థులతో కలిసి ఆమె యోగాసనాలు చేశారు. కోయంబత్తూరు పెరియకుళం పరిధిలోని పార్కులో బీజేపీ రాష్ట్ర కో ఇన్‌చార్జ్ పొంగులేటి సుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే వానతీ శ్రీనివాసన్ యోగా కార్యక్రమానికి హాజరయ్యారు.



యోగా డేలో గవర్నర్ ఆర్ఎన్ రవి

## 500 టాస్మాక్ దుకాణాల మూత

- మంత్రి ముత్తుస్వామి తొలి సంతకం



సాక్షి, చెన్నై: రాష్ట్రంలో 500 టాస్మాక్ దుకాణాలను మూసివేతకు ప్రభుత్వం నిర్ణయించింది. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ మంత్రి హోదాలో ముత్తుస్వామి తొలిసంతకం చేశారు. రాష్ట్రంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ పరిధిలోని మార్కెటింగ్ కార్పొరేషన్ నేతృత్వంలో రాష్ట్రంలో మద్యం విక్రయాల్లో ప్రభుత్వం నిమగ్నమైన విషయం తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా 5,329 దుకాణాలు ఉన్నాయి. ఏడాదికి మద్యం విక్రయాలు రూ.30 వేల కోట్లకు పైగా జరుగుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల సమయంలో దశల వారీగా మద్యం దుకాణాల మూత, మద్యనిషేధం నినాదాన్ని డీఎంకే తెరపైకి తెచ్చింది. అధికారంలోకి వచ్చినానంతరం మేనిఫెస్టోలో పేర్కొన్న ఆ నినాదాన్ని పక్కన పెట్టారు. రాష్ట్రంలో మద్యం దుకాణాల ద్వారానే కాకుండా, బెల్ట్ షాపుల రూపంలో విచ్చల విడిగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. అదే సమయంలో గత నెల కల్తీ మద్యం, కల్తీ సారా రూపంలో చోటుచేసుకున్న మరణాలు, టాస్మాక్ బార్‌లలో మద్యం సేవించిన వారి మృతి వంటి ఘటనలతో రాష్ట్ర ప్రభుత్వంపై ఆగ్రహాన్ని ప్రదర్శించే వారు పెరిగారు. మద్యం రూపంలో ఆదాయాన్ని డీఎంకే పాలకులు అర్జిస్తున్నట్టు విమర్శలు పెరిగాయి. ఇక, ఆ శాఖను నిర్వహిస్తూ వచ్చిన మంత్రి సెంథిల్ బాలాజీని ఈడీ అరెస్టు చేయడం వంటి పరిణామాలు చక చక చోటుచేసుకోవడంతో రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా విమర్శనాస్త్రాలను సంధించే పనిలో ప్రతి పక్షాలు నిమగ్నమయ్యాయి. ఈ సమయంలో సెంథిల్ బాలాజీ చేతిలో ఉన్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖను గృహ నిర్మాణ మంత్రి ముత్తుస్వామికి అప్పగించడంతో టాస్మాక్ దుకాణాల మూత కసరత్తుపై ఆయన దృష్టి పెట్టారు.

**దుకాణాల మూతకు ఉత్తర్వులు..**

రాష్ట్రంలో ఆదాయం తక్కువగా ఉన్న, ఆలయాలు, బడి, జన సంచార ప్రాంతాలలో ఉన్న, ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు, కోర్టు వివాదాలు ఉన్న దుకాణాలను గుర్తించి తాజాగా మూతకు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ శాఖ బాధ్యతలు స్వీకరించినానంతరం ముత్తు స్వామి తొలిసంతకంగా దుకాణాల మూత నిర్ణయం తీసుకున్నారు. ఈ ఉత్తర్వులను ఆ శాఖ కార్యదర్శి విశాఖన్ బుధవారం జారీ చేశారు. మండలాల వారీగా గురువారం నుంచి మూతపడనున్న దుకాణాల నంబర్లను సైతం ఈ ఉత్తర్వులలో వివరించారు. ఇందులో చెన్నై, కాంచీపురం, తిరువళ్లూరు డివిజన్‌లో 138 దుకాణాలు ఉన్నాయి. కోయంబత్తూరు, తిరుప్పూర్, ఈరోడ్, నీలగిరి, కరూర్ డివిజన్‌లో 78 చొప్పున దుకాణాలు ఉన్నాయి. ఇతర డివిజన్లలో మిగిలిన దుకాణాలు ఉన్నాయి. వారం రోజుల్లోపు ఆయా దుకాణాలలో ఉన్న స్టాక్ అంతా సమీపంలోని దుకాణాలకు తరలించేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ 500 దుకాణాలలో 1,500 మంది సిబ్బంది పనిచేస్తుండగా, వీరిని సిబ్బంది సంఖ్య తక్కువగా ఉన్న దుకాణాలకు బదిలీ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. తాజాగా ఐదు వందల దుకాణా ల మూతతో రాష్ట్రంలో మద్యం దుకాణాల సంఖ్య 4, 829కు తగ్గింది. తాజా ఉత్తర్వుల నేపథ్యంలో మిగిలిన దుకాణాలు దశల వారీగా మూసివేయడానికి చర్యలు విస్తృతం చేయాలని, రాష్ట్రంలో సంపూర్ణ మద్యనిషేధం అమలు చేయాలన్న నినాదం మళ్లీ తెరపైకి వచ్చింది.

## ఈడీకి చుక్కెదురు!

- మధ్యంతర ఉత్తర్వులకు సుప్రీంకోర్టు నిరాకరణ
- హైకోర్టును ఆశ్రయించాలని సూచన
- సెంథిల్ బాలాజీకి ముగిసిన శస్త్ర చికిత్స
- ఐసీయూలో వైద్యుల ప్రత్యేక పర్యవేక్షణ



సాక్షి, చెన్నై: సుప్రీంకోర్టులో బుధవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వర్గాలకు చుక్కెదురైంది. సెంథిల్ బాలాజీ వ్యవహారంలో మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడానికి సుప్రీంకోర్టు బెంచ్ నిరాకరించింది. ఇదిలాఉండగా, చెన్నై కావేరి ఆస్పత్రిలో మంత్రి సెంథిల్ బాలాజీకి బైపాస్ సర్జరీ విజయవంతంగా ముగిసింది. వైద్యుల పర్యవేక్షణలో ఐసీయూలో ఆయన ఉన్నారు. క్యాష్ ఫర్ జాబ్స్ కేసులో మంత్రి సెంథిల్‌బాలాజి అరెస్టయిన విషయం తెలిసిందే. గుండెపోటుతో ఆయన ఆస్పత్రిలో చేరడంతో ఈడీ వర్గాలకు ముచ్చెమటలు తప్పలేదు. ఎలాగైనా తమ కస్టడీకి తీసుకుని ఆయన్ను విచారించేందుకు విశ్వ ప్రయత్నాలు మొదలెట్టారు. సెంథిల్‌ను కావేరి ఆస్పత్రికి తరలించి చికిత్స అందించేందుకు హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ ఈడీ దాఖలు చేసిన అప్పీలు పిటిషన్ బుధవారం సుప్రీంకోర్టులో విచారణకు వచ్చింది. విచారణ నుంచి తప్పించుకునేందుకే సెంథిల్ బాలాజి ఆస్పత్రిలో చేరినట్టుందని సుప్రీంకోర్టుకు ఈడీ న్యాయవాదులు వివరించారు. ఆయనకు జరుగుతున్న చికిత్స ఓ ప్రశ్నార్థకంగా పేర్కొన్నారు. దీంతో సెంథిల్ బాలాజి తరఫు న్యాయవాదులు తమ వాదనలో ఈడీపై ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. నాలుగు చోట్ల గుండెకు వెళ్లే నాళాల్లో బ్లాక్‌లు ఉన్నట్టు వైద్యులు తేల్చినట్టు వివరించారు. దీనిని కూడా ఈడీ వక్రీకరించే ప్రయత్నం చేయడం, అనుమానాలు వ్యక్తం చేయడం శోచనీయమన్నారు. ఆస్పత్రిలో చికిత్సలో వ్యక్తి ఉంటే, అప్పీలుకు ఈడీ వెళ్లడం వెనుక ఆంతర్యమేమిటో అని ప్రశ్నించారు. వాదనల అనంతరం సుప్రీంకోర్టు ఈడీ తీరుపై అసహనం వ్యక్తం చేస్తూ, ఈ వ్యవహారంలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని స్పష్టం చేసింది. అలాగే, మద్రాసు హైకోర్టును ఆశ్రయించాలని సూచించింది. దీంతో ఈడీకి చుక్కెదురైనట్టైంది.

**విజయవంతంగా శస్త్ర చికిత్స..**

బుధవారం ఉదయం కావేరి ఆస్పత్రిలో డాక్టర్ ఏఆర్ రఘురాం బృందం ఐదు గంటల పాటు శ్రమించి సెంథిల్ బాలాజీకి బైపాస్ సర్జరీ విజయవంతం చేశారు. ఆయన ఐసీయూలో వైద్యుల పర్యవేక్షణలో ఉన్నట్టు ఆస్పత్రి వర్గాలు బులిటెన్ విడుదల చేశాయి. నాళాలలో బ్లాక్‌లు అన్నీ బైపాస్ సర్జరీతో తొలగించామని, ఆయన పూర్తిగా వైద్యుల పర్యవేక్షణలో ఉన్నట్టు వివరించారు. కనీసం పది రోజుల పాటు వైద్యుల పర్యవేక్షణలో సెంథిల్ ఉండాల్సిన అవసరం ఉన్నట్టు సమాచారం.

## పళని సేన నిరసన హోరు



సాక్షి, చెన్నై: అన్నాడీఎంకే నేతృత్వంలో బుధవారం రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు జరిగాయి. మంత్రి పదవి నుంచి సెంథిల్ బాలాజీని తప్పించాలని నాయకులు నినదించారు. ఈడీ అరెస్టు తర్వాత పరిణామాలతో సెంథిల్ బాలాజి వద్ద ఉన్న శాఖలను మరో ఇద్దరికి అప్పగించిన విషయం తెలిసిందే. ఆయన ప్రస్తుతం ఇలాకా లేని మంత్రిగా కొనసాగుతున్నారు. దీనిని వ్యతిరేకిస్తూ , ఆయన్ను మంత్రి పదవి నుంచి తప్పించాలని నినాదిస్తూ అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళనిస్వామి ఇచ్చిన పిలుపుమేరకు ఆ పార్టీ వర్గాలు బుధవారం రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించాయి. ఆ పార్టీ జిల్లాల కార్యదర్శుల నేతృత్వంలో జిల్లా కలెక్టరేట్లు, డివిజన్ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు జరిగాయి. కోయంబత్తూరు, మదురై, తిరుచ్చి, ఈరోడ్, సేలం, తిరుప్పూర్‌లలో భారీ నిరసన కార్యక్రమాలు జరిగాయి. ఆ పార్టీ ముఖ్య నేతలు, మాజీ మంత్రులు నిరసనకు నేతృత్వం వహించారు. చెన్నై కలెక్టరేట్ ఆవరణలో మాజీ మంత్రి జయకుమార్ నేతృత్వంలో నిరసన కార్యక్రమం జరిగింది. సెంథిల్ బాలాజీని మంత్రి పదవి నుంచి తప్పించాల్సిందేనని నాయకులు నినదించారు. సెంథిల్‌ను వెనకేసుకు రావడంలో ఉన్న అంతర్యమేమిటో అని డీఎంకే అధ్యక్షుడు, సీఎం స్టాలిన్‌ను ప్రశ్నించారు. జయకుమార్ మాట్లాడుతూ ప్రజాధనాన్ని ఈ పాలకులు వృథా చేస్తున్నారని మండిపడ్డారు. ఇలాకా లేని మంత్రిగా సెంథిల్ బాలాజీని ఆస్పత్రిలో ఉంచి మరీ వైద్యసేవలు అందించాల్సిన అవసరం ఏమిటో అని ప్రశ్నించారు. ఆయన్ను మంత్రి పదవి నుంచి తప్పించాలని, లేనిపక్షంలో పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు. తమపై కేసులు వేసినా భయపడే ప్రసక్తే లేదని, చట్టపరంగా ఎదుర్కొనేందుకు అన్నాడీఎంకే వర్గాలు సిద్ధంగా ఉన్నట్టు ధీమా వ్యక్తం చేశారు.

## పోలీస్ బాస్ ఎవరో?

- శంకర్ జివ్వాల్‌కు అవకాశం

సాక్షి, చెన్నై: రాష్ట్ర శాంతి భద్రతల విభాగం డీజీపీ రేసులో చివరకు ఇద్దరు పేర్లు తెరపైకి వచ్చాయి. వీరిలో ఒకరిని ఆ పదవి వరించనుంది. రాష్ట్ర శాంతి భద్రతల విభాగం డీజీపీ శైలేంద్రబాబు ఈనెల 30న పదవీ విరమణ పొందనున్నారు. ఈ పోస్టు భర్తీ నిమిత్తం సీనియర్ ఐపీఎస్‌లు 14 మందితో కూడిన జాబితాను ఢిల్లీలోని యూపీఎస్సీ సెలక్షన్ కమిటీకి రెండు నెలల క్రితం పంపించారు. ఇందులో ముగ్గురి పేర్లు ఖరారు చేసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికను పంపించినట్టు సమాచారం. ఇందులో తమిళనాడు బ్యాచ్‌కు చెందిన ఢిల్లీ కమిషనర్‌గా డిప్యూటేషన్‌పై ఉన్న సంజయ్ అరోరా పేరు ప్రథమంగా వినబడుతోంది. అయితే, ఆయన మళ్లీ రాష్ట్రానికి వచ్చేందుకు మొగ్గు చూపనట్టు తెలిసింది. దీంతో ఈ జాబితాలో ఉన్న మిగిలిన ఇద్దరిలో ఒకరికి శాంతి భద్రతలు దక్కే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ ఇద్దరిలో ఒకరు చెన్నై పోలీసు కమిషనర్ శంకర్‌జివ్వాల్, మరొకరు పోలీసు గృహ నిర్మాణ డైరెక్టర్‌గా ఉన్న ఏకే విశ్వనాథ్ ఉన్నారు. ఇందులో శంకర్‌జివ్వాల్‌కు అవకాశం ఎక్కువగా ఉండవచ్చన్న సంకేతాలు వెలువడ్డాయి. సీఎం స్టాలిన్‌తో సన్నిహితంగా ఆయన ఉంటూ రావడం కలిసి వచ్చిన అంశంగా మారింది.

## భిన్న సంస్కృతుల భూమి భారతదేశం



కళాకారులను సత్కరిస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి

- రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి
- ఘనంగా పశ్చిమబెంగాల్ వ్యవస్థాపక దినోత్సవం

కొరుక్కుపేట: భిన్న మతాలు, భిన్న సంస్కృతులు సంఘమించే పవిత్ర భూమి భారతదేశం అని రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి అన్నారు. భాష, మతం ప్రాతిపదికన దేశాన్ని విభజించలేమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈమేరకు పశ్చిమబెంగాల్ వ్యవస్థాపక దినోత్సాన్ని రాజ్‌భవన్‌లో మంగళవారం జరుపుకున్నారు. గవర్నర్ రవి పాల్గొని వేడుకలను ఘనంగా ప్రారంభించారు. గవర్నర్ మాట్లాడుతూ 1947 జూన్ 20 పశ్చిమ బెంగాల్ వ్యవస్థాపక దినోత్సవంగా మారిన పరిస్థితులను గుర్తు చేసుకోవాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. దేశాన్ని విభజించి, ముస్లింలు మెజారిటీగా ఉన్న పశ్చిమబెంగాల్‌ను పాకిస్తాన్‌లో భాగం చేసేందుకు బ్రిటీష్ వారు ముస్లింలీగ్‌తో కుమ్మక్కయ్యారని వాదిస్తూ జూన్ 20, 1947న బెంగాల్ శాసనసభలో ఆమోదించిన తీర్మానం పశ్చిమబెంగాల్‌తో కొనసాగడానికి దారితీసిందని అన్నారు. ఇదిలాఉండగా 1905లో బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా దేశం మొత్తం ఎలా నిరసన వ్యక్తం చేసిందని గుర్తుచేశారు. ఒక దేశాన్ని మతం, జాతి, భాష ఆధారంగా విభజించలేమన్నారు. మనదేశం భిన్నత్వంలో ఏకత్వం కలిగినదని అన్నారు. దేశాన్ని బలహీనపరచే శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండేందుకు వ్యవస్థాపక దినోత్సవం తప్పనిసరిగా గుర్తు చేయాలని ఆయన అభిప్రాయపడ్డారు.

## క్లుప్తంగా

### విస్తృతంగా డిజిటల్ సామర్థ్యాలు

సాక్షి, చెన్నై: 2023 చివరి నాటికి మరిన్ని డిజిటల్ సామర్థ్యాల ఆవిష్కరణలు, విస్తృతం, సాంకేతిక, డేటా, సైబర్ నిపుణుల నియామకం లక్ష్యంగా చర్యలు తీసుకున్నామని లాయిడ్స్ బ్యాంకింగ్ గ్రూప్ ప్రధాన ఆపరేటింగ్ అధికారి రాన్ వాన్ కెమెనాడే తెలిపారు. భారత్‌లో తమ సేవలను బుధవారం ఆయన స్థానికంగా వెల్లడించారు. ఖాతాదారులకు డిజిటల్ సామర్థ్యాలు మరింత విస్తృతం చేయడం ద్వారా సేవలు త్వరితగతిన పొందేందుకు వీలుందన్నారు. హైదరాబాద్‌లోని నాలెడ్జ్ సిటీలో కొత్త టెక్నాలజీ సెంటర్‌తో పాటుగా పెట్టుబడులు విస్తృతంగా పెట్టాలన్న నిర్ణయం తీసుకున్నామన్నారు. కొత్త టెక్నాలజీ సెంటర్ తమ పెట్టుబడి టెక్ ఇన్నో వేషన్ పవర్ హౌస్‌గా భారత దేశంలో ప్రతిబింబిస్తుందన్నారు.

### సమావేశానికి కౌన్సిలర్లు డుమ్మా



సమావేశం

తిరుత్తణి: తిరుత్తణి యూనియన్ సమితి సమావేశానికి డీఎంకే, అన్నాడీఎంకే సహా సభ్యులందరూ డుమ్మా కొట్టడంతో సమావేశం వేరొక తేదీ నిర్వహిస్తామని బీడీఓ తెలిపారు. తిరుత్తణి యూనియన్ సమితి చైర్‌పర్సన్ తంగధనం (అన్నాడీఎంకే) ఆధ్వర్యంలో బుధవారం సమితి సమావేశం నిర్వహించనున్నట్లు సభ్యులకు సమాచారం అందించారు. ఆ ప్రకారం చైర్‌పర్సన్ తంగధనం, బీడీఓలు రాజేంద్రబాబు, సంతానం పాల్గొన్నారు. అయితే వైస్ చైర్మన్ ఈఎస్.కండ్రిగ రవి సహా సభ్యులు 11 మంది డుమ్మాకొట్టడంతో అర్ధగంట పాటు చైర్‌పర్సన్, అధికారులు వేచి వుంచి కౌన్సిలర్లు సమావేశానికి హాజరుకాకపోవడంతో మరో తేదీ సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. తిరుత్తణి యూనియన్ సమితి సమావేశాన్ని సభ్యులు తరచూ డుమ్మాకొట్టడంతో యూనియన్‌లో అభివృద్ధి పనులకు ఆటంకం కలుగుతుందని, సంక్షేమ పథకాలు అమల్లో తీవ్ర జాప్యం చోటుచేసుకుంటున్నట్లు విమర్శలు వస్తున్నాయి.

# సర్వరోగ నివారిణి యోగా





యోగా శిక్షణను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న డైరెక్టర్ బాలాజి, యోగాసనాలు

వేలూరు: ఐదేళ్ల చరిత్ర కలిగిన యోగా శిక్షణను ప్రతిఒక్కరూ చేయాలని శ్రీపురం బంగారుగుడి నారాయణి ఆస్పత్రి డైరెక్టర్ బాలాజి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నారాయణి మండపంలో యోగా శిక్షణను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన విద్యార్థులు, సిబ్బందితో కలిసి యోగాలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితి ద్వారా జూన్ 21న ప్రపంచ యోగా దినోత్సవంగా 2015వ సంవత్సరంలో ప్రకటించారన్నారు. యోగాను మన సిద్ధర్లు గత ఐదు వేల సంవత్సరాల క్రితమే చేశారన్నారు. ఇది ఒక రోజు శిక్షణ కాదని ప్రతిరోజూ యోగాను అలవాటు చేసుకోవాలన్నారు. ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ గీత ఇనియన్, కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ లలిత, యోగా శిక్షకులు హేమ శక్తివేల్ పాల్గొన్నారు.

**వీఐటీ యూనివర్సిటీలో..**

వేలూరు వీఐటీ యూనివర్సిటీలో ఈ యోగా శిక్షణను వేలూరు డీఐజీ ముత్తుస్వామి ప్రారంభించారు. ఈ యోగా శిక్షణలో వీఐటీలోని విద్యార్థులు వీఐటీ క్రీడా మైదానంలో పాల్గొని యోగా శిక్షణ చేశారు. వీఐటీ ఉపాధ్యక్షుడు జీవీ సెల్వం మాట్లాడుతూ శారీరకంగాను, మానసిక రుగ్మతలను పారదోలి సర్వరోగి నివారణి యోగా దోహదపడుతుందన్నారు. యోగా శిక్షణపై ప్రతి ఒక్కరూ ఆశక్తి చూపాలన్నారు. ఒత్తిడి తగ్గించి ప్రశాంతతను యోగా అందిస్తుందన్నారు. వీఐటీ విద్యార్థులు పాల్గొన్నారు.

**తిరుత్తణిలో..**

తిరుత్తణి: తిరుత్తణిలో పీకాక్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో స్థానిక ద్రౌపదీ దేవి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన యోగాను పీకాక్ ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ ఎం.శ్రీ కిరణ్ ప్రారంభించారు. యోగా ఆవశ్యకత శిక్షణలో పద్ధతులపై యోగా మాస్టర్ అవగాహన కల్పించారు.

# అన్నాడీఎంకే శ్రేణుల ధర్నా



ఆందోళన నిర్వహిస్తున్న అన్నాడీఎంకే నేతలు

తిరువళ్లూరు: రాష్ట్రంలో పెరిగిన అవినీతి, అరాచకాలను అదుపు చేయడంలో డీఎంకే ప్రభుత్వం వైఫల్యం చెందిందని అన్నాడీఎంకే సీనియర నేత తమిళ్ మగన్ హుస్సేన్ ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా నకిలీ మద్యం విక్రయాలు, అవినీతి, కల్తీసారాతో మృతి లాంటి సంఘటనలను అదుపు చేయడంలో విఫలమైన డీఎంకే ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించాలని అన్నాడీఎంకే అధిష్టానం పిలుపు నిచ్చింది. ఇందులో భాగంగానే తిరువళ్లూరులో అన్నాడీఎంకే ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ధర్నా కార్యక్రమానికి జిల్లా కన్వీనర్లు బీవీ రమణ, మాధవరం మూర్తి, సిరునియం బలరామన్, అలెగ్జాండర్, బెంజిమిన్ అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథులుగా అన్నాడీఎంకే సీనియర్ నేత రాష్ట్ర అధ్యక్షుడు తమిళ్ మగన్ హుస్సేన్ హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా డీఎంకే అధికారంలోకి వచ్చిన తరువాత అవినీతిని ప్రోత్సహించి రాష్ట్ర ఖజానాను దోచుకుంటున్నారని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా కల్తీసారాను విక్రయించడం ద్వారా డీఎంకే నేతలు భారీ దోచుకున్నారని అయితే వాటిని సేవించి 20 మంది పైగా మృతిచెందారని వాపోయారు. కల్తీ సారా విక్రయించిన మంత్రులు, డీఎంకే నేతలను ఇంతవరకు అరెస్టు చేయకపోవడం దారుణమన్నారు. అనంతరం డీఎంకే ప్రభుత్వానికి వ్యతిరేఖంగా నినాదాలు చేశారు. మాజీ ఎంపీలు వేణుగోపాల్, తిరుత్తణి హరి, మాజీ మంత్రి అబ్దుల్‌రహీం, మాజీ ఎమ్మెల్యే మణిమారన్ పాల్గొన్నారు.

# క్వారీ రద్దు చేయాలని నిరసన



జాతీయ జెండాతో నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

తిరుత్తణి: క్వారీ రద్దు చేయాలనే డిమాండ్‌తో గ్రామీణులు జాతీయ జెండాతో నిరసన తెలిపారు. తిరుత్తణి యూనియన్ వీకేఎస్.కండ్రిగ గ్రామ పంచాయతీ పరిధిలోని నరసింగాపురం వద్ద కొత్తగా రాళ్ల క్వారీకి రాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది. అయితే క్వారీ ఏర్పడితే రాళ్లు పేల్చేందుకు నాటుమందులు వినియోగించడంతో చుట్టు పక్కల గ్రామస్తులకు హృదయ సంబంధిత వ్యాధులతో పాటు పంట పొలాల్లో రాళ్ల పొడి పడి పంటకు నష్టం కలుగుతోందని, నీటి ఎద్దడి సైతం తీవ్రమవుతుందని, లారీల కారణంగా ప్రమాదాలు చోటుచేసుకుంటాయని, అందువల్ల రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ ఉమ, పోలీసులు గ్రామస్తులతో చర్చలు జరిపి న్యాయం చేస్తామని హామీతో నిరసన విరమించారు.

### వాహనాల వేలం రేపు

పళ్లిపట్టు: ఆర్కేపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో నేరాలకు సంబంధించి పోలీసులు సీజ్ చేసిన వాహనాలను శుక్రవారం వేలం నిర్వహించనున్నట్లు తహసీల్దారు తెలిపారు. ఆర్కేపేట తహసీల్దారు రమేష్ విడుదల చేసిన ప్రకటనలో ఆర్కేపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో నేరాలకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేసి సీజ్ చేసిన వాహనాలు తాలూకా కార్యాలయంలో శుక్రవారం 11 గంటలకు తహసీల్దార్, పోలీసుల సమక్షంలో వేలం జరగనున్నట్లు, ఆసక్తిగల వ్యక్తులు వేలం పాటలో పాల్గొనేందుకు ముందస్తు రుసుం చెల్లించి పాల్గొనాలని తెలిపారు.

### • ప్రారంభం



చెన్నై క్రోంపేటలో ఆంధ్రా వంటకాల రుచులతో బెంగళూరుకు చెందిన నందన ప్యాలెస్ బుధవారం ఏర్పాటైంది. దీనిని రాష్ట్ర చిన్న తరహా పరిశ్రమలశాఖ మంత్రి టీఎం అన్బరసన్ ప్రారంభించారు. సంస్థ చైర్మన్ ఆర్ రవిచంద్రన్ ఆంధ్రా ఆహారం పదార్థాలు, రుచులను వివరించారు.

- సాక్షి, చెన్నై

# విద్యార్థుల్లో పోటీతత్వం పెరగాలి



తరగతులను ప్రారంభిస్తున్న కలెక్టర్

తిరువళ్లూరు: విద్యార్థుల్లో పోటీతత్వం పెరిగి లక్ష్యం వైపు ముందుకు సాగాలని కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్ సూచించారు. తిరువళ్లూరు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో నైపుణ్యం వున్న విద్యార్థులను గుర్తించి వారు అన్ని రంగాల్లో రాణించేలా ప్రత్యేక పాఠశాలను 2021–22వ సంవత్సరంలో ఏర్పాటు చేశారు. ఈ పాఠశాల కోసం తిరువళ్లూరు జిల్లా వేపంబట్టులోని బజరంగ్ కళాశాలను ఎంపిక చేశారు. ఈ నేపథ్యంలో 2023–24వ సంవత్సరంలో 160 మందిని ఎంపిక చేసి వారిని ప్రత్యేక పాఠశాలకు తరలించారు. వీరికి ప్లస్ ఒన్, ప్లస్‌టూ బోధనతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనే ప్రత్యేక శిక్షణను ఏడాది పాటు అందించనున్నారు. కాగా ఈ ఏడాది తరగతులను ప్రారంభించే కార్యక్రమం బుధవారం జరిగింది. కార్యక్రమానికి కళాశాల చైర్మన్ భాస్కరన్, కలెక్టర్ హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో సీఈఓ సరస్వతి, డీఈఓ తేన్‌మొళి పాల్గొన్నారు.

### ఆత్మహత్యకు యత్నించిన యువకుడు మృతి

తిరువళ్లూరు: పరీక్షల్లో ఫెయిల్ కావడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు యత్నించిన యువకుడు చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. తిరువళ్లూరు జిల్లా ఆర్ఎస్ కండ్రిగకు చెందిన మనోహరన్ కుమారుడు తమిళరసు(24). ఇతను సమీపంలోని ప్రైవేటు కళాశాలలో ఇంజినీరింగ్ చదువుతున్నాడు. ఇటీవల పరీక్ష ఫలితాలు విడుదల కాగా తమిళరసు ఫెయిలయ్యాడు. మనస్తాపం చెందిన తమిళరసు సోమవారం పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి వెళ్లాడు. యువకుడిని చెన్నై స్టాన్లీ వైద్యశాలకు తరలించారు. అక్కడ చిక్సిత పొందుతూ యువకుడు మంగళవారం రాత్రి మృతిచెందాడు. కవరపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నటి సునయన



# నాకు నచ్చిందే చేస్తా!

తమిళసినిమా: దక్షిణాదిలో 18 ఏళ్లగా కథానాయకిగా రాణిస్తున్న నటి సునయన. మొదట తెలుగులో ఎంట్రీ ఇచ్చిన మహారాష్ట్రకు చెందిన ఈ భామ ఆ తరువాత తమిళం, మలయాళం, కన్నడం భాషల్లో పరిచయమై తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. తాజాగా ఈమె ప్రధాన పాత్రలో నటించిన రెజీనా చిత్రం పాన్ ఇండియా స్థాయిలో శుక్రవారం తెరపైకి రానుంది. సునయన ఈ చిత్ర ప్రమోషన్ కార్యక్రమంలో మాట్లాడుతూ తన కుటుంబం నుంచి తమిళ ప్రేక్షకుల నుంచి తనకు ప్రేమ, ఆదరణ చాలానే లభించాయన్నారు. అందుకు వారికి ఎప్పటికీ రుణపడి వుంటానన్నారు. రెజీనా చిత్రం తన కెరీర్‌లో చాలా ముఖ్యమైనదిగా పేర్కొన్నారు. ఎందుకంటే 2018 ప్రాంతంలో తాను ఏం చేయాలన్న దాని గురించి చాలామంది చాలా విషయాలు చెప్పారన్నారు. అప్పుడు తనకు ఏం అనిపిస్తే అదే చేయాలని నిర్ణయించుకున్నానన్నారు. ఆ తరువాత గట్టిగా మంచి ఆలోచనాత్మక కథా చిత్రాలను ఎంపిక చేసుకోవడం ప్రారంభించనున్నట్లు చెప్పారు. అలా ఎలా నటించడానికి అంగీకరించారన్నారు. ఆ సమయంలో చాలా మందికి వెబ్‌సీరీస్ అంటే ఏమిటో కూడా తెలియని పరిస్థితి అన్నారు. అందుకే చాలా మంది అటువైపు దృష్టి సారించలేదని, అయితే వెబ్ సీరీస్‌లో నటించడం తనకు నచ్చిందన్నారు. అందుకే తనకు నచ్చింది చేయాలని నిర్ణయం తీసుకున్నానన్నారు. ఆ తరువాత తమిళంలో సిల్లుక్కరు పట్టి, తెలుగులో రాజరాజ చోళ వంటి వైవిధ్యభరిత కథా చిత్రాలను ఎంచుకుని నటించానన్నారు. ఈ రెజీనా చిత్రం కూడా ఆ కోవలో చేరుతుందని చెప్పారు. ఈ తరహా కథా చిత్రాల్లోనే నటిస్తూ ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని కలిగించాలని కోరుకుంటున్నారని నటి సునయన పేర్కొన్నారు.

## కోలీవుడ్ టాక్స్

# చంద్రముఖి-2కు గుమ్మడికాయ కొట్టారు



చంద్రముఖి-2 చిత్ర యూనిట్



కంగనా రనౌత్

తమిళసినిమా: చంద్రముఖి-2 చిత్ర షూటింగ్ పూర్తి అయ్యింది. నటుడు రజనీకాంత్, జ్యోతిక, నయనతార, ప్రభు ప్రధాన పాత్ర పోషించిన చంద్రముఖి చిత్రం పి.వాసు దర్శకత్వంలో రూపొంది 2005లో విడుదలైంది. అప్పట్లో సంచలన విజయాన్ని సాధించిన చంద్రముఖి చిత్రానికి సీక్వెల్ చేయాలని దర్శకుడు పి.వాసు ప్రయత్నిస్తునే ఉన్నారు. రజనీకాంత్ అంగీకరించకపోవడంతో అదే కథతో తెలుగులో వెంకటేష్ కథానాయకుడిగా తెరకెక్కించారు. అయితే 18 ఏళ్ల తరువాత చంద్రముఖి -2ను తమిళంలో రూపొందిస్తున్నారు. ఇందులో రజనీకాంత్‌కు బదులుగా నృత్య దర్శకుడు లారెన్స్ నటించడం విశేషం. బాలీవుడ్ సంచలన నటి కంగనా రనౌత్ ప్రధాన పాత్రను పోషిస్తున్న ఇందులో వడివేలు, నటి రాధిక ముఖ్యపాత్రల్లో నటిస్తున్నారు. తొలి భాగానికి దశరథ్ వహించిన పి.వాసునే తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని లైకా ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తోంది. ప్రముఖ టాలీవుడ్ సంగీత దర్శకుడు ఎం ఎం కీరవాణి సంగీతాన్ని అందిస్తున్న ఈ చిత్ర షూటింగ్ బుధవారంతో పూర్తయింది. ఈ విషయాన్ని చిత్ర వర్గాలు విడుదల చేసిన పోస్టర్ వెల్లడించారు. ప్రస్తుతం నిర్మాణ కార్యక్రమాలు జరుపుకుంటున్న చంద్రముఖి-2 చిత్రంపై సినీ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. కారణం రజనీకాంత్ పాత్రను లారెన్స్ పోషించడం జ్యోతిక పాత్రలో కంగనారనౌత్ నటించడంతో పాటు ఎంఎం కీరవాణి సంగీతాన్ని అందించడమే.

# కాజల్ కథే వేరయా!

తమిళసినిమా: ఎప్పుడూ ఏదోవిధంగా వార్తల్లో ఉండడానికి ప్రయత్నించే నటీమణుల్లో కాజల్ అగర్వాల్ ఒకరు. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో కథానాయకిగా నటిస్తూ ఇండియన్ నటిగా గుర్తింపు పొందిన నటి ఈమె. తెలుగు చిత్రం మగధీరతో కాజల్ అగర్వాల్ లక్ మొదలైందనే చెప్పాలి. అంతకుముందు కొన్ని చిత్రాల్లో నటించినా సరైన బ్రేక్ రాలేదు. అలాంటిది మగధీర చిత్రం తరువాత స్టార్ హీరోయిన్ల లిస్టులో చేరిపోయింది. అంతేకాకుండా వరుసగా ప్రముఖ నటుల సరసన నటించే అవకాశాలను సంపాదించుకుంది. అలా అగ్రకథానాయకిగా నటిస్తుండగానే గౌతమ్‌కిచ్చులు అనే వ్యక్తి ప్రేమలో పడి 2020లో సైలెంట్‌గా పెళ్లి కూడా చేసుకున్నారు. ఆ విధంగా వార్తల్లో కెక్కింది. పెళ్లి అయిపోవడంతో కాజల్ అగర్వాల్ సినీ కెరియర్‌కు ఫుల్‌స్టాప్ పడినట్టే అనే ప్రచారం జరిగింది. అలాంటిది ఈమెను ఇండియన్–2 చిత్రం కాపాడిందని చెప్పాలి. ఈ చిత్రంలో నటిస్తుండగానే కాజల్ అగర్వాల్ పెళ్లి చేసుకుని ఒక బిడ్డకు తల్లి కూడా అయ్యింది. ఇదంతా జరగడానికి రెండేళ్లు పట్టింది. అయితే అలాంటి పరిస్థితుల్లో ఇండియన్–2 చిత్రం పలు కారణాల వల్ల షూటింగ్ ఆగిపోయింది. మళ్లీ షూటింగ్ ప్రారంభమయ్యే సమయానికి కాజల్ అగర్వాల్ మళ్లీ నటించడానికి సిద్ధమైంది. అందుకు చాలా కసరత్తులే చేసింది. కాగా ఇండియన్–2 చిత్రం ఇంకా పూర్తి కాలేదు. అంతలోనే కాజల్ అగర్వాల్ తెలుగులో మరో రెండు చిత్రాలలో నటించే అవకాశాలు వరించాయి. ఇలాంటి పరిస్థితుల్లో కాజల్ అగర్వాల్ నటనకు స్వస్తి చెప్పబోతుందని ప్రచారం గుప్పుమంది. అయితే అలాంటి నిర్ణయాన్ని తాను తీసుకోలేదని ఆమె మంగళవారం తన పుట్టినరోజు సందర్భంగా స్పష్టం చేసింది. అదే సమయంలో ఒక ఆసక్తికరమైన వీడియోను ఆమె విడుదల చేసింది. అందులో కాజల్ అగర్వాల్ ఒక కాఫీ కప్పులో అమాంతం ఎగిరి దూకి జలకాలాడుతున్న దృశ్యం చేసుకుంది. ఇది గ్రాఫిక్స్‌తో చేసిన వీడియో అని తెలిసినా, ఫన్నీగా ఉండడంతో అది ఇప్పుడు నెట్టింట్లో వైరల్ అవుతోంది.



కాజల్ అగర్వాల్

# మరో హిందీ చిత్రానికి రెడీ!



దర్శకుడు ఆనంద్ రాయ్‌తో ధనుష్

తమిళసినిమా: కోలీవుడ్, టాలీవుడ్, బాలీవుడ్, హాలీవుడ్‌లో దుమ్మురేపుతున్న ధనుష్ బాలీవుడ్‌లో ఎక్స్‌ట్రార్డనరీ జర్నీ ఆఫ్ ది పక్కీర్, ది గ్రే మ్యాన్ చిత్రాల్లో నటించారు. అదేవిధంగా హిందీలో రాంజానా, అట్రాంగిరే చిత్రాల్లో నటించారు. ఇక ఇటీవల తెలుగులో సార్ చిత్రం ద్వారా ఎంట్రీ ఇచ్చి హిట్ కొట్టారు. కాగా ప్రస్తుతం తమిళంలో కెప్టెన్ మిల్లర్ చిత్రంలో నటిస్తున్నారు. ఈ చిత్రం తరువాత స్వీయ దర్శకత్వంలో తన 50వ చిత్రాన్ని చేయనున్నట్లు ప్రచారం జరుగుతోంది. అలాంటిది తాజాగా మరోసారి బాలీవుడ్ చిత్రం చేయడానికి రెడీ అవుతున్నట్లు సమాచారం. ఈయన ఇంతకుముందు నటించిన రెండు హిందీ చిత్రాలకు దర్శకుడు ఆనంద్ ఎల్ రాయ్ దర్శకత్వం వహించారు. తాజాగా నటించిన మూడవ చిత్రానికి ఆయనే దర్శకత్వం వహిస్తున్నట్టు తెలిసింది. తాజా చిత్రాన్ని వైవిధ్య భరిత ప్రేమ కథాంశంతో తెరకెక్కించడానికి దర్శకుడు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ చిత్రానికి తేరే ఇష్క్ మైన్ అనే టైటిల్‌ను నిర్ణయించినట్లు ధనుష్ బుధవారం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. అయితే ఇది వైమానిక దళం నేపథ్యంలో సాగే కథా చిత్రంగా ఉంటుందని తెలిసింది. కాగా దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉందన్నది గమనార్హం. అయితే ధనుష్ తన 50వ చిత్రాన్ని పూర్తిచేసిన తరువాతే హిందీ చిత్రంలో నటిస్తారా? లేక ఏకకాలంలో రెండు చిత్రాలు చేస్తారా కూడా తెలియాల్సి ఉంది. ప్రస్తుతం మా త్రం ఆయన కెప్టెన్ మిల్లర్ చిత్రాన్ని పూర్తి చేసే పనిలో ఉన్నారు.

# యోగా దినోత్సవం సందర్భంగా..

తమిళసినిమా: ఆరోగ్యసూత్రాలు, యోగాసనాలు చాలా ముఖ్యమైనవి. కాగా బుధవారం ప్రపంచ యోగా దినోత్సవం. ఈ సందర్భంగా సినీ సంగీత కళాకారుల సంఘం అధ్యక్షుడు, దక్షిణ భారత సినీ కార్మికుల సమాఖ్య ఉపాధ్యక్షుడు సంగీత దర్శకుడు దీనా, ఈశా ట్రస్ట్ నిర్వహణతో కలిసి బుధవారం స్థానిక ఆళ్వార్‌పేటలోని అగ్నికి యోగా స్టూడియోస్‌లో యోగా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గాయకుడు వేల్‌మురుగన్, గాయని రణినారెడ్డి పలువురు సంగీత కళాకారులు ఈశా ఔత్సాహికులు పాల్గొన్నారు. వీరందరికీ నాడి సుధీ, ఈశాక్రియ వంటి సద్గురు యోగాసనాల శిక్షణ వీడియోను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో గాయకుడు వేల్‌మురుగన్ యోగా గురించి రాసిన పాటను ఆలపించారు. అనంతరం సంగీత దర్శకుడు కలైమామణి దీనా యోగా ప్రాముఖ్యత గురించి, సద్గురు నిర్వహిస్తున్న అనేక సత్కాకార్యక్రమాల గురించి, ప్రధానమంత్రి నరేంద్రమోదీకి యోగాపై నమ్మకం గురించి ప్రసంగించారు. అనంతరం అందరూ యోగాసనాలు చేశారు. గాయని ప్రియదర్శిని వ్యాఖ్యాతగా వ్యవహరించారు.



యోగా దినోత్సవ కార్యక్రమం

# విజయ్ అభిమానుల హంగామా!

- వా తలైవా..వా
- రేపటి సీఎం అంటూ పోస్టర్ల హోరు

సాక్షి, చెన్నై: దళపతి విజయ్ బర్త్‌డే సందర్భంగా ఆయన అభిమానులు రాజకీయ ప్రస్తావనతో బుధవారం హంగామా సృష్టించారు. వాతలైవా..వా( రా.నాయకుడా రా), నాళై మొదల్వన్( రేపటి సీఎం) అన్న నినాదాలతో తమిళనాట పోస్టర్లను హోరెత్తించారు. సినీ నటుడు విజయ్ రాజకీయ ప్రవేశ చర్చ తరచూ తెరపైకి వస్తున్న విషయం తెలిసిందే. అలాగే, ఇటీవల కాలంగా తన చిత్రాల్లో రాజకీయంగా చర్చకు తగ్గ వ్యాఖ్యల తూటాలను విజయ్ పేల్చుతూ వస్తున్నారు. ఇది వివాదాలకు సైతం దారి తీస్తున్నాయి. అలాగే, విజయ్ ఇటీవల వేస్తున్న అడుగులు 2026 అసెంబ్లీ ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని పయనం సాగిస్తున్నట్టుగా ఉంది. అభిమానులతో జిల్లాల వారీగా సమీక్షలు, సమావేశాలతో తరచూ విజయ్ బిజీ అవుతున్నారు. విజయ్ ఇయక్కంలో జాలర్లు, మహిళలు, విద్యార్థి విభాగాలను సైతం ఏర్పాటు చేసి ఉండడంతో రాజకీయ అరంగేట్రానికి సమయం ఆసన్నమవుతున్నట్టు ప్రచారం ఊపందుకుంది. ఈ సమయంలో ఈనెల 17న చెన్నై వేదికగా




ఎన్నికల విజయోత్సవంగా...

విజయ్ నిర్వహించిన కార్యక్రమం మరింత రాజకీయ చర్చకు మార్గంగా మారింది. పది, ప్లస్‌టూ ఫలితాలలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను సత్కరించడమే కాకుండా ఓటు విలువ, రాజకీయాలు, భావినాయకుడి ఎంపిక అంశాలను తన ప్రసంగంలో విజయ్ గుర్తు చేశారు. దీంతో ఆయన 2026 ఎన్నికలే లక్ష్యంగా రాష్ట్ర రాజకీయాలలో కీలకం కావడం తథ్యమన్న ధీమాతో అభిమానులు ఉన్నారు.

**పోస్టర్ల హోరు..**

గురువారం దళపతి విజయ్ 48వ వసంతంలోకి అడుగుపెట్టనున్నారు. ఆయన నటిస్తున్న లియో చిత్రం గురించిన కీలక టీజర్ లేదా పాటను విజయ్ విడుదల చేయడానికి సన్నద్ధమైనట్టు సమాచారం. అదే సమయంలో తమ అభిమాన హీరోను రాజకీయ తెరపైకి తెస్తూ అభిమానులు కోయంబత్తూరు, తిరునల్వేలి, మదురై, సేలం, తిరుచ్చి, పుదుచ్చేరి, దిండుగల్ నగరాలలో బుధవారం పోస్టర్లతో హంగామా సృష్టించారు. ఈ పోస్టర్లు ప్రత్యేక ఆకర్షణగానే కాదు, రాజకీయంగా చర్చకు దారితీసింది. విజయ్ సచివాలయంలో కూర్చున్నట్టు, ఆయన పేరుకు ముందుగా సీఎం విజయ్ అని వ్యాఖ్యలతో ఫొటోలు పోస్టర్లలో ఉన్నాయి. అలాగే, రేపటి సీఎం, నేటి తలైవా..రేపటి తమిళ రక్షకుడు, వా తలైవా వా..ఉచిత విద్యను అందిద్దాం ..అన్న పలు నినాదాలతో ఈ పోస్టర్లు హోరెత్తించారు. 2026లో విజయ్ సీఎం కావడం తథ్యమని తేల్చే రీతిలో ఈ పోస్టర్లను అభిమానులు హోరెత్తించి తమ ఉత్సాహాన్ని ప్రదర్శించడం గమనార్హం.

## మహిళకు వేధింపులు

- ఎస్‌ఐ సహా నలుగురు పోలీసుల బదిలీ

తిరువొత్తియూరు: తిరుచ్చి సమయపురంలో హాస్టల్‌లో ఉంటున్న మహిళను వేధించిన ఎస్‌ఐ సహా నలుగురు కానిస్టేబుళ్లను అధికారులు బదిలీ చేశారు. వివరాలు.. తిరుచ్చి మారియమ్మన్ ఆలయానికి నిత్యం వేలాది మంది భక్తులు వస్తుంటారు. యాత్రికుల వసతి కోసం ఉచిత మండపాలు, వసతి గృహాలు ఉన్నాయి. కొద్ది రోజుల క్రితం సమయపురం ఆలయానికి ఓ జంట ఇక్కడి హాస్టల్‌లో ఉంటోంది. హాస్టల్‌ను తనిఖీ చేసేందుకు వెళ్లిన ఓ ఎస్‌ఐ, ముగ్గురు పోలీసులు మహిళతో దురుసుగా ప్రవర్తించేందుకు ప్రయత్నించారని.. ప్రశ్నించిన భర్తపై దాడికి పాల్పడినట్టు తెలిసింది. దీనిపై పోలీసు ఉన్నతాధికారులు రహస్య విచారణ చేశారు. మహిళకు వేధింపులు ఇచ్చిన సంగతి నిజమేనని తేలింది. దీంతో సమయపురం పోలీసుస్టేషన్‌లో పని చేస్తున్న ఎస్‌ఐ ప్రకాష్, కుమారేశన్‌లను పుదుకోట్టై జిల్లాకు, తిరుమేనిని పెరంబలూరు జిల్లాకు, సెయ్యరాసును అరియలూరు జిల్లాకు బదిలీ చేస్తూ డీఐజీ శరవణ సుందర్ ఆదేశించారు. ఈ చర్య పోలీసు శాఖలో కలకలం రేపింది.

## క్లుప్తంగా

### సర్పంచ్‌పై ఫిర్యాదు

తిరుత్తణి: పంచాయతీ నిధులను దుర్వినియోగం చేశారని.. అవినీతికి పాల్పడ్డారని సర్పంచ్‌పై వార్డు సభ్యులు అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తిరువలంగాడు యూనియన్ అరుంగళం పంచాయతీ సర్పంచ్‌గా శరణ్య ఉన్నారు. పంచాయతీ అభివృద్ధి నిధులు రూ.45 లక్షలు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసన్ సాయంతో దుర్వినియోగం చేసి అవినీతికి పాల్పడినట్లు.. దీంతో పంచాయతీలో అభివృద్ధి పనులు కుంటుపడినట్లు గత నెల పంచాయతీ వార్డు సభ్యులు విజయభారతి, రాధ, అజంత తదితరులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. జిల్లా పంచాయతీరాజ్ శాఖ సహాయ డైరెక్టర్ విచారణ చేపట్టిన క్రమంలో సర్పంచ్‌పై చర్యలు లేకపోవడంతో బుధవారం అదనపు కలెక్టర్‌ను కలిసి మరోసారి ఫిర్యాదు చేశారు.

### స్టాన్లీ రౌండ్ ఠాణా మార్గంలో వాహనాల నిషేధం

తిరువొత్తియూరు: ఎన్‌ఎస్‌సీ బోస్ రోడ్డులో వర్షపు నీరు కారణంగా స్టాన్లీరౌండ్ ఠాణా మార్గంలో వెళ్లే వాహనాలకు రవాణశాఖ నిషేధం విధించింది. పనుల కారణంగా ప్రకాశం రోడ్డు (బ్రాడ్‌వే రహదారి) ఎన్‌ఎస్‌సీ బోస్ రోడ్డు జంక్షన్ నుంచి ముత్యప్పన్ వీధి జంక్షన్ వరకు తాత్కాలిక వన్ వే లేన్‌గా మార్చబడుతోంది. దీంతో ఎన్‌ఎస్‌సీ బోస్ రోడ్డు నుంచి ప్రకాశం రోడ్డు మీదుగా స్టాన్లీ రౌండ్‌ఠాణా వరకు వైపు వెళ్లే అన్ని వాహనాలను 22 నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు నిషేధం విధించారు. ఈ విషయమై చెన్నై మెట్రోపాలిటన్ పోలీసు డిపార్టుమెంట్ ఒక ప్రకటనలో ఇలా తెలిపారు. ఎన్‌ఎస్‌సీ బోస్ రోడ్డు, ఎసప్లనేడు నుంచి వచ్చే వాహనాలు వెళ్లే మార్గం, కురలకం జంక్షన్, ఎన్‌ఎస్‌సీ బోస్ రోడ్ ప్యారిస్ జంక్షన్, ఎడమ వైపు రాజాజీ రోడ్ ఇబ్రహీం రోడ్డులో వెళ్లాలి.

### వృద్ధుడు సజీవ దహనం

తిరువళ్లూరు: ఇంట్లో నిద్రిస్తున్న ఓ వృద్ధుడు సజీవదహనమైన సంఘటన మప్పేడులో కలకలం రేపింది. తిరువళ్లూరు జిల్లా పన్నూర్‌కు చెందిన అనంతయ్య కుమారుడు పొట్టి బాలయ్య(83). ఇతని భార్య పిల్లలు లేకపోవడంతో అదే ప్రాంతంలో వున్న మేనల్లుడు పీటర్ జోసెఫ్(55) వద్ద ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి యథావిధిగా మొదటి అంతస్తులోని రూమ్‌లో నిద్రకు ఉపక్రమించాడు. అయితే రూమ్‌లో నుంచి హఠాత్తుగా మంటలు చెలరేగి క్షణాల్లో వ్యాపించడంతో మంటల్లో చిక్కుకున్న పొట్టి బాలయ్య గట్టిగా కేకలు వేశాడు. దీంతో పీటర్ జోసెఫ్ పైకి వచ్చి చూడగా అప్పటికే ఇంట్లో నుంచి పొగలు రావడంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న సిబ్బంది మంటలను ఆర్పి, మంటల్లో చిక్కుకుని సజీవదహనమైన వ్యక్తిని బయటకు తీసి శవపరీక్ష నిమిత్తం తిరువళ్లూరు వైద్యశాలకు తరలించారు. మప్పేడు పోలీసులు కుని ప్రమాదానికి గల కారణాలపై విచారణనూ ముమ్మరం చేశారు.

### నలుగురు ఆత్మహత్యాయత్నం

తిరువొత్తియూరు: తిరుచెందూరు బెంజిమిన్ కాలనీకి చెందిన అముదేశ్వరి మహిళలతో కలిసి మహిళా స్వయం సహాయక సంఘాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈ సంఘం రెండేళ్ల క్రితం బ్యాంకులో రుణం పొందిన రూ.లక్షా 80వేల రుణాన్ని సంఘం సభ్యులు చెల్లించలేదు. దీంతో బ్యాంకు యంత్రాంగం మహిళా స్వయం సహాయక కమిటీ అడ్మినిస్ట్రేటర్‌తో పాటు 13 మంది సభ్యుల వద్ద విచారణ చేశారు. ఆ సమయంలో గ్రూప్ లీడర్‌కు అముదేశ్వరికి డబ్బులు చెల్లించామని ఆమె బ్యాంకులో చెల్లించలేదని తెలిసింది. దీంతో మనస్తాపానికి గురైన అముదేశ్వరి (42), ఆమె కుమారుడు ఆర్ముగం (20), వదిన మరియమ్మాళ్ (60), ఆడబిడ్డ స్నేహ, మంగళవారం రాత్రి ఆహారంలో చీమల విషాన్ని కలిపి తిన్నారు. బుధవారం ఉదయం చాలా సమయం అయినప్పటికీ ఇంట్లో నుంచి బయటకు రాలేదు. ఇరుగుపొరుగు వారు వెళ్లి చూడగా నలుగురు వ్యక్తులు నోటి నుంచి నురగలు కక్కుతూ అపస్మారక స్థితిలో ఉన్నట్లు గుర్తించారు. వారు షాక్ అయ్యారు. వెంటనే వారిని రక్షించి తిరుచెందూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

### ముక్కంటి హుండీ లెక్కింపు



శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం హుండీ లెక్కింపు నిర్వహించారు. స్వామి వారికి కానుకల రూపంలో రూ.1.19 కోట్లు, 0.050 గ్రాముల బంగారం, 438 కేజీల వెండి, 72 నోట్ల విదేశీ కరెన్సీని భక్తులు కానుకగా వేసినట్లు ఈఓ సాగర్‌బాబు తెలిపారు. 20రోజుల్లోనే ఈ ఆదాయం సమకూరినట్లు వెల్లడించారు.

### తిరుమల ఘాట్‌లో వాహనాల తనిఖీ

తిరుమల: తిరుమలకు వెళ్లే మొదటి ఘాట్‌రోడ్డులో ట్రాఫిక్ పోలీసులు బుధవారం వాహనాల తనిఖీ చేపట్టారు. శ్రప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయానికి సమీపంలో ట్రాఫిక్ డీఎస్పీ కొండయ్య, బ్రేక్ ఇన్‌స్పెక్టర్, సిబ్బందితో కలిసి పలు వాహనాలను తనిఖీ చేశారు. వేగంగా వెళ్లే వాహనాలు, హెల్మెట్ లేకుండా వెళుతున్న ద్విచక్రవాహనదార్లను ఆపి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఘాట్‌లో నిర్దేశిత వేగంతోనే వాహనాలు నడపాలని, బైక్‌పై వెళ్లే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఆదేశించారు. రికార్డులను పరిశీలించి, లైసెన్స్ లేని వారికి జరిమానా విధించారు.

## రూ.66.67 కోట్లతో తాగునీటి ప్రాజెక్ట్

కొరుక్కుపేట: దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పైప్ లైన్ నీటి పంపిణీ ప్రాజెక్టు 2025 నాటికి పూర్తవుతుందని తాగునీటి బోర్డు తెలిపింది. రూ.66.67 కోట్లతో చేపట్టిన ఈ ప్రాజెక్టు వల్ల నీలాంగరై ప్రాంతంలోని 34,100 మంది, సెమ్మంజేరిలో 51,000 మంది ప్రయోజనం పొందుతారని పేర్కొంది. రాజీవ్‌గాంధీ రోడ్, పాత మహాబలిపురం రోడ్డు, ఈస్ట్‌కోస్టు రోడ్డుకు ఆనుకుని ఉన్న కొన్ని ప్రాంతాల్లో పైపులైన్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయనున్నారు. 2025 డిసెంబర్ నాటికి సెమ్మంజేరి, నీలాంగరై ప్రాంతాల్లో తాగునీటిని అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. అలాగే ఓఎం ఆర్ రోడ్డు, ఈసీఆర్ రోడ్లలో సమగ్ర తాగునీటి నెట్‌వర్క్‌ను అందించే ప్రాజెక్టులు వివిధ దశల్లో అమలు ఉన్నారు. త్వరలో జరగనున్న మెట్రో పనులను సులభతరం చేసేందుకు కొట్టివాక్కం ప్రాంతాల్లోని ప్రధాన పైపులైన్లను పునరుద్ధరిస్తున్నారు. దీంతో కొట్టివాక్కం ప్రత్యామ్నాయ రోజుల్లో రోజుకు 4 మిలియన్ లీటర్ల తాగునీటిని అందిస్తున్నట్లు చెన్నై మెట్రో పాలిటన్ డ్రింకింగ్ వాటర్ సప్లై అండ్ సీవరేజ బోర్డు అధికారులు తెలిపారు.

## శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 20 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 71,831 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 31,831 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.11 కోట్ల మంది భక్తులు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం అవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 15 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

## రాష్ట్రంలో శాంతిభద్రతలు విఫలం



అన్నా కలైఅరంగం ఎదుట ధర్నా చేస్తున్న అన్నాడీఎంకే కార్యకర్తలు

- అన్నాడీఎంకే శ్రేణుల ధర్నా

వేలూరు: రాష్ట్రంలో శాంతి భద్రతలు విఫలం కావడాన్ని ఖండిస్తూ అన్నాడీఎంకే పార్టీ ఆధ్వర్యంలో వేలూరు ఉమ్మడి జిల్లాతో పాటు తిరువణ్ణామలై జిల్లాలోను ఆ పార్టీ కార్యకర్తలు ధర్నా నిర్వహించి డీఎంకే ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వేలూరులో నిర్వహించిన ధర్నాలో జిల్లా కార్యదర్శి ఎస్ఆర్‌కే అప్పు మాట్లాడుతూ ప్రజాధనాన్ని కొల్ల గొట్టి స్టాలిన్ కుటుంబసభ్యులకు అందజేస్తున్న సెంథిల్ బాలాజీని మంత్రి పదవి నుంచి వెంటనే తొలగించాలన్నారు. రాష్ట్రంలో ఒకే వారసుల కుటుంబం కోసం ప్రజలను మద్యం దారులుగా తయారుచేస్తున్న ఘనత డీఎంకే ప్రభుత్వానికే దక్కిందన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారానికి వచ్చిన డీఎంకే ప్రభుత్వానికి రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెపుతారన్నారు. ద్రావిడ మోడల్ పేరు చెప్పుకుంటూ చంకలు గుద్దుకుంటున్న డీఎంకే నాయకులు ప్రస్తుతం ఎందుకు నోరు తెరవడం లేదని ప్రశ్నించారు. వేలూరు కార్పొరేషన్ పరిధిలో మొత్తం టెండర్‌లను డీఎంకే నాయకులు తీసుకొని కార్పొరేషన్ పూర్తిగా గుంతలమయంగా మార్చారన్నారు. వీటిపై కార్పొరేషన్ కమిషనర్ విచారణ జరిపి ప్రజలకు న్యాయం చేయాలన్నారు. అనంతరం డీఎంకే ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పట్టణ కార్యదర్శి వేలయగన్, కోశాధికారి మూర్తి, ఐటీ విభాగం రీజినల్ కార్యదర్శి జనని సతీస్‌కుమార్, జిల్లా కార్యదర్శి రాజన్, డివిజన్ కార్యదర్శులు కుప్పుస్వామి, జయశంకర్ పాల్గొన్నారు. రాణిపేట, తిరుపత్తూరు, జిల్లాలతో పాటు వివిధ తాలుకా కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు.

## సాంకేతికతతో ముందుకు..



సెంటర్‌ను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

కొరుక్కుపేట: పూర్తిస్థాయి, సరికొత్త సాంకేతికతతో ఈవీ వాహనాలు రంగం ముందుకు సాగుతోందని ఎంజీ మోటార్ ఇండియా మార్కెటింగ్ హెడ్ ఉదిత్ మల్హోత్ర తెలిపారు. ఈ మేరకు వేళచ్చేరిలోని ఫినిక్స్ మాల్‌లో ఎంజీ స్టూడియో జెడ్ పేరుతో ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లగ్జరీ కార్లు తదితర వాహనాల్లోని సదుపాయాలను డిజిటల్ పద్ధతిన కొనుగోలుదారులు వీక్షించడానికి ఈ స్టూడియో జెడ్ దోహదపడుతుందని అన్నారు. ఈ కేంద్రంలో కామెట్ ఈవీ ఎస్‌యూవీ, జెడ్ ఈవీ లగ్జరీ వాహనాల్లో లభించే సదుపాయాలను కస్టమర్లు సమగ్రంగా వీక్షించవచ్చని తెలిపారు. లగ్జరీ కార్ల సాంకేతిక వివరాలు, సదుపాయాలను కస్టమర్లకు చేరువవుతాయన్నారు.

## గొంతు కోసి చిన్నారి హత్య

తిరువొత్తియూరు: చిన్నారిని గొంతు కోసి దుండగులు హత్య చేశారు. విరుదునగర్ పాండియన్ నగర్ అన్నామలైకి చెందిన ముత్తురాజ్. ఇతని భార్య రామలక్ష్మి. ఆయనకు ముత్తుపాండి (07), అనే కుమారుడు, పాండీస్వరి, భానుప్రియ, చిత్ర అనే ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కొన్ని సంవత్సరాల క్రితం ముత్తురాజ్ అనారోగ్యంతో మరణించాడు. దీంతో రామలక్ష్మి బాలమురుగన్ అనే వ్యక్తిని రెండవ వివాహం చేసుకున్నారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి బాలుడు ముత్తుపాండిని గొంతు కోసం హత్యకు గురయ్యాడు. ఫిర్యాదు మేరకు విరుదునగర్ గ్రామ పోలీసులు ఆ ప్రాంతానికి చెందిన అజిత్ కేసు నమోదు చేసి ముత్తుపాండి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సేలం అలియాస్ విజయ్, ధనుష్ కోసం వెతుకుతున్నారు. హత్యపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

## ఆత్మను తీసుకొచ్చేందుకు వినూత్న పూజలు



కుమారుడికి ఫొటో పెట్టి పూజలు చేస్తున్న కుటుంబసభ్యులు

వేలూరు: తిరుపత్తూరు జిల్లా నాట్రంబల్లి సమీపంలోని సారకాల్‌నత్తం గ్రామానికి చెందిన కేశవన్ ఇతని భార్య వాసంతి. వీరికి ఎయిల్ అరసన్, ఉదయ్‌వసంత్(20) పిల్లలున్నారు. ఎయిల్ అరసన్ సారకాల నత్తం గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్‌గా ఉంటున్నాడు. ఉదయ్‌వసంత్ రెండు నెలల క్రితం అదే గ్రామంలో బైకులో వెళుతున్న సమయంలో లారీ ఢీకొని అక్కడిక్కడే మృతిచెందాడు. పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులు అదే గ్రామంలోని శ్మశానంలో దహన క్రియలు చేశారు. చెరువు గట్టు వద్ద ఆత్మగా తిరుగుతున్న ఉదయ్‌వసంత్ ఆత్మను ఇంటికి తీసుకొచ్చేందుకు కుటుంబ సభ్యులు నిర్ణయించుకున్నట్లు తెలుస్తుంది. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను సిద్ధం చేశారు. మంగళవారం సాయంత్రం మృతిచెందిన ఉదయ్‌వసంత్ ఆత్మను ఇంటికి తీసుకొచ్చేందుకు చెరువు గట్టు వద్ద కుటుంబ సభ్యులు పూజలు చేశారు. అక్కడ పూలకరగం పెట్టి నేలపై పసుపు, పుష్పాలు పెట్టి మేళ తాళాల నడుమ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉదయ్‌వసంత్ చిత్రపటంతో పాటు కరగను చెరువు గట్టు నుంచి ఇంటికి మేళ తాళాల నడుమ తీసుకొచ్చారు. ఆ సమయంలో ఒకటిన్నర కిలో మీటరు దూరం పసుపు నీళ్లు, పుష్పాలు చల్లి ఊరేగింపుగా వచ్చారు. అనంతరం ఉదయ్‌వసంత్ చిత్ర పటాన్ని ఇంట్లో పెట్టి పూల మాల వేసి పూజలు చేశారు. మృతి చెందిన కుమారుడి ఆత్మ ఇంటికి రావాలని కుటుంబసభ్యులు పూజలు చేసిన సంఘటన పలువురిని ఆశ్చర్యపరిచింది.

## హెచ్‌ఎంకు వ్యతిరేకంగా గ్రామస్తుల ఆందోళన



పాఠశాల ఎదుట నిరసన తెలుపుతున్న స్థానికులు

వేలూరు: వేలూరు జిల్లా అనకట్టు నియోజకవర్గం ఇలవంబాడి ప్రభుత్వ పాఠశాలలో సుమారు 280 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. హెచ్‌ఎంతో పాటు మొత్తం 14 మంది టీచర్లు ఉన్నారు. పాఠశాల హెచ్‌ఎంగా పూట్టుతాక్కు గ్రామానికి చెందిన గజేంద్రన్ పదేళ్లుగా ఇక్కడ పనిచేస్తున్నారు. ఈయన భార్య కూడా అదే పాఠశాలలో టీచర్‌గా పని చేస్తోంది. ఈ నేపథ్యంలో విద్యాశాఖ అధికారులు గజేంద్రన్‌ను గత ఏప్రిల్‌లో పేర్పంబట్టు ప్రభుత్వ పాఠశాలకు బదిలీ చేశారు. అయితే హెచ్‌ఎం బదిలీపై వెళ్లకుండా అదే పాఠశాలలోనే విధులు నిర్వహిస్తూ పది రోజులుగా మెడికల్ సెలవు పెట్టి ఇంటిలో ఉంటున్నారు. ఈ పాఠశాలలో 6వ తరగతి విద్యార్థులను చేర్పించేందకు హెచ్‌ఎంతో పాటు అసిస్టెంట్ హెచ్‌ఎం కూడా లేకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులకు పలు సమస్యలు ఎదురవుతున్నాయి. దీంతో ఆగ్రహించిన గ్రామస్తులు పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించి నినాదాలు చేశారు. విద్యాశాఖ అధికారులు వెంటనే హెచ్‌ఎం గజేంద్రన్‌ను మార్పు చేసి వేరే హెచ్‌ఎంను నియమించాలని, పాఠశాలలో విద్యా నాణ్యతను పెంచాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా హెచ్‌ఎంకు మద్దతుగా మరో వర్గానికి చెందిన వారు ధర్నా నిర్వహించి నినాదాలు చేశారు. ఆ సమయంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘర్షణలో అదే గ్రామానికి చెందిన బాబు, శివలకు గాయాలు కావడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయాలైన వారిని ఆసుపత్రికి తరలించారు. దీంతో గ్రామంలో పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## ఐదు టన్నుల చేపల మృతి



మృతి చెందిన చేపలు

- సమీప ప్రాంతాల్లో దుర్వాసన
- తొలగించాలని స్థానికుల వినతి

తిరువళ్లూరు: పుట్లూరు ప్రాంతానికి చెందిన చెరువుల్లో ఐదు టన్నుల చేపలు మృతిచెంది దుర్వాసన పెరగడంతో కాకలూరు, పుట్లూరు, తిరువూర్ ప్రాంతాలకు చెందిన ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. తిరువళ్లూరు జిల్లా పుట్లూరు గ్రామానికి చెందిన చెరువు విస్తీర్ణం వంద ఎకరాలు. ఈ చెరువుపై ఆధారపడి 150 ఎకరాల వ్యవసాయం సాగులో వుంది. దీంతో పాటు చెరువు నిండితే మూడు గ్రామాల్లో భూగర్భ జలాలు పెరిగే అవకాశం వుంది. పుట్లూరు చెరువుకు గతంలో వర్షపు నీరు మాత్రమే ప్రధాన ఆధారం. అయితే కాకలూరు సిప్‌కాట్ నుంచి వెలువడే వ్యర్థపు నీరు, పరిశ్రమల నుంచి వెలువడే కెమికల్ నీటిని గత నాలుగేళ్ల నుంచి పుట్లూరు చెరువుకు దారి మళ్లించారు. దీంతో పాటు తిరువళ్లూరు మున్సిపాలిటీ నుంచి సబ్‌వే డ్రైనేజీ ద్వారా సేకరించే నీటిని శుద్ధీకరణ చేసిన నీటిని పుట్లూరు చెరువులో వదలాల్సి ఉంది. అయితే శుద్ధీకరణ చేయకుండానే పుట్లూరు చెరువుకు నీటిని వదులుతున్నారు. దీంతో మురుగు, కెమికల్ నీరు కలిసి పుట్లూరు చెరువులో పేరుకపోవడంతో కాకలూరు, తిరువళ్లూరు, తిరువూర్, పుట్లూరు గ్రామాలకు దుర్వాసన వెదజల్లుతోంది. ఇదే సమస్యపై నాలుగు ప్రాంతాలకు చెందిన ప్రజలు గతంలో కలెక్టర్ సహా ఉన్నత అధికారులను కలిసి మురుగునీటితో ఏర్పడుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు. అయినా ఫలితం కనిపించలేదు. బుధవారం చెరువులో ఐదు టన్నుల మేరకు చేపలు మృతి చెంది ఒడ్డుకు చేరాయి. దీంతో దుర్వాసన మరింత పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే మృతిచెందిన చేపలను తొలగించాలని కోరుతున్నారు.

## ఘనంగా ఎన్‌ఏసీ జ్యువెలర్స్ వార్షికోత్సవం

- వ్యవస్థాపకుడు ఎన్.ఆంజనేయులు చెట్టికి నివాళులు
- చారిటీ సంస్థలకు రూ.50 లక్షల విరాళం




మెడికల్ రీసెర్చ్ కోసం రూ.5 లక్షలు విరాళంగా ఇస్తున్న ఎన్‌ఏసీ జ్యువెలర్స్ యాజమాన్యం

కొరుక్కుపేట: దక్షిణ భారతదేశంలోని ప్రముఖ ఆభరణాల దుకాణాలలో ఒకటైన ఎన్ఏసీ జ్యువెలర్స్ 50వ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఆనందం ఫౌండేషన్ నుంచి విరాళాల ద్వారా స్వచ్ఛంద కార్యక్రమాలకు సహకరిస్తున్న వారికి రూ.50 లక్షల విరాళాలు అందిస్తున్నారు. అలాగే ఎన్ఏసీ జ్యువెలర్స్ వ్యవస్థాపకుడు, దివంగత ఎన్.ఆంజనేయులు చెట్టికి నివాళులర్పించారు. అలాగే 50వ వార్షికోత్సవం సందర్భంగా జూలై 1 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించే గోల్డెన్ వీక్ వేడుకలను ప్రారంభించారు. చెన్నైలోని మైలాపూర్‌లో వున్న ఎన్ఏసీ స్టోర్‌లో ఏర్పాటు చేసిన ఎన్.ఆంజనేయులు చెట్టి శిలా విగ్రహాన్ని ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీనియర్ న్యాయవాది కె.దురైస్వామి, గౌరవ అతిథులుగా పాల్గొన్న వేల్స్ వర్సిటీ వ్యవస్థాపక చాన్సలర్ డాక్టర్ ఐసరీ కె.గణేష్‌తో పాటు ఎన్ఏసీ జ్యువెలర్స్ చైర్మన్ అనంత పద్మనాభన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు అనంత రామానుజం, అర్జున్ వరదరాజ కలిసి ఆవిష్కరించారు. రూ.50 లక్షల విరాళంలో చెన్నైలోని అడయార్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు రూ.5 లక్షలు, శంకర నేత్రాలయానికి రూ.5లక్షలు, మిగిలిన రూ.40 లక్షలు విలువైన సంస్థలకు పంపిణీ చేయడం సహా స్వచ్ఛంద కార్యక్రమాలకు కూడా వినియోగిస్తున్నట్టు తెలిపారు. 50వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా ఎన్ఏసీ జ్యువెలర్స్ గోల్డెన వీక్‌ను జూలై 1 నుంచి 8 వరకు అన్ని స్టోర్‌లలో ఉత్తేజకరమైన కార్యకలాపాలు, గేమ్‌లను కలిగి ఉంటుందన్నారు. ప్రత్యేకమైన ఆఫర్‌లు, బహుమతులతో కూడిన లాయల్టీ ప్రోగ్రామ్ ద్వారా దీర్ఘకాల పోషకులు రివార్డ్ చేయబడతాయని వెల్లడించారు.

## చోరీ కేసులో దొంగ అరెస్ట్

తిరువొత్తియూరు: పెరంబూర్ నగల దుకాణం చోరీ కేసులో ఆంధ్రాలో దాక్కున్న నిందితుడిని పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. చెన్నై పెరంబూర్ పేపర్‌మిల్స్, ఫిబ్రవరి 10న రోడ్డులోని జేఎల్ జ్యువెలరీ షాపులో రూ.20 లక్షల విలువైన 8 కిలోల బంగారు ఆభరణాలు, వజ్రాభరణాలు చోరీకి గురయ్యాయి. నగల దుకాణం యజమాని జయచంద్రన్ కుమారుడు శ్రీధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తిరువికానగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. గంగాధరన్, స్టీఫెన్ అను నేరస్తులు, రెండున్నర కిలోల బంగారు ఆభరణాలతో బెంగళూరు మహాలక్ష్మి లేఅవుట్ పోలీసుస్టేషన్‌లో లొంగిపోయారు. అనంతరం ప్రత్యేక పోలీసులు బెంగుళూరు వెళ్లి గజేంద్రన్ దివాకర్‌తో పాటు ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. వారి నుంచి రెండు కిలోల బంగారాన్ని స్వాధీనం చేసుకుని పుళల్ జైలుకు తరలించారు. ఈ స్థితిలో గంగాధరన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని అతని భార్య గీతను, ఆ నగలను తన బావమరిది రాఘవేంద్రకు ఇచ్చి కరిగించాడని వాటిని నగదు చేసినట్టు తెలిసింది. అనంతరం గీత, రాఘవేంద్రన్‌లను అరెస్టు చేశారు. వారి నుంచి 400 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం బెంగుళూరులో ఉన్న అరుణ్‌ను అరెస్ట్ చేశారు. అతడి నుంచి 200 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి ఇప్పటి వరకు ఏడుగురిని అరెస్టు చేసి వారి నుంచి ఆరు కిలోల 500 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు గౌతం (26)ను 10 రోజుల క్రితం ఆంధ్రప్రదేశ్‌లోని మదనపల్లిలో ప్రత్యేక పోలీసులు అరెస్టు చేశారు. దోపిడీ సమయంలో ఇతను వాహన డ్రైవర్. అతడి నుంచి అర కిలో బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అతడిని బుధవారం తెల్లవారుజామున చెన్నైకు తీసుకొచ్చి విచారిస్తున్నారు. ఇప్పటికే ఏడుగురిని అరెస్టు చేయగా ఇప్పుడు గౌతమ్‌ను అరెస్టు చేసి పెరంబూరు నగల దుకాణ దోపిడీ కేసులో నిందితులందరినీ అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు.

## క్లుప్తంగా...

### 23 నుంచి కేజీబీవీ టీచర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

పోస్టుకు ముగ్గురు చొప్పున 4,243 మంది ఎంపిక

సాక్షి, అమరావతి: కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో టీచర్ పోస్టుల భర్తీకి ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు జిల్లాల్లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. రాష్ట్రంలోని కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న 1,543 పోస్టుల భర్తీకి సమగ్ర శిక్ష ఇటీవల నోటిఫికేషన్ ఇవ్వగా, 46,173 దరఖాస్తులు అందాయి. పోస్టుకు ముగ్గురి చొప్పున అర్హత, ప్రతిభ కలిగిన అభ్యర్థులను 4,243 మందిని ఎంపిక చేసి, వారి వివరాలను జిల్లాలకు పంపించారు. బుధ, గురువారాల్లో అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించి, శుక్రవారం నుంచి డీఈవో, జాయింట్ కలెక్టర్, సబ్జెక్ట్ నిపుణులతో పాటు ఐదుగురి సభ్యులు బృందం అభ్యర్థులను ఇంటర్వ్యూ చేసి, తుది జాబితా సిద్ధం చేస్తుందని సమగ్ర శిక్ష రాష్ట్ర ఎస్పీడీ శ్రీనివాసరావు తెలిపారు.

### నవోదయలో ప్రవేశాలకు నోటిఫికేషన్

సాక్షి, అమరావతి: జవహర్ నవోదయ విద్యా సంస్థల్లో 2024–25 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాలకు కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 1.5-2012 నుంచి 30-07-2014 మధ్య జన్మించి, ఆయా జిల్లాలోని ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 2023–24 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి చదువుతూ ఉండాలి. జవహర్ నవోదయ విద్యా సంస్థ ఆధ్వర్యంలో ఏపీలో 15, తెలంగాణలో 9 పాఠశాలలు ఉన్నాయి. ప్రవేశ పరీక్ష ద్వారా ఆరో తరగతిలోకి విద్యార్థులను ఎంపిక చేస్తారు. విద్యార్థులు ఆగస్టు 10వ తేదీ లోగా https:// cbseitms. rcil. gov. in/ nvs/లో దరఖాస్తు చేసుకోవాలని ప్రకటించింది.

### ఎస్ఎస్‌సీలో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, అమరావతి: రాష్ట్ర పాఠశాల విద్య పరీక్షల సంచాలకుల కార్యాలయం (ఎస్ఎస్‌సీ బోర్డు)లో ఖాళీగా ఉన్న జూనియర్ అసిస్టెంట్, డేటా ప్రాసెసింగ్ అసిస్టెంట్ పోస్టుల భర్తీ చేయనున్నారు. ఔట్ సోర్సింగ్ విధానంలో ఈ పోస్టులను భర్తీ చేయనున్నట్టు విద్యాశాఖ ఓ ప్రకటనలో పేర్కొంది. అర్హత గల అభ్యర్థులు శుక్రవారం నుంచి జూలై 7వ తేదీ వరకు https:// www. bse. ap. gov. in లేదా https:// dge& ap. aptonline. inలో దరఖాస్తు చేసుకోవచ్చని ప్రకటించింది.

### సీపెట్‌లో ప్రవేశాలకు 30 వరకు గడువు

గన్నవరం రూరల్: సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ(సీపెట్)లో ప్రవేశాలకు ఈ నెల 30వ తేదీ లోగా విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సీపెట్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ చింతా శేఖర్ బుధవారం సూచించారు. 2023–24 విద్యా సంవత్సరానికి జాబ్ ఓరియంటెడ్ కోర్సులైన మూడు సంవత్సరాల కాల పరిమితి కలిగిన డిప్లొమా, రెండు సంవత్సరాల వ్యవధి గల పోస్టు గ్రాడ్యుయేషన్ డిప్లొమో కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. 10వ తరగతి విద్యార్హతతో డిప్లొమో ఇన్ ప్లాస్టిక్ టెక్నాలజీ, ప్లాస్టిక్స్ మౌల్డ్ టెక్నాలజీ, బీఎస్సీ విద్యార్హతతో డిప్లొమో ఇన్ ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్ అండ్ టెస్టింగ్ కోర్సుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఏపీలో 10వ తరగతి సప్లిమెంటరీ విద్యార్థుల విజ్ఞప్తి మేరకు ఫేజ్–2 ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహిస్తామని, పీజీ విద్యార్థులకు అవకాశం కల్పిస్తున్నామని, ఆసక్తి ఉన్న వారు సెల్ నంబర్ 99859 41979లో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

### రూ.85.73 కోట్ల విలువైన గంజాయి స్వాధీనం

ఇద్దరు అరెస్టు

సాక్షి, అమరావతి: అక్రమంగా తరలిస్తున్న రూ.85.73 కోట్ల విలువైన 428.67 కేజీల గంజాయిని విజయవాడ కస్టమ్స్ విభాగం అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే...విజయవాడ కస్టమ్స్ విభాగం అధికారులు తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు వద్ద తనిఖీలు నిర్వహించారు. ప్రత్యేకంగా రూపొందించిన ఓ వాహనంలో అక్రమంగా తరలిస్తున్న రూ.85.73కోట్ల విలువైన గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేసి వారిపై కేసు నమోదు చేశారు.

### ఇద్దరు అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్ల అరెస్ట్

ఏర్పేడు(తిరుపతి జిల్లా) : అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లింగ్ కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.1.33 లక్షలు విలువ చేసే 10.17 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు రేణిగుంట డీఎస్పీ భవ్యకిషోర్ తెలిపారు. బుధవారం ఏర్పేడు పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. ముందస్తు సమాచారం మేరకు ఏర్పేడు సమీపంలోని హెచ్‌పీ గ్యాస్ గోదాము వద్ద మంగళవారం సాయంత్రం గంజాయిని తరలిస్తున్న కేరళకు చెందిన ఏ1 పి.రవీంద్రన్‌రంజిత్ అలియాస్ రంజిత్ అలియాస్ అర్జున్, ఏ7 నెల్లిక్కాల్ మోహనన్ విష్ణు అలియాస్ విష్ణును అరెస్ట్ చేశామన్నారు. కాగా ఈ నెల 13న ఏర్పేడుకు సమీపంలోని వెంకటగిరి రోడ్డులో వాహనాన్ని తనిఖీ చేయగా.. రూ.20 లక్షలు విలువ చేసే గంజాయి, ఏ2 జీజేష్, ఏ5 వెంకటరమణ, ఏ6 రామకృష్ణను అరెస్ట్ చేసి పీడీ యాక్ట్ నమోదు చేశామన్నారు. అప్పట్లో 8 మందిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

# యోగాతో ప్రశాంతత

## పలుచోట్ల యోగాదినోత్సవంలో పాల్గొన్న ఉన్నతాధికారులు

- కేంద్రమంత్రులు భారతీప్రవీణ్ పవార్, దేవుసిన్హ్ చౌహాన్, మురళీధరన్
- భీమవరం, లేపాక్షి, విశాఖల్లో యోగా దినోత్సవంలో కేంద్రమంత్రులు



భీమవరం విష్ణు కళాశాలలో యోగాసనాల్లో పాల్గొన్న కేంద్రమంత్రి భారతీప్రవీణ్ పవార్, కలెక్టర్ ప్రశాంతి తదితరులు

సాక్షి, అమరావతి/సాక్షి, భీమవరం/లేపాక్షి/సీతంపేట/సింథియా: యోగాసాధన ద్వారా శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ప్రయోజనాలను ప్రోత్సహించడం ప్రపంచ యోగాదినోత్సవ ముఖ్య లక్ష్యమని కేంద్ర ఆరోగ్య, కుటుంబసంక్షేమశాఖ సహాయమంత్రి డాక్టర్ భారతీప్రవీణ్ పవార్ చెప్పారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలోని విష్ణు కళాశాల ఆడిటోరియంలో బుధవారం ఏర్పాటు చేసిన అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగాద్వారా నిత్యం ఆరోగ్యంగా ఉండడానికి మన దేశం ఆచరణాత్మక విధానమే కారణమన్నారు. యోగాను ప్రజలకు తెలిపి ప్రపంచవ్యాప్తంగా విస్తృత అవగాహన కల్పించింది ప్రధాని నరేంద్రమోదీయేనని చెప్పారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి భారతీప్రవీణ్ పవార్, కలెక్టర్ పి.ప్రశాంతి విద్యార్థులతో కలిసి యోగాసనాలు వేశారు.

**యోగా వ్యాప్తికి ప్రధాని కృషి అమోఘం**

ప్రపంచ దేశాల్లో యోగావ్యాప్తికి ప్రధాని నరేంద్ర మోదీ చేస్తున్న కృషి అమోఘమని కేంద్ర కమ్యూనికేషన్లశాఖ సహాయ మంత్రి దేవుసిన్హ్ చౌహాన్ చెప్పారు. శ్రీసత్యసాయి జిల్లా లేపాక్షిలోని నంది విగ్రహం వద్ద బుధవారం జరిగిన అంతర్జాతీయ యోగ దినోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాతో సర్వరోగాలు దూరమవుతాయని చెప్పారు. ఒత్తిడి తగ్గించుకోవడం యోగాతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ కార్యదర్శి సునీల్ దియోధర్ తదితరులు పాల్గొన్నారు. విశాఖపట్నం పోర్టు అథారిటీ ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం పోర్టు స్టేడియంలో నిర్వహించిన అంతర్జాతీయ యోగాదినోత్సవంలో కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాలు, విదేశీ వ్యవహారాలశాఖ సహాయమంత్రి వి.మురళీధరన్ పాల్గొన్నారు.

**వారసత్వ సంపద యోగా**

యోగా మన వారసత్వసంపద అని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు చెప్పారు. ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం విజయవాడలో నిర్వహించిన యోగా దినోత్సవంలో ఆయన మాట్లాడారు. ప్రపంచానికి ఆరోగ్యదిక్సూచిగా యోగాను అందించిన ఘనత భారతదేశానికే దక్కుతుందని పురావస్తుశాఖ కమిషనర్ జి.వాణీమోహన్ చెప్పారు. విజయవాడలోని బాపు మ్యూజియంలో బుధవారం నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ఆమె మాట్లాడారు.అనంతరం మ్యూజియం నుంచి మొగల్రాజపురం వరకు ర్యాలీ నిర్వహించారు. ఉద్యోగులు, అధికారులు పని ఒత్తిడి నుంచి ఉపశమనం పొందడానికి యోగా సాధన చేయాలని రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ ఎండీ లక్ష్మీషా సూచించారు. విజయవాడలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో బుధవారం నిర్వహించిన యోగదినోత్సవంలో ఆయన మాట్లాడారు.

**తూర్పు నౌకాదళం ఆధ్వర్యంలో..**

తూర్పు నావికాదళం పరిధిలోని అన్ని యూనిట్లలో యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో సుమారు 10 వేలమంది నౌకాదళ సిబ్బంది, డిఫెన్స్ సెక్యూరిటీ కార్ప్స్, వారి కుటుంబసభ్యులు పాల్గొన్నారు. సముద్ర ఉపరితలం మీద ఉన్న నౌకల్లో, తీరంలో వివిధ ఓడరేవుల్లో, విదేశీ పోర్టుల్లో ఉన్న ఈస్టర్న్ ఫ్లీట్ షిప్‌లలో కూడా యోగా దినోత్సవం నిర్వహించారు. ఇండోనేషియాలోని జకార్తాలో ఐఎన్ఎస్ శివాలిక్, బంగ్లాదేశ్‌లోని చటోగ్రామ్‌లో ఐఎన్ఎస్ కిల్తాన్, థాయ్‌లాండ్‌లోని పుకెట్‌లో ఐఎన్ఎస్ సుమిత్ర నౌకల్లో సిబ్బంది యోగాసనాలు వేశారు. మల్కాపురంలోని కేంద్రీయ విద్యాలయంలోని చిన్నారులతో ఇషా ఫౌండేషన్ ప్రతినిధులు యోగాసనాలు వేయించారు. భారతీయ త్రివర్ణ థీమ్‌తో నేవీ సిబ్బంది చేసిన యోగా సాధన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

### యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం

గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్



సాక్షి, అమరావతి: ఆరోగ్యకర జీవనానికి యోగా ఒక శాస్త్రీయమార్గమని గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ చెప్పారు. శరీరానికి, మనసుకు మధ్య చక్కటి సమన్వయంతో ఆరోగ్యరక్షణకు యోగా ఉపయోగపడుతుందన్నారు. విజయవాడలోని రాజ్‌భవన్‌లో బుధవారం నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ఆయన పలు యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం యోగా సాధనతో శరీరక, మానసిక ఆరోగ్యం సాధ్యమని చెప్పారు. ఒత్తిడిని దూరం చేసి లక్ష్యసాధనకు యోగా దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అశోక్ సింఘాల్, జాయింట్ కార్యదర్శి పి.నారాయణస్వామి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

**హైకోర్టులో యోగా దినోత్సవం**

సాక్షి, అమరావతి: హైకోర్టులో బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ ఆకుల వెంకటశేషసాయితో పాటు పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు, ఉద్యోగులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. యోగా గురువు బైసు మల్లికార్జునరావు ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు.

### వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో దివ్యాంగుల యోగా

ఏయూక్యాంపస్: సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో రోటరీ క్లబ్ సహకారంతో ఆంధ్ర విశ్వవిద్యాలయం సౌజన్యంతో బుధవారం 500 మంది దివ్యాంగ విద్యార్థులు అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏయూలో జరిగిన ఈ కార్యక్రమం ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదైంది. కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి, సమగ్ర శిక్ష రాష్ట్ర అదనపు పథక సంచాలకుడు డాక్టర్ కె.వి.శ్రీనివాసులురెడ్డి, రాష్ట్ర సహిత విద్య కో ఆర్డినేటర్ ఎస్.కె.అన్నపూర్ణ, డీఈవో ఎల్.చంద్రకళ, అనకాపల్లి, విశాఖపట్నం, విజయనగరం జిల్లాల నుంచి దివ్యాంగ విద్యార్థులు, ప్రత్యేక ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థులను పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేశ్‌కుమార్, సమగ్ర శిక్ష రాష్ట్ర పథక సంచాలకుడు బి.శ్రీనివాసరావు అభినందించారు.



యోగా సనాలు వేస్తున్న కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి, సమగ్ర శిక్ష రాష్ట్ర అదనపు పథక సంచాలకులు డాక్టర్ కె.వి.శ్రీనివాసులు రెడ్డి తదితరులు

### ద్విభాషా పుస్తకాలపై కేంద్ర మంత్రి కితాబు

పూణెలో 'ఏపీ స్టాల్'ను సందర్శించిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్



బైలింగ్యువల్ టెక్స్ట్ బుక్స్‌ను పరిశీలిస్తున్న కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లోని పాఠశాల విద్యార్థులకు బైలింగువల్ పాఠ్యపుస్తకాలు అందించడం గొప్ప పరిణామమని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కితాబిచ్చారు. జి–20లో భాగంగా పూణెలో జరుగుతున్న 'జన్ భాగిదారీ' కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ ఏర్పాటు చేసిన 'ఫౌండేషనల్ స్కూల్' స్టాల్‌ను బుధవారం కేంద్రమంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన నూతన జాతీయ విద్యా విధానాన్ని అనుసరించి గిరిజన విద్యార్థుల కోసం రూపొందించిన మాతృ భాషాధారిత బహుభాషా (సవర, కొండ, కువి, ఆదివాసీ ఒడియా, కోయ, సుగాలి) బైలింగ్యువల్ పాఠ్య పుస్తకాలను ఆసక్తిగా పరిశీలించారు. ఇలాంటి పాఠ్య పుస్తకాల రూపకల్పనలో ఏపీ ప్రభుత్వం చేస్తున్న కృషిని మంత్రి అభినందించారు. కేంద్ర ప్రభుత్వ విద్యామంత్రిత్వశాఖ సలహాదారు డాక్టర్ రామచంద్ర, పశ్చిమ బెంగాల్ ఎస్సీఈఆర్టీ ప్రతినిధులు, మహారాష్ట్ర డైట్ ప్రతినిధులు, వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పునాది విద్యకు అవలంబిస్తున్న పద్ధతులను అడిగి తెలుసుకున్నారు.

### ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రావత్‌కు బెయిలబుల్ వారెంట్

ఆదేశాలు జారీ చేసిన హైకోర్టు

సాక్షి, అమరావతి : కోర్టు ధిక్కార కేసులో తమ ముందు హాజరు కావాలంటూ ఇచ్చిన ఆదేశాలను బేఖాతరు చేసినందుకు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి షంషేర్ సింగ్ రావత్‌కు హైకోర్టు బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరీ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. వినుకొండ మునిసిపాలిటీలో సీసీ రోడ్డు నిర్మాణానికి తాము సమర్పించిన ఎర్నస్ట్ మనీ డిపాజిట్ (ఈఎండీ), ఫ్యూచర్ సెక్యూరిటీ డిపాజిట్ (ఎఫ్ఎస్‌డీ) సొమ్మును వాపసు ఇచ్చేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ కాంట్రాక్టర్ జె.వెంకటేశ్వరరెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ జరిపిన హైకోర్టు.. ఈఎండీ, ఎఫ్ఎస్‌డీలను పిటిషనర్‌కు వాపసు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ ఆదేశాలను అమలు చేయలేదంటూ అధికారులపై వెంకటేశ్వరరెడ్డి కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన జస్టిస్ రవినాథ్ తిల్హరీ తమ ఆదేశాలను ఎందుకు అమలు చేయలేదో స్వయంగా హాజరై వివరణ ఇవ్వాలని ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రావత్‌ని ఆదేశించారు. తాజాగా బుధవారం ఈ వ్యాజ్యం విచారణకు రాగా, విచారణ మరో రోజుకు వాయిదా వేయాలని ప్రభుత్వ న్యాయవాది అభ్యర్థించారు. అందుకు అంగీకరించిన న్యాయమూర్తి, వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు కోరుతూ పిటిషన్ దాఖలు చేసుకోవాలని సూచించారు. విచారణను మధ్యాహ్నానికి వాయిదా వేశారు. మధ్యాహ్నం తిరిగి విచారణ చేపట్టగా, ప్రభుత్వ న్యాయవాది హాజరు కాలేదు. వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు కోరుతూ ఎలాంటి పిటిషన్ దాఖలు చేయలేదు. దీంతో న్యాయమూర్తి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. రావత్‌కు బెయిలబుల్ వారెంట్ జారీ చేశారు. తదుపరి విచారణను జూలై 12కి వాయిదా వేశారు.

### కులవృత్తులను కాపాడడమే లక్ష్యం: లోకేశ్

డక్కిలి: కులవృత్తులను కాపాడటమే తమ పార్టీ లక్ష్యమని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే చేనేత కార్మికులను ఆదుకోవడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామని టీడీపీ నాయకుడు లోకేశ్ చెప్పారు. యువగళం పాదయాత్రలో భాగంగా ఆయన బుధవారం తిరుపతి జిల్లా డక్కిలిలో చేనేత కార్మికులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే వెంకటగిరిలో టెక్స్‌టైల్ పార్కు తీసుకొచ్చి చేనేతవర్గాలకు ఉపాధి కల్పిస్తామని చెప్పారు. ఒకే సంతకంతో రూ.110 కోట్ల చేనేత రుణాలు మాఫీచేసింది టీడీపీనే అని పేర్కొన్నారు. ఆదరణ పథకం ద్వారా సబ్సిడీతో మగ్గాలు, వర్షాకాలంలో చేనేతలకు పింఛను సౌకర్యం కల్పించామన్నారు. హ్యాండ్‌లూమ్, పవర్ లూమ్‌ల మధ్య తేడా తెలిసేలా ప్రత్యేక బ్రాండింగ్ తీసుకురావడం కోసం కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. మెరుగైన వసతులతో షెడ్లు నిర్మించి కార్మికులు అక్కడికి వచ్చి చీరలు నేసుకునే అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. వెంకటగిరి చేనేతకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందన్నారు. తన తల్లి, సతీమణి కూడా వెంకటగిరి చీరలు ధరిస్తారని తెలిపారు. వెంకటగిరి చేనేతలను ఆదుకునే బాధ్యత తనదన్నారు. సొంతంగా మగ్గం నేసుకునే కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తామని చెప్పారు. చేనేత కార్మికులకు గతంలో ఇచ్చే అన్ని సబ్సిడీలను జగన్‌మోహన్ రెడ్డి పాలనలో రద్దుచేశారన్నారు. తాము అధికారంలోకి రాగానే 18 ఏళ్లు నిండిన మహిళలకు ప్రతి నెల రూ.1,500 ఇస్తామని, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని చెప్పారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామన్నారు. ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం పేరుతో రూ.15 వేలు ఇస్తామన్నారు. ఆ వంతున ముగ్గురు పిల్లలు ఉంటే రూ.45 వేలు ఇస్తామని చెప్పారు. అనంతరం ఆయన లింగసముద్రం, మోపూరురోడ్డు, పలుగోడు, మిట్టపాళెం, నాగవోలు గ్రామాల మీదుగా వెంకటగిరికి పాదయాత్ర కొనసాగించారు. మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి, బొలిగల మస్తాన్ యాదవ్, పోలంరెడ్డి వెంకటరెడ్డి, ఏలేశ్వరం రామచంద్రనాయుడు, పి.కోటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల సంక్షేమంలో ఏపీ అగ్రగామి

వైఎస్సార్‌సీపీపీ రాష్ట్ర కో ఆర్డినేటర్ వి.విజయసాయిరెడ్డి



సాక్షి, అమరావతి: దేశంలో దివ్యాంగుల సంక్షేమంలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా నిలిచిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ (వైఎస్సార్‌సీపీపీ) నాయకుడు, పార్టీ కో ఆర్డినేటర్, పార్టీ అనుబంధ విభాగాల ఇన్‌చార్జి వి.విజయసాయిరెడ్డి చెప్పారు. ఆయన బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి పార్టీ దివ్యాంగుల విభాగ సమావేశాన్ని టెలీకాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక వేలాదిమంది దివ్యాంగులకు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు పెన్షన్ ఇస్తూ అండగా నిలుస్తోందని చెప్పారు. 14 రకాల రోగపీడితులు, వైకల్యాలున్న 7,98,352 మందికి నెలకు రూ.255 కోట్లకుపైగా పింఛన్లు ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతినెల ఒకటో తేదీనే వలంటీర్ ద్వారా నేరుగా దివ్యాంగుని వద్దకే పెన్షన్ పంపుతున్నట్లు చెప్పారు. దివ్యాంగులకు మూడు శాతం ఉన్న రిజర్వేషన్లను నాలుగు శాతానికి పెంచి ఉద్యోగ నియామకాల్లోను, ప్రమోషన్లలోను అవకాశం కల్పిస్తున్నారన్నారు. పార్టీ దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు కిరణ్‌రాజ్ నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు, జోనల్ ఇన్‌చార్జీలు పాల్గొన్నారు.

**వినతుల స్వీకరణ**

వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో వరసగా మూడోరోజు బుధవారం కూడా వి.విజయసాయిరెడ్డి గ్రీవెన్స్ డే నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

## 'వాణిజ్యపన్నుల' అవినీతి కేసులో కొనసాగిన సోదాలు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: వాణిజ్యపన్నుల శాఖలో అవినీతికి పాల్పడినట్లు అభియోగాలు ఎదుర్కొంటున్న ఐదుగురి ఇళ్లల్లో ఎన్టీఆర్ జిల్లా పోలీసుల సోదాలు రెండోరోజు బుధవారం కూడా కొనసాగాయి. ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కె.ఆర్.సూర్యనారాయణ, వాణిజ్యపన్నుల శాఖ జీఎస్టీ అధికారులు బలిజేపల్లి మెహర్‌కుమార్, కంచర్లకోట సంధ్య, సీనియర్ అసిస్టెంట్ కావూరి వెంకటచలపతి, ఆఫీస్ సబార్డినేట్ మరీదు సత్యనారాయణ ఇళ్లల్లో మంగళవారం పోలీసులు తనిఖీలు ప్రారంభించిన విషయం తెలిసిందే. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా ఆదేశాలతో డీసీపీ విశాల్‌గున్ని నేతృత్వంలో ఆరుబృందాలు ఈ సోదాలు చేస్తున్నాయి. విజయవాడ సత్యనారాయణపురం, కృష్ణాజిల్లా కానూరు, గుడివాడతో పాటు హైదరాబాద్‌లోని వారి ఇళ్లల్లో పోలీసులు సోదాలు చేశారు. ఆయా ఇళ్లల్లో రూ.కోట్ల విలువైన బినామీ ఆస్తిపత్రాలు, సరైన బిల్లులు లేని బంగారం, బంగారు ఆభరణాలు, నగదును పోలీసులు గుర్తించినట్లు విశ్వసనీయ సమాచారం. అవినీతి సొమ్ముతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో రూ.కోట్ల విలువైన భూములను కొనుగోలు చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. వాణిజ్యపన్నుల శాఖలో పనిచేసే ఈ నలుగురు ఉద్యోగుల అవినీతి వెనుక ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కె.ఆర్.సూర్యనారాయణ హస్తం ఉందని పోలీసులు భావిస్తున్నారు. ఈ తనిఖీల్లో దీనికి సంబంధించిన కొన్ని పత్రాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. కీలక సూత్రధారి సూర్యనారాయణ ఇంకా పరారీలోనే ఉన్నారు.

## డిపాజిట్ అంటే చార్జీ కాదు

**అదనపు వినియోగానికి డిపాజిట్ నిబంధన కొత్తగా రాలేదు**

- ఎన్నో ఏళ్లుగా గృహ, వ్యవసాయేతర వినియోగదారులకు అమలులో ఉంది
- ఏసీడీపై రిజర్వ్ బ్యాంక్ నిర్దేశించిన రేట్ల ప్రకారం వడ్డీ
- సర్వీసు రద్దు చేసుకుంటే వినియోగదారుడికి తిరిగి చెల్లింపు
- అయినా ప్రభుత్వంపై బురదజల్లేందుకే ఈనాడు ప్రయత్నం

సాక్షి, అమరావతి: సెక్యూరిటీ డిపాజిట్‌కి, విద్యుత్ చార్జీకి తేడా తెలియకుండా 'విద్యుత్ వినియోగదారులపై ఏసీడీ బాదుడు' అంటూ ఈనాడు మరో అబద్ధాన్ని అచ్చేసింది. ఎన్నో ఏళ్లుగా అమలులో ఉన్న దానిని ఇప్పుడే కొత్తగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్నట్లు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసింది. డిపాజిట్‌పై వడ్డీ వస్తుందని, సర్వీసును రద్దు చేసుకుంటే ఆ మొత్తాన్నీ వినియోగదారునికి తిరిగి ఇచ్చేస్తారనే వాస్తవాలను దాచిపెట్టి ప్రభుత్వంపై బురదజల్లేందుకు తప్పుడు కథనాన్ని నిస్సిగ్గుగా వండి వార్చింది. ఈ రోత రాతలను విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు తీవ్రంగా ఖండించాయి. ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) చీఫ్ జనరల్ మేనేజర్ (రెవెన్యూ) ఎ.వెంకటేశ్వరరావు అసలు వాస్తవాలను వెల్లడించారు.

**'ఏపీఈఆర్‌సీ' ఆదేశాల ప్రకారమే**

నిజానికి అదనపు వినియోగానికి డిపాజిట్ (ఏసీడీ) ఇప్పుడు కొత్తగా వచ్చిందేమీ కాదు. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) 2004లోనే జారీ చేసిన రెగ్యులేషన్ 6 ప్రకారం అదనపు సెక్యూరిటీ డిపాజిట్ వసూలు ఎన్నో ఏళ్లుగా అమలులో ఉంది. గృహ, వ్యవసాయ వినియోగదారులు తప్ప మిగిలిన వినియోగదారులందరూ దీని పరిధిలోకి వస్తారు. ఒక సర్వీసుపై గతేడాది వినియోగించిన యూనిట్లలో సరాసరి రెండు నెలల మొత్తాన్ని లెక్కించి, అదనపు వినియోగ డిపాజిట్‌ను నిర్ణయిస్తారు. ప్రతి ఏటా మే నెలలో అదనపు డిపాజిట్ వసూలు చేయాల్సి వచ్చినపుడు నోటీసు ఇవ్వడం కూడా సర్వ సాధారణంగా జరిగేదే. గడువు లోపు డిపాజిట్ చెల్లించకపోతే అపరాధ చార్జీలు వసూలు చేసే విధానం కూడా పూర్వం నుంచే అమలులో ఉంది. అంతేకాకుండా వినియోగదారులు చెల్లించిన డిపాజిట్‌పై ఏపీఈఆర్‌సీ ఆదేశాల మేరకు, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్దేశించిన రేట్ల ప్రకారం ప్రతి ఏటా 5వ నెలలో డిస్కంలు వడ్డీని చెల్లిస్తాయి. దానిని వినియోగదారుల విద్యుత్ బిల్లులో సర్దుబాటు చేస్తాయి. దీనినిబట్టి అదనపు సెక్యూరిటీ డిపాజిట్ వసూలు చేయడమనేది పూర్తిగా ఏపీఈఆర్‌సీ ఆదేశాలకు లోబడి మాత్రమే జరుగుతోంది. పైగా సెక్యూరిటీ డిపాజిట్ అనేది విద్యుత్ చార్జీల కిందకి రాదు. ఇది కేవలం డిపాజిట్ మాత్రమే. వినియోగదారుడు అతని సర్వీసు రద్దు చేసుకుంటే, ఆ రోజుకు ఉన్న విద్యుత్ చార్జీల బకాయిలను మినహాయించుకుని మిగిలిన మొత్తాన్ని అతనికి తిరిగి ఇచ్చేస్తారు. వాస్తవాలు ఇంత స్పష్టంగా ఉన్నప్పటికీ, ఈనాడుకు మాత్రం ఇవేవీ కనిపించవు. కనీసం ఏసీడీని ఎప్పటి నుంచో చెల్లిస్తున్న వినియోగదారులు ఈనాడు వార్తను చూసి నవ్వుతారనే సిగ్గు కూడా రామోజీకి లేదు.

## నడి సంద్రంలో 12 గంటల పాటు మృత్యు పోరాటం

ప్రమాదానికి ఎదురీది ప్రాణాలు కాపాడుకున్న మత్స్యకారుడు



పిఠాపురం: ప్రాణాల మీద ఆశ అతడిలో మనోధైర్యాన్ని తట్టి లేపింది. ఎలాగైనా బతకాలనే పట్టుదల నడి సంద్రాన్ని ఎదురీదేలా చేసింది. 12 గంటల పాటు సముద్రంలో ఆ మత్స్యకారుడు చేసిన సాహసమే అతడి ప్రాణాలను రక్షించింది. ఈ సంఘటన కాకినాడ సమీపంలో నడి సంద్రంలో జరిగింది. దీనికి సంబంధించి తోటి మత్స్యకారులు తెలిపిన వివరాలివీ..కొత్తపల్లి మండలం ఉప్పాడకు చెందిన పలువురు కాకినాడ శివారు రేపూరుకు చెందిన గేదెల అప్పారావుతో కలిసి బోటుపై మంగళవారం రాత్రి సముద్రంలో వేటకు వెళ్లారు. కాకినాడ తీరానికి సుదూర సముద్రంలో రాత్రి 8 గంటలకు చేపల కోసం సముద్రంలో వల వేసి బోటులో అందరూ పడుకున్నారు. తెల్లవారుజామున 4 గంటలకు అందరూ లేచి చూసేసరికి అప్పారావు కనిపించలేదు. దీంతో ఈ విషయాన్ని ఉప్పాడ, అంతర్వేదిలో తోటి మత్స్యకారులకు చెప్పగా వారు మరో బోటుపై వెళ్లి అప్పారావు కోసం గాలించారు. అయినా ఆచూకీ లభించలేదు. ఇంతలో అంతర్వేది తీరం నుంచి చిన్న తెప్పపై చేపల వేటకు వెళ్లిన కొందరు మత్స్యకారులకు నడి సంద్రంలో ఓ వ్యక్తి తేలియాడుతూ కనిపించాడు. వెంటనే అక్కడికి వెళ్లి అతడిని తమ తెప్పలోకి ఎక్కించుకోగా కొన్ని క్షణాల్లోన్నే అతడు అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. దీంతో తోటి మత్స్యకారులు అతడి గుండెలపై బలంగా గుద్ది తాగిన నీటిని కక్కించి సపర్యలు చేయడంతో అతడిలో కదలికలు వచ్చాయి. వెంటనే అతడిని అంతర్వేది వద్ద ఒడ్డుకు చేర్చి 108లో రాజోలు ఆస్పత్రికి తరలించారు. అనంతరం అతడిని అప్పారావుగా గుర్తించారు. కాగా, చేపల కోసం వల వేసి అందరూ పడుకున్నాక తాను బహిర్భూమికి వెళ్లానని, ఇంతలో బోటు కదలడంతో ప్రమాదావశాత్తు సముద్రంలో పడిపోయానని అప్పారావు చెప్పాడు. ఎంతసేపు ఈత కొట్టినా బోటు కనిపించకపోవడం..సముద్ర ఒడి ఎక్కువగా ఉండటంతో అలా ఈదుకుంటూ వచ్చానని తెలిపాడు. ఓపిక ఉన్నంత వరకు ఈదుకుంటూ తీరం వైపు వెళుతున్న తనకు ఎండ ఎక్కడంతో ఓపిక తగ్గిపోయిందని.. దీంతో మునిగిపోకుండా తానున్న స్థలంలోనే పైకి తేలి ఉండే విధంగా ప్రయత్నం చేశానని చెప్పాడు. 12 గంటల శ్రమ అనంతరం చివరకు తనకు దూరంగా ఒక తెప్ప కనిపించడంతో చేతులు పైకి ఊపుతూ రక్షించమని అడిగానని..ఆ తెప్పలో ఉన్న వారు తనని కాపాడారని అప్పారావు చెప్పాడు.

## ఆవు మాంసాన్ని విక్రయిస్తున్న టీడీపీ కార్యకర్తలు

- ఇప్పటి వరకు 30 ఆవులను చంపి మాంసం విక్రయం
- నలుగురి అరెస్ట్.. పరారీలో ఇద్దరు



నాటు తుపాకీని పరిశీలిస్తున్న డీఎస్పీ

పొదలకూరు : ఆవులను చంపి మాంసం విక్రయించిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేశారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పొదలకూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో బుధవారం నెల్లూరు రూరల్ డీఎస్పీ పి.వీరాంజనేయరెడ్డి వివరాలు వెల్లడించారు. పొదలకూరు మండలం చాటగొట్లకు చెందిన కడివేటి భాస్కర్, నల్లబాలెం సురేంద్ర, నల్లబాలెం కిశోర్, నల్లబాలెం వెంకటరమణయ్య, నాగరాజు, వేణులు ముఠాగా ఏర్పడి మరుపూరు, చాటగొట్ల అటవీ ప్రాంతంలో సంచరించే ఆవులను చంపి మాంసాన్ని కిలో రూ.150 వంతున అమ్ముతున్నారు. మరుపూరు ఎస్సీ కాలనీకి చెందిన పెంచలమ్మ దొడ్డిలోని ఆవును ఈ నెల 17వ తేదీ రాత్రి అడవిలోకి తీసుకెళ్లి చంపి మాంసాన్ని అమ్ముకుని సొమ్ము చేసుకున్నారు. తన ఆవు కనిపించడం లేదని పెంచలమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తీగ లాగితే డొంక కదిలినట్టు కొంతకాలంగా ఈ ముఠా గోవులను చంపి మాంసాన్ని అమ్ముతున్న విషయం వెలుగుచూసింది. మార్చి నెలలో నిందితులు సంగం, నెల్లూరు రోడ్డు అటవీ ప్రాంతంలో నాలుగు ఆవులను నాటు తుపాకీతో చంపి మాంసాన్ని అమ్ముకున్నారు. ఈ విధంగా 30 ఆవులను చంపారు. భాస్కర్, సురేంద్ర, కిశోర్, వెంకటరమణయ్యను సీఐ సంగమేశ్వరరావు, ఎస్ఐ ఎస్కే కరిముల్లా అరెస్ట్ చేశారు. వారి నుంచి సింగిల్ బ్యారెల్ నాటు తుపాకీ, గన్‌పౌడర్, మోకులు(తాళ్లు), ఆటోను స్వాధీనం చేసుకున్నారు. తుపాకీని బుజబుజనెల్లూరు నక్కల కాలనీలో కన్నయ్య అనే వ్యక్తి వద్ద కొనుగోలు చేశారు. నాగరాజు, వేణు పరారీలో ఉన్నారు. కాగా, నిందితులంతా టీడీపీకి చెందిన వారు. ఎన్నికల సమయంలో క్రియాశీలకంగా వ్యవహరిస్తుంటారు. చాలాకాలంగా ఈ నేరాలకు పాల్పడుతున్నారు. వీరిని కాపాడేందుకు పార్టీ పెద్దలు రంగంలోకి దిగినట్టు సమాచారం.

సాక్షి ఫ్యామిలీ
చెన్నై
గురువారం ॥ 22-6-2023

వరలక్ష్మికి గాత్రం దేవుడిచ్చిన వరం.
గురువులు లేరు... శిక్షణ లేదు.
రేడియో ఆమెకు పాటలు నేర్పింది.
రేడియో ఆమెచేత పాడించుకుంది.
ఆలయాలు ఆమె పాటలకు వేదికనిచ్చాయి.
ఇప్పుడామె ముంబయిలో తెలుగు స్వరం.

# ఆమె పాటకు అరవై ఏళ్లు


వరలక్ష్మి

వరలక్ష్మి నారాయణమ్ పుట్టిల్లు గుంటూరు జిల్లాలోని బ్రాహ్మణ కోడూరు. రేడియోలో వచ్చిన పాటలు వింటూ పాడడం నేర్చుకున్నారు. అందుకే కాబోలు పాట పాడాలనే అభిలాష ఉన్న వాళ్లను ఏర్చికూర్చి, వాళ్లకు పాడడంలో మెళకువలు నేర్పించి, వారిని ఒక వేదిక మీదకు తీసుకువచ్చి పాడించారు. ఘంటసాల జయంతి రోజున ఘంటసాల పాటలు పాడడానికి మహామహులైన గాయకులు పోటీ పడుతుంటారు. కరతాళ ధ్వనులలో ఉప్పొంగిపోతుంటారు. జనం వారినే చూస్తారు, వారికే హారతులు పడుతుంటారు. కానీ... పాడాలనే తపన ఉన్న అనేక మంది ఆశావహుల ముఖాలను చూశారామె. వారిలో గృహిణులున్నారు. డాక్టర్లు, లాయర్లు, లెక్చరర్‌లు కూడా ఉన్నారు. ఇలాంటి గానాభిలాషులతో ఘంటసాల జయంతిని ప్రత్యేకంగా నిర్వహించేవారు వరలక్ష్మి. బీఈడీ చేసిన వరలక్ష్మి పాఠాలు చెప్పడంలో స్వరం మాధుర్యం కోల్పోతుందేమోనన్న భయంతో పాటల కోసం పాఠాల ఉద్యోగానికి దూరమయ్యారు. పాట పాడక పోతే తోచదు. ఇప్పుడు ముంబయిలో నివసిస్తున్నప్పటికీ అక్కడి తెలుగు వారిని ఒక చోటకు చేర్చడానికి పాటనే మాధ్యమంగా చేసుకున్నారామె. అరవై ఐదేళ్ల వరలక్ష్మి అరవై ఏళ్ల తన పాటల ప్రస్థానాన్ని 'సాక్షి'తో పంచుకున్నారు.

■ **పాట చాలా ఇచ్చింది!**

''నేను పాట కోసం జీవితాన్ని అంకితం చేశాననే ప్రశంస సంతోషంగా ఉంటుంది. కానీ పాటకు నేను చేసిన సేవకంటే పాట నాకిచ్చిన గుర్తింపు, గౌరవమే పెద్దది. పాట నాకెంతో ఇచ్చింది. ఐదేళ్ల వయసులో గుంటూరులోని బ్రహ్మనందరెడ్డి స్టేడియంలో ఘంటసాల గారితో కలిసి 'ఆకాశవీధిలో అందాల జాబిలి' పాడాను. నాలో గాయని ఉందని గుర్తించిన స్కూల్ టీచర్‌లు ఏ కార్యక్రమం అయినా నాతో పాడించేవారు. ఇక కాలేజ్‌లో మ్యూజిక్ ఒక సబ్జెక్ట్‌గా తీసుకున్నాను. మా సరోజిని మేడమ్ ఎక్కడ పోటీలు జరిగినా నన్ను పంపేవారు. సినీనటి సుమలత మ్యూజిక్‌లో నా క్లాస్‌మేట్. ఆ పరిచయం ఉన్నప్పటికీ నేను సినిమా గానం వైపు వెళ్లలేదు. రేడియోలో 'బి గ్రేడ్' సింగర్‌గా సెలెక్ట్ అయ్యాను. 'ఈ మాసపు పాట, లలిత గీతాలు' లెక్కలేనన్ని పాడాను. టీవీలో తరిగొండ వెంగమాంబ కీర్తనలు, సమస్త దేవతా కీర్తనలను పాడడంతోపాటు బాణీలు కూడా కట్టాను. ఆరు సొంత ఆల్బమ్‌లు చేశాను. మా రోజుల్లో ఇప్పుడున్నన్ని సౌకర్యాల్లేవు. చాలా మంది మహిళలకు తమ పాటలను రికార్డు చేసుకోవాలనే కోరిక ఉన్నప్పటికీ ఇంట్లో సహకారం లేక ఆశను చంపేసుకునేవారు. అలా నా దృష్టికి వచ్చిన వారందరి చేత సొంత ఆల్బమ్‌లు చేయించగలిగాను. పెళ్లి తర్వాత మా వారి ఉద్యోగరీత్యా మచిలీపట్నంలో ఉన్నంత కాలం నా పాటయానం ఇన్నర్ వీల్ సర్వీస్‌తో కలగలిసిపోయి సాగింది. మా అబ్బాయి చదువు కోసం తిరుపతికి మారాం. అప్పుడు మరో మలుపు తీసుకుంది. తిరుపతిలో ఉన్నంత కాలం 'ఘంటసాల స్వరాభిషేకం' కార్యక్రమంలో వందల మందితో అన్నమాచార్య కీర్తనలు, సాధారణ పాటలు పాడించాను. వీటన్నింటిలో నాకు అత్యంత సంతోషాన్నిచ్చిన సంఘటన తిరుమలలో జరిగింది.



నేను, నా ఫోన్ ఉంటే చాలు. ఎక్కడికైనా వెళ్లి పాడతాను. దేశవిదేశాల్లోనూ నా స్వరం వినిపించే అవకాశం వచ్చింది.

■ **గిరులు ప్రతిధ్వనించాయి**

తిరుమల రేడియో స్టేషన్ ప్రారంభోత్సవానికి ఆహ్వానించారు. వామన చరిత్ర పారాయణం చేశాను. తిరుమలలోనే మరో సంఘటన వేదపాఠశాలలో జరిగింది. మా వదిన తిరుప్పావై పాటలను తెలుగులో రాశారు. ఆ పాటలకు నేను ట్యూన్ కట్టాను. ముప్పైవ పాట ట్యూన్ చేస్తున్నప్పుడు అనుకోకుండా తిరుపతిలోనే ఉన్నాను. వేద పాఠశాల నుంచి ఆహ్వానం వచ్చింది. గోవిందనామాలతో మొదలుపెట్టి తిరుప్పావై పాశురాలన్నీ పాడాను. అప్పుడు వేదపాఠశాల గురువులు, ఐదు వందల మంది విద్యార్థులు గొంతుకల్లో పలికిన ఆశీర్వచనం తిరుమల గిరుల్లో ప్రతిధ్వనించింది. పాటను కమర్షియల్‌గా మార్చకుండా కళగా గౌరవిస్తే భగవంతుడు తనవంతుగా ఇనుమిక్కిలిగా ఇస్తాడని నమ్ముతాను. రెమ్యూనరేషన్ ఇవ్వలేని వాళ్ల కోసం సొంత ఖర్చులతో వెళ్లి పాడిన సందర్భాలున్నాయి. అందుకే నాకు ఆహ్వానాలు కూడా ఎక్కువే వస్తుంటాయి. తెలుగు నేల మీద ఆలయాలన్నీ నా పాటను ఆహ్వానం పలికాయనే చెప్పాలి. ఆర్కెస్ట్రాతో వెళ్తే తప్పనిసరిగా ఖర్చులుంటాయి. అందుకే చెన్నైకి వెళ్లి ట్రాక్‌లు రికార్డు చేయించుకున్నాను. నేను, నా ఫోన్ ఉంటే చాలు. ఎక్కడికైనా వెళ్లి పాడతాను. దేశవిదేశాల్లోనూ నా స్వరం వినిపించే అవకాశం వచ్చింది.

■ **మెండైన ప్రోత్సాహం**

పాట కోసం నేను టీచర్ ఉద్యోగాన్ని వదులుకుంటానంటే మా వారు రెండోమాటకు తావులేకుండా ప్రోత్సహించారు. ఆయన కెమిస్ట్రీ ప్రొఫెసర్‌గా రిటైరయ్యారు. మా అబ్బాయికి రిలయెన్స్‌లో ఉద్యోగం. తను పాడతాడు కానీ వృత్తిగా కాదు. మనుమరాళ్లిద్దరికీ మంచి గొంతు ఉంది. వాళ్లకు నేర్పించాలనే ప్రయత్నం చేస్తున్నాను. కానీ పెరటి చెట్టు వైద్యానికి పనికిరాదన్నట్లు నా దగ్గర క్రమశిక్షణగా కూర్చుని పాడలేకపోతున్నారు. రెండు పాటలు పాడి 'ఇక ఆడుకుంటాం నానమ్మా' అని వెళ్లిపోతారు'' అన్నారామె నవ్వుతూ.

అరవై ఐదేళ్ల వయసులో కూడా ఆమె స్వరంలో మాధుర్యం ఏ మాత్రం తగ్గలేదు. 'పాట కోసం గొంతు సవరించుకోని రోజు నాకు అనారోగ్యం వచ్చినట్లు. ఇంత వరకు ఒక్కరోజు కూడా ముసుగుపెట్టి పడుకున్నది లేదు. పాటలోనే నా ఆరోగ్యం, పాటతోనే నా జీవితం' అన్నారు వరలక్ష్మి నారాయణమ్.

– వాకా మంజులారెడ్డి

**బ్యూటిప్**



అరటి తొక్కతో సహా పండుని ముక్కలుగా తరిగి పేస్టుచేయాలి. ఈ పేస్టుకు రెండు టీస్పూన్ల పచ్చిపాలు పోసి మరోసారి గ్రైండ్ చేసి పదిహేను నిమిషాలు రిఫ్రిజిరేటర్‌లో పెట్టాలి. తరువాత ఈ మిశ్రమాన్ని ముఖానికి, మెడకు పూతలా వేసుకుని, ఇరవై నిమిషాలు ఆరాక కడిగేయాలి. అరటిలో పండులో ఉన్న విటమిన్ బి6, బి12, ప్రొటీన్, ఫైబర్, మెగ్నీషియం, పొటాషియం చర్మానికి పోషణ అందించి ఆరోగ్యంగా ఉంచుతాయి. ఈ ప్యాక్‌ను వారానికి రెండు సార్లు వేసుకోవడం వల్ల ముఖ చర్మం నిగారింపుని సంతరించుకుంటుంది.

**ఎంపవర్‌మెంట్**

**రూబీ సిన్హా ప్రారంభించిన 'షీ ఎట్ వర్క్' డిజిటల్ ప్లాట్‌ఫామ్ ఎంతోమంది ఔత్సాహిక మహిళా వ్యాపారవేత్తలకు జ్ఞానకేంద్రంగా మారింది. 'అదిగో దారి' అని దారి చూపే దిక్సూచి అయింది. 'ఎంటర్‌ప్రెన్యూర్‌గా ప్రయాణం మొదలు పెట్టారా? అయితే మీ దగ్గర ఉన్న శక్తిని బయటికి తీసుకురావల్సిన సమయం వచ్చింది. ఒక్కరిగా ప్రయాణం మొదలు పెట్టి వందలాదిమందికి స్ఫూర్తి ఇస్తున్న వారు ఎంతోమంది ఉన్నారు. వారిలో మీరు ఒకరు ఎందుకు కాకూడదు!' అంటూ ఔత్సాహిక వ్యాపారవేత్తలను ఉత్సాహపరిచే రూబీ సిన్హా తాజాగా బ్రిక్స్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ, ఉమెన్ వర్టికల్ అధ్యక్షురాలిగా నియామకం అయింది...**

# నిలువెత్తు గెలుపు పాఠం


రూబీ సిన్హా

ఢిల్లీకి చెందిన రూబీ సిన్హా జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్‌లో మాస్టర్స్ చేసిన తరువాత జర్నలిస్ట్‌గా కెరీర్ మొదలుపెట్టింది. మరోవైపు వారాంతాలలో ఫిల్మ్ మేకింగ్ కోర్సు చేసేది. ఏమాత్రం తీరిక దొరికినా అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసేది. షార్ట్ ఫిల్మ్స్ తీసేది.

అడ్వర్‌టైజింగ్ దిగ్గజాలతో కలిసి పనిచేయడం ఆమెకు ఎంతో స్ఫూర్తిని ఇచ్చింది.

ఒక బిడ్డకు తల్లి అయిన రూబీ ఇంటికే పరిమితం కావల్సి వచ్చింది. కొంత కాలం తరువాత స్నేహితులలో ఒకరు ఇండిపెండెంట్ పీఆర్ కన్సల్టెంట్‌గా ప్రయత్నించమని సలహా ఇచ్చారు. ఈ సలహా రూబీకి బాగా నచ్చింది. అలా మొదలైన ప్రయాణమే తనను ఎంటర్‌ప్రెన్యూర్‌గా మార్చింది.

'అనుభవమైతేగానీ తత్వం బోధపడదు' అన్నట్లు రూబీ సిన్హా ఎంటర్‌ప్రెన్యూర్ అయిన తరువాతగానీ మహిళ వ్యాపారవేత్తలు ఎదుర్కొనే సమస్యలు అర్థం కాలేదు. ఎన్నో సవాళ్లను ఎదుర్కొని 'కమ్యూన్ బ్రాండ్ సొల్యూషన్స్' ద్వారా కమ్యూనికేషన్ ఇండస్ట్రీలో సక్సెస్‌ఫుల్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా గెలుపు జెండా ఎగరేసింది. అయితే తన విజయానికే పరిమితమై సంతృప్తి పడకుండా ఔత్సాహిక మహిళా వ్యాపారవేత్తలకు డిజిటల్ ప్లాట్‌ఫామ్ 'షీ ఎట్ వర్క్' ద్వారా ఉత్సాహాన్ని, బలాన్ని ఇచ్చి ముందుకు నడిపించింది.

'ప్రతి స్టార్టప్ ఐడియా సక్సెస్ కావాలని ఏమీ లేదు. కానీ ఎందుకు సక్సెస్ కాలేము అనే పట్టుదల ఉండే మాత్రం కచ్చితంగా సక్సెస్ అవుతాం. మన దేశంలో ఎంతో ప్రతిభ, సృజనాత్మకత ఉంది. వోలా క్యాబ్స్ నుంచి ఫ్లిప్‌కార్ట్ వరకు ఎన్నెన్నో విజయాలు ఒక్కసారి గుర్తు తెచ్చుకోండి చాలు'... ఇలాంటి మాటలు ఎన్నో 'షీ ఎట్ వర్క్'లో కనిపిస్తాయి.

'ఒంటరి ప్రయాణం కష్టాలతో కూడుకున్నది. అయితే ఆ ప్రయాణం నీకు కొత్త శక్తి ఇస్తుంది' అనే మాట రూబీకి చాలా ఇష్టం.

తాను ఒంటరిగానే ప్రయాణం పెట్టింది.

'బడ్జెట్, క్యాష్ ఫ్లో మేనేజ్‌మెంట్ నుంచి ప్రతిభావంతులైన ఉద్యోగులను ఎంపిక చేసుకోవడం వరకు ఎంటర్‌ప్రెన్యూర్ ముందు ఎన్నో సవాళ్లు ఉంటాయి. అయితే అవేమీ జటిలమైన సవాళ్లు కాదు. ప్రతి సవాలు ఒక పాఠం నేర్పుతుంది. అలా నేను ఎన్నో నేర్చుకున్నాను. ఎంటర్‌ప్రెన్యూర్ టీమ్ కెప్టెన్‌గానే కాదు టీమ్ మెంబర్‌గా కూడా వ్యవహరించాలి. టీమ్‌తో కలిసిపోయి వారికి ఉత్సాహాన్ని ఇవ్వాలి' అంటుంది రూబీ.

నేర్చుకోవడానికి చిన్నా,పెద్దా తేడా అనేది ఉండదు.

'నేను ఒకరి దగ్గర నేర్చుకోవడం ఏమిటి' అనే అహం అడ్డొస్తే అదే అడ్డుగోడగా మారుతుంది. అయితే రూబీకి అలాంటి అహాలు లేవు.

'ఈ తరానికి అద్భుతమైన సాంకేతిక నైపుణ్యం, తెలివితేటలు, చురుకుదనం ఉన్నాయి. వారి నుంచి నేను ఎన్నో విషయాలు నేర్చుకుంటాను' అంటుంది రూబీ.

'భవిషత్ దార్శనికత, వ్యూహ చతురత, అంకితభావం రూబీ సిన్హా బలాలు' అంటున్నారు బ్రిక్స్ సీసీఐ డైరెక్టర్ జనరల్ మధుకర్.

భౌగోళిక సరిహద్దులకు అతీతంగా స్త్రీ సాధికారతకు సంబంధించిన లక్ష్యాలను ముందుకు తీసుకువెళ్లడానికి బ్రిక్స్ సీసీఐ, ఉమెన్ వర్టికల్ ఏర్పాటయింది. ఇప్పుడు ఈ విభాగానికి రూబీ సిన్హా రూపంలో అంతులేని బలం చేకూరింది.

## సమన్వయం

వ్యక్తిగత, వృత్తిగత జీవితాన్ని సమన్వయం చేసుకోవడం అనేది ఒక కళ. ఆ కళలో మనం ఆరితేరాలి. అప్పుడే మన ప్రయాణం సజావుగా సాగుతుంది. టైమ్‌కు ఆఫీసుకు రావడానికి ఎంత ప్రాధాన్యత ఇస్తానో, మా అమ్మాయితో కలిసి స్కూల్‌లో జరిగే ఫంక్షన్‌కు వెళ్లడానికీ అంతే ప్రాధాన్యత ఇస్తాను. కంపెనీకి సంబంధించిన విషయాలపై సహ ఉద్యోగులతో చర్చించడానికి ఎంత ప్రాధాన్యత ఇస్తానో, అమ్మాయి దగ్గర కూర్చొని హోంవర్క్ చేయించడానికీ అంతే ప్రాధాన్యత ఇస్తాను.

– రూబీ సిన్హా



బెంగళూరుకు చెందిన 35 ఏళ్ల పుష్ప ఎస్ ఎం ఇప్పటికి 1086 పరీక్షలు రాసింది. ఆమె కోసం కాదు. దివ్యాంగుల కోసం, కలం పట్టుకునే వీలు లేని కండరాల సమస్య ఉన్నవారి కోసం, పరీక్షల ముందు యాక్సిడెంట్‌లకు గురయ్యి రాసే వీలు లేని వారి కోసం... ఆమె పరీక్షలు రాస్తూనే ఉంది. ఇంకా రాయాలనే అనుకుంటోంది. 'ఒక దివ్యాంగ పిల్లవాడికి మీరు పరీక్ష రాసిపెట్టండి. రిజల్ట్స్ వచ్చి ఆ పరీక్ష పాసయ్యాక ఆ పిల్లవాడి కళ్లల్లో కనిపించే కృతజ్ఞతకు మీరు విలువ కట్టలేరు' అంటుంది పుష్ప.

**విద్యార్థికి పరీక్షే కీలకం
అది రాయలేని పరిస్థితి ఉంటే?
దివ్యాంగులు అయి ఉంటే?
సహాయకులు కావాలి.
కాని పరీక్ష రాసి పెట్టడానికి
అందరూ పనికి రారు.
అందుకు ఎంతో ఓర్పు,
సహనం, సేవాభావం కావాలి.
బెంగళూరుకు చెందిన పుష్ప
అలాంటి విద్యార్థుల కోసం
దాదాపు వేయికి పైగా పరీక్షలు రాసింది.
ఆమె పరిచయం.**

# పరీక్షలకు వారధి






దివ్యాంగ విద్యార్థుల కోసం పరీక్ష రాస్తున్న పుష్ప

■ **2007లో అనుకోకుండా**

ఆ రోజు పుష్ప రోజూ వెళ్లే బస్సులో కాకుండా నడిచి ఇంటికి వెళ్లాలనుకుంది. ఆ నడకే ఆమె జీవితాన్ని మార్చింది. దారిలో ఒక అంధ కుర్రవాడు రోడ్డు దాటించమని సహాయం అడిగాడు. పుష్ప రోడ్డు దాటిస్తూ మాట కలిపింది. ఆ కుర్రవాడు వచ్చే నెలలో ఎస్ఎస్ఎల్‌సి పరీక్షలు రాయనున్నాడు.'నాకు మీరు పరీక్షలు రాసి పెడతారా?' అని అడిగాడు. పుష్ప ఆలోచనలో పడింది. 'మీలాంటి వాళ్లు మా కోసం ముందుకొస్తే మేము మా జీవితంలో ముందుకెళతాం' అని ఆ అబ్బాయి అన్నాడు. ఆ మాట ఆమె మీద చాలా ప్రభావం ఏర్పరిచింది. 'అప్పటి వరకూ నా జీవితానికి అర్థమేమిటా అనే ఆలోచన ఉండేది. ఆ క్షణాన ఇలాంటి వారికి సాయం చేయడానికే పుట్టానేమో అనుకున్నాను' అంటుంది పుష్ప.

■ **అంత సులభం కాదు**

దివ్యాంగులకు, అంధులకు,సెరిబ్రల్ పాల్సీ.. డౌన్ సిండ్రోమ్... డిస్‌లెక్సియ వంటి బుద్ధిమాంద్యం సమస్యలు ఉన్నవారు పరీక్షలు రాయాలంటే వారికి లేఖకులుగా ఉండటం అంత సామాన్యం కాదు. 'ముందు మీకు ఓపిక ఉండాలి. వాళ్లు ప్రశ్నను మళ్లీ మళ్లీ చదివి వినిపించమంటారు. ఒక్కోసారి నేను ఒక ప్రశ్నను ముప్పై నలభైసార్లు చదివి వినిపించిన సందర్భాలున్నాయి. అలాగే మీకు శ్రద్ధగా వినే శక్తి ఉండాలి. జవాబు చెప్పే పిల్లలు కొందరు మరీ నెమ్మదిగా, కొందరు మరీ వేగంగా చెప్తారు. అర్థం చేసుకుని రాయాలి. వారు రాసే సబ్జెక్ట్‌లు మీరు చదివినవి కావు. అందుకని కూడా మీరు జవాబులను పూర్తిగా అర్థం చేసుకుంటూ రాయాల్సి వస్తుంది. మనల్ని పర్యవేక్షిస్తుంటారు. కాబట్టి గ్రామర్ వంటివాటిల్లో చిన్న సాయం చేయొచ్చు కాని మన తెలివి వారికి అందివ్వలేం. నిజాయితీ ముఖ్యం' అంటుంది పుష్ప. ఆమె ఇప్పటి వరకూ పది, ఇంటర్, డిగ్రీ, పిహెచ్‌డి, బ్యాంకు పరీక్షలు... ఇలాంటివి ఎన్నో రాసి పెట్టింది.

■ **అడిగిన వెంటనే సెలవు**

పుష్ప బెంగళూరులో ఒక ఐటి కంపెనీలో పని చేస్తుంది. లేఖకురాలిగా ఆమెకు ఉన్న డిమాండ్‌ను చూసి ఐటి కంపెనీ ధారాళంగా సెలవులు ఇస్తూ ప్రోత్సహిస్తోంది. ఇది మంచి పనే అని మెచ్చుకుంటోంది. పుష్ప ఇంగ్లిష్, హిందీ, కన్నడ, తెలుగు, తమిళ భాషల్లోని విద్యార్థుల కోసం పరీక్షలు రాసి పెడుతోంది. ఇలాంటి విద్యార్థుల కోసమే తెలుగు, తమిళ భాషలను షార్ట్ టర్మ్ కోర్సులు చేసి నేర్చుకుంది. 'నా బాల్యంలో మా నాన్న రోజు కూలీగా ఉండేవాడు. ఆయనకు ప్రమాదం జరిగి మంచాన పడితే మంచి మనసున్న వారి సాయంతో చదువుకున్నాను. ఇప్పుడు ఆ బాకీని ఇలా తీర్చుకుంటున్నాను' అంటుంది పుష్ప.

ఇంత అద్భుతమైన సేవ చేస్తున్నది కాబట్టే 2019లో నాటి రాష్ట్రపతి కోవింద్ చేతుల మీదుగా నారీశక్తి పురస్కార్ అందుకుంది.

# ఫేక్ హ్యాపీనెస్

నిజజీవితంలో కాకుండా డిజిటల్ మీడియా ద్వారా సంతోషాన్ని ప్రదర్శించేవారి సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. చుట్టూ ఉన్న వ్యక్తుల నుంచి దూరమవుతూ, తాము అంతా సంతోషంగా ఉన్నట్టు నటిస్తూ 'ఫేక్ హ్యాపీనెస్'ను క్రియేట్ చేస్తుంటారు కొందరు. అది ఫేక్ అని తెలియని వాళ్లు, తాము కూడా తమ ఫేక్ హ్యాపీనెస్‌ను మరింత క్రియేటివ్‌గా పోస్ట్ చేస్తుంటారు. వ్యసనంలా మార్చే ఈ చట్రంలో రోజుకు ఎంతోమంది చేరుతున్నారు.

■ **అవగాహనా లోపం**

మనమంతా మన చుట్టూ ఉన్నవారితో కలిసి జీవిస్తున్నాం. ఇందులో కొందరు తమపై తమకు సరైన అవగాహన లేని కారణంగా ఎదుటివారిని అనుకరించడం, విలువలు లేని వారి ప్రవర్తనలను కాపీ చేయడం చూస్తుంటాం. అంటే, ఉదాహరణకు.. స్నేహితుల్లో ఒకరు పొగతాగడాన్ని చూస్తూ, కొన్నాళ్లకు ఆ గ్రూప్‌లో ఉన్న మిగతావారూ అదేపని చేస్తుంటారు. ఇది సమయాన్ని వృథా చేస్తుంది. మానసికంగా, శారీరకంగా చెత్తను తయారు చేస్తుంది. ఇదే సోషల్ మీడియా విషయంలోనూ జరుగుతుంది. చాలామంది ఒకే రకమైన కంటెంట్‌ను చూడటానికి అలవాటు పడుతున్నారు అది నిజం కాదని స్పష్టంగా తెలిసినప్పటికీ. ఏదో ఆనందం కోసం చూస్తున్నాం అంటారు. అదే కంటెంట్‌ను చూస్తూ కొంతకాలానికి తామూ కూడా అదే రకమైన కంటెంట్‌ను పోస్ట్ చేస్తారు. ఒకరిని చూసి ఒకరు ఫేక్ కంటెంట్‌ను సోషల్‌మీడియాలో వదిలితే.. కొన్నాళ్లకు ఏది నిజమో, ఏది అబద్ధమో తెలియకుండా పోతుంది.

■ **ఆత్మగౌరవ సమస్య**

మీలో ఆత్మబలం లేకపోతే ఇతర వ్యక్తులపై ఆధారపడతారు. అప్పుడు ఇతరులు మీ గురించి ఏమనుకుంటున్నారో అని మీరు ఎప్పుడూ బాధ, భయపడుతూ ఉంటారు. నిజానికి చుట్టూ ఉన్నవాళ్లకు మన గురించి పట్టించుకునేంత తీరిక లేదు. మన సొంత అవగాహనే తప్ప ఎవరూ ఎవరికీ తీర్పులు చెప్పరు. ఆత్మగౌరవ సమస్యలు ఉన్న ఎవరైనా సోషల్‌మీడియా ద్వారా తమ జీవితం గొప్పగా, సంతోషకరంగా ఉందని నిరూపించడానికి ప్రయత్నించవచ్చు. డిప్రెషన్‌తో పోరాడుతున్న ఎవరైనా ఇప్పటికీ అంతా బాగానే ఉన్నట్లు నటించడానికి సోషల్‌మీడియాను ఉపయోగించవచ్చు. వారి బంధాల గురించి, సంతోషకరంగా గడిపిన సందర్భాలను ఫొటోలతో సహా పోస్ట్ చేయవచ్చు. అవే నిజం అనుకోవడానికి లేదు. వాటికి ప్రతిగా మరికొందరు తాము సంతోషంగా ఉన్న ఎప్పటి సందర్భాన్నో ఇప్పుడు పంచుకోవచ్చు. ఇలంటి విధానాల వల్ల ఆత్మగౌరవం, బలం పెరగవు అని గుర్తుంచుకోవాలి.



**సైబర్ టాక్**

■ **పొంచి ఉండే స్కామర్లు**

మీరు ఫేక్‌హ్యాపీనెస్ కోసం ప్రయత్నిస్తుంటే మిమ్మల్ని నకిలీ ఖాతాలతో మోసం చేసేవారూ ఉండచ్చు.

- మీరు చేసే పోస్ట్‌లకు ఉన్న ఫలంగా ఎక్కువ లైక్స్, వ్యూస్ వస్తే అనుమానించండి. ఎందుకంటే, ఫేక్ సోషల్ మీడియా అకౌంట్స్ మిమ్మల్ని ట్రాప్ చేసే అవకాశం ఉంది. దీని ద్వారా మీతో పరస్పర చర్యలు జరిపి, దారితప్పించవచ్చు..
- వ్యక్తిగత సమాచారాన్ని పంచుకునేలా లేదా ఆర్థిక స్కామ్‌లలో పాల్గొనేలా మోసగించవచ్చు.
- స్కామర్లు ఫేక్ స్పాన్సర్‌షిప్ అవకాశాలను అందిస్తూ, వ్యక్తులను లక్ష్యంగా చేసుకోవచ్చు.
- పాస్‌వర్డ్, క్రెడిట్ కార్డ్ వివరాలు మొదలైన సమాచారాన్ని పంచుకునేలా మోగిసించవచ్చు.

■ **ఫేక్ సర్కిల్**

సోషల్ మీడియాలో పోస్ట్ చేసే ప్రతిదీ ఏదైనా డిలీట్ చేయలేరు. దశాబ్దాలుగా ఇంటర్నెట్‌లో కనిపించే అవకాశం ఉంది. మీరు మీ మెసేజ్‌ను లేదా ఫొటోని డిలీట్ చేయవచ్చు. అయితే, ఇంటర్నెట్‌లో స్క్రీన్‌షాట్, డౌన్‌లోడ్ వంటి సాధనాలపై మీ కంట్రోల్ ఉండదని గుర్తించాలి. మీ ప్రొఫైల్‌ని ఆర్ట్ గ్యాలరీగా పరిగణించాలి. అంటే, మీ సొంత భావోద్వేగాలతో సహా గొప్పగా కనిపించని దేన్నీ పోస్ట్ చేయరని అర్థం. కానీ, కాలక్రమేణా ఫేక్ హాపీనెస్ షేరింగ్ ఒక అలవాటుగా మారచ్చు. అలాంటప్పుడు కొన్నాళ్లకు ప్రొఫైల్‌లోని మొత్తం కంటెంట్ ఫేక్ అవ్వచ్చు. దీనిని కొన్నాళ్లుగా చూస్తున్న మీ ఫ్రెండ్స్ గ్రూప్ సభ్యులు కూడా అదే అలవాటుగా మార్చుకుంటే... ఫేక్ హాపీనెస్ చట్రం క్రియేట్ అవుతుంది.

■ **గుర్తింపు కోరుకోవడం**

ఈ ఆలోచన అత్యంత ప్రమాదకరమైనది. సోషల్ మీడియాను అదే పనిగా ఉపయోగించడం వల్ల కలిగే ప్రమాదాలలో ఇది ఒకటి. కాలక్రమేణా మిమ్మల్ని మీ ఆన్‌లైన్ ప్రొఫైల్‌తోనే జనాలు గుర్తించవచ్చు. అప్పుడు మీ ప్రొఫైల్ మీరు కావచ్చు. మన మనసుకు ఏది నిజం, ఏది అబద్ధం.. వాటి మధ్య ఉంటే తేడా అన్నీ తెలుసు. కానీ, అది ఒక్కటే సరిపోదు. సోషల్ మీడియాలో తమ సొంత ఇమేజ్‌తో గుర్తింపు పొందేందుకు ఇష్టపడే ఎవరైనా చివరికి వారి సొంత నిజ జీవితాన్ని, నిజమైన అవసరాలను విస్మరించవచ్చు. మీరు సంతోషంగా లేని సమయాల్లో గుర్తింపు పోతుందేమో అనే ఆలోచనతో ఫేక్ హ్యాపీనెస్ ఫొటోలను, వీడియోలను పోస్ట్ చేయవచ్చు. మీరు సోషల్‌మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ అయినా, దానిపై ఆధారపడే వ్యాపారాన్ని చేస్తుండవచ్చు. కానీ, అన్నింటి కన్నా జీవితంపై దృష్టి పెట్టడం ఇప్పుడే మొదలవ్వాలి. ఎందుకంటే జీవితం ఆన్‌లైన్‌లో కాదు ఆఫ్‌లైన్‌లోనే ఉంటుంది.

■ **వ్యసనం**

లైక్‌లు, కొత్త ఫాలోవర్లు, నోటిఫికేషన్లను చూడటం గొప్ప అనుభూతిని ఇస్తుంది. మీరు చేసిన పోస్ట్‌కి వచ్చిన కామెంట్స్‌కు రిప్లై కూడా ఇవ్వండి. వచ్చే నోటిఫికేషన్స్‌కి అడిక్ట్ అవకండి. మీరు చేసిన పోస్ట్‌కు కామెంట్స్, వ్యూస్, లైక్స్.. నంబరింగ్‌పై దృష్టి పెట్టకండి. సంతోషకరమైన ఫొటోలను పోస్ట్ చేయడం వల్ల వచ్చే లైక్‌లు, వ్యూస్ పెరుగుతుంటే వాటి వల్ల వచ్చేదేంటో ఊహించండి. లైక్స్ ఎన్ని ఎక్కువ వస్తే అంత బలం పొందినట్టుగా అనిపిస్తుంది. దీనివల్లే మళ్లీ మళ్లీ అదే పని చేయాలను

**మోసగించబడుతున్నాం అని గుర్తిస్తే వెంటనే...
ఈ క్రింది సంబంధిత సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో రిపోర్ట్ చేయండి.**
* https://help.twitter.com/en/safety-and-security/report-a-tweet
* https://www.facebook.com/help/1380418588640631
* https://www.linkedin.com/help/linkedin/answer/a1344213/recognize-and-report-spam-inappropriate-and-abusive-content?lang=en * https://help.instagram.com/192435014247952
* https://faq.whatsapp.com/1142481766359885/?cms_platform=android

**పరిస్థితి తీవ్రత ఎక్కువగా ఉంటే.. https://www.cybercrime.gov.inలలో రిపోర్ట్ చేయండి.**


ఇన్‌పుట్స్:
**అనీల్ రాచమల్ల**
డిజిటల్ వెల్‌బీయింగ్ ఎక్స్‌పర్ట్,
ఎండ్ నౌ ఫౌండేషన్

## ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రణయ్



తైపీ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత ఆటగాళ్లు హెచ్ఎస్ ప్రణయ్, పారుపల్లి కశ్యప్ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్ ప్రణయ్ 21-11, 21-10తో లిన్ యు సియెన్ (చైనీస్ తైపీ)పై... కశ్యప్ 21-15, 21-16తో హెసియావో (జర్మనీ)పై గెలుపొందారు. మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్‌లో సిక్కి రెడ్డి-రోహన్ కపూర్ ద్వయం 21-14, 21-17తో భారత్‌కే చెందిన బొక్కా నవనీత్-ప్రియా కొన్‌జెంగ్‌బమ్ జంటను ఓడించి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది.

## వరల్డ్ నంబర్‌వన్‌గా జో రూట్




ఆస్ట్రేలియాతో జరిగిన యాషెస్ సిరీస్ తొలి టెస్టులో ఇంగ్లండ్ ఓడినప్పటికీ ... ఆ జట్టు బ్యాటర్ జో రూట్ మాత్రం అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ టెస్టు ర్యాంకింగ్స్‌లో ఐదు స్థానాలు ఎగబాకి నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకున్నాడు. నంబర్‌వన్ ర్యాంక్‌లో ఉన్న లబుషేన్ (ఆస్ట్రేలియా) మూడో ర్యాంక్‌కు పడిపోయాడు. యాషెస్ తొలి టెస్టులో రూట్ (118 నాటౌట్; 46 పరుగులు) రెండు ఇన్నింగ్స్‌లలో రాణించగా... లబుషేన్ మాత్రం (0, 13) విఫలమయ్యాడు.

## తెలుగు టాలన్స్ దూకుడు



**జైపూర్:** ప్రీమియర్ హ్యాండ్‌బాల్ లీగ్‌లో హైదరాబాద్‌కు చెందిన తెలుగు టాలన్స్ జట్టు లీగ్ దశను విజయంతో ముగించింది. బుధవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో తెలుగు టాలన్స్ జట్టు 36-28 గోల్స్ తేడాతో గర్విత్ గుజరాత్ జట్టును ఓడించింది. మొత్తం 10 మ్యాచ్‌లు ఆడిన టాలన్స్ 15 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచింది. తెలుగు టాలన్స్‌తోపాటు మహారాష్ట్ర ఐరన్‌మెన్, రాజస్తాన్ పేట్రియాట్స్ జట్లు సెమీఫైనల్ చేరుకోగా... చివరి సెమీఫైనల్ బెర్త్ కోసం ఢిల్లీ పంజెర్స్, గోల్డెన్ ఈగల్స్ ఉత్తరప్రదేశ్ జట్లు పోటీపడుతున్నాయి.

## నేటి నుంచి గ్లోబల్ చెస్ లీగ్

**దుబాయ్:** అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే), టెక్ మహీంద్రా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో దుబాయ్ వేదికగా నేటి నుంచి గ్లోబల్ చెస్ లీగ్ జరుగనుంది. మొత్తం ఆరు జట్లు (బాలన్ అలాస్కన్ నైట్స్, చింగారి గల్ఫ్ టైటాన్స్, గ్యాంజస్ గ్రాండ్‌మాస్టర్స్, ఆల్పైన్ వారియర్స్, త్రివేణి కాంటినెంటల్ కింగ్స్, అప్‌గ్రాడ్ ముంబా మాస్టర్స్) బరిలో ఉన్నాయి.



# భారత్‌దే 'ఎమర్జింగ్ కప్'

- అండర్-23 ఆసియా టి20 క్రికెట్ టోర్నీ ఫైనల్లో బంగ్లాదేశ్‌పై విజయం
- శ్రేయాంక పాటిల్, మన్నత్ కశ్యప్ మాయాజాలం

**మోంగ్ కాక్ (హాంకాంగ్):** ఎట్టకేలకు వరుణ దేవుడు కరుణించడంతో ఆసియా మహిళల అండర్-23 ఎమర్జింగ్ కప్ టి20 క్రికెట్ టోర్నీ ఫైనల్ జరిగింది. శ్వేతా సెహ్రావత్ నాయకత్వంలోని భారత 'ఎ' జట్టు చాంపియన్‌గా అవతరించింది. బుధవారం జరిగిన తుది పోరులో భారత్ 31 పరుగుల తేడాతో బంగ్లాదేశ్ 'ఎ' జట్టును ఓడించింది. మొత్తం ఎనిమిది జట్లు పాల్గొన్న ఈ టోర్నీలో 15 మ్యాచ్‌ల్లో 8 మ్యాచ్‌లు వర్షం కారణంగా రద్దు కావడం గమనార్హం. భారత జట్టు లీగ్ దశలో ఒక మ్యాచ్ ఆడింది. ఆ తర్వాత రెండు లీగ్ మ్యాచ్‌లు, సెమీఫైనల్ కూడా వర్షం కారణంగా సాధ్యపడలేదు. అయితే పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచిన భారత్ ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. బంగ్లాదేశ్‌తో జరిగిన టైటిల్ పోరులో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 127 పరుగులు సాధించింది. దినేశ్ వృందా (29 బంతుల్లో 36; 5 ఫోర్లు, 1 సిక్స్), కనిక అహూజా (23 బంతుల్లో 30 నాటౌట్; 4 ఫోర్లు), ఉమా చెత్రీ (20 బంతుల్లో 22; 2 ఫోర్లు, 1 సిక్స్), శ్వేత సెహ్రావత్ (20 బంతుల్లో 13; 2 ఫోర్లు) రాణించారు. భారత జట్టుకు ఆడుతున్న హైదరాబాద్ అమ్మాయి గొంగడి త్రిష నాలుగు పరుగులు చేసింది. అనంతరం 128 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన బంగ్లాదేశ్ 19.2 ఓవర్లలో 96 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. భారత స్పిన్నర్లు శ్రేయాంక పాటిల్ (4/13), మన్నత్ కశ్యప్ (3/20), కనిక అహూజా (2/23) బంగ్లాదేశ్‌ను దెబ్బ తీశారు. ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబరిచిన కనిక అహూజాకు 'ప్లేయర్ ఆఫ్ ద ఫైనల్'... ఈ టోర్నీలో తొమ్మిది వికెట్లు పడగొట్టిన శ్రేయాంక పాటిల్ 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ' అవార్డులు గెల్చుకున్నారు.

# రొనాల్డో రికార్డు...

**అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో జాతీయ జట్టుకు 200 మ్యాచ్‌లు ఆడిన తొలి ప్లేయర్‌గా ఘనత**



**రేక్‌జావిక్ (ఐస్‌లాండ్):** పోర్చుగల్ ఫుట్‌బాల్ జట్టు దిగ్గజం, స్టార్ ప్లేయర్ క్రిస్టియానో రొనాల్డో మరో మైలురాయి అందుకున్నాడు. పురుషుల అంతర్జాతీయ ఫుట్‌బాల్ చరిత్రలో జాతీయ జట్టు తరఫున 200 మ్యాచ్‌లు ఆడిన తొలి ప్లేయర్‌గా ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. యూరో-2024 చాంపియన్‌షిప్ క్వాలిఫయింగ్ టోర్నీలో భాగంగా గ్రూప్ 'జె'లో ఐస్‌లాండ్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో రొనాల్డో బరిలోకి దిగడంద్వారా 200 మ్యాచ్‌లు పూర్తి చేసుకున్నాడు. 38 ఏళ్ల రొనాల్డో ఆట 89వ నిమిషంలో చేసిన గోల్‌తో ఈ మ్యాచ్‌లో పోర్చుగల్ 1-0తో ఐస్‌లాండ్‌ను ఓడించింది. గ్రూప్ 'జె'లో పోర్చుగల్‌కిది వరుసగా నాలుగో విజయం కావడం విశేషం. అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో అత్యధిక గోల్స్ చేసిన రికార్డు కూడా రొనాల్డో (123 గోల్స్) పేరిటే ఉంది. మ్యాచ్‌కు ముందు రొనాల్డో ఘనతకు గుర్తింపుగా 'గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్' సంస్థ సర్టిఫికెట్‌ను అందజేసింది. 2003 నుంచి పోర్చుగల్ జాతీయ సీనియర్ జట్టుకు ఆడుతున్న రొనాల్డో వరుసగా ఐదు ప్రపంచకప్‌లలో గోల్స్ చేసిన ఏకైక ప్లేయర్‌గా నిలిచాడు. రొనాల్డో కెప్టెన్సీలో పోర్చుగల్ 2016 తొలిసారి యూరో చాంపియన్‌గా అవతరించింది. ప్రొఫెషనల్ ఫుట్‌బాల్‌లో స్పోర్టింగ్ సీపీ, మాంచెస్టర్ యునైటెడ్, రియల్ మాడ్రిడ్, యువెంటస్ జట్లకు ఆడిన రొనాల్డో ప్రస్తుతం సౌదీ అరేబియా ప్రొ లీగ్‌లో అల్ నాసర్ క్లబ్ జట్టుకు ఆడుతున్నాడు.

**జాతీయ జట్టుకు అత్యధిక మ్యాచ్‌లు ఆడిన టాప్-10 ఆటగాళ్లు**

| ప్లేయర్ | దేశం | మ్యాచ్‌లు |
|---|---|---|
| రొనాల్డో | పోర్చుగల్ | 200 |
| బదర్ అల్ ముతవా | కువైట్ | 196 |
| సో చిన్ అన్ | మలేసియా | 195 |
| అహ్మద్ హసన్ | ఈజిప్ట్ | 184 |
| అహ్మద్ ముబారక్ | ఒమన్ | 183 |
| సెర్జియో రామోస్ | స్పెయిన్ | 180 |
| ఆండ్రెస్ గ్వార్డాడో | మెక్సికో | 179 |
| అల్‌దెయా | సౌదీ అరేబియా | 178 |
| క్లాడియో స్వారెజ్ | మెక్సికో | 177 |
| గియాన్లుగి బఫన్ | ఇటలీ | 176 |

# సునీల్ ఛెత్రి 'హ్యాట్రిక్'

**పాకిస్తాన్‌పై 4-0తో భారత్ ఘనవిజయం**

**బెంగళూరు:** దక్షిణాసియా ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో డిఫెండింగ్ చాంపియన్ భారత జట్టు భారీ విజయంతో శుభారంభం చేసింది. పాకిస్తాన్ జట్టుతో బుధవారం జరిగిన గ్రూప్ 'ఎ' తొలి మ్యాచ్‌లో భారత్ 4-0 గోల్స్ తేడాతో ఘనవిజయం నమోదు చేసింది. కెప్టెన్ సునీల్ ఛెత్రి (10వ, 16వ, 74వ ని.లో) మూడు గోల్స్‌తో 'హ్యాట్రిక్' సాధించగా... మరో గోల్‌ను ఉదాంత సింగ్ (81వ ని.లో) అందించాడు. శనివారం తమ తదుపరి మ్యాచ్‌లో నేపాల్‌తో భారత్ ఆడుతుంది. 1952 తర్వాత భారత ఫుట్‌బాల్ వరుసగా ఏడు మ్యాచ్‌ల్లో ప్రత్యర్థి జట్టుకు ఒక్క గోల్ కూడా ఇవ్వకపోవడం ఇదే ప్రథమం. భారత జట్టు తరఫున 138వ మ్యాచ్ ఆడిన సునీల్ ఛెత్రి (90 గోల్స్) అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో అత్యధిక గోల్స్ చేసిన క్రీడాకారుల జాబితాలో నాలుగో స్థానానికి ఎగబాకాడు. టాప్-3లో క్రిస్టియానో రొనాల్డో (పోర్చుగల్-123 గోల్స్), అలీ దాయి (ఇరాన్-109 గోల్స్), మెస్సీ (అర్జెంటీనా-103 గోల్స్) ఉన్నారు. 2005లో జూన్ 12న భారత సీనియర్ జట్టు తరఫున అరంగేట్రం చేసిన 38 ఏళ్ల సునీల్ ఛెత్రి తొలి గోల్ కూడా పాకిస్తాన్ జట్టుపైనే రావడం విశేషం. పాకిస్తాన్‌తో బుధవారం జరిగిన మ్యాచ్‌లో భారత హెడ్ కోచ్ ఇగోర్ స్టిమాక్ మొరటుగా వ్యవహరించడంతో ఆయనకు మ్యాచ్ రిఫరీ ప్రజ్వల్ ఛెత్రి రెడ్ కార్డు చూపించి మైదానం బయటకు పంపించారు. భారత జట్టు రెండో గోల్ చేసిన తర్వాత పాక్ ప్లేయర్ అబ్దుల్లా ఇక్బాల్ త్రో ఇన్ చేయడానికి సిద్ధంకాగా స్టిమాక్ అబ్దుల్లా నుంచి బంతిని లాక్కున్నారు. స్టిమాక్ చర్యకు పాక్ ఆటగాళ్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు జట్ల ఆటగాళ్ల మధ్య వాగ్వాదం కూడా చోటు చేసుకుంది. రిఫరీ జోక్యం చేసుకొని పరిస్థితిని చక్కదిద్దడంతోపాటు స్టిమాక్‌కు రెడ్ కార్డు ఇచ్చి బయటకు పంపించి మ్యాచ్‌ను కొనసాగించారు. అంతకుముందు జరిగిన మరో మ్యాచ్‌లో కువైట్ జట్టు 3-1తో నేపాల్ జట్టును ఓడించింది. నేడు జరిగే మ్యాచ్‌ల్లో లెబనాన్‌తో బంగ్లాదేశ్; మాల్దీవులుతో భూటాన్ తలపడతాయి.


సునీల్ ఛెత్రి



## సిద్ధాంత్‌కు కాంస్యం

**బెర్లిన్:** స్పెషల్ ఒలింపిక్స్ వరల్డ్ సమ్మర్ గేమ్స్-2023లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ స్విమ్మర్ సిద్ధాంత్ మురళీ కుమార్ కాంస్య పతకం సాధించాడు. పురుషుల 25 మీటర్ల ఫ్రీస్టయిల్ లెవెల్ 'బి' కేటగిరీలో 17 ఏళ్ల సిద్ధాంత్ 30.57 సెకన్లలో గమ్యానికి చేరి మూడో స్థానంలో నిలిచాడు. గచ్చిబౌలి స్టేడియంలోని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ (శాట్స్) స్విమ్మింగ్ కాంప్లెక్స్‌లో హెడ్ కోచ్ ఆయుశ్ యాదవ్ వద్ద సిద్ధాంత్ శిక్షణ తీసుకుంటున్నాడు. ఈనెల 25 వరకు జరిగే ఈ క్రీడల్లో ఇప్పటి వరకు భారత్‌కు మూడు స్వర్ణాలు, ఏడు రజతాలు, నాలుగు కాంస్య పతకాలు లభించాయి.

# చివరి బంతికి స్కాట్లాండ్ గెలుపు

**బులవాయో:** వన్డే ప్రపంచకప్ క్వాలిఫయింగ్ టోర్నీలో ఐర్లాండ్ జట్టుతో జరిగిన గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో స్కాట్లాండ్ జట్టు ఒక వికెట్ తేడాతో గెలిచింది. తొలుత ఐర్లాండ్ 50 ఓవర్లలో 8 వికెట్లకు 286 పరుగులు చేయగా... స్కాట్లాండ్ 50 ఓవర్లలో 9 వికెట్లకు 289 పరుగులు చేసి నెగ్గింది. ఆఖరి ఓవర్లో స్కాట్లాండ్ విజయానికి 8 పరుగులు అవసరమయ్యాయి. తొలి ఐదు బంతుల్లో ఆరు పరుగులు వచ్చాయి. గెలిచేందుకు ఆఖరి బంతికి రెండు పరుగులు అవసరంకాగా... మైకేల్ లీస్క్ (61 బంతుల్లో 91 నాటౌట్; 9 ఫోర్లు, 4 సిక్స్‌లు) ఫోర్ కొట్టి స్కాట్లాండ్‌ను గెలిపించాడు. మరో మ్యాచ్‌లో ఒమన్ జట్టు ఐదు వికెట్లతో యూఏఈపై గెలిచింది.


మైకేల్ లీస్క్

# సినిమా


● నాగార్జున

## అజయ్ దర్శకత్వంలో..?

గత ఏడాది అక్టోబరులో 'ది ఘోస్ట్' సినిమాతో ఆడియన్స్ ముందుకు వచ్చారు నాగార్జున. ఆ తర్వాత తదుపరి చిత్రం గురించి ఆయన అధికారికంగా ప్రకటించ లేదు. కథలు వింటూ బిజీగా ఉన్నారు. దర్శకుడు మోహన్‌రాజా, రచయిత బెజవాడ ప్రసన్నకుమార్ వంటివారు నాగార్జునకు కథలు వినిపించారట. అయితే ఏదీ ఫైనలైజ్ కాలేదని సమాచారం. తాజాగా నాగార్జునకు 'ఆర్ఎక్స్ 100' ఫేమ్ దర్శకుడు అజయ్ భూపతి ఓ కథను వినిపించారని, ఈ కథ ఆయనకు నచ్చిందని, త్వరలోనే వీరి కాంబోలో సినిమా ఉంటుందనీ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. ఈ సినిమాను శ్రీనివాసా చిట్టూరి నిర్మించనున్నారని తెలిసింది.


● ప్రభాస్

## రాయల్?

ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో మాళవికా మోహనన్ ఓ హీరోయిన్‌గా నటిస్తున్నారు. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే యాభై శాతానికి పైగా పూర్తయింది. ఈ చిత్రానికి ఇప్పటివరకూ 'రాజా డీలక్స్' అనే టైటిల్ వినిపించింది. తాజాగా 'అంబాసిడర్', 'రాయల్' అనే టైటిల్స్‌ను కూడా పరిశీలిస్తున్నారట. మరి..'రాజా డీలక్స్' లేదా 'రాయల్' టైటిల్స్‌లో ఏదో ఒకటి ఫైనలైజ్ అవుతుందా? లేక మరేదైనా టైటిల్ ఈ సినిమాకు ఖరారు అవుతుందా? అనేది వేచి చూడాలి. ఇక హారర్ కామెడీ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందుతున్న ఈ సినిమా రాజా డీలక్స్ అనే ఒక థియేటర్ బ్యాక్‌డ్రాప్‌లో ఉంటుందని, ఈ చిత్రంలో ప్రభాస్ – బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ తాతామనవళ్ళుగా కనిపిస్తారనే ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే.


● ధనుష్

## సాహస ప్రయాణం!

'రాంఝణా' (2013), 'అత్రంగి రే' (2021) చిత్రాల తర్వాత హీరో ధనుష్, బాలీవుడ్ దర్శకుడు ఆనంద్ ఎల్. రాయ్ దర్శకత్వంలో మూడో సినిమా రూపొందనుంది. ఈ చిత్రానికి 'తేరే ఇష్క్ మే' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. 'రాంఝణా' చిత్రం విడుదలై (2013 జూన్ 21) పదేళ్లు పూర్తయిన సందర్భంగా ధనుష్, ఆనంద్ ఎల్. రాయ్ 'తేరే ఇష్క్ మే' సినిమాను ప్రకటించారు. ''కొన్ని సినిమాలు మన జీవితాలను మార్చేస్తుంటాయి. 'రాంఝణా' చిత్రం కూడా అలాంటిదే. ఈ క్లాసిక్ చిత్రంలో భాగస్వామ్యులైన అందరికీ ధన్యవాదాలు. ఇక ఇప్పుడు 'రాంఝణా' ప్రపంచం నుంచే 'తేరే ఇష్క్ మే' చిత్రం రాబోతోంది. ఈ సినిమా కోసం నేను ఎలాంటి జర్నీ చేయనున్నానో నాకు తెలియదు. కానీ ఈ ప్రయాణం సాహసోపేతంగా ఉంటుందని మాత్రం చెప్పగలను'' అని పేర్కొన్నారు ధనుష్. ఈ సినిమా చిత్రీకరణ ఈ ఏడాదే ప్రారంభం కానుంది.

## వరుణ్ సందేశ్‌కు గాయాలు

'ది కానిస్టేబుల్' సినిమా సెట్స్‌లో వరుణ్ సందేశ్ గాయపడ్డారు. వరుణ్ సందేశ్ హీరోగా ఆర్యన్ శుభాన్ దర్శకత్వంలో 'బలగం' జగదీష్ నిర్మిస్తున్న చిత్రం 'ది కానిస్టేబుల్'. ఈ సినిమాకు సంబంధించిన ఓ యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరణలో భాగంగా వరుణ్ సందేశ్ గాయపడ్డారు. ''పల్లెటూరిలోని ఓ కానిస్టేబుల్ జీవిత కథ ఆధారంగా రూపొందుతున్న సినిమా ఇది. 40 శాతం పూర్తయింది. అయితే హైదరాబాద్‌లోని శంకర్‌పల్లి సమీపంలో గల టంగుటూరు గ్రామంలో ఫైట్ సీన్ తీస్తున్నప్పుడు వరుణ్ సందేశ్ కాలికి బలమైన గాయం అయింది. దాంతో వైద్యులు మూడు వారాల విశ్రాంతి సూచించారు. ఆయన కోలుకున్నాక రెండో షెడ్యూల్ ప్రారంభిస్తాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.


● వరుణ్ సందేశ్

## భాగ్ సాలేకి వాయిస్


● సిద్ధు జొన్నలగడ్డ

శ్రీ సింహా కోడూరి, నేహా సోలంకి జంటగా నటించిన చిత్రం 'భాగ్ సాలే'. ప్రణీత్ బ్రహ్మాండపల్లి దర్శకత్వం వహించారు. అర్జున్ దాస్యన్, యష్ రంగినేని, కల్యాణ్ సింగనమల నిర్మించిన ఈ సినిమా జూలై 7న విడుదల కానుంది. క్రైమ్ కామెడీగా రూపొందిన ఈ సినిమాకి హీరో సిద్ధు జొన్నలగడ్డ వాయిస్ ఓవర్ ఇచ్చారు. ఆయన వాయిస్ ఓవర్‌తో 'భాగ్ సాలే' చిత్ర నేపథ్యాన్ని వివరించబోతున్నారు. కథలో హీరో ఎందుకు ఛేజ్ చేస్తాడు? దాని వెనకున్న కారణాలేంటి? అనేది సిద్ధు చెబుతారు. ఈ చిత్రానికి కెమెరా: రమేష్ కుషేందర్, సంగీతం: కాల భైరవ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్: అశ్వత్థామ, గిప్సన్ కొరబండి.

## అందుకే తప్పుకోవాల్సి వచ్చింది


● పూజా హెగ్డే

'మహర్షి' చిత్రం తర్వాత హీరో మహేశ్‌బాబు, హీరోయిన్ పూజా హెగ్డే జంటగా నటించేందుకు రెడీ అయిన చిత్రం 'గుంటూరు కారం'. ఈ చిత్రంలో శ్రీలీల మరో హీరోయిన్. త్రివిక్రమ్ దర్శకత్వంలో ఎస్. రాధాకృష్ణ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. కాగా వివిధ కారణాల వల్ల 'గుంటూరు కారం' సినిమా రెగ్యులర్ షూటింగ్ వాయిదా పడుతూ వస్తోంది. ఈ నేపథ్యంలో కాల్షీట్స్ సర్దుబాటు చేయలేక హీరోయిన్ పూజా హెగ్డే 'గుంటూరు కారం' చిత్రం నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. ''తమిళంలో ఓ చిత్రం, కన్నడంలో ఓ మూవీ, హిందీలో ఓ కొత్త ప్రాజెక్ట్‌తో పాటు కొన్ని యాడ్స్ కమిటయ్యారు పూజా హెగ్డే. ఇలా వరుస కమిట్‌మెంట్స్ కారణంగా కాల్షీట్స్ సర్దుబాటు చేయలేక 'గుంటూరు కారం' చిత్రం నుంచి ఆమె తప్పుకోవాల్సి వచ్చింది'' అని పూజా హెగ్డే వ్యక్తిగత సిబ్బంది పేర్కొన్నారు. ఇక 'గుంటూరు కారం' సినిమా నుంచి పూజా హెగ్డే తప్పుకోవడంతో తొలుత సెకండ్ హీరోయిన్‌గా తీసుకున్న శ్రీలీలను మెయిన్ హీరోయిన్‌గా ఫిక్స్ చేసిందట చిత్ర యూనిట్. అలాగే సెకండ్ హీరోయిన్ పాత్ర కోసం సంయుక్తా మీనన్ వంటి హీరోయిన్ల పేర్లను పరిశీలిస్తోందని ఫిల్మ్‌నగర్ భోగట్టా. కాగా 'గుంటూరు కారం' నెక్ట్స్ షెడ్యూల్ చిత్రీకరణ ఈ నెలాఖర్లో ప్రారంభం అవుతుందని, వీలైనంత త్వరగా షూటింగ్‌ను పూర్తి చేసి, ముందుగా ప్రకటించినట్లు సంక్రాంతి సందర్భంగా జనవరి 13న ఈ సినిమాను విడుదల చేసేలా చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోందని సమాచారం.

## విశాఖ ఉక్కు నేపథ్యంలో...

సత్యారెడ్డి లీడ్ రోల్‌లో నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'ఉక్కు సత్యాగ్రహం'. ప్రజా గాయకుడు గద్దర్ కీలక పాత్ర పోషించిన ఈ చిత్రంలో పల్సర్ బైక్ పాటతో ఫేమస్ అయిన గాజువాక కండక్టర్ ఝాన్సీ హీరోయిన్‌గా పరిచయమవుతున్నారు. జనం ఎంటర్‌టైన్‌మెంట్‌పై రూపొందిన ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు మొదలయ్యాయి. ఈ సందర్భంగా సత్యారెడ్డి మాట్లాడుతూ– ''విశాఖ స్టీల్‌ప్లాంట్ సాధన కోసం గతంలో జరిగిన పోరాటం, ప్రస్తుతం పరిరక్షణ కోసం జరుగుతున్న ఆందోళన నేపథ్యంలో ఈ చిత్రం రూపొందింది. వాస్తవానికి దగ్గరగా యువతరాన్ని ఆలోచింపజేసేలా సినిమా ఉంటుంది. త్వరలో వైజాగ్ ఆర్కే బీచ్‌లో 'ఉక్కు సత్యాగ్రహం' ప్రీ రిలీజ్ వేడుక నిర్వహిస్తాం'' అన్నారు. వైజాగ్ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ తదితరులు కీలక పాత్రలు పోషించిన ఈ చిత్రానికి సంగీతం: శ్రీ కోటి, కెమెరా: వెంకట్ చక్రి, సమర్పణ: సతీష్ రెడ్డి, శ్రీవేమల, సహనిర్మాతలు: శంకర్ రెడ్డి, కుర్రి నారాయణరెడ్డి.


● సత్యారెడ్డి, గద్దర్

## మిస్టర్ ఎక్స్ ఆరంభం

ఆర్య, గౌతమ్ కార్తీక్ హీరోలుగా, అనఘ హీరోయిన్‌గా పాన్ ఇండియన్ మూవీ 'మిస్టర్ ఎక్స్' సినిమా ఆరంభమైంది. మను ఆనంద్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మంజు వారియర్ కీలక పాత్ర పోషిస్తున్నారు.


● అనఘ, ఆర్య, మను ఆనంద్, గౌతమ్ కార్తీక్

ఎస్. లక్ష్మణ్ కుమార్ నిర్మిస్తున్న ఈ సినిమా పూజా కార్యక్రమాలు బుధవారం జరిగాయి. ''యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న చిత్రం ఇది. స్టంట్ సిల్వా యాక్షన్ కొరియోగ్రఫీ చేస్తున్నారు. ఫైట్స్‌ని ఇండియా, ఉగాండా, అజర్‌బైజాన్, జార్జియా దేశాల్లో చిత్రీకరిస్తాం. ఈ చిత్రం తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో రిలీజ్ కానుంది'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: ధిబు నినన్ థామస్, కెమెరా: తన్వీర్ మీర్.

## వాస్తవ ఘటనల భీమదేవరపల్లి

అంజి వల్గమాన్, సాయి ప్రసన్న, అభిరామ్, రూపా శ్రీనివాస్, సుధాకర్ రెడ్డి, రాజవ్వ, కీర్తి లత కీలక పాత్రల్లో రమేశ్ చెప్పాల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'భీమదేవరపల్లి బ్రాంచి'. డాక్టర్ బత్తిని కీర్తిలతా గౌడ్, రాజా నరేందర్ చెట్లపెల్లి నిర్మించిన ఈ సినిమా మైత్రీ మూవీస్ డిస్ట్రిబ్యూటర్స్ ద్వారా ఈ నెల 23న రిలీజ్ కానుంది. బత్తిని కీర్తిలతా గౌడ్ మాట్లాడుతూ– ''ప్రభుత్వ పథకాల పట్ల ప్రజలు పరిజ్ఞానం పెంచుకోవాలనే సదుద్దేశ్యంతో ఈ చిత్రం నిర్మించాను'' అన్నారు. ''పేపర్‌లో వచ్చిన ఓ వాస్తవ ఘటనకి ప్రభావితమై ఈ చిత్రకథ తయారు చేశాను. ప్రభుత్వ పథకాల గురించి ప్రజలు తెలుసుకోవాలనే ఆలోచనతో ఈ సినిమా తీశాం'' అన్నారు రమేష్ చెప్పాల.


● రూపా శ్రీనివాస్, అభిరామ్

## అన్ని సమయాల్లో గొప్ప

'సుడిగాలి' సుధీర్, దివ్యభారతి జంటగా నటిస్తున్న చిత్రం 'జీ.ఓ.ఏ.టీ' (గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్స్ – అన్ని సమయాల్లో గొప్ప). నరేష్ కుప్పిలి దర్శకత్వంలో మహాతేజ క్రియేషన్స్ పతాకంపై చంద్రశేఖర్ రెడ్డి మొగుళ్ల నిర్మిస్తున్నారు. ''హైదరాబాద్‌లో మా సినిమా తొలి షెడ్యూల్‌ను పూర్తి చేశాం. ఈ షెడ్యూల్‌లో సుధీర్, దివ్యభారతిలపై కీలక సన్నివేశాలు తీశాం. సుధీర్‌పై యాక్షన్ ఎపిసోడ్స్ కూడా చిత్రీకరించాం. ఖర్చు, క్వాలిటీ విషయంలో రాజీ పడకుండా నిర్మిస్తున్నాం. సుధీర్ కెరీర్‌లో ఈ చిత్రం మైలురాయిగా నిలుస్తుంది'' అన్నారు చంద్రశేఖర్ రెడ్డి మొగుళ్ల. ఈ చిత్రానికి సంగీతం: లియోన్ జేమ్స్, కెమెరా: బాలాజీ సుబ్రమణ్యం.


● సుధీర్

**స్టాక్ మార్కెట్లు**

| దేశీ సూచీలు | | |
|---|---|---|
| సెన్సెక్స్ ▲ | 195 | 63,523 |
| నిఫ్టీ ▲ | 40 | 18,857 |

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

| విదేశీ సూచీలు (బుధవారం రాత్రి 11.00 గంటలకు) | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 13,505 | ▽ | 162 |
| డోజోన్స్ | 34,016 | ▽ | 38 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,559 | ▽ | 10 |
| డాక్స్ | 16,023 | ▽ | 88 |
| షాంఘై | 3,198 | ▽ | 42 |
| నికాయ్ | 33,575 | ▲ | 186 |

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

**బులియన్** రూ.లలో — ముంబై

| | | | |
|---|---|---|---|
| బంగారం (99.9 స్వచ్ఛత) | 58,864 | ▲ | 418 |
| బంగారం (99.5 స్వచ్ఛత) | 58,628 | ▲ | 417 |
| వెండి (కిలో) | 70,133 | ▽ | 1,958 |



# శ్రీరామ్ ఫైనాన్స్ నుంచి పిరమల్ ఔట్

**బ్లాక్‌డీల్స్‌తో 8.34% వాటా విక్రయం**



**ముంబై:** యూఎస్ పీఈ దిగ్గజం టీపీజీ తదుపరి తాజాగా శ్రీరామ్ ఫైనాన్స్‌లో పిరమల్ ఎంటర్‌ప్రైజెస్ వాటా విక్రయాన్ని చేపట్టింది. ఓపెన్ మార్కెట్ ద్వారా శ్రీరామ్ ఫైనాన్స్‌లో గల మొత్తం 8.34 శాతం వాటాను పిరమల్ విక్రయించింది. ఆదిత్య బిర్లా సన్ లైఫ్ ఎంఎఫ్, కొటక్ మహీంద్రా ఎంఎఫ్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఇన్సూరెన్స్, బ్లాక్‌రాక్, బీఎన్‌పీ పరిబాస్, సొసైటీ జనరాలి తదితర సంస్థలకు 3.12 కోట్లకుపైగా షేర్లను విక్రయించింది. బ్లాక్ డీల్స్ ద్వారా రూ. 1,545 ధరలో రూ. 4,824 కోట్లకు వాటాను ఆఫర్ చేసింది. సోమవారం శ్రీరామ్ ఫైనాన్స్‌లో 2.65% వాటాను ఓపెన్ మార్కెట్ ద్వారా రూ. 1,390 కోట్లకు టీపీజీ విక్రయించిన సంగతి తెలిసిందే. ఎంఎఫ్‌లు, సంస్థాగత ఇన్వెస్టర్లు వీటిని కొనుగోలు చేశాయి. కాగా.. బ్లాక్‌డీల్ వార్తల ప్రభావంతో బుధవారం ఎన్ఎస్ఈలో శ్రీరామ్ ఫైనాన్స్ షేరు 11.3% దూసుకెళ్లి రూ. 1,736 వద్ద నిలిచింది. ఇక మంగళవారం 6% జంప్‌చేసి రూ. 838కు చేరి న పిరమల్ ఎంటర్‌ప్రైజెస్ బుధవారం మరింత అధికంగా 14.2% దూసుకెళ్లి రూ.958 వద్ద ముగిసింది.

**పునర్వ్యవస్థీకరణతో**

శ్రీరామ్ గ్రూప్ చేపట్టిన పునర్వ్యవస్థీకరణ తదుపరి పిరమల్ ఎంటర్‌ప్రైజెస్‌కు గ్రూప్‌లోని పలు కంపెనీలలో షేర్లు లభించాయి. ఈ బాటలో శ్రీరామ్ ఫైనాన్స్‌లో 8.34 శాతం వాటాను పొందగా.. శ్రీరామ్ జీఐ హోల్డింగ్స్, ఎల్ఐ హోల్డింగ్స్, ఇన్వెస్ట్‌మెంట్ హోల్డింగ్స్‌లోనూ 20 శాతం చొప్పున వాటాలు లభించాయి. దీంతో శ్రీరామ్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలో 13.33 శాతం, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో 14.91 శాతం వాటాను సొంతం చేసుకుంది.

## రెండేళ్లలో 35 లక్షలకు ట్యాలీ కస్టమర్లు

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** వ్యాపార నిర్వహణ సాఫ్ట్‌వేర్ సేవల సంస్థ ట్యాలీ సొల్యూషన్స్ వచ్చే రెండేళ్లలో తమ కస్టమర్ల సంఖ్యను 35 లక్షలకు పెంచుకోవాలని నిర్దేశించుకుంది. ప్రస్తుతం ఇది 23 లక్షలుగా ఉంది. తెలంగాణలో 1 లక్ష పైగా, ఆంధ్రాలో 70వేల పైచిలుకు కస్టమర్లు ఉన్నారు. కొత్త ట్యాలీ ప్రైమ్ 3.0 వెర్షన్‌ని ఆవిష్కరించిన సందర్భంగా సంస్థ జనరల్ మేనేజర్ (సౌత్ జోన్) భువన్ రంజన్ బుధవారం మీడియాకు ఈ విషయాలు తెలిపారు. తాజా వెర్షన్‌ను జీఎస్‌టీలో మార్పులు, చిన్న.. మధ్య తరహా సంస్థల (ఎస్ఎంఈ) అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దినట్లు ఆయన చెప్పారు. అలాగే డిజిటల్ పేమెంట్ల ద్వారా సత్వర వసూళ్లకు ఉపయోగపడేలా క్యూఆర్ కోడ్ ఆప్షన్‌ను కూడా ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ట్యాలీ సాఫ్ట్‌వేర్‌పై విద్యార్థులకు శిక్షణ కూడా కల్పిస్తున్నామని రంజన్ చెప్పారు.



# ఆకర్షణీయ ఎంప్లాయర్ బ్రాండ్.. టాటా పవర్

- తర్వాతి స్థానాల్లో అమెజాన్, టాటా స్టీల్
- రాండ్‌స్టాడ్ ఇండియా నివేదిక

**ముంబై:** దేశీయంగా అత్యంత ఆకర్షణీయమైన ఎంప్లాయర్ (ఉద్యోగాలు కల్పించే సంస్థ) బ్రాండ్‌గా టాటా పవర్ కంపెనీ అగ్రస్థానంలో నిల్చింది. ఈ–కామర్స్ దిగ్గజం అమెజాన్, ఉక్కు దిగ్గజం టాటా స్టీల్ వరుసగా రెండు, మూడో స్థానాలు దక్కించుకున్నాయి. మానవ వనరుల సర్వీసుల సంస్థ రాండ్‌స్టాడ్ ఇండియా తమ వార్షిక నివేదిక 'రాండ్‌స్టాడ్ ఎంప్లాయర్ బ్రాండ్ రీసెర్చ్ (ఆర్ఈబీఆర్) 2023'లో ఈ అంశాలు వెల్లడయ్యాయి. ఆర్థిక స్థితి, మంచి పేరు, కెరియర్‌లో పురోగమించేందుకు అవకాశాలు కల్పించడం వంటి మూడు అంశాల ప్రాతిపదికగా రాండ్‌స్టాడ్ ర్యాంకులు ఇచ్చింది. దీని ప్రకారం 2022లో 9వ స్థానంలో ఉన్న టాటా పవర్ తాజాగా నంబర్ వన్ స్థానానికి చేరింది. నివేదిక







ప్రకారం ఉద్యోగులు అత్యంత ఆకర్షణీయమైన రంగంగా ఆటోమోటివ్‌కు (77 శాతం) ఓటేశారు. ఐటీ, ఐటీఈఎస్, టెలికం (76 శాతం) .. ఎఫ్ఎంసీజీ, రిటైల్, ఈ–కామర్స్ (75 శాతం) తర్వాత స్థానాల్లో ఉన్నాయి. మరిన్ని విశేషాలు..

- టాప్ 10 కంపెనీల్లో నాలుగో స్థానంలో టీసీఎస్.. ఆ తర్వాత వరుసగా మైక్రోసాఫ్ట్, శాంసంగ్ ఇండియా, ఇన్ఫోసిస్, టాటా మోటార్స్, ఐబీఎం, రిలయన్స్ ఇండస్ట్రీస్ ఉన్నాయి. అత్యంత ఆకర్షణీయ స్టార్టప్ ఎంప్లాయర్‌గా బిగ్ బాస్కెట్ నిల్చింది.
- ఎంప్లాయర్‌ను ఎంచుకునేటప్పుడు ఉద్యోగ–వ్యక్తిగత జీవితం మధ్య సమతౌల్యం, కంపెనీకి ఉన్న పేరు ప్రతిష్టలు, ఆకర్షణీయమైన జీతభత్యాలకు ఉద్యోగార్థులు ప్రాధాన్యం ఇస్తున్నారు. మహిళలు ఎక్కువగా ఉద్యోగ–వ్యక్తిగత జీవితం మధ్య సమతూకాన్ని పరిగణనలోకి తీసుకుంటున్నారు.
- అదనపు ఆదాయం కోసం వేరే అసైన్‌మెంట్లు లేదా అదనంగా మరో ఉపాధి మార్గాన్ని ఎంచుకునేందుకు అనుమతించే కంపెనీలు చాలా ఆకర్షణీయంగా ఉంటాయని 91 శాతం మంది ఉద్యోగులు పేర్కొన్నారు.
- సిబ్బంది ఆధారంగానే వ్యాపారంలో విజయం సాధించగలమని, పెట్టుబడి ఒక్కటే సరిపోదని ప్రపంచవ్యాప్తంగా సంస్థలు గుర్తిస్తున్నాయి. అలాగే, ఉద్యోగులు కూడా తాము ఏ బ్రాండుతో కలిసి పని చేయాలి, దీర్ఘకాలికంగా పని–వ్యక్తిగత జీవితం మధ్య సమతౌల్యం ఎలా ఉంటుంది అనే అంశాలపై మరింతగా ఆలోచిస్తున్నారు.

## దేశంలో 5జీ హవా

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** దేశంలో 2028 చివరి నాటికి మొబైల్ చందాదార్లలో దాదాపు 57 శాతం వాటా 5జీ కైవసం చేసుకోనుంది. తద్వారా ప్రపంచవ్యాప్తంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న 5జీ మార్కెట్‌గా భారత్ అవతరిస్తుందని ఎరిక్సన్ మొబిలిటీ నివేదిక వెల్లడించింది. '2022 డిసెంబర్ చివరినాటికి దేశంలో 5జీ చందాదార్లు ఒక కోటి ఉన్నట్టు అంచనా. భారత్‌లో 2022 అక్టోబరులో 5జీ సేవలు ప్రారంభం అయ్యాయి. డిజిటల్ ఇండియా కార్యక్రమం కింద భారీ నెట్‌వర్క్ విస్తరణ జరుగుతోంది' అని ఎరిక్సన్ నివేదిక వెల్లడించింది.




**అంతర్జాతీయంగా 150 కోట్లు..**

కొన్ని మార్కెట్లలో భౌగోళిక రాజకీయ సవాళ్లు, స్థూల ఆర్థిక మందగమనం ఉన్నప్పటికీ.. ప్రపంచవ్యాప్తంగా కమ్యూనికేషన్ సర్వీస్ ప్రొవైడర్లు 5జీలో పెట్టుబడులు కొనసాగిస్తున్నారు. 2023 చివరినాటికి ప్రపంచవ్యాప్తంగా 150 కోట్ల మొబైల్ చందాదార్లు 5జీ వేదికపైకి రానున్నారు. ఉత్తర అమెరికాలో 5జీ చందాదార్ల వృద్ధి గత అంచనాల కంటే బలంగా ఉంది. ఈ ప్రాంతంలో 2022 చివరి నాటికి 5జీ విస్తృతి 41 శాతం ఉంది. ఈ ఏడాది చివరి నాటికి ప్రతి స్మార్ట్‌ఫోన్‌కు నెలవారీ అంతర్జాతీయ సగటు డేటా వినియోగం 20 జీబీ కంటే ఎక్కువగా ఉంటుందని అంచనా' అని నివేదిక వివరించింది.

# సరికొత్త శిఖరాలకు సెన్సెక్స్

- ఇంట్రాడే, ముగింపులోనూ సరికొత్త రికార్డులు
- ముగింపులో నిఫ్టీ సైతం ఆల్‌టైం హై
- సూచీల ర్యాలీకి అధిక వెయిటేజీ షేర్ల దన్ను
- రాణించిన బ్యాంకింగ్, ఫైనాన్స్, ఆర్థిక షేర్లు
- జీవితకాల గరిష్టానికి ఇన్వెస్టర్ల సంపద



**ముంబై:** స్టాక్ మార్కెట్‌లో రెండో రోజూ బుల్ దూకుడు కొనసాగింది. బ్యాంకింగ్, ఫైనాన్స్, ఐటీ షేర్లు రాణించడంతో బుధవారం సెన్సెక్స్ ఇంట్రాడే, ముగింపులో సరికొత్త శిఖరాల్ని అధిరోహించింది. నిఫ్టీ ఆల్‌టైం హై స్థాయి(18,888)ని అందుకునే ప్రయత్నం చేసినా., గరిష్ఠం స్థాయిల నిరోధం ఎదురవడంతో 12 పాయింట్లు దూరంలో నిలిచింది. అయితే ముగింపులో మాత్రం కొత్త రికార్డును నమోదు చేసింది. దేశీయ మార్కెట్లోకి విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులు కొనసాగడంతో పాటు భారత వృద్ధి అవకాశాలపై భరోసా అంశాలు మార్కెట్ వర్గాలను మెప్పించాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం, టీసీఎస్, కోటక్ బ్యాంక్ తదితర లార్జ్‌క్యాప్ షేర్లు రెండుశాతం వరకు లాభపడి సూచీల ర్యాలీకి ప్రాతినిథ్యం వహించాయి. ఉదయం సెన్సెక్స్ 139 పాయింట్ల లాభంతో 63,467 వద్ద మొదలైంది. ట్రేడింగ్ ప్రారంభంలోనే కొనుగోళ్ల మద్దతు లభించడంతో సెన్సెక్స్ 261 పాయింట్లు 63,588 వద్ద జీవితకాల గరిష్టాన్ని నమోదు చేసింది. దీంతో గతేడాది డిసెంబర్ ఒకటో తేదీన నమోదైన 63,583 ఆల్‌టైం హై స్థాయి కనుమరుగైంది. కొత్త రికార్డు నమోదు తర్వాత లాభాల స్వీకరణ చోటుచేసుకోవడంతో సెన్సెక్స్ కొంతమేర లాభాల్ని కోల్పోయింది. చివరికి 195 పాయింట్ల లాభంతో 63,523 వద్ద స్థిరపడింది. ఈ ముగింపు కూడా సూచీకి కొత్త ఆల్‌టైం హై కావడం విశేషం. నిఫ్టీ 32 పాయింట్లు పెరిగి 18,849 వద్ద మొదలైంది. ట్రేడింగ్‌లో 59 పాయింట్లు ఎగసి 18,876 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. ఆఖరికి 40 పాయింట్ల లాభంతో జీవితకాల గరిష్ఠ ముగింపు 18,857 వద్ద నిలిచింది. చిన్న, మధ్య తరహా షేర్లను కొనేందుకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపడంతో బీఎస్ఈ మిడ్, స్మాల్‌క్యాప్ ఇండెక్స్‌లు అరశాతం చొప్పున ర్యాలీ చేశాయి. లాభాల మార్కెట్లోనూ ఆటో, ఎఫ్ఎంసీజీ, మెటల్, రియల్టీ షేర్లు నష్టాలను చవిచూశాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.4,013 కోట్ల షేర్లను, దేశీయ ఇన్వెస్టర్లు రూ.550 కోట్ల షేర్లను కొన్నారు. అమెరికా ఫెడ్ రిజర్వ్ ఛైర్మన్ టెస్టిమోనీ ప్రసంగం( జూన్ 21, 22) నేపథ్యంలో ఇన్వెస్టర్లు అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి.

**మార్కెట్లో మరిన్ని సంగతులు**

- సూచీల రికార్డు ర్యాలీ నేపథ్యంలో ఇన్వెస్టర్ల సంపద సైతం జీవితకాల గరిష్టానికి చేరింది. బీఎస్ఈ కంపెనీల మొత్తం విలువ ఆల్‌టైం స్థాయి రూ.294.49 లక్షల కోట్లకు చేరింది.
- నోవార్డిక్ ఏవియేషన్ క్యాపిటల్‌తో సెటిల్‌మెంట్ పరస్పర అంగీకార ఒప్పందాన్ని కుదుర్చుకోవడంతో స్పైస్‌జెట్ షేరుకు రెక్కలొచ్చాయి. ట్రేడింగ్‌లో ఏడుశాతం లాభపడి రూ.29.40 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. చివర్లో లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో 4% లాభంతో రూ.28.63 వద్ద స్థిరపడింది.

# ఇక 'మెడ్‌ప్లస్' ఔషధాలు

- 50–80 శాతం తగ్గింపుతో విక్రయం
- మెడ్‌ప్లస్ ఎండీ మధుకర్ రెడ్డి

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** ఔషధాల విక్రయంలో ఉన్న హైదరాబాద్ సంస్థ మెడ్‌ప్లస్ హెల్త్ సర్వీసెస్.. సొంత బ్రాండ్‌లో మందుల అమ్మకాల్లోకి ప్రవేశించింది. 50–80% డిస్కౌంట్‌తో వీటిని విక్రయిస్తున్నట్టు సంస్థ ఎండీ, సీఈవో గంగాడి మధుకర్ రెడ్డి తెలిపారు. కంపెనీ సీవోవో చెరుకుపల్లి భాస్కర్ రెడ్డి, చీఫ్ స్ట్రాటజిక్ ఆఫీసర్ చేతన్ దీక్షిత్‌తో కలిసి బుధవారమిక్కడ మీడియాతో మాట్లాడారు. వివిధ చికిత్సలు, దీర్ఘకాలిక జబ్బులకువాడే 500లకుపైగా పేటెంట్‌యేతర ఔషధాలను మెడ్‌ప్లస్ బ్రాండ్‌లో ప్రవేశపెట్టినట్టు మధుకర్ చెప్పారు. జీఎంపీ, ఈయూ జీఎంపీ ధ్రువీకరణ పొందిన ప్లాంట్లలో మందులు తయారవుతున్నట్టు వివరించారు.

**ఏటా 1,000 స్టోర్లు..:**

ప్రతి ఏటా మెడ్‌ప్లస్ ఫార్మసీ విభాగంలో 1,000 రిటైల్ ఔట్‌లెట్లను తెరుస్తామని మధుకర్ రెడ్డి తెలిపారు. 'వీటి ఏర్పాటుకు ఏటా సుమారు రూ.300 కోట్లు అవసరం అవుతాయి. ఏడు రాష్ట్రాల్లోని 552 నగరాలు, పట్టణాల్లో ప్రస్తుతం 3,822 స్టోర్లు ఉన్నాయి. ఈ ఏడాదే ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, కేరళ రాష్ట్రాల్లో అడుగుపెడుతున్నాం. 2022–23లో రూ. 4,550 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయం ఆర్జించాం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కనీసం 25% వృద్ధి ఆశిస్తున్నాం. డిస్కౌంట్ల వల్ల లాభాలపై ఎటువంటి ప్రతికూల ప్రభావం ఉండదు' అని వెల్లడించారు. సంస్థకు 22 వేల పైచిలుకు ఉద్యోగులు ఉన్నారు.




మధుకర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి (కుడి)

## ఎన్ఎండీసీలో తగ్గిన ఎల్ఐసీ వాటా

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** మైనింగ్ రంగ దిగ్గజం ఎన్ఎండీసీలో 2.07 శాతం వాటాను జీవిత బీమా సంస్థ ఎల్ఐసీ రూ.649 కోట్లకు విక్రయించింది. దీంతో ఎన్ఎండీసీలో ఎల్ఐసీ వాటా 9.62 శాతానికి వచ్చి చేరింది. 2023 మార్చి 14 నుంచి జూన్ 20 మధ్య 6.06 కోట్ల షేర్లను బహిరంగ మార్కెట్లో ఒక్కొక్కటి సగటున రూ.107.59 చొప్పున ఎల్ఐసీ విక్రయించింది.




---

**భవిత**

పోటీ పరీక్షల ప్రత్యేకం: ఇండియన్ జాగ్రఫీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

ఆంధ్రప్రదేశ్ పోలీసు ఉద్యోగాలకు సంబంధించిన స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ఆన్‌లైన్ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

**కెరీర్ కౌన్సెలింగ్**
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

# విద్య, ఉద్యోగ సమాచారం

### పీజేటీఎస్ఏయూలో యూజీ కోర్సుల్లో ప్రవేశాలు

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్శిటీ, పీవీ నరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్శిటీ,శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ స్టేట్ హార్టికల్చరల్ యూనివర్శిటీలతోపాటు అనుబంధ కళాశాలల్లో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి బైపీసీ స్ట్రీమ్‌లో అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ వెలువడింది.

**డిగ్రీ కోర్సులు-సీట్ల వివరాలు**

» బీఎస్సీ(ఆనర్స్)అగ్రికల్చర్(నాలుగేళ్లు)–720 సీట్లు. » బీఎస్సీ(ఆనర్స్) కమ్యూనిటీ సైన్స్(నాలుగేళ్లు)–43 సీట్లు. » బీవీఎస్సీ అండ్ ఏహెచ్ (ఐదున్నరేళ్లు)–174 సీట్లు. » బీఎఫ్ఎస్సీ(నాలుగేళ్లు)–39 సీట్లు. » బీఎస్సీ(ఆనర్స్)హార్టికల్చర్ (నాలుగేళ్లు)–204 సీట్లు.
» **అర్హత:** ఇంటర్మీడియట్(ఫిజికల్ సైన్సెస్, బయోలాజికల్ సైన్సెస్)తోపాటు టీఎస్ ఎంసెట్–2023 ఉత్తీర్ణులై ఉండాలి. » **వయసు:** బీవీఎస్సీ ఏహెచ్ కోర్సుకు 17 నుంచి 25 ఏళ్లు, ఇతర కోర్సులకు 17 నుంచి 22 ఏళ్లు మధ్య ఉండాలి.
» **ఎంపిక:** టీఎస్ ఎంసెట్–2023లో అభ్యర్థులు పొందిన ర్యాంకు ఆధారంగా సీటు కేటాయిస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 17.07.2023.
» **దరఖాస్తు సవరణ తేదీలు:** 18.07.2023 నుంచి 19.07.2023 వరకు
» **వెబ్‌సైట్:** www.pjtsau.edu.in

### జవహర్ నవోదయ విద్యాలయలో ఆరో తరగతి ప్రవేశాలు

జవహర్ నవోదయ విద్యాలయ(జేఎన్‌వీ) సంస్థ 2024–25 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాలకు సంబంధించి..జవహర్ నవోదయ విద్యాలయ ఎంపిక పరీక్ష–2024కు దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** విద్యార్థి తప్పనిసరిగా జవహర్ నవోదయ విద్యాలయం ఉన్న సంబంధిత జిల్లా నివాసి అయి ఉండాలి. విద్యార్థులు 2023–24 విద్యా సంవత్సరంలో ఆయా జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ఐదో తరగతి చదువుతుండాలి.
» **వయసు:** దరఖాస్తు చేసుకునే విద్యార్థులు 01.05.2012 నుంచి 30.07.2014 మధ్యలో జన్మించిన వారై ఉండాలి.
» **ప్రవేశ పరీక్ష:** జవహర్ నవోదయ ప్రవేశానికి నిర్వహించే రాత పరీక్షలో వచ్చే మార్కుల ఆధారంగా విద్యార్థుల ఎంపిక ఉంటుంది. ప్రవేశ పరీక్ష ప్రశ్నపత్రంలో మూడు విభాగాలు(మెంటల్ ఎబిలిటీ, అర్థమెటిక్, లాంగ్వేజ్)ఉంటాయి.

**ముఖ్య సమాచారం**

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో జేఎన్‌వీ అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 10.08.2023
» **వెబ్‌సైట్:** cbseitms.rcil.gov.in

### సింగరేణి కాలరీస్‌లో అప్రెంటిస్‌లు

కొత్తగూడెంలోని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్, హెచ్ఆర్‌డీ విభాగం.. 2023–24 సంవత్సరానికి సంబంధించి వివిధ ట్రేడుల్లో అప్రెంటిస్‌లకు దరఖాస్తులు కోరుతోంది.

» **ట్రేడులు:** ఎలక్ట్రానిక్స్, ఫిట్టర్‌లు, టర్నర్, మెషినిస్ట్, మెకానిక్ మోటార్ వెహికల్, డ్రాఫ్ట్స్‌మ్యాన్ (సివిల్), మెకానిక్ డీజిల్, మౌల్డర్, వెల్డర్.
» **అర్హత:** పదో తరగతితోపాటు సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 18 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి.
» **స్టైపెండ్:** ట్రేడును బట్టి నెలకు రూ.7,700 నుంచి రూ.8050 వరకు చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** ఐటీఐ ఉత్తీర్ణత సాధించిన సీనియారిటీ ఆధారంగా ఎంపిక చేస్తారు.సీనియారిటీ ప్రకారం అభ్యర్థులు ఎక్కువ సంఖ్యలో ఉంటే ఐటీఐ మార్కులను పరిగణనలోకి తీసుకుంటారు.
» **దరఖాస్తు విధానం:** ఎస్‌సీసీఎల్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని హార్డ్‌కాపీ, సంబంధిత ధ్రువపత్రాలను జతచేసి రిజిస్టర్డ్ పోస్టు /కొరియర్/వ్యక్తిగతంగా ఏదైనా ఎంవీటీసీ కేంద్రాల్లో అందజేయవచ్చు.
» **వెబ్‌సైట్:** www.scclmines.com

### బెల్ బెంగళూరులో 82 ఇంజనీర్ పోస్టులు

బెంగళూరులోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బెల్) ఆధ్వర్యంలోని ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్, సెంటర్స్ ఆఫ్ ఎక్స్‌లెన్స్.. ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 82 »**పోస్టుల వివరాలు:** ట్రెయినీ ఇంజనీర్, ప్రాజెక్ట్ ఇంజనీర్ పోస్టులు.
» **విభాగాలు:** ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్–కమ్యూనికేషన్,ఎలక్ట్రానిక్స్–టెలికమ్యూనికేషన్,కమ్యూనికేషన్,టెలికమ్యూనికేషన్,మెకానికల్ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌లో బీఈ/బీటెక్/బీఎస్సీ ఇంజనీరింగ్ ఉత్తీర్ణులవ్వాలి. **వయసు:** 28 నుంచి 32 ఏళ్లు ఉండాలి. » **వేతనం:** నెలకు రూ.30,000 నుంచి రూ.55,000 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్టింగ్, రాతపరీక్ష/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును మేనేజర్(హెచ్ఆర్), ప్రొడక్ట్ డెవలప్‌మెంట్–ఇన్నోవేషన్ సెంటర్(పీడీఐసీ), భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, ప్రొఫెసర్. యూ ఆర్ రావు రోడ్, నాగాలాండ్ సర్కిల్ దగ్గర, జలహళ్లి పోస్టు, బెంగళూరు–560013 చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 28.06.2023.
» **వెబ్‌సైట్:** www.bel-india.in

# ఐడీఆర్‌బీటీలో బ్యాంకింగ్ టెక్నాలజీ కోర్సు

ఐడీఆర్‌బీటీ.. ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెవలప్‌మెంట్ అండ్ రీసెర్చ్ ఇన్ బ్యాంకింగ్ టెక్నాలజీ. దీన్ని భారత కేంద్ర బ్యాంకు ఆర్‌బీఐ ఏర్పాటుచేసింది. ఐడీఆర్‌బీటీ.. పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ బ్యాంకింగ్ టెక్నాలజీ(పీజీడీబీటీ) కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఈ కోర్సులో చేరిన అభ్యర్థులకు బ్యాంకింగ్, ఆర్థిక సంస్థలకు అవసరమైన లేటెస్ట్ టెక్నాలజీపై శిక్షణ అందుతుంది. పీజీడీబీటీ కోర్సులను పూర్తి చేసుకున్నవారు బ్యాంకింగ్ రంగంలో ఉజ్వల అవకాశాలను అందుకునే వీలుంది. ఐడీఆర్‌బీటీ అందించే పీజీడీబీటీ కోర్సు పూర్తి వివరాలు..

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ)..1996లో హైదరాబాద్‌లో ఐడీఆర్‌బీటీని ఏర్పాటుచేసింది. ఈ సంస్థ భారతదేశంలోని బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు అవసరమైన సాంకేతికతను అందించడంతోపాటు టెక్నాలజీపై పరిశోధనలు కొనసాగిస్తుంది. టెక్నాలజీ, మేనేజ్‌మెంట్ రంగాలకు నైపుణ్యాలున్న మానవ వనరులకు డిమాండ్ ఏర్పడింది. దీంతో 2016లో ఐడీఆర్‌బీటీ.. బ్యాంకింగ్ టెక్నాలజీ పీజీ డిప్లొమా కోర్సును ప్రారంభించింది. ఇప్పటివరకూ ఆరు బ్యాచ్‌లు పూర్తికాగా.. తాజాగా ఏడో

» పీజీడీబీటీ ప్రవేశాలకు ప్రకటన విడుదల

బ్యాచ్‌లో ప్రవేశాలకు ప్రకటన వెలువడింది. ఏడో బ్యాచ్ జూలైలో ప్రారంభం కానుంది.

**మొత్తం సీట్లు**

40(ఇందులో బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు 10 స్పాన్సర్డ్ సీట్లు కేటాంచారు)

**అర్హతలు**

పీజీడీబీటీ కోర్సులో ప్రవేశాలు కోరుకునే అభ్యర్థులు కనీసం 60 శాతం మార్కులతో బీటెక్ లేదా ఏదైనా సబ్జెక్టులో ప్రథమ శ్రేణిలో పీజీ ఉత్తీర్ణత సాధించాలి. 10+2+4 విధానంలో చదివిన వారు మాత్రమే దరఖాస్తుకు అర్హులు. ప్రస్తుతం ఫైనల్ ఇయర్ చదివే విద్యార్థులు కూడా దరఖాస్తుకు అర్హులే. అలాగే అభ్యర్థులు గేట్/క్యాట్/ జీమ్యాట్/ జీఆర్ఈ/సీమ్యాట్/గ్జాట్/మ్యాట్/ఏటీఎంఏల్లో ఏదో ఒక పరీక్ష స్కోరు సాధించడం తప్పనిసరి.

**ఎంపిక ఇలా**

వచ్చిన దరఖాస్తులను షార్ట్‌లిస్ట్ చేసి..అనంతరం గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి.. వాటిలో చూపిన ప్రతిభ ఆధారంగా కోర్సులోకి తీసుకుంటారు. కోర్సు మొత్తం ఫీజు రూ.ఐదు లక్షలు. నాలుగు విడతల్లో ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.




**కోర్సు స్వరూపం**

పీజీడీబీటీ ఏడాది కోర్సు. ఫుల్‌టైం విధానంలో ఉంటుంది. మూడు నెలలకు ఒక టర్మ్ చొప్పున 4 టర్మ్‌లుగా కోర్సు ఉంటుంది. ఇందులో లెక్చరర్లు,సెమినార్లతోపాటు ఐటీ నిపుణులతో ఇంటరాక్టివ్ సెషన్స్ కూడా నిర్వహిస్తారు. కోర్సులో భాగంగా ప్రాక్టికల్ లెర్నింగ్‌కు అధిక ప్రాధాన్యం ఉంటుంది. మొత్తం నాలుగు టర్మ్‌ల్లో చివరి టర్మ్‌లో ప్రాజెక్ట్ కేటాయించారు. కోర్సులో భాగంగా టెక్నాలజీని ఉపయోగించి.. బ్యాంకింగ్, ఆర్థికసంస్థల ఉత్పాదకత పెరిగేలా బోధన ఉంటుంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉపయోగిస్తున్న టెక్నాలజీపై అవగాహన కల్పిస్తారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటాబేస్ మేనేజ్‌మెంట్, క్రిప్టోగ్రఫీ, ఐవోడీ, బిగ్ డేటా, అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ, మొబైల్ బ్యాంకింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, పేమెంట్, సిస్టమ్ తదితర అంశాల్లో శిక్షణ ఇస్తారు. కోర్సును విజయవంతంగా పూర్తిచేసుకున్నవారికి పీజీ డిప్లొమా ప్రధానం చేస్తారు.

**క్యాంపస్ ప్లేస్‌మెంట్స్**

ఈ కోర్సును పూర్తిచేసుకున్న వారు క్యాంపస్ స్థాయిలోనే ఉద్యోగావకాశాలను అందుకోవచ్చు. హెచ్‌డీఎఫ్‌సీ, ఐడీబీఐ, బంధన్, కరూర్ వైశ్య, ఫెడరల్, కోటక్, సౌత్ ఇండియా, ఎన్‌పీసీఐ తదితరం సంస్థలు రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నాయి. ఎంపికైన అభ్యర్థులకు సగటున రూ.9 లక్షల వార్షిక వేతనం అందుతోంది.

**ముఖ్యసమాచారం**

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: 24.06.2023
- వెబ్‌సైట్: https://www.idrbt.ac.in

# ఆర్మీలో కొలువుతోపాటు బీటెక్

ఇంటర్ ఉత్తీర్ణులు ఆర్మీలో లెఫ్టినెంట్ ఉద్యోగంతోపాటు బీటెక్ పట్టా అందుకునే చక్కటి అవకాశం. ఇంటర్ ఎంపీసీ విద్యార్థుల కోసం ఇండియన్ ఆర్మీ 10+2 టెక్నికల్ ఎంట్రీ స్కీమ్‌కు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎంపిక ప్రక్రియలో విజయం సాధించిన వారిని శిక్షణ కోసం తీసుకుంటారు. ఈ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ఇటు బీటెక్ డిగ్రీతోపాటు అటు ఆర్మీలో లెఫ్టినెంట్ కొలువు సొంతమవుతుంది. ఇండియన్ ఆర్మీ 10+2 టెక్నికల్ ఎంట్రీ స్కీమ్ పూర్తి వివరాలు..

- మొత్తం ఖాళీలు: 90

**అర్హతలు**

- ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమేటిక్స్ సబ్జెక్టులతో 60 శాతం మార్కులతో ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. జేఈఈ మెయిన్ స్కోరు తప్పనిసరి. అవివాహిత పురుష అభ్యర్థులు మాత్రమే దరఖాస్తుకు అర్హులు.

» మొత్తం ఖాళీల సంఖ్య 90
» ఇంటర్ ఎంపీసీ విద్యార్థులకు చక్కటి అవకాశం
» ఎంపికైతే నెలకు రూ.లక్ష వరకూ వేతనం

- **వయసు:** 16 1/2 ఏళ్ల నుంచి 19 1/2 ఏళ్ల మధ్య ఉండాలి. 2004 జూలై 2–2007 జూలై 1 మధ్య జన్మించిన వారు మాత్రమే దరఖాస్తుకు అర్హులు.

**ఎంపిక ఇలా**

ఇంటర్ మార్కులు, జేఈఈ మెయిన్ స్కోర్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేస్తారు. ఇలా ఎంపికైన వారికి సర్వీస్ సెలక్షన్ బోర్డు(ఎస్ఎస్‌బీ) ఆధ్వర్యంలో బెంగళూరులో అయిదు రోజుల పాటు రెండు దశల్లో సైకాలజికల్ టెస్టులు,గ్రూప్ టాస్కలు,ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. మొదటి రోజు స్టేజ్–1 స్క్రీనింగ్( ఇంటెలిజెన్స్) పరీక్షల్లో అర్హత సాధించిన వారిని స్టేజ్–2కి ఎంపిక చేస్తారు. నాలుగు రోజుల పాటు నిర్వహించే వివిధ పరీక్షల్లో.. అన్ని విభాగాల్లోనూ రాణించిన అభ్యర్థులను శిక్షణకు ఎంపిక చేస్తారు.

**శిక్షణ**

ఎంపికైన వారికి మొత్తం అయిదేళ్ల శిక్షణ ఉంటుంది. ఇందులో ఏడాది పాటు ఆఫీసర్ ట్రెనింగ్ అకాడమీ–గయాలో బేసిక్ మిలిటరీ ట్రెనింగ్ నిర్వహిస్తారు. అనంతరం నాలుగేళ్లపాటు టెక్నికల్ ట్రెనింగ్ పుణె, సికింద్రాబాద్, మావ్‌ల్లోని ఆర్మీ కేంద్రాల్లో ఏదో ఒకచోట కొనసాగుతుంది. ఇందులో రెండు దశలు..ఫేజ్–1 మూడేళ్ల ప్రీ కమిషన్ ట్రెనింగ్, ఫేజ్–2 ఏడాది పోస్ట్ కమిషన్ ట్రెనింగ్ ఉంటాయి. మూడేళ్ల ఫేజ్–1 శిక్షణ అనంతరం అభ్యర్థులకు నెలకు రూ.56,100 చొప్పున స్టైపెండ్ లభిస్తుంది.

**బీటెక్ డిగ్రీ**

నాలుగేళ్ల శిక్షణ అనంతరం లెఫ్టినెంట్ హోదా సొంతమవుతుంది. ట్రెనింగ్,కోర్సు పూర్తయిన తర్వాత వీరికి ఇంజనీరింగ్(బీటెక్) డిగ్రీని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ ప్రధానం చేస్తుంది. అనంతరం వీరిని పూర్తిస్థాయిలో విధుల్లోకి తీసుకుంటారు.

**వేతనాలు**

లెఫ్టినెంట్ హోదాతో విధుల్లో చేరిన వారికి లెవల్–10 ప్రకారం మూలవేతనం లభిస్తుంది. ఇలా ఎంపికైన వారికి ప్రతి నెల రూ.56,100తోపాటు మిలటరీ సర్వీస్ పే కింద రూ.15,500 ప్రతి నెల అందుతాయి. వీటికి అదనంగా డీఏ, హెచ్ఆర్ఏ, ప్రోత్సాహకాలు దక్కుతాయి. విధుల్లో చేరిన మొదటి నెల నుంచే అన్ని కలుపుకొని సీటీసీ రూపంలో నెలకు దాదాపు రూ.లక్ష అందుకోవచ్చు.




**ఉన్నత హోదా**

ఈ పోస్టులకు ఎంపికైన వారు తక్కువ వ్యవధిలోనే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చు. విధుల్లో చేరిన రెండేళ్ల తర్వాత కెప్టెన్, ఆరేళ్ల సర్వీస్‌తో మేజర్, పదమూడేళ్ల అనుభవంతో లెఫ్టినెంట్ కల్నల్ హోదాలను అందుకోవచ్చు.

**ముఖ్యసమాచారం**

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:జూన్30, 2023
- వెబ్‌సైట్: www.joinindianarmy.nic.in

# సరుకు లోడింగ్‌లో విశాఖపట్నం పోర్టుకు మరో రికార్డు



సాక్షి, విశాఖపట్నం: సరుకు లోడింగ్‌లో విశాఖపట్నం పోర్టు అథారిటీ బుధవారం మరో రికార్డు నమోదు చేసింది. ఒక్క రోజు వ్యవధిలో ఒకేసారి నిర్వహించిన అతి పెద్ద సింగిల్ పార్శిల్ లోడు రికార్డును అధిగమించింది. ఎంవీ జీసీఎల్ గంగా కార్గో షిప్‌లో ఒకే రోజులో 1,04,496 మెట్రిక్ టన్నుల ఐరన్ ఓర్ పెల్లెట్స్ లోడ్ చేశారు. ఆర్సిలర్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా(ఏఎంఎన్ఎస్)కు సంబంధించిన ఇన్నర్ హార్బర్‌లోని వెస్ట్ క్యూ–1 బెర్త్‌లో ఈ లోడింగ్ జరిగింది. ఈ ఏడాది ఏప్రిల్ 10వ తేదీన 1,02,200 మెట్రిక్ టన్నుల లోడింగ్ ఇప్పటి వరకూ రికార్డు సింగిల్ పార్శిల్‌గా ఉండేది. అత్యధిక మొత్తంలో లోడింగ్ నిర్వహించిన సిబ్బందిని పోర్టు చైర్మన్ డాక్టర్ అంగముత్తు అభినందించారు.

• తెలంగాణ

# యునెస్కో గుర్తింపు దిశగా అడుగులు

**ముడుమాల్ నిలువురాళ్లను సందర్శించిన దక్కన్ హెరిటేజ్ ట్రస్ట్ సభ్యులు, సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్**



నిలువురాళ్లను పరిశీలిస్తున్న దక్కన్ హెరిటేజ్ సభ్యులు, ప్రొఫెసర్ పుల్లారావు

కృష్ణా: నారాయణపేట జిల్లా కృష్ణా మండలం ముడుమాల్‌లో కృష్ణానది పక్కన ఉన్న నిలువురాళ్లకు యునెస్కో గుర్తింపు తీసుకురావడమే తమ లక్ష్యమని దక్కన్ హెరిటేజ్ అధికారి వేదకుమార్, సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ పుల్లారావు అన్నారు. బుధవారం సాయంత్రం నిలువురాళ్ల (మెగాలిత్ బరియల్స్)ను వారు సందర్శించి గుర్తింపునకు అవసరమయ్యే ఫొటోలు తీసుకున్నారు. ఈ ప్రాంతానికి గుర్తింపు తీసుకొచ్చే విషయంపై ఇప్పటికే రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, పురావస్తుశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో చర్చలు జరిపినట్లు తెలిపారు. ఆదిమానవులు కాలాన్ని, రుతువులను తెలుసుకునేందుకు నిలువురాళ్లను ఏర్పాటు చేసినట్లుగా ఇదివరకే పురావస్తుశాఖ వారు గుర్తించారు. ఇవి ఆసియా ఖండంలోనే మొదటివని, ఇలాంటివి కేవలం ఆఫ్రికా ప్రాంతంలో కనిపిస్తాయని గతంలోనే పుల్లారావు తెలిపారు. నిలువురాళ్ల సంపదను కాపాడటంతో పాటు యునెస్కో గుర్తింపునకు కృషి చేయాలని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, టీటా గ్లోబల్ ప్రెసిడెంట్ సందీప్‌కుమార్ మఖ్తాల రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు కొంతకాలంగా విజ్ఞప్తి చేస్తున్నారు.

# విద్యార్థులకు మెనూ అమలు చేయకుంటే చర్యలు

**ఆహార కమిషన్ చైర్మన్ చిత్తా విజయ ప్రతాప్‌రెడ్డి**

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యానికి అనుగుణంగా పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలోని విద్యార్థులకు తప్పనిసరిగా మెనూ అమలు చేయకుంటే చర్యలు తప్పవని ఆహార కమిషన్ చైర్మన్ చిత్తా విజయ ప్రతాప్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం విజయవాడలోని సంస్థ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ఎండీయూ వాహనాల ద్వారా నిత్యావసరాల సరఫరా, అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రభుత్వ పథకాల అమల్లో నిర్లక్ష్యం వహిస్తే సుమోటోగా తీసుకుని కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఆహార కమిషన్ సభ్యులు కాంతారావు, లక్ష్మీరెడ్డి, కృష్ణకిరణ్, దేవి, డిప్యూటీ డైరెక్టర్ సురేష్ పాల్గొన్నారు.



## సింహాద్రిలో విద్యుదుత్పత్తి పునరుద్ధరణ

పరవాడ: అనకాపల్లి జిల్లా పరవాడ సమీపంలోని సింహాద్రి ఎన్టీపీసీ రెండో యూనిట్‌లో సోమవారం ఉదయం సాంకేతిక లోపంతో నిలిచిపోయిన విద్యుదుత్పత్తిని మరమ్మతుల అనంతరం తిరిగి బుధవారం ఉదయం పునరుద్ధరించారు. ప్రస్తుతం సంస్థలో 4 యూనిట్లు యథావిధిగా పనిచేస్తున్నాయని ఎన్టీపీసీ అధికారులు వెల్లడించారు.



# వ్యాక్సిన్‌కు మరింత భద్రత

**పిల్లలు, గర్భిణులకు వేసే వ్యాక్సిన్లను భద్రపరిచేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. వాటిని భద్రపరిచే రిఫ్రిజిరేటర్లకు నిరంతరం విద్యుత్ సరఫరా అయ్యేలా జనరేటర్లు, ఇన్వర్టర్లు ఆస్పత్రుల్లో ఏర్పాటు చేసింది.**

- వ్యాక్సిన్ పాడవ్వకుండా నిరంతరం విద్యుత్ ఉండేలా చర్యలు
- పీహెచ్‌సీల్లో జనరేటర్, ఇన్వర్టర్లు ఏర్పాటు
- ఏడాదికి 1,43,000 మందికి వ్యాక్సిన్
- పిల్లలకు 14 రకాల టీకాలు

విజయనగరం ఫోర్ట్: చిన్నారులకు వేసే వ్యాక్సిన్‌ను భద్రపరిచేందుకు ప్రభుత్వం మరింత శ్రద్ధ కనబరుస్తుంది. పిల్లలు ప్రాణాంతక వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు ముందస్తుగా టీకా(వ్యాక్సిన్) వేస్తారు. దీన్ని భద్రపరచడంలో నిర్లక్ష్యం వహిస్తే పాడవుతుంది. ఈ క్రమంలో వ్యాక్సిన్ పాడవ్వకుండా భద్రపరిచే రిఫ్రిజిరేటర్లకు నిరంతరం విద్యుత్ సరఫరా అయ్యే విధంగా చర్యలు తీసుకున్నారు. వ్యాక్సినేషన్ కోసం ప్రభుత్వం రూ.కోట్లు ఏటా ఖర్చు చేస్తోంది. వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో వేయడం ద్వారా లక్షలాది మంది పిల్లలు వ్యాధుల బారిన పడకుండా ప్రభుత్వం కాపాడుతుంది.

### నిరంతర విద్యుత్‌కు చర్యలు

జిల్లాలో 54 పీహెచ్‌సీలు ఉన్నాయి. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 12 ఉన్నాయి. వీటి పరిధిలో ప్రతి బుధ, శనివారాల్లో వ్యాక్సినేషన్ డే నిర్వహించి గర్భిణులకు, పిల్లలకు టీకాలు వేస్తారు. ఐదేళ్లలోపు పిల్లలకు 14 రకాల టీకాలు వేస్తారు. గర్భిణులకు టీటీ రెండుసార్లు వేస్తారు. ఏడాదికి 21 వేల గర్భిణులకు టీకాలు వేస్తున్నారు. అదే విధంగా 1,43,000 మంది పిల్లలకు ఏడాదికి టీకాలు వేస్తున్నారు.



రాకోడు పీహెచ్‌సీలో రిఫ్రిజిరేటర్‌కోసం వినియోగించేందుకు ఏర్పాటు చేసిన ఇన్వర్టర్

### వ్యాక్సిన్ భద్రపరచడంలో ప్రత్యేక శ్రద్ధ

ప్రస్తుతం వేసవి కావడంతో వ్యాక్సిన్ భద్రపరచడంలో ప్రత్యేక శ్రద్ధ ప్రభుత్వం చూపుతుంది. విద్యుత్ మరమ్మతులు, భారీ వర్షాలు, ఈదురుగాలులు వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిన సమయంలో వ్యాక్సిన్ పాడవ్వకుండా ఉండేందుకు వ్యాక్సిన్ భద్రపరిచే రిఫ్రిజిరేటర్లకు ప్రత్యేకంగా ఇన్వర్టర్లను ఏర్పాటు చేశారు. విద్యుత్ లేని సమయంలో ఇన్వర్టర్లుద్వారా విద్యుత్ సరఫరా చేస్తున్నారు. 24 గంటలపాటు విద్యుత్ సరఫరా లేనట్టయితే వ్యాక్సిన్ పాడవుతుంది. అటువంటి పరిస్థితి లేకుండా ముందస్తుగా ఇన్వర్టర్లు, జనరేటర్లు పీహెచ్‌సీల్లో ఏర్పాటు చేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నుంచి పీహెచ్‌సీలకు వ్యాక్సిన్ సరఫరా చేస్తారు. అక్కడ నుంచి వ్యాక్సినేషన్ జరిగిన రోజు ఐస్ బాక్సుల ద్వారా గ్రామాలకు వ్యాక్సిన్ తీసుకుని వెళ్తారు. ప్రాణాంతకమైన వ్యాధుల నుంచి రక్షణ కోసం ఐదేళ్ల లోపు పిల్లలకు టీకాలు వేస్తారు. పోలియో, గోరింత దగ్గు, డయేరియా, డిఫ్తిరియా వంటి వ్యాధులు రాకుండా టీకాలు వేస్తారు. పిల్లలకు నిర్దేశించిన వారాల ప్రకారం టీకాలు వేస్తారు.

**వ్యాక్సిన్ భద్రతకు చర్యలు**



వ్యాక్సిన్ భద్రపరచడంలో తగు చర్యలు తీసుకున్నాం. అన్ని పీహెచ్‌సీలకు విద్యుత్ లేని సమయంలో వ్యాక్సిన్ భద్రపరిచేందుకు వినియోగించేందుకు ఇన్వర్టర్లు, జనరేటర్లు ఏర్పాటు చేశాం. నిర్దేశించిన ప్రకారం ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు గర్భిణులకు, పిల్లలకు టీకాలు వేస్తారు.

– డాక్టర్ నాగులాపల్లి శృతి, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి



Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943 